# వేమన్న ఏమన్నాడు?



యలమంచిలి వెంకటప్పయ్య

గాంధీ సామ్యవాద పుస్తకమాల

# వేమన్న ఏమన్నాడు?

## తొలి తునక

కూర్పు :

**యలమంచిలి వెంకటప్పయ్య**

**గాంధీ సామ్యవాద పుస్తకమాల - 15**

**మధు నగర్, విజయవాడ- 10**

1986 అక్టోబరు
ప్రతులు :1000

వెల రూ : 15-00

ముద్రణ :
నాగార్జున ఎంటర్‌ప్రైజెస్
విజయవాడ-520 004.

## 1. ఆంధ్రోపన్యాసకుడు పులిచెర్ల సాంబశివరావు, M.A.

తెలుగునాట వేమన పేరు తెలియనివారు ఉండరు. కవిగా, యోగిగా వేమన ప్రఖ్యాతి మన రాష్ట్ర సరిహద్దులు దాటినది. తేట తెలుగు మాటలతో ఒప్పు వేమన ఆటవెలదులన్నచో పసివారికి సైతము ప్రాణము.

వేమన కవీంద్రుడొక కావ్యమును రచించలేదు. కనుక ఆయన తనను గూర్చి వ్రాసుకొను అవకాశము కలుగలేదు. తరువాతి కవు లెవ్వరును వేమన్నను గురించి చెప్పలేదు. శాసనములలో కూడ వేమన్న ప్రసక్తి కనబడదు. అయినప్పటికీ వేమన ప్రజాకవియేగాక ప్రఖ్యాత లోక కవులలో ఒకరుగా ఖ్యాతిగాంచిరి.

## 2. ఆరుద్ర

(ఈయన ప్రసిద్ధాధునిక కవులు. ఆంధ్రసాహిత్య చరిత్రకర్తలు. ఆంధ్రసాహిత్య సారాన్ని ఆపోశన పట్టిన అపర అగస్త్యులు. సామాజిక వ్యవస్థను సామ్యవాద దృక్పథంతో సమీక్షించినా, సౌమ్యశీలతతో సత్యాన్ని విశ్వజనీనంగా ప్రతిపాదించ గలిగిన ప్రతిభావంతులు. కవితా ప్రక్రియల్లోని, కళా రహస్యాలతో పాటు కవి హృదయాన్ని ఆవిష్కరించే రసవత్తరమైన రచనా రహస్యాలను తెలిసికొన్న రసికులు. కవిత వ్రాసినా, చరిత్ర చెప్పినా, విమర్శ వెలయించినా, పఠిత మనసుకు, సూటిగా హత్తుకొనే వాక్పాకం వారి కలానికి వెన్నతో నబ్బిన విద్య)

"వేమన దేహానికి విభిన్నమైన ఆత్మనూ, పరలోకాన్నీ, తిరస్కరించడం, వైదిక కర్మలను ఖండించడం, చతుర్వర్ణ, చతురాశ్రమాలను అంగీకరించకపోవడం, విగ్రహారాధన, తీర్థయాత్రలు మొదలైన వాటిని విమర్శించడం మొదలైనవి వేమనగారి ప్రబోధాలలో ముఖ్యమైనవి. వేమనగారు వేదాలను ప్రమాణములుగా అంగీకరించరు.

వేమనగారు తమ పద్యాలల్లో గుండెలకు పట్టేవి, కొత్తగా కనిపించేవి, తెలివిని పెంచేవి, పాపాలను పోగొట్టేవి మొదలగు చాల చక్కని నీతులు చెప్పారు. వేమనగారు తాత్వికులేగాని, ఆయన దేన్నీ చదవకూడదని నిషేధించలేదు.

మొత్తముమీద వేమనగారు ప్రబోధించే సంసార యోగంలో వెతలు ఉండవు. ఆనందం వుంటుంది. ఆలుమగల అన్యోన్యం వుంటుంది.

ఇదే సారమన్న సంసారయోగం. ఇందులో సతీపతులిద్దరూ సమానులు.

వేమనగారు వైదిక మతంలోని దురాచారాలను దుయ్యపట్టారు. ఆయన గారి మతంలో ఇహలోకంలో సంసారాభివృద్ధికి 'కామము' చాల అవసరం.

తెలుగు సాహిత్యంలో నన్నయ, తిక్కన, ఎర్రనలను కవిత్రయంగా భావిస్తున్నటికీ నిజమైన కవిత్రయం తిక్కన, గురజాడ, వేమన. వేమనగారు ముమ్మాటికీ భౌతికవాదులే. ఆయనగారి మతంలో ఇహలోకమే కాని పరలోకం లేనేలేదు.

సాహిత్యాభిమానులంతా వేమనగారు తమ చాటువుల ద్వారా చాటిన సర్వమానవ సౌభ్రాతృత్వాన్నీ, అభ్యుదయ భావాన్నీ అలవరచుకోవాలి. వారిఆట వెలదులన్నీ ఒప్పుల కుప్పలు. అవి తెలుగు జాతికి, తెలుగు నీతికి ఆడపడుచులు.

కుల మత భేదాలు పోవాలి. మూఢనమ్మకాలు పనికిరావు. దేవుడు లేడు. సంపదలకు శ్రమే మూలము. పరలోకం అంటే వేరేలేదు. అని వేమన పద్యములు కట్టారు. వేమన సంస్కృత కావ్యాలతో సహా అనేక గ్రంథాలను చదివాడు. హక్కుల కోసం, విశ్వశాంతి కోసం పోరాడమని వేమన చెప్పారు.

## 3. కట్టమంచి రామలింగారెడ్డి

ఆర్య సంస్కృతి సర్కార్ జిల్లాలలో (కృష్ణా, గోదావరి, గుంటూరు, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం వగైరా జిల్లాలలో) నలుముకొనినంతగా, పశ్చిమాంధ్రలో (కడప, కర్నూల్, చిత్తూరు, అనంతపురం జిల్లాలో) ప్రాకలేదు. ఎందుకనగా పశ్చిమాంధ్రము కొండనేల. బీద దేశము. కాని బీదలైననూ ప్రజలు కృత్రిమ (కపటము) మెఱుగని దృఢగాత్రులు. నరులే గాక రాజుల దాడులు గూడ పడమటి నుండి తూర్పునకే నడిచినవి. ఆ దేశము కొండలు, అడవులు గలది. బయటవారు దీనితో సంబంధం కలిగి వుంటానికి ఇక్కడ ప్రలోభకారణాలు కూడ చాలతక్కువ. ఎందుకన రాగి (తమిదలు), జొన్న, సజ్జ చేలలో వారు పొందగలిగిన

లాభము కూడ అంతంతమాత్రమే. కాని బీద ప్రజల హృదయాలు ఉదారమునకు, అతిథి సత్కారమునకు మాత్రం బీదవి కావు.

మత గురువుల అధికారము, కులముల ఆధిక్యత, కర్మక్రతువులే ప్రాణమైన వైదిక మతము మీదనే తిరుగబడి దండెత్తిన భూమి అది. సూత్రప్రాయమును అయిన భావవ్యక్తీకరణ విధానమున ఆచార్యోత్తముడైన వేమన పద్యముల వలన ఇదంతయు నిరూపితమగుచున్నది. దక్షిణ భారతమున రూపొందిన జీవిత విధాన విమర్శకులలో వేమన ఉన్నతోన్నతుడు, ఇంతటివాడు ఇంకొకడు పోతులూరు వీర బ్రహ్మము.

పశ్చిమాంధ్రము పార్వతేయ భూమి. అది వేమనను కని పెంచినది. వేమన పద్యములలో వలెనే, చిత్తాకర్షక గుణము యీ రాతి కొండలందును, నైజముగ, సరళముగ, సూటిగా చైతన్య శక్తితో హృదయము నంటుకొనుచున్నది.

పుట్టుకతో వేమన పల్లెటూరి వాడు. కులమునే త్యజించిన వాని కులమునే చెప్పవలసి వచ్చిన యెడల, అతడు ఒక రెడ్డి. అతడు విద్యావంతుడు గాదు. పండితుడు గాదు. కాని అగాధ భావపూరుడు. జీవిత లౌకిక పారలౌకిక విషయములలో లోతుగా తెలిసినవాడు, బుద్ధివైభవము గలవాడు.

ఆయన కవిత్వము స్వచ్ఛమైనది. అది స్వయం సంభవము. దాని భాష, భావము, శయ్య (శైలి) అన్నీ ఆయన సొంతములు. ముక్త సరియైన మూడు బంతులలో పద్య భావమంతయు నిముడ్చును. చతురోక్తిని సంక్షేపంగా చెప్పుటలో వేమనను మించినవాడు యింకొకడు లేడు. ఆయన ఉపమానములు, రూపకములు అన్నీ పొలములు, పుట్టలు, పల్లెలు మొదలగు నాటి నుండియే చేపట్టబడినవి. ఆయన ప్రకృతి ప్రియుడైన సహజ కవి. విషయ లంపటులైన నీచానుభవములలో మునిగి ప్రాకులాడుచూ, తమ మానసములు ఆధ్యాత్మిక వాసనా యుత్తములని నటించిన మోసగాళ్ళను, వేషధారులను మాత్రమే ఆయన నిందించినాడు.

మానవుడు సాధించవలసిన పరమ గమ్యము, జనన మరణ చక్రము నుండి జీవాత్మను విడిపించి, సర్వవ్యాపకుడైన ఆ పరమాత్మయందు విలీనము పొందాలని వేమన చెప్పును. ఒక మానవుని ఇంకొక మానవుని నుండి వేరుచేసి ఒకరికంటె తాను వేరనియు, అధికుడననియు భావించు తలంపు గాని, సంస్థగాని

అహంకార రూపములు. ఇవి ఆ కాలంలో శైవము, వైష్ణవము, లింగాయతము, బౌద్ధము మొదలగు వివిధ మతములలో వ్యాప్తిజెందాయి. వాటిని వేమన నిర్దాక్షిణ్య తర్కముతో ఎదిరించుచున్నాడు.

ఎందుకన యీ ప్రతిమతాను యాయుడునుఁతాను ఇతరులకంటె భిన్నుడననియు, శ్రేష్ఠుడననియు భావించుకొనుచున్నాడు. ఈ ఆధిక్యత, ఈ ఉత్కృష్టత, యదార్థమైన యోగ్యత, సద్గుణ సంపత్తిపై ఆధారపడియుండుటలేదు. ఆటోపము (ఆండబరము) బాహ్యాచారము. మూఢ విశ్వాసాశ్రమము, కపటవంచన, అనుష్ఠానము, ప్రతీకపూజ మొదలగువాటిపై యీ గొప్పతనము నెలకొని, ఆత్మోన్నతికిమారు. దాని పతనమునకే తోడ్పడుచున్నవి. ఈ గురువులు,ఆచార్యులలో పలువురు ఉన్నతులేగాని (చదువుకున్నవారే) ఉత్తములు మాత్రంగాదు. (ఆచరణపరులు మాత్రంగాదు). సర్వత్రసర్వకాలములందు వ్యాపించియుండు దేవుడు అవతారమెత్తుననుటలో సత్యము లేదు. ఇక మన కొఱకుగాను ఆయన (దేవుడు) ప్రత్యేక జన్మమెత్తుట అర్థములేని మాట అని వేమన చెబుతాడు.

వేమన భాషా శైలి నిష్ఠురము; మర్మభేదవము. ఆ వ్రాత, మృదుల నిందోక్తి, మెత్తని వ్యాజము (ఎత్తిపొడుపుమాట) మధుర హాస్యముల మధ్య నడయాడుచుండును. చతురహాస్యము ఆయన ప్రత్యేక లక్షణము. వేదాంతపరంగా ఆయన వాదించడుగాని; పుండు పడునట్లుగా, గట్టిగా మానవుని మోదును. (కొట్టును) ప్రతిపక్షుల కీర్తి హీన బాహ్యలోపములను, బట్టబయలుచేసి వెక్కిరింతలకు, ఎగతాళులకు, బాల్పడజేయును. నీవు మరణానంతరము ఆ విశ్వశక్తిలో సంలీనము కావలయుననికోరిన యెడల, నీవు మొట్టమొదట బ్రతికియుండగానే సర్వమానవత్వంలో కలసిపోవాలని యెలుగెత్తి ప్రకటించి అమరకీర్తిని పొందాడు వేమన.

హిందూమతమునకు చెందిన బాహ్యాచారములలో (స్నానము, జపమాల,రుద్రాక్షమాల, కట్టు, బొట్టు, జుట్టు) వేమన విమర్శనకు, అవహేళనమునకు గురిగాని అంశమేలేదు. ఊరకే నీవు మునిగిన ముక్తి కలుగునా? అట్లయినచో, చేపలన్నీ ముక్తిపొందవలసినవే గదా? విభూతి శరీరానికి బూసికొనినంత మాత్రాన, కైవల్యం లభించునా? అట్లయినచో, గాడిద ఎప్పుడూ బూడిదలో గదా పొర్లాడు

చుండును? మాంసాదులను మాని శాకాహారియగుటయే ఒక మతమని పూని ఆచరించుటవల్ల మోక్షము గలదా? ఆకు లెల్ల తిన్న మేకపోతులకు కాయసిద్ధి లభించునా?

కులమని వేరు చేయుట సాంఘిక అభిశాపమేకాదు. రాజకీయ దోషమేకాదు. మోక్షమునకే ప్రబల విరోధి. కపటరీతిగా మతము పేర ప్రదర్శించుకొను ఆకూటాచారము (కపట ఆచరణ) మన వినాశకారి. దానిని ముందుగా తొలగించుకోవాలి.

వేమన పద్యములు నిరంతరము ప్రజల నాలుకలపైన చిందులాడుచూ సామెతలై పోయాయి. పీఠాధిపతుల ఆధిపత్యము, విగ్రహారాధనము, ఒక మానవునికి, ఇంకొక మానవునికి మధ్య ఏర్పరచిన వర్ణ విభాగములు, మూఢ విశ్వాసముల నిరంకుశాధికారము– ఇవి ఆయన (వేమన) అప్రతిమాన (ఎదురులేని) విమర్శన శక్తికి గురియైనవి. స్త్రీ జనముల బానిసీడు తనమును దప్ప, ఆయన గర్హించని సాంఘిక దురాచారమేలేదు.

మానవులందరూ తనకున్న పౌరుషమును ఉపయోగించి ఆచారమూఢ విశ్వాసములను భిన్నము చేసి పాత గురువులను వారికి దాసులైన ముసలమ్మల అధికారమును తొలగద్రోసి మానవులందర్నీ స్వతంత్రులు కమ్మని ఆయన (వేమన) రచనలు ప్రబోధించును. ఆయన చెప్పినది హేతుబద్ధమైన జీవన విధానము.

## 4. కొడాలి లక్ష్మీనారాయణ

వేమన కవియేగాకుండా, మహావేదాంతి. అనుష్టానపరుడు. బెంగాలు లోని టాగూరు, ఇంగ్లాండు కవి రాబర్టు బ్రౌనింగుల కంటే వేమన కొన్ని విధముల నధికుడు.

వేమన పద్యములు క్రీ.శ. 1824లో సి.పి. బ్రౌను ప్రథమముగా ఆంగ్లభాషలోనికి మార్చెను. తరువాత క్రీ.శ. 1872లో గోవర్ అను కవి ఆంగ్లభాషలోనికి మార్చెను. వేమన పద్యములు నీతిదాయకములు. బోధకల్గించునట్టివని యాయన వ్రాసెను. 1904లో వేమనను గూర్చి గ్రియర్సన్

ఇట్లు వ్రాసెను. క్రీ.శన 18వ శతాబ్దమునకు చెందినవాడు వేమన. ఆయన గ్రామ్య భాషలో వ్రాసెను. ఆయన కులము మీద స్త్రీల మీద దాడివెడలెను. తెలుగు కవులందరిలోనూ వేమన అత్యధికమైన పలుకుబడి గలిగియున్నాడు. వేమన యోగి పేరుతో లేని సామెతగాని, వచనముగాని లేదు. ఈవిధంగా వేమన అంతర్జాతీయ ఖ్యాతి గడించెను. ఆయన పద్యములు తమిళ, కన్నడ, మలయాళ భాషలలోనికి మార్చబడినవి.

ఆధ్యాత్మిక విద్యను బోధించువాడు వేమనవంటి మహాత్ముడై యుండవలెను. అనుష్టానములేని గురువులు నిష్ప్రయోజనం. వేమనకు విగ్రహారాధన యందు విశ్వాసము లేదు."

## 5. క్రాంతికిరణ్

తన సృష్టిచే సాహిత్యానికో సాంఘిక ప్రయోజనం ఉండాలని ఆశించి ఆ సాహిత్యం పదిమందికి అర్థంకావాలని పామర భాషలో లిఖించి సాంఘిక దౌష్ట్యాలను నిర్మొహమాటంగా నిర్భయంగా తూర్పారబట్టి జీవితం నేర్పిన పాఠాలు, గుణపాఠాల నుంచి కవిత్వ సత్యాలను క్రుమ్మరించి పండితులలో కాక ప్రజల నాల్కలపై నిలచి తెల్లవాడి (బ్రౌన్ దొర) పుణ్యమా అంటూ తెలుగువాడికి తిరిగి తెలియబడ్డ ప్రజాకవి వేమన.

నాటి సమాజంలోని రొచ్చును కదిపి కుదిపి దాని దుర్గంధాన్ని అర్థమయ్యేరీతిలో అందరికీ చాటిచెప్పిన వేమన శతకవాఙ్మయంలోని నీతి నేటికీ ఈనాటికీ మన సమాజానికి కూడా వర్తింస్తుందంటే, సరిపోతుందంటే ఆయనది ప్రజాసాహిత్యమేకాదు. సజీవసాహిత్యంకూడా. ఎన్ని యుగాలు మారినా, మరెన్ని పద్ధతులు మారినా, మానవజాతి మస్తిష్కంలో కుళ్ళు, కుతంత్రాలు ఉన్నంత వరకు, ఆయన సాహిత్య సజీవసంకేతంలా మానవ సమాజానికి వర్తిస్తూనే వుంటుంది.

సర్వకాల సర్వావస్థలలోనూ, సజీవకవి వేమన. వేమన కులంమానవ కులం. వేమన మతం మంచితనం అని జస్టిస్ చిన్నపరెడ్డిగారి మాటలు అక్షరాల సత్యము.

ఉన్నత కుటుంబంలో జన్మించి జీవితాన్ని సరితూచుకోలేక, సరిచేసుకోలేక ఉన్నదంతా పోగొట్టుకొని ఐనవాళ్ళచేత, కానివాళ్ళచేత ఛీకొట్టించుకొనిన సమాజంలో హీనంగా జూడబడ్డ వేమననాటి సమాజ స్వరూపంపై కసితో పగతో సాహిత్యం ద్వారా సెగలు వెళ్ళగ్రక్కి, ఆ రొచ్చు సమాజంలో, ఆ నీచ మనస్తత్వాలున్న వ్యక్తుల మధ్య నీచుడిగా బ్రతకలేక సమాజాన్ని తానే బహిష్కరించి దేశద్రిమ్మరిగా మారి, చెట్లవెంట పుట్లవెంట తిరిగిన వేమన సమాజంలోని లొసుగుల్ని, నీతిపేర సాగుతున్న అవినీతిని, ధర్మం పేర సాగుతున్న అధర్మాన్ని దుయ్యబట్టి ఏ ఒక్కడ్నీ విడవక అందర్నీ తూర్పారబట్టి, నాటి సమాజ నగ్న స్వరూపాన్ని నగ్నంగా బయటపెట్టిన ధైర్యశాలి.

చాలమంది నామమాత్రపు కవులు ఎవరికి యిష్టమొచ్చినట్లు వాళ్ళు పద్యాలు వ్రాసి వేమన పద్యాలలో ఇరికించారు. అందువల్ల వేమన పద్యాలలో వైరుధ్యం కాన్పిస్తోంది.

వేమన సాహిత్యంలో తడమని భావాలంటూ ఏమీలేవు. చెప్పని సమస్యాలేదు. అందుకే ఆయన సాహిత్యం ఒక మహాసాగరం. దానిలో దిగి వెతికితే దొరకనిది ఏదీ లేదు. లోతునకు వెళ్ళినకొద్దీ, ఆణిముత్యాలు దొరుకుతాయి. ఐతే అంతలోతుకు వెళ్ళివెదకే ధైర్యం, సాహసం, చొరవ, ఓర్పు ఉండాలిగా. పైకి అందరకూ అర్థమౌతూ తేలికగా కన్పిస్తూ అసలు మూలభావం మాత్రం పూర్తిగా ఎవరికీ అంతుపట్టని పద్యాలు వేమనవి. ఒక పద్యం చురకత్తి, ఒకటి ఈటె, వేరొకటి అమృతకలశం. వాటిల్లో నిప్పులు ఉంటై; నొప్పులు ఉంటై; కనువిప్పులు ఉంటై; అందుకే వేమన అంతుపట్టని ఆసేతుహిమవంతం; అంతుచిక్కని జలపాతం. మార్క్సిజం దార్శనికతలో శ్రీశ్రీ, భక్తిభావంలో పోతన, భావుకత్వంలో కృష్ణశాస్త్రి అర్థమౌతారు. కాని వేమనని ఆమూలాగ్రంగా చూడాలంటే ఎన్నో దార్శనికతలు కావాలి. ఎన్నోకళ్ళు పెట్టుకోవాలి. పండితుల మాటేమోగాని, గ్రామాలలో ప్రజలకు తెలిసిన కవి వేమనే. సుకవి ప్రజల నాల్కలపైన నిలచిపోతాడు అని జాషువాగారి భాష్యం. వేమన విషయం నూటికి నూరుపాళ్లు నిజం. ఆబాలగోపాలానికి అర్థమయ్యే కవి వేమన.

## 6. చార్లెస్ ఇ. గోవర్

(ఈయన ఇంగ్లండు నివాసి. ఈయన జానపదగేయ వాఙ్మయ ప్రియుడు. ఈయన "దక్షిణ భారత జానపద గేయాలు" (Folk songs of South India) అనే పుస్తకాన్ని 1871లో వ్రాశాడు. ఈయన వేమన పద్యాలను ఇంగ్లీషులో పద్యానువాదము చేసినాడు. ఈయన భారతదేశ విషయాలపై చాల పుస్తకాలు వ్రాశాడు)

ద్రావిడ భాషా కుటుంబమునకు జెందిన గొప్ప భాషలలో తెలుగు ఒక్కటే మృదుమధురమై వున్నది. అందువల్ల తెలుగును ప్రాచ్య ఇటాలియన్ భాష అనుట ఎంతో సముచితముగనున్నది. తెలుగుదేశంలో బ్రాహ్మణుల ప్రాబల్యమునకు లోబడని భాగములు ఇంకనూ చాలా గలవు. బ్రాహ్మణులు శ్రీమంతమైన వాగర్త ప్రాంతాలలోనే ప్రాబల్యమును చేసుకొన్నారు. అందువల్లనే వీరి సంబంధంలేని ప్రదేశాలలో పల్లెలలో పుట్టిన తెనుగు బుగ్గ, స్వచ్ఛమై, దూషితముగాక, ఎప్పుడూ ప్రవహించుచూ దేశమంతటా భాషా జీవనమును ఊరించుచూ దేశీయవాణిని వినాశనమునుండి కాపాడుచున్నది. తెలుగు ప్రజల చరిత్రను తెలుసుకొనుటకు మనము 10వ శతాబ్దమున రచియింపబడిన "దశకుమార చరిత్ర" (సంస్కృతంలో నుండి కవికృతము) తెనుగు వారి ఆంధ్రసామ్రాజ్యమును గూర్చి ఉగ్గడించుచున్నది. ఆంధ్రులు ప్రచండ నావికాబలము కలిగినవారు. వారికి యుద్ధనౌకలు అసంఖ్యాకములుగా వుండేవి. వారికి వేలకువేలు నావికులుండేవారు. మైసూరు మొదలు కన్యాకుమారి వరకు దక్షిణదేశమందలి, కరవై (బలిజ), సడకన్(వెలమ) మొదలగు కులములవారు వలసబోయి అచట స్థిరనివాసము  ఏర్పరచుకొనిన తెలుగువారే. వీరి సాంఘికోన్నతి భూస్థితి మొదలగునవి వారు ఆ ప్రాంతమును జయించి వశపరచుకొనిన దాని ఫలితమనే తెలుపుచున్నది.

తెలుగు సామ్రాజ్యములలో విజయనగరము కడపటిది. క్రీ.శ. 1399–1600 నకును ఆ సామ్రాజ్యాధికారము  దక్షిణాపథమున పరమోచ్ఛ స్థితిని పొందియున్నది. దీనికి మూడు ప్రముఖులైన భేతాళ (బేలాల) వంశము వరంగల్లులో

పాలన నెరపినది. వీటికి ముందు కదంబ చాళుక్యుల చరిత్ర క్రీస్తుకుపూర్వం అస్ఫుట ప్రాచీన కాలములోనికి చొచ్చుకొని పోయి యున్నది.

ప్లిని (Pliny) రోమను సైనికచరిత్ర రచయిత క్రీ.శ. 23–74లో వుండెను. అతని కాలంలోనూ, ఆయనకు యీ సంగతులు చెప్పిన విశ్వాసపాత్రులకు ముందు కాలంలోనూ, నాగరికపూర్ణమైన ఒక ప్రచండ ఆంధ్రరాజ్యము గంగాతటము మొదలు కావేరీతీరము వరకు భారతదేశ తూర్పుతీరము వరకు ఆక్రమించుకొని తనకు ఎదురు లేకుండా విలసిల్లినది. విజయనగర పతనానంతరం వారన్ హేస్టింగ్సు నాయకత్వమున బ్రిటిష్‌వారి రాజ్యాధికారము తలయెత్తి తిరిగి శాంతి స్థిరపడునంతవరకు తెనుగు జాతిని దురదృష్టము, అరాచకము, నిరాశ అలముకొనినవి. భాగ్యవంతమైన ఈ తెనుగుదేశంపై మొగలులు, పఠానులు, మహారాష్ట్రులు, పిండారీలు( దోపిడి ముఠాలు) ఇతర రాజుల దండులో ఒకదాని తరువాత ఇంకొకటి యీ భాగ్యవంతమైన దేశముపై పడినవి. కాని ఆంధ్రులు కత్తెత్తి, దండెత్తి వచ్చిన వారిని నిలువరించి దేశ రక్షణమును గావించుకోలేకపోయారు.

ఈ రకంగా తెలుగుజాతి భూమిపై తుడిచివేయబడినది. క్రీ.శ. 13వ శతాబ్దానికి ముందుండిన తెలుగు పుస్తకమే అరుదైపోయింది. తెలుగు భారతము, నన్నయ వ్యాకరణము 12వ శతాబ్దానికి ముందే వ్రాయబడినవి. కాని అవి సామాన్య ప్రజాభిప్రాయమునకు ప్రతినిధులుగావు. ఎందుకనగా అవన్నీ బ్రాహ్మణులచేత బ్రాహ్మణుల కొరకు వ్రాయబడినవి.

వేమన 16వ శతాబ్దమువాడని కొందరు, 12వ శతాబ్దామువాడని మరికొందరు, వేమన వెలమ కులస్థుడని కొందరు, జంగమని మరికొందరు రెడ్డి అని ఇంకొందరు, వీరశైవ సిద్ధాంతి అని మరికొందరు అంటున్నారు.

ఏమైనప్పటికీ వేమన పద్యములందలి సత్యములు, నుడికారములు అనేక శతాబ్దాలుగా ప్రజా జీవనమున తేలియాడుచునే యుండివనుట పరమ సత్యము. అయితే వేమన తన సొంతములను చాలావాటిని వీటిలో తప్పక కలిపివేసియుండును. వేమన పద్యముల చందము అతి సులభమైనది. ఇది నకలు వ్రాతగాండ్ర పనిని సుకరము చేసినది. కాబట్టే ఇప్పటి వేమన పద్యపరంపర, జానపద సూక్తులను

ఛందోబద్ధముచేసి ఒకే అచ్చులోబోసి తీర్చిన విధముగా గాన్పించుచున్నది.

వేమనయొక్క హేతువాదము, ఏకేశ్వరోపాసన, నన్ను బాగా ఆకర్షించాయి. వేమన భావములేగాక, ఆ భావముల వ్యాపకమునకు ఆయన చూపిన ఆసక్తి, సత్యనిరతి, అనేకములు గూడా పాశ్చాత్యులకు ఎక్కువగా మనస్సుకెక్కినవి. కాని వేమన పద్యాలద్వారా హిందూ విద్యార్థులను క్రైస్తవ మతము లోనికి కలుపుకొనే యత్నం పాశ్చాత్య ప్రభుత్వం చేస్తున్నదనే అపోహకు తావు లేకుండా చేయడానికి నేను వేమన పద్యాలను పాఠశాలలో పెట్టుటకు యిష్టపడలేదు.

## 7. ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్

(ఈయన ఒక ఆంగ్లేయుడు. 1817ఓ మదరాసు సివిల్ సర్వీసులో ప్రవేశించెను. తెలుగు జిల్లాలకు ఈయన పంపబడినాడు. ఈయన తెలుగుభాషను బాగా నేర్చుకొనెను. తీరినపుడల్లా తెలుగు భాషాసారస్వతమునకే తన కాలమును వినియోగించాడు. ఇతడు వేమన పద్యములను ప్రప్రథమముగా తన సొంత సొమ్ముతో అచ్చు వేయించిన గొప్ప తెలుగు భాషాభిమానముగల మహావ్యక్తి.

ఈయన కాలగర్భంలో కలిసిపోతున్న అనేక తెలుగు కావ్యాలను వెలికితీసి తెలుగు సాహిత్యానికి అమూల్యమైన సేవచేసిన పాశ్చాత్యులలో ప్రముఖుడు. ఈయన తెలుగు భాషా సాహిత్యానికి తన జీవితాన్ని అంకితం చేశాడు. ఈయన నిరాడంబరమూర్తి. తెలుగులో అసమానమైన నిఘంటువును రచించాడు. తెలుగు జనజీవితంలోనుంచి సాహిత్యాన్ని, సాహిత్యంలోనుంచి జన జీవితాన్ని దర్శించి అవగాహనకు తెచ్చుకొని మనకొక అవగాహనను ప్రసాదించి పోయిన సారస్వత మూర్తి. పాశ్చాత్య దంపతులకు యీయన జన్మించినా అనేక భారతీయ భాషలను అభ్యసించి తెలుగు భాషోద్ధరణకు యావత్ జీవితాన్ని అంకితం చేసిన నవ్యాంధ్ర సాహిత్యానికి యుగపురుషుడు)

తెలుగు దక్షిణ భారతమున ఒక ప్రధాన భాష. ఇది ప్రాచీనమైన భాష. ఇది క్రీ.శ. 36వ సంవత్సరము నుండియే వ్యాప్తిలో వుంది. ఆ రోజులలో దీనిని రాజులు పోషించారు. ఈ భాషా వ్యాకరణము చాలా శాస్త్రీయమైనది. ఈ భాష

సంస్కృతముకంటే ఎక్కువ కష్టమైనది; కాని శబ్దములు లలిత, రామణియకములై వినుటకు మృదులమధురములై యుండును. అందుకని యీ భాషను ఆంగ్లేయులు "భారతదేశ ఇటలీ భాష" అనినారు. ఈ భాష నేడు సంస్కృతంతో ఎక్కువ సంబంధం కలిగి వుంది. ఈ భాష పారిభాషిక పదములను ఇతర భాషలనుండి ముఖ్యంగా సంస్కృతము నుండి ఎక్కువ పదములను అరువు తెచ్చుకొనుచున్నది. ఈ సంస్కృతీకరణము రోజురోజుకూ ఎదిగిపోతున్నది. అందువల్ల యీ భాష తన మొదటి స్వచ్ఛతను కోల్పోవుచున్నది. 18వ శతాబ్దములో మహమ్మదీయుల దురాక్రమణ, వారి ప్రోద్బలములు తెలంగాణా ప్రాంత సాహిత్యమును గట్టిగా అణచివేసినవి. తెలుగుభాష స్థితి చాల దిగజారిపోయినది. అందువల్ల జనసామాన్య భాషగూడ చాల సంకరమై పాడైపోయినది. కాని బ్రిటిష్ ప్రభుత్వాధికారము క్రిందికి వచ్చిన తర్వాత యీ భాషాభివృద్ధికి సదవకాశము ఏర్పడినది. 18వ శతాబ్దమునకు పూర్వం ఏ తెలుగు కావ్యంగాని, పద్యముగాని అచ్చుపడి ఎరుగదు. తెలుగు భాషా కావ్యము ఏదిగాని ఇంగ్లీషులోనికి అనువదింపబడుటకు ప్రయత్నము కూడ జరుగలేదని నా నమ్మకము.

తెనుగుభాష నేర్చుకొనవలెనంటే వేమన రచనలు చాల ఉపయోగకారులు. సులభశైలిలో వివిధ విషయాలు విపులంగా వర్ణించబడ్డాయి. శయ్యా (శైలి), గారము గలిగిన కవిత్వంలో వేయిమాటలలో ఇమడని అర్థభావము ఒక చిన్న వాక్యములో, చాటువులో, నానుడిలో ఆ భాణములో దృష్టాంతరీకరింపబడుచున్నది. వేమన కడప జిల్లావాసి. గండికోట పరిసరములలో జన్మించి యుండును. 708వ పద్యములో వేమన తన జన్మము గురించి చెప్పుకున్నాడు. ఆయన 1653 ప్రాంతంలో జీవించి యుండవచ్చును.

వేమన పద్యములు మిక్కిలి లోకప్రియములైనవి. కాని వాటి తుంటమాటలు, చిక్కటి అల్లిక, ఇతర భాషలలోనికి వాటిని రమ్యముగా అనువదించుటకు వీలు కాకుండా చేసినవి. అయినప్పటికీ యీ వాక్యములే తెనుగు భాషకు బిగువును, మగసిరిని వెల్లడించుచున్నవి.

సాధారణ కవులు యిట్టి భావములను వ్యక్తం చేయుటకు తమ

పాండిత్యమునకు శక్తి చాలకపోయినందున పదాడంబరముతో ఆ వెలితిని కప్పి పుచ్చుకొనుచుందురు. సూత్రప్రాయములైన వేమన రచనములెన్నో సామాన్య సామెతలై వ్యాపించియున్నవి. ఇందులో సంస్కృత హితోపదేశము, భగవద్గీతలనుండి చాల గ్రహించబడినవి. ఈ నానుడులలో కొన్ని అస్ఫుటములైన సంస్కృతములే.

తత్త్వ విద్యావిషయమున వేమన, వ్యాసుని వేదాంత సంప్రదాయమునకు చెందినవాడే. వేమన సూక్తులు గ్రీకు దేశపు వేదాంతి "ప్లేటో" గూడ మత నిబంధనలకు దగ్గరగా వుంటున్నవి. వేమన నైతిక నియమావళి "డిమోక్రిటస్" (గ్రీకు దేశపు భౌతిక తత్త్వవేత్త) సాంప్రదాయిక సూత్రములను పోలియున్నది.

వేమన పద్యములు నీతి, అవహేళనము, గూఢ వేదాంతము వగైరాలకు సంబంధించినవి. నీతి విభాగంలో భక్తి భావావేశము గలదు. రెండవ భాగము హిందూ మతాచారములను, ముఖ్యంగా బ్రాహ్మణులను వెక్కిరించి చులకనపరచుచున్నవి. కాని ఇందులో వ్యక్తిగత దూషణములేదు. మూడవది మర్మ వేదాంత భాగము. ఈ భాగంలో వీర్యవంతమైన ఒక దృఢబుద్ధి, అనాగరిక మూఢాచార గాఢతమములో చిక్కి ఆరిపోయిన సత్యజ్యోతిని వెదకులాడుచున్నట్లు మాత్రము కన్పించును.

వేమన పద్యములలోని కొన్ని పద్యములను ఇంగ్లీషులోనికి అంటే ల్యాటిన్ భాషలోనికి మార్చుట సులభముగా వున్నది. అయినప్పటికీ ఇంగ్లీషులోనికి అనువదించుటకు అనువైనవాటిని ఏటినిగాని ల్యాటిన్‌లో వ్రాసి ఇంగ్లీషులో దిగవేయలేదు. ఎక్కువ జటిలమైన పద్యములను తెలుగు వివరణమునుగూడ చేర్చియున్నాను. నాకు ఇద్దరు బ్రాహ్మణ మహాశయులు తెనుగు భాషను, దాని వ్యాకరణమును నేర్పిరి. వేమన పద్యములు ఎక్కువగా ఆటవెలదులు. బళ్ళారి, కడప, కర్నూలు, విశాఖపట్టణము, మచిలీపట్నము వగైరా పట్టణముల నుండి వేమన పద్యముల వేరు వేరు ప్రతులు స్వీకరింపబడినవి. వీటినన్నిటిని కలిపి 2వేల పద్యములను మాత్రమే ఏరగలిగితిని.

తెలుగుభాష నేర్చుకోటానికి సులభశైలిలో వ్రాయబడిన రచనలను నేను అన్వేషింప మొదలిడితిని. వేమన పద్యముల వ్రాతప్రతులు నాకు చాల లభించాయి.

నా ఉద్యోగ నిర్వహణములో నాకు లభించిన తీరికలో వాటిని బాగా చదివి ఇంగ్లీషులోనికి అనువదించితిని.

వేమన తన కుల నామమునుగాని, ఇంటి పేరునుగాని ఎక్కడా బయట పెట్టలేదు. అందువల్ల ఆయన 'జంగము'గా వుండవచ్చునని అనుకొంటున్నాను. ఈజంగములనే శూద్రజాతి, వేదమతమునుండి చీలిపోయినది. ఈ మత సిద్ధాంతములు వేమన సిద్ధాంతములకు సరిపోవుచున్నవి. ఆయన దూషించనిది యీ మతము నొకదానినే.

వేమన కర్నూలు జిల్లాలోని కందనవోలు దుర్గాధిపతి అనవేమనరెడ్డి కుటుంబమునకు చెందినవాడని కొందరందురు. కందనవోలు దగ్గర కృష్టిపాడు గ్రామస్థుడని మరికొందరంటున్నారు. గుంటూరు మండలములోని వినుకొండవాడని ఇంకొందరంటున్నారు. కడప జిల్లా చిట్వేలు వాడని అనువారు కొందరు గలరు. అయినప్పటికీ ఆయన పద్యములలో వ్రాయబడి యున్న కొన్ని స్థానిక పదములు ఆయన తెలంగాణా (ఇప్పటి రాయలసీమ) నైరుతీ ప్రాంతీయుడై ఉండవచ్చునని తేల్చి చెప్పుటకు వీలుచిక్కుచున్నది. ఆయన 17వ శతాబ్దము నాటివాడని విశ్వసించబడుచున్నది.

వేమన బ్రాహ్మణులను చులకనచేసి తూలనాడినట్లు కాన్పించును. బసవేశ్వరుని ధర్మములపట్ల చాల మొగ్గు చూపించినట్లు కనబడినప్పటికీ వీరశైవ సిద్ధాంతాలను మాత్రము అవలంబించివాడు కాదు. ఇంతేగాక స్త్రీ జాతిని గర్హించిన తీరు ఆయన వీరశైవుడు కాదనే దానికి ఇంకొక నిదర్శనమగుచున్నది.

1823 నాటికి నాకు 25 ఏండ్లు పూర్తి అయినవి. అప్పటికి నేను తెలుగు ధారాళముగా మాట్లాడగలిగియుంటిని. ఆ తర్వాత1824లో తెలుగు పద్యములు చదువమని నన్ను కొందరు ప్రోత్సాహపరచినారు. అంతవరకు తెనుగు భాషా కవుల సంగతి నాకు తెలియదు. కాని "దూబాయి" పుస్తకము ద్వారా వేమన నాకు పరిచయమైనాడు. ఆయన పద్యములను చదవగా, ఆయన నీతి సూత్రకారుడైన ఒక గ్రామీణుడని తెలిసికొంటిని. ఆయన పద్యములను ఇంగ్లీషులోనికి అనువదించితిని.

వేమన పద్యములను నేను 1829లో ముద్రించితిని. కాని బ్రాహ్మణులను

వేమన హేళనము చేసినందున యీపద్య సంపుటి వారికి గిట్టక చులకన చేయబడినది.కాని ఇది అటు తెనుగు, ఇటు ఇంగ్లీషు నేర్చుకొను వారికి ప్రీతిపాత్రమైన గ్రంథమైనది.

నేను చాలకాలం వరకు హిందూ సంఘంలో కలసిమెలసి యుండలేదు.అందువల్ల నాకు ఏ కొద్దిమందో పరిచయమైనారు. హిందువులు చాల అరుదుగా వచ్చి నన్ను చూచేవారు. నేను వేమన పద్యములను అచ్చు వేయించిన తరువాత చాలమంది హిందువులు నేను వారి మతమును కావలయుననే విమర్శించి క్రిందుచేసే ప్రబల విరోధినని లెక్కగట్టినారు. బ్రాహ్మణులపట్ల వేమన పలికిన అపభాషణములను నేను ముద్రించుటచే, వారు నిరాకరించే జంగమ వాఙ్మయమును నేను ఆమోదించుటచే హిందువుల విగ్రహారాధనపట్ల నాకు గల విరోధ భావమునకు ప్రబల నిదర్శనమని వారి అభిప్రాయము.

## 8. చేకూరి రామారావు

తన కాలపు పరిధిలోనైనా సామాజిక చైతన్య దృష్టితో కవిత్వం చెప్పిన తెలుగు మొదట కవి వేమన్నే. ఆనాటి (17వ శతాబ్దం) సామాజిక పరిస్థితులను వేమన్న సమూలంగా అర్థం చేసుకొన్నాడని చెప్పలేం. గొప్ప, పేద తారతమ్యాలు అర్థం చేసుకోగలిగాడుగాని వాటి వెనకాల వున్న ఆర్థిక వ్యవస్థ లోతుపాతులు తెలుసుకోటానికి వేమన్న ఆర్థిక శాస్త్రవేత్త కాదు. వేశ్యలను గురించిగాని అసలు స్త్రీలను గురించిగాని వేమన్నకు కనీసం ఉదారమైన అభిప్రాయాలు కూడా ఉన్నట్లులేదు. అయితే తన కాలాన్ని మించి కొన్ని విషయాలలో ముందుకు చూడగలిగిన కవిగా వేమన్నను మనం గౌరవించాలి. విగ్రహారాధనను వ్యతిరేకించాడు. శైవ, వైష్ణవ మతాలవారి ఆర్భాటాలను, వారి దురాచారాలను, మోసాలను బట్టబయలు చేశాడు. చిలుక పలుకుల చదువులను విమర్శించాడు. కాకులకు పిండాలు పెట్టటంవంటి మూర్ఖాచారాలను తీవ్రంగా ఖండించాడు. శ్రమశక్తిలోనే సర్వమూ ఉన్నది అనేంత నిశిత పరిశీలన చెయ్యగలిగిన వేమన్న మామూలు కవికాడు. తన కాలపు చట్రంలో ఇమడని గొప్ప కవి. వేమన రచనామార్గంలో మూడు అంశాలను గుర్తించవచ్చు. 1. ప్రజల భాషలో

ప్రచారంగావున్న పదాలను మాండలికాలను ప్రయోగించి ప్రజలకు సన్నిహితమైన రచన చెయ్యటం, 2. చెప్పదలచుకొన్న భావాన్ని తగిన విస్తీర్ణంలోనే క్లుప్తంగా చెప్పటం, 3. ఊహలోనుంచి కాక జీవితంనుంచి ఉపమానాలను ఏరుకోవటం. కవితా దృక్పథం విషయంలో మాత్రమే కాక రచనా విధానంలో కూడా వేమన్న ఆదర్శంనుంచి ఈనాటి కవులు నేర్చుకోవలసింది చాలా వుంది.

## 9. జెడి.బి. గ్రిబిల్

కదిరి తాలూకాలో ఒక నూతన మత ప్రవక్త జాడలు కొన్ని నాకు దొరికినవి. బ్రిటిషువారు యీ జిల్లాను ఆక్రమించుకొనుటకు కొంత కాలమునకు ముందు వేమన అనే కాపు తన్ను తాను ఒక గురు పీఠమున అధిష్ఠించుకొనినాడు. ఆయనను బ్రాహ్మణులు గుర్తించకపోవుటేగాక, మీదు మిక్కిలి వెలివేసినారు. కాని ప్రజలు ఆయనను గూర్చి యిప్పటికినీ గౌరవభావముతో, గురు భ్రూవముతో మాట్లాడుచున్నారు.

ఆయనకు ఒక పరమ పురుషుడు ప్రత్యక్షమై సప్త సూత్రములను– దొంగిలించకుము; ఎల్లప్పుడూ దయామయుడుగా వుండుము. ఇతరుల మనస్సును బాధించకుము; ఉన్నదానితో తృప్తిపడుము; ఇతరులపట్ల అసూయ పడకుము; కోపమును అణచి ఓర్పును వహించుము. నిరంతరము భగవంతుని ఆరాధనలో నిమగ్నమై యుండుము– ప్రసాదించెనని వేమన చెప్పుకొనినాడు.

వేమనను గురించి అనేక గాథలు ప్రచారంలో వున్నవి. ఒకనాడు ఇరుగు పొరుగువారితో తాను యోగ సమాధిలో ప్రవేశించుచున్నానని చెప్పి అట్లే మూడు రోజులపాటు యోగనిద్రపోయి మేల్కాంచినాడు. స్పృహ రాగానే తాను ఈ సమాధి కాలంలో స్వర్గంలో ఉండినట్లును, అచట కొందరు దేవతలు తనకు అద్వైత మతోపదేశము చేసినట్లును చెప్పినాడు.

వేమలోగల ఒక విశేషమేమంటే– ఆయన ఎప్పుడూ దిసమొలతో తిరిగేవాడు. ఒకప్పుడు రెండెద్దులు పోట్లాడుకొనుచుండగా వాటి తగవును ఆపి, వేరుచేయబోగా తాను కట్టుకొని యుండిన గుడ్డ ఊడి క్రిందపడి పోయింది. అది మొదలు ఆయన మరల గుడ్డ కట్టుకొనక విత్తలిగానే (దిగంబరిగానే)

ఉండిపోయినాడు.

ఈ విచిత్రవ్యక్తి ఒక చచ్చినకుక్క ఒంటినుండి పిడికెడు చీడపురుగులను లాగి తీసికొని నోటిలో పోసుకొని వాటిని బియ్యపుగింజలుగా మార్చి బయటకు ఉమ్మివేసినాడట. ఇక ఇట్టి ప్రవక్తను బ్రాహ్మణులు నిరాకరించి ఆంక్షబెట్టినారనుటలో విశేషములేదు.

కటారుపల్లెలో వేమన సమాధిమీద ఒక గుడి కట్టబడియున్నది. కొంతకాలమునకు ఆయన భక్తులకుమధ్య వివాదములు ఏర్పడగా చీలిక వేర్పడి, కొందరు కొండ కామెర్లలోనూ చేరి అక్కడా రెండు వేమనాలయాలను నిర్మించుకొని ఈ యోగిని సేవించుకొనుచున్నారు. ఏటేటా కటారుపల్లెలో వేమన తిరునాళ్ళు అతి వైభవముగా జరుగుచున్నవి. అచట వేలాది ప్రజలు మూగుచున్నారు. కాని అచటికి బ్రాహ్మణులు మాత్రం రారు. శూద్రులకు మాత్రం కటారుపల్లి ఒక పవిత్ర క్షేత్రముగా వున్నది. నల్లచెఱువులో కూడా ఏటేటా, ఏప్రియల్ నెలలో జరిగే వేమన ఉత్సవమును నేను మ్యాన్యుయలీలో వర్ణించినాను. అది కుగ్రామమైననూ, అనేకమంది ప్రజలు అక్కడకు పోగవుదురు.

## 10. డా॥ ఈశ్వరతోపా

వేమన తన ఉపదేశాలలో మర్మము విడచి, యున్నది యున్నట్లుగా చెప్పాడు. సంఘమునందలి, యున్నతవర్గము సంఘంలో గౌరవస్థానమును ఆక్రమించినమాట నిజమే. కాని మానవత్వ విషయమున అది చాలవరకు పతనము చెందిందని వేమన అభిప్రాయం. దాని సాంఘిక విధానములను, నైతిక ప్రమాణములను బయల్పరచి, దాని జీవిత మార్గాలు అర్థరహితములని నిరూపించాడు. అందుకని ఉన్నతవర్గములవారు వేమన పరిశీలనములను హేళనాత్మకములుగా గణించిరి. కాని వేమన వారికి మార్గదర్శకములై యభ్యుదయమునకు వెలుగు నొసంగుననియే, వానిని తనకు సహజమైన సరళమార్గమున చెప్పియుండెను.

ఉన్నదాని నున్నట్లు విప్పిచెప్పు వేమన యుపదేశ విధానము ఆ కాలమునందలి విద్యావంతులకు పలువురకు రుచించలేదు. వేమన వారి నాగరిక

విధానములను అధిక్షేపించుటయేగాక, వారికి మానవతా పాఠాలు కూడ నేర్పజూచుటయే వారి అసంతృప్తికి ముఖ్యహేతువు. గర్వము, పొగరుబోతుతనము మానవత్వాభివృద్ధికి గొప్ప ఆటంకాలని వేమన స్పష్టంగా చెప్పాడు.

ఇంతే కాకుండా అధికారము, సంపద, గౌరవములు మానవోన్నతికి సహాయకారులు కాజాలవని కూడ స్పష్టంగా చెప్పి మానవోన్నతి, చాలవఱకు మానవుల ప్రయత్నములపైననే ఆధారపడి వుంటుందని వక్కాణించాడు. ఆనాటి ఉన్నతవర్గములవారిలో సంస్కృతి నశించిపోయిందని వేమన గుర్తించాడు.

వేమన మానవ స్వభావమును బాగుగా పరిశీలించినవాడగుటచే మానవ జీవితమునకు సంబంధించిన అన్ని అంశములను గూర్చి లెస్సగా ఆలోచించాడు. మానవజీవితము జీవశాస్త్ర సిద్ధాంతములకు అనుగుణముగా వర్తించునని వేమన ఉద్దేశము. భౌతికములైన అర్థానర్థాలు మనుజుని మానసిక భావపరిస్థితులచే నిశ్చయింపబడునని వేమన ఉద్దేశము.

వాక్చాతుర్యము. వాక్పారత్వములు, భావచాంచల్య లక్షణములని వేమన అభిప్రాయము. అందువల్లనే వట్టిమాటలపై కంటె మనస్సుపైనే ఆధారపడే వుండాలని వేమన పదేపదే చెప్పాడు. మానవుడు తనయెడ అశ్రద్ధవహించుటచేతనే ఆత్మ విజ్ఞానమును కోల్పోయి ఆత్మ వినాశమునకు హేతువగుచున్నాడని వేమన నమ్మకం.

మానవ జీవితము కాల నియమమునకు లొంగి వర్తించుచున్నది. ఈ విషయాన్ని గుర్తించుకొని మానవుడు తన కర్తవ్య కర్మలను నిర్వహించినయెడల, అతడు ప్రపంచంలో శాంతముగా జీవించగలడని వేమన వెలుగెత్తి చాటాడు.

మానవుడు కామానికి, ధన మత్తతకు, రాగద్వేషాల ఉద్రేకాలకు గుఱియై చెడిపోతున్నాడని వేమన తెలిసికొని చాల విచారపడ్డాడు. అందుకని ఆయన ప్రజలమధ్య నివసిస్తూ వారి మంచిచెడ్డలను ఆలోచించి వారికి సదుపదేశాలు కావించాడు.

ప్రపంచములో వివిధములైన సాంస్కృతిక వర్గముల వారున్నారు. మానవ జీవితంలో సంస్కృతికి గల ప్రాధాన్యతను వేమన గుర్తించాడు. వేమన దరిద్రుల పక్షమున వాదించాడు. వారియెడల సానుభూతిని చూపించమని ధనికులకు హెచ్చరిక

చేశాడు. మానవ జీవితము కేవలం శారీరక తత్వము మాత్రమే కాదు. అందు ఆధ్యాత్మిక తత్త్వము కూడ నిండియున్నది. కాని మానవుడు శరీరంలో ఒక ఆత్మ ఉన్నదని అనుకొనునేగాని వాని శక్తిని జాగృత మొనరించుటకై అతడు ఏమీ ప్రయత్నించుటలేదు. అందువల్ల అతడు తన దేహమునకు ఆత్మకుగల పరస్పర సంబంధమును గుర్తించకపోతున్నాడు. కాని ఆధ్యాత్మికతా ప్రకాశములేని కేవలం భౌతిక జీవితం నిర్మలమైనప్పటికీ నిరర్ధకమైనదని వేమన అభిప్రాయం.

మానవుడు ప్రపంచంలో బానిసగా గాక స్వతంత్రుడుగా జీవించుచూ మానవ సంస్కృతీకరణమును నిర్వహించవచ్చునని వేమన ఊహ. ప్రపంచం మానవునికి పరీక్షాస్థలమని వేమన నమ్మకం. ప్రపంచ పరిత్యాగమను నాదర్శమును వేమన హర్షించలేదు. వేమన వేషధారులైన సన్యాసులను ఘాటుగా విమర్శించాడు. కాని సంస్కార సంపన్నులైన మహోదాత్తుడైన యోగిపుంగవుని వేమన అమితంగా గౌరవించాడు.

కర్మకాండలు మానవుని ఆధ్యాత్మిక విషయమును అజ్ఞానాంధకారంలో బడద్రోయుననియు, దేవతోపాసన యట్లుగాక, మానవునిలో అణగియున్న ఆధ్యాత్మిక శక్తులను సజ్జీవములనుగా నొనరించుటకు తోడ్పడు చున్నదనియు, ఇంతే కాకుండా కర్మకాండలవల్ల మానవుడు భ్రష్టుడైపోవుననియు, దైవోపాసనవల్ల మానవుడు ఆత్మజ్ఞుడగునని వేమన నమ్మిక.

దైవోపాసన మానవైక్యమునకు సర్వవిధముల తోడ్పడుననియు, కర్మానుష్ఠాన మార్గము దానిని కలుషితంచేసి ధ్వంసం చేయుననియు వేమనకు స్థిరమైన నమ్మకం ఉండేది. కర్మానుష్ఠానంవలన ప్రాపంచిక లాభం కలుగవచ్చును. కాని కర్మానుష్ఠాన త్పరమైన జీవితము మానవుని ఆధ్యాత్మిక ప్రవృత్తిని నడచివేయునని వేమన అభిప్రాయం.

ప్రపంచంలోని మతక్రియా కలాపాల యందును, మత ప్రవక్తల కర్మ త్పరములైన మార్గములందును వేమనకు ఎట్టి అభిమానం వుండేది కాదు. ఎందుకన వారి జీవితములలో మాయ, వంచనలు అవిచ్ఛిన్నముగా కొనసాగుచున్నాయని వేమన తెలిసికొన్నాడు.

వేమన మానవజీవితం నుండి కర్మకలాపాలకు సంబంధించిన తప్పును తాను నిర్మూలింపజేయాలని హృదయపూర్వకంగా యత్నించుచుండే వాడు. కర్మాచార కాండము వేదప్రతిపాదకమనియు సన్మార్గ నివర్తకమనియు, దోషభూయిష్టమనియు వేమన అభిప్రాయము.

ఇంతేకాదు మతక్రియా కలాపాలు కూడ నిర్థకములనియు, మౌఢ్యసూచకములనియు, వేమన తలంచెను. తీర్థయాత్రలకును మానవ కళ్యాణమునకును ఎట్టి సంబంధం లేదనియు, తీర్థయాత్రల గూర్చి సదభిప్రాయం కలిగియుండుటెల్ల కేవలం నటనయని వేమన అభిప్రాయము. తీర్థయాత్రల వల్ల మానవహృదయంలో ఎట్టిమార్పు కలగదని వేమన నమ్మిక. భగవదారాధన యందు పూర్ణవిశ్వాసం ఉన్నప్పటికీ, విగ్రహారాధన వట్టి బూటకమని వేమనగట్టిగా నమ్మినాడు. విగ్రహారాధనవల్ల మానవునికి ఎట్టిమేలు కలుగకపోగా అది మనవుని గుణగణాలను నశింపుజేయునని వేమన నమ్మకం. విగ్రహారాధన యందలి యాధ్యాత్మిక తత్త్వమునకును, యథార్థ భగవదారాధన తత్త్వమునకును మధ్యగల భేదమును వేమన చక్కగా నిరూపించాడు. మానవుని అంతరమును వృద్ధిపరచుటకై అతనిలోని పశుభావములను మానవతా సహితాభిలాషములుగా మార్చవలెనని వేమన యత్నము. మానవుడు జన్మచేతనే అధికుడు కాజాలడనియు, గుణముచేతనే మానవుడు గొప్పవాడు కాగలడని వేమన అభిప్రాయం. మతాచార్యులయెడ వేమనకు ఏ విధమైన ద్వేషము లేదు. కాని మలినమును, సంకుచితములైన వారి జీవితములను చూడగా ఆయనకు ఆశ్చర్యము కలిగెను. బూటకపు గురువులన్న వేమన్నకు అమితమైన ఏవగింపు ఉండేది.

వేమన వర్ణవ్యవస్థను పూర్తిగా వ్యతిరేకించినాడు. అందుకై వర్ణ విధానమునకు లోబడిన సంఘముపై వేమన ధ్వజమెత్తినమాట నిజమే. అంటరాని వారియందు సవర్ణులచేత చూపబడు సాంఘికమైన అధర్మము వేమన హృదయానికి చాల నొప్పికలిగించెను. అందుకే ఆయన అంటరాని వారనబడే వారిని హృదయపూర్వకంగా ప్రేమించి వారికి మానవతా గౌరవమును సమకూర్చడమే తన కర్తవ్యమని వేమన భావించాడు. వర్ణవ్యవస్థయందు నమ్మకముగల వారి దృష్టిలో

అంటరానివారని చెప్పబడేవారు మానవులే కాకపోవటం వేమన హృదయంలో కోపాగ్నికి కారణమయ్యెను.

వేమన అంటరానివారి పక్షంవహించి, మానవగౌరవము వర్ణవ్యవస్థితమై యుండునను వారి భ్రాంతిని తొలగించటానికి యత్నించెను. వేమన అంటరానియెడ కఠినంగా ప్రవర్తించే సవర్ణులను ఏవగించుకొంటూ, అంటరాని వారికి సన్నిహిత మిత్రుడుగా వుండేవాడు. శూద్రునిగాని, అంటరాని వానిని గాని నింద్యునిగా చూచుట నాగరికపు మానవులకు తగినపని కాదని వేమన వక్కాణించాడు. వేమన సవర్ణమానవుల దేవునికంటె, అంటరానివారి దేవుడు భిన్నుడా అని సవర్ణులను వేమన ప్రశ్నించి, మానవులందరూ ఒకే రీతిని జన్మించారని బోధించాడు. వేమన మానవతావాది, సమతావాది, తత్త్వవేత్త, సంస్కారవాది, ప్రజాకవి.

## 11. డా॥ జి.వి. సుబ్రహ్మణ్యం

వేమన అంతస్సాధన ఆయనకు ముక్తినిచ్చిందో లేదోకాని, ఆయన సూక్తిలోని శక్తిమాత్రం జాతికి ఒక నూతనవ్యక్తిత్వాన్ని ప్రసాదించింది. ఆయన సాధకుడు, బోధకుడు. జీవిత సాగరాన్ని మధించిచేదును కుత్తుకలో, అమృతాన్ని అంతరంగంలో నిలుపుకొన్న విధం ఆయన సాధనం. అమృతమయమైన సత్యాన్ని చేదు నిజాలతో నిరూపించి చిత్తాలకు హత్తేటట్టు చెప్పటం ఆయన బోధనం. ఆయన బోధన సాధనం, సరళమైన దేశీయచ్ఛందం. ఆయన దర్శించిన అపూర్వ సత్యాలు ఆయన్ని ద్రష్టను చేశాయి. ఆయన చెప్పిన సూక్తి మౌక్తికాలు ఆయన్ని స్రష్టను చేశాయి. ప్రజలకు కావలసినది ఆయన దర్శనం. అందువల్లనే ఆయన వారికి యెగిలా, సాక్షాత్కరిస్తారు. సాహితీ రసికులకు కావలసింది ఆయన సృజన వ్యాపారం. వారికాయన మహాకవిలా ప్రత్యక్షమౌతాడు.

వేమన్న వ్యక్తిత్వం విచిత్రమైనది. ఆయనకు పాండిత్యం కంటె పరమార్థం గొప్పది. అందువల్లనే పాండిత్యంకోసం పండితుల పాదాలనంటలేదు. పరమార్థం కోసం జీవితాన్ని గురువుగా ఎంచుకున్నాడు.

వేమన యౌవ్వనంలో అందిన ఐహిక భోగాలను అనుభవిస్తూ పోయాడు.

అందులో ఆయనకు అర్థార్థి సంబంధం తప్ప పరమార్థంతోకూడిన పరమార్థం కనపడలేదు.

కాంచనం, వంచనం రక్తిమార్గంలో ముళ్లపొదల్లా కనిపించాయి. ఆ మార్గం వదలిపెట్టాడు. భగవంతుడికి మనిషికి మధ్య మతం పేరిట మనిషే కల్పించిన ప్రతిబంధకాలు ఆయన మనస్సును గాయం చేశాయి. బహిర్ముఖమైన జీవితంమీద ఆయనకు కోపం వచ్చింది. అంతర్ముఖుడై ఆయన తనలోనే భగవంతుణ్ణి చూచుకొన్నాడు.

వేమన జీవితం వెంట తిరిగినపుడెల్లా జీవితం లోకంలోని తప్పులనే ఎత్తిచూపించింది. చివరకు నీలోనే నిజం వుంది తెలుసుకోమని చెప్పి దూరమైంది. వేమన్న తనకుతాను గురువైనాడు. తనకుతాను శిష్యుడైనాడు. శిష్యుడుగా తాను లోకవర్తములో ఉన్న పుచ్ఛకాయతనాన్ని ప్రశ్నించుకుంటాడు. గురువుగా తానే సత్యాన్ని నిరూపించుకుంటాడు. ఆయన అంతర్వ్యక్తిలో జరిగే యీ సంచారసారమే ఛందోరూపముదాల్చి బయటపడుతుంది. ఆయన కవిత అందుకే ఆత్మాశ్రయమైనది అనే దాని అంతర్లీనమైన శక్తి.

వేమన స్వయంకృషితోనే సత్యాన్ని స్వాయత్తం చేసుకొన్న సాధకుడు.

వేమన్న దృష్టిలో మనిషే దేవుడు. ఆయన తత్త్వం మానవతావాదం. మనిషి తనకుతాను ద్రోహం చేసుకొన్నా, మరొక మనిషికి ద్రోహంచేసినా, ఆత్మవంచన, దైవవంచన అంటాడు వేమన. కుల వర్గ భేదాలు మానవ కల్పితాలంటాడు వేమన. వేమన ఆత్మోద్ధరణతోపాటు సమాజ సముద్ధరణాన్ని కాంక్షించిన కర్మయోగి.

భక్తి మాధుర్యానికి పోతన్న వాక్కు, సూక్తి సారళ్యానికి వేమన్న వాక్కు తెలుగువారి ముఖమందిరాల్లో గౌరవప్రపత్తులను సంపాదించుకున్నాయి. ఈ అభ్యుదయ కవితాయుగంలో వేమన కవిత అభ్యుదయభావ ప్రచారానికి అభినవ సాధనంగా సమాదరించబడుతున్నది. ఆబాలగోపాలనికి అర్థమయ్యే కవి వేమన.

## 12. డా॥ ఎన్. గోపి

పండితులతో ప్రమేయంలేకుండా వేమన పద్యాలు ఊరూరా, వాడవాడా

సామాన్య ప్రజల నాలుకల మీద ఆడుతూనే వున్నాయి. వేమన ప్రధానంగా తాత్త్వికుడైనకవి. అందువల్ల పేదరికానికి మూలకారణం ఆర్థికవ్యవస్థలోని దోపిడీ విధానమని గుర్తించలేదు. వేమన సామాజిక దృష్టి ప్రదానంగావున్న పదునైన పరిశీలన ఉన్నకవి కావటంవల్ల సమకాలీను లెవరూ చూడనంత లోతుగా సంఘాన్ని పరిశీలించాడు.

వేమన శైవులను, వైష్ణవులను సమానంగా తిట్టాడు. తత్త్వాలు అటుంచి, నిత్య జీవితంలో వీళ్ళ ఆగడాలను, వేషదారితనాన్ని, వేమన్న దుయ్యబట్టాడు. వేమన చేసిన అధిక్షేపాలవెనుక ఎటువంటి పరిస్థితులుండేవో తెలిస్తే, వేమన్న ఆగ్రహం మనకు అర్థమౌతుంది. వేమనపద్యాలకు మూలం సమాజ జీవనం. జాతిరక్తంలో కలిసిపోయి జవాన్ని జీవాన్ని నిలుపుకున్న అనేకానేక సూక్తులూ, సామెతలూ వీటికాధారం. వీటిలోకాలమని ఉండదు. చిరప్రాణులు పరంపరాగతాలు. జీవులను హింసిస్తూ వాటి ప్రతిరూపాలైన రాయి– రప్పలకు మొక్కుట పాపం అంటున్నాడు వేమన. ప్రాణిలోని శివున్ని చూడలేనివాడు జడంలో చూస్తాడా? అని వేమన ప్రశ్న.

వేమన్నది స్వార్థంలో నుంచి పుట్టిన ఆక్రోశంకాదు. మానవుడు మానవుడుగా మనలేకపోతున్నాడే అనే వేదనలోంచి పుట్టిన పొలికేకలు. తోటి మనిషిని అనాదరించేవారు నరపశువులని కూడ పడతిట్టాడు వేమన. హెచ్చుతగ్గుల్లోని అమానుషత్వాన్ని గుర్తించి తీవ్రమైన భావావేశంతో అపారమైన మానవతాదృష్టితో చేసిన విమర్శనలు వేమనవి. అదే ఆయన ప్రత్యేకత. వేమన్నను దోషైక దృష్టిగల వ్యంగ్య కవి అనటంలో సబబులేదు. లోకంలోనికి స్వర్గాన్ని దించే కుటుంబవ్యవస్థను ఆయన ఆకాంక్షించాడు. వేమన పరలోక విలువలకన్న ఇహలోకపు విలువలకే ఎక్కువ ప్రాధాన్యం యిచ్చాడు. భౌతిక సుఖజీవనమే స్వర్గంకన్నా మిన్న అని వేమన వాదం. వేమన్నకు కుటుంబ వ్యవస్థ భగ్నం కావటం యిష్టంలేదు. ధర్మార్థ కామ మోక్షాలలో వేమన కామాన్ని ఎప్పుడూ చిన్నచూపు చూడలేదు.

వేమన్న పెళుసుమాట వ్యక్తులను గాయపరచటానికి, వ్యవస్థను గడగడలాడించటానికి హృదయాలను గాయపరచే గుణం వేమన పద్యాలలో లేదు. వేమన్న విసిరినరాళ్ళు కరుడుకట్టిన మకిలిపొరలను భేదిస్తే గగ్గోలు పడే వాళ్ళకే

అలా అనిపిస్తుంది. వేమన్న వర్ణ, జాత్యహంకారాలను నిరసించాడు. వేమన సుతిమెత్తని హృదయానికి, క్షమాగుణానికి కేంద్రం. వేమన్న సామాన్య ప్రజల తాత్త్వికుడు. కొందరికి మాత్రమే అందుబాటులో వున్న తత్త్వ రహస్యాలను ప్రజల భాషలో చెప్పాలన్నది వేమన ప్రయత్నం. తన కాలంలో అంతరించిపోతున్న మంచి విలువల్ని పట్టి ఆపాలని వేమన్న తాపత్రయం.

కావ్యానికి సైజూ, బరువూ కాదు. బాధల, ఆరాటాల, ఆవేశాల బరువును గమనించ మంటాడు వేమన. వెనుకటి వాళ్ళ కృషినీ, త్యాగాలను స్మరించటం మన విధి అంటాడు వేమన కాని పెద్దలమీద ప్రేమతో గుడ్డిగా అనుసరించేవాడు భావదాసుడని వేమన అభిప్రాయం.

వేమన కోపం వ్యక్తిగత కోపంకాదు. నాటి జడీభూత వ్యవస్థపై ప్రకటించిన ధర్మాగ్రహం. తనకు లేదని దేబిరింపుతో ఆక్రోశంతో పుట్టిన కోపాన్ని వేమన ఖండించాడు. కనిపించే పదార్థాల తత్త్వం నిరంతర సాధన వల్ల అవగత మవుతుందంటాడు వేమన.

## 13. డా॥ సూర్యనారాయణ భాను

సమాజంలోని ఉత్తమ సంప్రదాయాలచుట్టూ చేరి అవగుణములను, వాటిని అనుసరించే ఛాందసులను నిరసించి మంచిని ఎత్తి చూపిన సామాజిక స్పృహనిచ్చిన మహాకవులు వేమన, కబీరు.

వేమన తనకాలం నాటి సమాజంలోని మూఢాచారాలను, మోసపూరితమయిన మనస్తత్వాలను నిరసించి ఉత్తమగురువు అంటే ఎవరో, ఆయన నుండి జ్ఞానాన్ని ఎట్లాపొందాలో విపులంగా తెల్పెను. కనుక వేమన సామాజిక స్పృహకలిగిన తాత్త్విక భక్త కవులలో ఒకరు.

## 14. నార్ల వెంకటేశ్వరరావు

మన పూర్వకవుల (నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, పెద్దన, శ్రీనాథుడు, పోతన, సూరన మొదలగు వారి) తెన్ను పూర్వ సాంప్రదాయిక ఆశ్రితము. కాని వేమన

మాత్రము సాంప్రదాయములను, పాత నిబంధనలను, పాటించనివాడు. వేమన వర్ణవ్యవస్థను, పాత సాంప్రదాయాలను అపవిత్రంగా ఎంచి వాటిని ఎదుర్కొని విధ్వంసం చేయగోరెను. అందువల్ల కొందరు వేమనను మతభ్రష్ఠుడనెను. కాని ఆయన ధర్మనిష్ఠ గలవాడు. ఆయన ఆలు-బిడ్డలు-ఇల్లు- వాకిలి, సిరిసంపదలు మొదలగు వానిని వదలివేయుటేగాక, చివరకు కట్టుగుడ్డలనే వదలివేసి నిండు బిత్తలి (దిగంబరి) అయినాడు. ఆయన అశుచిగా, ఆకలిపట్టు (బాధ)తోనే ఉండి ఎల్లప్పుడు పరిహాసమునకు గురియైపోయాడు. అప్పుడప్పుడు గిట్టనివారు ఆయనకు శారీరక పీడను కూడ కల్గించేవారు. ఆయన మతము మూఢ సంప్రదాయబద్ధముకాదు. ఆయన అనేక దేవతారాధనను అంగీకరించేవాడు కాదు. విగ్రహారాధనను గేలిపట్టించాడు. దేవ-మానవుల మధ్య సంధాన కర్తలమని (దళారులమని) చెప్పుకొనే పురోహితులను, పూజారులను పీఠాధిపతులను పందా పట్టించాడు.

వేమన స్వర్గ-నరకాలు లేవని చెప్పాడు. దేవుని రాజ్యం మీలోనే గలదు; మానవుడు దేవుని నుండి వేరు చేయబడజాలడు; ఇద్దరూ ఒకటేనని వేమన మతం, వేమన మానవజాతి శ్రేయోభిలాషి. ఆయన మాటల కొఱకు మాటలను ఉపయోగించక, భావమునకే ప్రాధాన్యత ఇచ్చాడు. ఆయన కవిత్వం ఉపదేశాత్మకమైనది. ఆయన శైలి సరళ ప్రసన్నమయ్యు విషయపూర్ణము, ఆనందదాయకము. ఆయన పద్యములు తెనుగునుడికారములై, నానుడులై, సామెతజలై, నీతులై, సూత్రములై ప్రజలనోట నానుచున్నవి.

1914 వరకూ ఆంధ్రపండితలోకము, కావలెనని పట్టుదలతో వేమన పేరును అడుగునకు త్రొక్కి అణచిపెట్టినది. ఆంధ్ర సాహిత్యరంగమున ఆయన ప్రస్తావనను, పండితులుగాని, కవులుగాని, విమర్శకులుగాని, భాషా చరిత్రకారులుగాని, ఎత్తియే ఎరుగరు. పైపెచ్చు కొందరు చరిత్రకారులు వేమనను బుద్ధి పూర్వకంగానే తమ రచనలలో చాలకడగా వుంచారు. 1917 ప్రాంతంలో వెలువడిన కవుల చరిత్రలో కూడా పట్టుపట్టినట్లు వేమన వెలివేయబడినాడు. వేమనయందు ఇది ఒక మూగ కుట్ర అనకతప్పదు.

వేమన భాష స్వచ్ఛమైనది, ప్రసన్నమైనది, నిర్మలమైనది. ఆయన ఉపమానములు, యథార్థములు. పరుషములు. కొన్ని విషయములందు చెప్పుటలో ఆయన భావసరళి, ఆయన కాలానికేకాదు, నేటి ఆధునిక యుగమునకే పురోగామియై క్రొంక్రొత్తగనున్నది.

వేమన మత మూఢాచారాలపైనను, సాంఘిక మతాచారాలపైనను, తిరగబడిన ఉదారశయుడు. ఆయన వ్యావహారిక తెనుగు భాష వాడెను. ఆయన దానికి ఒక కొత్త వాదరపదను, పరిమాణమును కల్పించాడు. వేమన మతబాహ్యాడంబరములను, (బొట్టు, జుట్టు, కట్టు వగైరాలను) లింగధారణ, విగ్రహారాధన, ఉపవాసములు వగైరాలను పరిహసించాడు. అందువల్ల శైవ మత రచయితలు (వైదిక మత రచయితలు) వేమన నామ రూపాలను తుడిచి వేయుటకు కుట్ర పన్నిరి. ఇందుకు కారణము వేమన శూద్రుడగుటయే. శూద్రుని రచన ఎంత గొప్పదైనా దానిని తాకకుండానే, దాని గుణగణాలను లెక్కచేయక, దానిని దూరంగా విసిరిపారవేయమని అప్ప కవి అనుశాసించాడు. అందువల్ల వేమనను పొగిడిన వారు హిందూ పండితులు కారు. క్రైస్తవ విద్వాంసులు. అందులోనూ ప్రొటెస్టెంటులే. కాని మత పిచ్చి గల విగ్రహారాధకులైన క్యాథలిక్కులు మాత్రం కాదు.

1829లో చార్లెస్ ఫిలిప్‌బ్రౌన్ అను మద్రాసు ప్రభుత్వ సివిల్ ఆంగ్ల ఉద్యోగి వేమన పద్యములను కొన్నింటిని ఏరి పాఠ్యగ్రంథంగా 500 ప్రతులను అచ్చువేయించి విద్యాబోర్డు వారికి యివ్వగా, అందులో 450 ప్రతులు మాయమైపోయాయి. మిగతా 50 ప్రతులు బ్రౌనుకు సంపాదక పారితోషికముగా యివ్వబడినవి. పదేండ్లకు తరువాత ఆ 450 ప్రతులు చిత్తు కాగితాలలో పారవేయబడినవని బ్రౌనుకు తెలిసింది. విద్యాబోర్డు సభ్యులైన కొందరు అగ్రవర్ణ పండితుల కుట్రతో యీ పని జరిగిందని తెలిసింది. సారాంశమేమనగా బ్రాహ్మణులు వేమనని చాల గట్టిగా ద్వేషించారు. అందుకైవారు వేమన కవితాశైలి అసభ్యకరమైనదనియు, విషయము దురాచార ప్రేరకమనియు వెలుగెత్తిచాటారు. వేమనచే ఆకర్షింపబడిన మొట్టమొదటి పాశ్చాత్యుడు ఫ్రెంచి మతగురువు కె.ఎ. దూబాయ్. ఈయన 1816లోనే వేమనను గురించి "హిందువుల ఆచారములు, అలవాట్లు, మతకర్మలు" అనే పుస్తకంలో

యిలా వ్రాశాడు–

"హిందూ మతాచారాలను బహిరంగంగా విమర్శించిన వారిలో ఒక్క బ్రాహ్మణుడు కూడ లేడు. విమర్శకులంతా బ్రాహ్మణేతరులే" "తిరువళ్ళువరు" పంచముడు. "పెట్టు సత్తుపిళ్ళె", "అగస్త్యుడు" ఈ ఇద్దరూ వెళ్ళాక కులం వారు. వీరు తమిళకవులు. "సరోనిజ్ఞెమూర్తి" కన్నడ కవి. వేమన తెనుగు కవి."

"వేమన ఎక్కువ ప్రఖ్యాతిగల కవి. ఈయన రచనలు చాల చిత్తాకర్షణీయంగా వుండును. ఎవడైనా ఈయనకు పూర్వ విమర్శక గ్రంథాన్ని ఒకవేళ వ్రాసినా దానిని బ్రాహ్మణులు అత్యంత శ్రద్ధతో కనిపించకుండా చేసియుందురు. కాని వేమన వంటి విమర్శకుల రచనలను యిప్పుడు యిక బ్రాహ్మణులు నాశనం చేయలేరు. కాని వాటిని ప్రచారంలోనికి రాకుండానూ, ఎవరూ చదవకుండానూ చేయటానికి నేడు కూడ వారు చేయదగిన ప్రయత్నం చాటుగా చేస్తూనేవున్నారు. కాని పురోహితులు, పూజారులు, పీఠాధిపతులు తప్ప తక్కిన బ్రాహ్మణులు వేమన రచనలను ఆసక్తితో చదువుతున్నారు."

1824లో బ్రౌను దూబాయి వ్రాసిన గ్రంథాన్ని చదివి వేమనపట్ల అత్యంత శ్రద్ధాళువైనాడు. ఆయన తాటాకులమీద వ్రాసియున్న వేమన పద్యములను పలు తావులనుండి సంగ్రహించి చేర్చి ఒక క్రమంలో ఒదిగించి తన సొంత సొమ్ముతో అచ్చు వేయించినాడు. కాని ఆయన దేశీయులనుండి ఒక్క కృతజ్ఞతా వచనమును కూడ కాంక్షించలేదు. ఎందుకంటే ఆనాటి ఆంధ్ర సాహిత్య పీఠాధిపతులకు వేమన పేరంటేనే అసహ్యముగ నుండినది గదా! వేమన పద్యములు తిరిగి 1828లోనూ, 1866లోనూ అచ్చు వేయబడినవి. 1867లో మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాన్ని శిథిలం కాకుండా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు ప్రచురించిరి. దానిలో బ్రౌను ఇలా వ్రాసినాడు– "తెనుగు సమగ్ర వాఙ్మయమంలో వేమన రచనలు ఐరోపీయులను బాగా ఆకర్షించినవి. వారు వాటిని గుర్తించిరి."

మానవ జాతిని ఉద్బోధించిన ప్రవక్తల, ఉపదేశకుల ప్రథమ శ్రేణిలో వేమనను చేర్చవచ్చును. ఏకేశ్వరోపాసనావాదము, విగ్రహారాధన ఖండన మొదలగువాటివలన వేమన భావములు ముస్లిములకు, ప్రొటెస్టెంటు క్రైస్తవులకు

బాగా మనస్సుకెక్కి నిండా నచ్చినవి. వేమన బసవేశ్వరుని వీరశైవములో పుట్టి ఆ వాతావరణమునందే పెరిగి పెద్దవాడైనాడు. వీరశైవ మతము, ఏకేశ్వర వాదమును సమర్థించి విగ్రహారాధనము, కులభేదములు ఇతర సాంఘిక దురాచారాలపైన దండెత్తినది.

ఈ శైవ శాఖకు సంబంధించిన ఉపదేశముల వ్యాపకమునకు వేమన అందరి కంటె ఎక్కువ ప్రోత్సాహమును, ఉడుగని (నశించని) పట్టుదలను చూపినాడు. హైదరాబాద్ వాసియైన మీర్ మహమ్మూద్‌ఖాన్, ఇంగ్లీషులో వేమనను గురించి ఒక పుస్తకమును వ్రాశాడు. దానిలో ఆయన యిలా వ్రాశాడు– "హిందువులు కానివారికి అనురక్తిని కూర్చినవాడు ఒక్క వేమన యోగియే. ఇంతేకాదు. హేతువాదులకు, మానవతావాదులకు వేమన మతము ఆకర్షణీయమైనది" మనుజుడు మానవత్వంతో నడచుకొనినచో, యీ భూలోకమే స్వర్గము కాగలదు. పురాణాలు కల్పించిన స్వర్గమును పట్టుకొని వ్రేలాడుచూ యీ ప్రపంచాన్ని గర్హించుట అవివేకము.

మనము నిలుచుండియున్న చోట్లన్నీ పునీత తీర్థములే అని యీ రాయలసీమ సేద్యగాని బిడ్డ చెప్పలేదా? వేమన మతము మానవ మతము. ఆయన ధర్మము ప్రేమ వ్యాపకము. సర్వమానవ సౌహార్థము, సర్వభావ సమన్వయము. కుల, మత వర్ణ వ్యవస్థలచే ఛిన్నాభిన్నముకాని సార్వజనీన సౌభ్రాతృత్వమును స్థాపించుటే వేమన ఒక ముఖ్య లక్ష్యము. అందువల్లనే వేమన అటు నాస్తికులకూ, ఇటు అజ్ఞేయవారికి (ఆస్తికులకు) గూడ ఉపదేశం యివ్వగలిగాడు. క్లుప్తంగా ఆయన బోధ ఏమనగా తోడి మానవుల దుఃఖములను తన దుఃఖములుగా భావించువాడే, మానవు డనిపించుకొనటానికి అర్హుడని అనవచ్చును. అందుచేత ఆధునిక ప్రపంచానికి వేమన సందేశం ఎంతో అవసరము.

వేమన ప్రజా మహాకవి. లోకకవి. ఆయన విద్వాంసులకు గాక, నిరక్షరాస్యులైన(చదువురాని) గ్రామీణ పాటక జనమునకు మాత్రమే వ్రాసినాడు. ఆయన సాహిత్య కీర్తిని కాంక్షించలేదు. ఆయన ప్రాచీన ప్రబంధ కవిత్వ సూత్రములనే తృణీకరించాడు. ఎందుకన పురాతన ప్రబంధ ఫక్కీకి చెందిన కవిత్వము ఎప్పటికీ సామాన్య ప్రజలలో వ్యాపించజాలదు. ఎందుకన అది ఎక్కువమందికి అర్థంకాదు.

మాట్లాడుకొన్నది మాట్లాడుకొన్నట్లు ముక్తసరిగా, సరళమైన పదాలతో, ధారాళముగ కవిత్వము చెప్పినాడు వేమన. ఇట్టి కవిత్వమే ఎప్పుడూ అర్థమై, జీవశక్తిని కోల్పోక సదా నిలిచి వుండగలదు. వేమన స్థానము కబీరు (16వ శతాబ్దము) వంగ చైతన్య స్వామి మొదలైనవారి సమపంక్తిలో వుండక తప్పదు.

వేమన అంటే తెలుగు పండితులు అసహ్యించుకునే రోజులలో పాశ్చాత్య పండితులు ఆయన కవిత్వము నందు ఆసక్తిని జూపి ఆయన సందేశమును నిర్వచించి, ప్రపంచమునకు తెలుప యత్నించిరి. నిజంగా వారి శ్రమయే లేనట్టేయితే, కష్టముమీదైనా ఆంధ్ర సారస్వత సంస్థలు నేడు యీపాటిగానైనా వేమనను గుర్తించి యుండేవి కావు.

1877-1923 ప్రాంతంలో వేమనను గురించి విమర్శించిన మొదటి ఆంధ్రుడు కొమఱ్ఱాజు వెంకట లక్ష్మణరావుగారు. ఈయన ఆంధ్రప్రదేశంలో సాహిత్య చారిత్రక పరిశోధకులకు మార్గదర్శకుడు. నేదునూరి గంగాధరం (రాజమండ్రి, చాకలికవి)గారు "మహాయోగి వేమనకవి" అనే పుస్తకములో 5000 పద్యములను 1960లో ప్రకటించినారు. 1913లో బందరు వాస్తవ్యులు ఆర్. పూర్ణయాచార్యులు "వేమన యోగీంద్ర చరిత్రము" "వేమన సూక్తి రత్నాకరణము" అను రెండు సంకలనములలో 4035 పద్యములను వ్రాశాడు.

అందువల్ల ఇక పాత పండితులు వేమన వాణినిని, కవిత్వమును శిరసావహించక తప్పినదికాదు.

వేమన వ్యక్తిత్వము అప్రతిహత శక్తితో సంఘమును కంపింపజేసి అజేయముగ పెరిగిపోయినది. అసూయ, ఆచారమౌఢ్యము అడ్డురాకుండినచో, వేమన ఎప్పుడో అమరుడైపోయేవాడు. ఆయన కాలంలోనే. ఆయన ఒక పురాణ పురుషుడైపోయినాడు.

వేమన నేటి తెలుగు కవులందరిలోనూ ఎక్కువ ప్రజాభిమానమును పొందినవాడు. ఇప్పుడు వాడుకలోవున్న ఏ చాటువుకుగాని, సామెతకుగాని అర్థపూరితమైన నీతి సూత్రమునకు వేమన కర్తృత్వము అంటకట్టబడనిది లేదు. వేమన కోపము, నింద, అవహేళనము, అసూయ ప్రేరకములుగావు.

పొరపాటుపడుతున్న మానవుల ధోరణిపట్ల ఆయనకు కలిగిన ఆవేదనయే యీ రూపమున బయటపడినది. మానవుడు యీ లోపము లన్నిటిని పోగొట్టుకోవాలనియే ఆయన స్వచ్ఛమైన కాంక్ష. మానవుడు సగౌరవంగా యీ భూమి మీద తల ఎత్తుకొని తిరిగి స్వతంత్రముగ మనవలయుననియే ఆయన వాంఛ. మానవ స్వాతంత్ర్యమును, సమానత్వమును, ప్రతిష్ఠను ఆకాంక్షించే ప్రపంచ దార్శనిక మానవులలో వేమన సర్వోత్తముడు.

ఇంతటి మహా పురుషుని జీవిత విశేషములు పురాణ గాథల అంకమున, నిదురించుచుండుట విచారకరము. చరిత్ర రచయితలు ఒకరు చెప్పినది ఇంకొకరు చెప్పక, విషయమును గచ్చుపొద చేసినారు. అయినప్పటికీ వేమనను శాశ్వత చారిత్రక మహాపురుషుడు డనక తప్పదు. ఏరకపు పరీక్ష పెట్టినా, వేమన ఒక గొప్ప కవి. అందుకు దృష్టాంతం ఆయనను ప్రజలు ఎక్కువగా గౌరవించుటే. తియ్యని పలుకులు పలికే బమ్మెర పోతన కూడ ఆయనలో సగము ప్రజానురాగమునుకూడ పొందలేకపోయాడు. సామాన్య జనంలో వేమన ఒక రాజకుమారుని వలెయుండును. వారు తమ హృదయాలను ఆయనకై సదా తెరచి వుంచుతున్నారు.

## 15. నేదునూరి గంగాధరం

నేదునూరి గంగాధరం– (ఈయనగారు రాజమహేంద్రపురం వాస్తవ్యులు, ఈయనగారు చాకలికులంలో పుట్టారు కాని గొప్ప తెలుగు– సంస్కృత పండితుడు. ఈయనగారు తన జీవితమునంతా ఆంధ్రభాషకొరకు వినియోగించారు. ఈయన నాల్గు తెలుగు సామెతలు, పలుకుబడులు, 5వేల వేమన పద్యములు పెక్కు కథలు ఎంతో శ్రమపడి సంగ్రహించారు.) వేమన యోగి ఏ కాలం వాడో, ఏ ప్రాంతం వాడో, ఏ కులం వాడో ఎవ్వరూ సరిగా చెప్పలేకపోతున్నారు. ఈ విషయాలనుగురించి పండితులలో అనేక అభిప్రాయ భేదాలున్నాయి. వేమన్నను కొందరు 15వ శతాబ్దంవాడంటే మరికొందరు 17వ శతాబ్దం వాడంటున్నారు. కొందరు కొండవీటి ప్రాంతం వాడంటే, మరికొందరు కదిరిదగ్గర కటారుపల్లె వాడంటున్నారు. కొందరు వేమన్న రెడ్డి కులస్థుడంటే, మరికొందరు కాపు కులస్థుడంటున్నారు. కనుక యీ

విషయాలను పండితులకు వదలివేయుట మంచిది.

వేమన వేదసారమును గోరుముద్దలుగ జేసి ఆంధ్రులకు అర్పించిన మహాయోగి. ఈయన మహాయోగియే కాదు, మహాకవి కూడా. ఈ దివ్య పురుషుడు చదివిన వారికిని, చదవని వారికిని, జ్ఞానులకు, అజ్ఞానులకు తన బోధనలను ఆటవెలదులలో సూటిగా చెప్పినాడు. ఒక అగమ్యమైన విషయమును సులభ గ్రాహ్యముగ బోధించుటలో వేమన మేటి. ఆయన ఉపమానాలు సాటిలేనివి. జ్ఞానమును నిత్యజీవితమునకు ముడిపెట్టిన మహాత్ముడాయన. అంతరక్తుడు అంతవిరక్తుడు మన తెలుగువారి చరిత్రలో మరియొకడు కానరాడు.

కందపద్యాలకు తిక్కనయు, సీసపద్యాలకు శ్రీనాధుడు, ఆటవెలది పద్యాలకు వేమనయు ప్రసిద్ధిపొందిన కవులు. వేమన కవిత్వము జాను (అందమైన) తెనుగులో తేనెసోన లూరుతూ వుంటుంది. ఈయన వ్రాసిన ఆటవెలదులలో ప్రతి పద్యములోనూ అపారమగు అనుభవము, అర్థము నిండివుండును. ప్రతిపద్యమూ ప్రతివారికిని జీవితము పొడవునకు నూతనార్థములను స్ఫురింపజేయుచునే యుండును.

వేమన సంఘమును నిర్మొగమాటముగ విమర్శించాడు. ఆ విమర్శనలో పరిహాసము మృదువుగ గోచరించును. కాని గంభీర దృష్టితో ఆ విమర్శనలను మనం అర్థంచేసుకొంటే "సత్యమంతే" అనిపించును. సంఘ దురాచారాలనుగూర్చి ఆయన హృదయం ఎంత సంక్షోభపడినదో సంఘ సంస్కరణకై నిర్వికారుడగు ఆ అద్వైత యోగిమూర్తి యెంత జాలిపడెనో మనకు కానవస్తుంది.

వేమన తన కాలంలోని సామాన్యులు వాడిన తెనుగు భాషనే వాడుటచేత మనకు ఆ కాలపు భాష ఆయన పద్యములవలన లభిస్తుంది. ఆయన పద్యములలో సామెతలు, జాతీయములు కోకొల్లలుగా వున్నాయి. ఆయన పద్యములలో ఆనాటి విజ్ఞానము, సాంఘిక పరిస్థితులు, మత సంప్రదాయములు, కూట (కపట) వేదాంతము, రసవాదాదిశాస్త్ర విజ్ఞానములాది అనేక విషయాలు మనకు లభించగలవు. ఏ భాషలోనూ జ్ఞానవిజ్ఞానములను ఇంత సులభముగా సామాన్య ప్రజానీకమునకు సూటిగా బోధించు కవిత్వరూపమున మన వేమన కవిత్వమునకు మీరిలేవన్న అతిశయోక్తి కానేరదు.

ఆయన విమర్శించిన సత్యములు ఒక దేశ, కాల, ప్రాంతములకు సంబంధించినవికాక, సర్వకాలిక, సార్వజనిత, సార్వదేశికములై విరాజిల్లుతూ వున్నాయి. కాని "పొరుగింటి పుల్లనికూర రుచి" అన్నట్లు మన ఆంధ్ర పండితులు పరభాషలలోని గ్రంథములను చదువుటకు బాల్పడుటయే గాని, మన జాతిరత్నములవంక చూడరు. కాని మన ఆంధ్ర సారస్వతాన్ని ఖిలంగాకుండా (చెడకుండా) సంపాదించి రక్షించిన మహామహుడు శ్రీ సి.వి. బ్రౌన్ దొరగారు. ఈయన ఆంగ్లేయుడై యుండికూడ వేమన పద్యములను ఏర్చి, కూర్చి, వాటికి ఇంగ్లీషుభాషలో భావం రాసి తన సొంత డబ్బుతో అచుట్చవేయించాడు. దానితో వేమన ఘనత ప్రపంచవ్యాప్తి నందినది.

వేమన పద్యము లెన్నియున్నవో సరిగా యెవరూ అంచనా వేయలేక పోతున్నారు. ఆయన ఒక గ్రంథంగా వ్రాయలేదు. దేశసంచారంచేస్తూ తనకు తోచిన భావములను, తాను చూచిన సాంఘిక పరిస్థితులను, ఇతరులు అడిగిన ప్రశ్నలకు సమాధానములను పద్యములలో చెప్పేవారు. శిష్యులు వాటిని కంఠస్తంచేస్తూ వాక్సాహిత్యంగా ప్రచారం చేశారు. అందుచేత అసలు వేమన పద్యములలో కొన్ని వాక్యములు, కొన్ని భావములు, మార్పులూ, కూర్పులూ, చేర్పులూ జరిగాయి. అవేగాక యితరులవి కొన్ని పద్యములు కూర్చబడ్డట్టు కన్పిస్తుంది. కాని వేమనవి అయిననూ కాకపోయిననూ నేను ముద్రితా ముద్రిత గ్రంథములనుండి సేకరించిన 5వేల పద్యములను అకారాది క్రమముతో నాకు తోచిన విజ్ఞాన విశేషాలతో సమకూర్చితిని.

## 16. బమ్ గోరె

(ఈయన హైదరాబాద్‌లోని యోగివేమన తెలుగు విజ్ఞాన కేంద్రానికి స్పెషల్ ఆఫీసరు)

ఇతర ప్రాంతాల వారికీ, ఇతర దేశాల వారికీ బాగా పరిచయస్తుడైన తెలుగు కవి వేమన ఒక్కడే. వేమన పద్యాలు అనేక ఇతర భాషలలోనికి అనువదించబడ్డాయి. తమిళము, కన్నడము, మలయాళము, ఉర్దూ తదితర పొరుగు

భాషలలోనికీ, ఇంగ్లీషు, ఫ్రెంచి వగైరా భాషలలోనికీ విస్తారంగా తర్జుమాఅయి, రచ్చగెలిచినా ప్రజాబలం ఎంతఉన్నప్పటికీ మన పండితుల కుహకము (కపటము) వల్ల వేమన్న ఒక విధంగా ఇంటగెల్వలేక పోతున్నాడు.

అందువల్ల తెలుగువారముగా మనం వేమనను గురించి తెలిసికోవలసి నంత తెలుసుకోలేకపోతున్నాము. తన పట్ల తనకు పుష్కలంగా ఆత్మవిశ్వాసమున్న వ్యక్తి వేమన. తాను చెప్పినది వేదమన్నాడు. అంతేగాని వేదంలో వున్నదాన్నే మళ్ళీ చెబుతున్నట్లుగా చెప్పుకోలేదు. తాను కవిననే నమ్మకం కలిగివుండటమేగాక, తన కాలపు కవులతో సమూలంగా భేదిస్తున్న స్పృహకూడా వేమనకున్నది.

తోటకూరకైన, దొగ్గలాకునకైన,
తవుడుకైన, తాలు తప్పకైన,
కావ్యములను చెప్పు గాడ్దెలార

అని చెడ తిట్టేవాడు. ఇతర కవుల నిందతో వూరుకోకుండా, తన మార్గమేమిటో, తన కవితా మార్గమేమిటో కూడా వివరించాడు. తాను ఒకర్ని అనుకరించకుండా తనను మరింకెవరూ అనుకరించకుండా పూర్తి మౌలికమైన బాణీలో కవిత్వం చెప్పిన కవి వేమన.

## 17. బండారు తమ్మయ్య

(ఈయన విమర్శనాగ్రేసర, ఐతిహాసిక సామ్రాట్. ధర్మభూషణ, శైవ, సాహితీ సార్వభౌమ, శివశరణ, సోమసాహిత్యాచార్య బిరుదాంకితుడు. వేమనను గూర్చి పరిశోధించి చర్చించిన వారిలో ఈయనది మొదటి పీట.)

వేమన చేసిన బోధనలు, చెప్పిన ధర్మములు, నీతులు సత్యసమ్మతము లవుటచే, ఒక్క భరత ఖండమునకేగాక, సమస్త ప్రపంచమునకు సమాదరణీయము లగుననుటకెట్టి సంశయమును లేదు. ఆయన విశ్వలోక కుటుంబి, ఆయన ఆంధ్రుడు. ఆయన పుట్టి పెరిగినది ఆంధ్రదేశములో. ఆయన బోధనామృత పానమున ధన్యమైనది ఆంధ్రదేశము. ఇట్టి దృష్టితో నిజమైన ఆంధ్రాభిమానంతో ఆంధ్రులెల్లరు వేమనను ఆరాధించిన చాలును.

కేవలం వేదాంతమును బోధించు పద్యములలోనేగాని సాధారణముగా

యితర బాహ్య విషయములను గూర్చి చెప్పు పద్యములలో వేమన గూఢతకుగాని, సందిగ్ధతకుగాని సందీయడు. చాటుమాటులకు ఆయన తేట కవితలో చోటులేదు. వేమన మొదట వీరశైవ మతస్థుడు. కాని తుదకు శుద్ధాద్వైతిగా మారినాడు. వేమనకు కావలసినది యదార్థ తత్వము.

ఎట్టి యుత్తమ మతావలంబులయినను వంచకులను మాత్రం వేమన ఇంచుకయు సహింపనేరడు. తనవారు– పెరవారు నన్న మొగమాటమే ఆయనకు లేదు. వేమ గర్హించునది మతములను గాదు; ఆయా మత ధర్మములను పాటింపని భ్రష్టులనే.

వేమనకు సంస్కృత భాషా పరిజ్ఞానము తగినంత లేకున్నను వాడుకలో నున్న కొన్ని చాటు శ్లోకములను, శ్లోక భాగములను, సామెతలను ఆయన విని ముఖస్థము చేసుకొని యుండినాడు. దేశ, కాల, విభేదములకు కూడ వేమన అతీతుడు.

వేమన దేశమందలి యెల్లకులముల వారియందుగల లోపములను, దోషములను వెల్లడించిన సమదృష్టితో నందఱకు హితబోధ మొనరించినాడు. ఆయన బోధనలు, నీతులు, సమస్త కులములవారికి సంతతాదరణీయములయి యున్నవి.

వేమన పెట్టు కవి గాక, పుట్టు కవి. ఆయన పద్యములలో ఆయన స్వానుభవము గొంతవఱకు ప్రతిబింబితమయి ఉంటుంది. వేమన విరాగి. రసవాదవేత్త. ఆయన పద్యములలో ముఖ్యముగా గానవచ్చునది ఆయన స్వానుభవము తెలిపే విషయాలేగాని, గ్రంథములందు ఆయన చూచిన దానినో, యితరుల నుండి వినినదానినో చిలుక పలుకులవలె ననువదించి చెప్పిన కేవల శుష్కోపదేశం మాత్రం కాదని గోచరించును.

ఉన్నవారు– లేనివారు, విత్తవంతులు– బిచ్చగాండ్రు, వీరు– వారనక యెల్లవారు తమకున్నంతలో దాన ధర్మము మొనర్పక గతులులేవని వేమన ముక్తకంఠమున వాక్రుచ్చెను.

ధనమున్నవానికి దాన గుణము లేకుండుటయు, దానగుణమున్న వానికి ధనము లేకుండుటయు అనునది వేమనకు మిక్కిలి చీకాకు గలిగించెను. అందుచేత వేమనకు అన్యాయముగా తోచిన యీ సృష్టి రహస్యమునకు సృష్టికర్తనే యిలా నాలుగు చివాట్లు పెట్టినాడు–

విత్త మొకనికిచ్చి వితరణ గుణమందు
జిత్తమొకనికిచ్చి చెఱచినాడు
బ్రహ్మచేతలెల్ల బాడైన చేతలు ॥వి॥
ఉదధిలోని నీళ్ళు ఉప్పులుగా జేసి
పసిడిగల్గు వాని బిసిని జేసె
బ్రహ్మదేవుని చేత పదడైన చేతరా ॥వి॥

వేమన జీవకారుణ్య మూర్తి. జీవహింస చేయుట శివుని యెడ అపచార మొనర్చుటయేయని వేమన ఉద్బోధించినాడు.

బ్రాహ్మణుడనని చెప్పుకొనదగిన వాడు సద్గుణ గరిష్ఠుడై, బ్రహ్మజ్ఞానమును బడసి, తానుతరించి యితరులను దరింపజేయు సమర్థుడై యుండవలయుననియు, అట్లుకానివాడు శూద్రుని కన్న దక్కువవాడనియు వేమన భావించెను. ఇట్టి భావములను ఆయన పలుమాఱు, పలురీతుల బహు పద్యములలో ఉద్ఘాటించాడు.

వేమన్న వ్యాకరణ సూత్రాలను అంతగా బాటింపక, కూడినంత వఱకు గ్రామ్యశైలిలోనే ఏపద్యములను రచించెను. వేమన విగ్రహారాధన, వర్ణభేదములు, కాంతాకనకములు, మంత్రతంత్రాలు, ప్రాపంచిక భోగాలు, శకునములు వీనినెల్లను పూర్తిగా నిరసించిన మన వేమన రసవాద విద్యయందెక్కువ మక్కువను గనుపఱచినట్లు కొన్ని పద్యముల వలన స్పష్టమగుచున్నది.

పందొమ్మిదవ శతాబ్దిమధ్య కాలము వరకును వేమన్నను లోకము కవిగా గుర్తింపదయ్యె. ఏలనన సాధారణ కవుల వలె వేమన కీర్తి కొరకు గాని, ధనము కొఱకు గాని కవిత అల్లినవాడు కాదు. కేవలము లోకహితము కాంక్షించియు, నాత్మతృప్తి కొఱకు మాత్రమే వేమన పద్యములల్లెను ఒకరి మెప్పుకోలు వడయుట కాతడెన్నడును తహ తహపడలేదు. తప్పులు కనిపించినచోట నిర్మొగమాటముగా నవి యెత్తిచూపుటకే ఆయన తన కవితాశక్తిని వినియోగించెను. విద్వాంసు లెన్నడును వేమన్నను కవిగా పరిగణించరయిరి. ఎందుకన వారి ఉద్దేశములలో భారతము, భాగవతము, రామాయణాదులు చదివి వసుచరిత్ర మనుచరిత్రలు పల్లెవేసి లక్షణ యుక్తముగా పద్య కావ్యములు రచించినవారే కవులు. అంతేకాని లక్షణమును

లక్ష్యము సేయక తన యిచ్చవచ్చిన రీతిగా విడివిడిగా తనకు తోచినపుడెల్ల పద్యములు చెప్పిన వేమన్నది కవిత్వము క్రింద గణనకెక్కదు.

వేమన ఆటవెలదుల పద్యములలో కొంత నీతి, కొంత హాస్యము, కొంత వేదాంతము కొంత రసవాదము గుఱించి రచనలు చేసెను. వేమన్న యొక్కొక్క పద్యం ఒక్కొక్క కావ్యం అని చెప్పనొప్పును. వేమన్న భావములు నూటికి నూఱుపాళ్ళు ఆయన సొంతములే. ఆయన కవిత్వము నందు భావములోగాని, భాషలో గాని అన్యానుకరణములు మృగ్యము. అటువంటి తన భావములకు సరిపడు జిగి బిగి గలిగిన భాషా పటుత్వము వేమన్నకు సహజముగా సంక్రమించింది. వేమన ప్రతి పద్య మందును సాధారణముగా ఒక నీతియు, నొక యుపమును నుండి తీరును. వేమన నీతులలో స్వానుభవము, లోకజ్ఞానము హెచ్చుగా గోచరించుచుండును. వేమన పద్యములలో కొన్ని కూట వేదాంతానికి సంబంధించిన అంతరార్థాలను కలిగియున్నట్లు కనపడుచున్నవి. కాని యీ అంతరార్థాలు గల పద్యములను ఆయన శిష్యులో, అనుయాయులో వ్రాసివుందురని ఊహింపవలసియున్నది.

వేమన రచనలో భావము, భాష యీ రెండునూ ఒకటితో నొకటి పందెము వేసుకొని కుప్పించి యెగిరినట్లు హృదయము నుండి పైకి వచ్చుచున్నవి. ఈ వేగమును నిరోధించుటకు ఛందస్సు, యతిప్రాసలు మొదలగు నిర్బంధములకును చేతగాలేగదు. ఇవి వానికి లొంగి సర్దుకొనవలసి వచ్చెనేగాని యవి వీనికి లొంగి కుంటుచు నడవలేదు.

వేమన్న వ్యాకరణము నంతగా పాటింపక కూడినంతవఱకు గ్రామ్యశైలినే పద్యములను రచించెను. వేమన్న భావములు నూటికి నూరు పాళ్ళు అతని సొంతములే. అతని కవిత్వమునందు భావములలోగాని భాషలో గాని అన్యానుకరణములు మృగ్యము (ఇతరులను అనుకరించటంలేదు)

వేమన కీర్తి కొఱకుగాని, ధనము కొఱకుగాని కవిత నల్లినవాడు కాదు. కేవలము లోకహితము కాంక్షించియు, నాత్మతృప్తి కొరకును మాత్రమే వేమన పద్యము లల్లెను. ఒకరి మెప్పుకోలు వడయుటకాతడెన్నడును తహ తహ చూపలేదు. తప్పులు కనిపించినచోట, నిర్మొగమాటముగా నవి యెత్తిచూపుటకే యాతడు కవితాశక్తిని

వినియోగించెను.

కర్మాచరణ ప్రధానమగు వైదిక మతమునందు చతుర్వర్ణములలోను నగ్రవర్ణులగు బ్రాహ్మణులు కర్మాధికారం వహించి తక్కిన వర్ణములవారి పయి, పలు నిరంకుశాధికారమును నెఱపుచుండిరి. "చాతుర్వర్ణ్యం మయాస్పష్టం, గుణకర్మ విభాగశః" అను గీతా వచనమునకు బ్రామాణ్యము వ్యవహారమున శూన్యమయ్యెను. సరియగు వేదాంత జ్ఞానము కలిగి బ్రహ్మవేత్తలయి, బ్రాహ్మణ పదమున కర్హతగలవారు మిక్కిలి తక్కువై కేవలము జన్మమాత్రమున యగ్రత్వము నాకాంక్షించి, యధికారము నెఱపువారు ప్రబలముగా నుండిరి. ఇట్టి బ్రాహ్మణాధికారము వేమనకు చాల నన్యాయముగను, ననపేక్షణీయముగను గానవచ్చెను.

విశ్వమెల్లను నడుప సర్వసమర్థుడగు సర్వేశ్వరుండుండగా, ప్రపంచమెల్ల దమతో నున్నదనెడి దురహంకార దురధికారము లీ బ్రాహ్మణులకేలయని వితర్కించి–

విశ్వమెల్లనడుప విశ్వేశ్వరుండుండ
బ్రాహ్మణులకు నేల పట్టుదలలు?
వనములోని కోతి వసుమతి నడుపునా? ॥వి॥

బ్రహ్మ వంశభవులు ప్రబలులైయుండగా, నితర జాతులకును గతులు వెలగవా? అని వేమన వాపోయాడు.

## 18. బులుసు వెంకట రమణయ్య

అలంతి యలతి పదములతో, అనన్యసామాన్యములైన పోలికలతో, అమూల్యములగు నంశములను ఆటవెలది పద్యములతో కూర్చి ఆంధ్ర భాషాయోషకు అమూల్యమగు ఆభరణమును అందజేసిన మహనీయుడు, ప్రజాకవి, ప్రగతిశీలుడు వేమన. వేమన చెప్పినదే వేదము అను ఖ్యాతిని గడించిన విజ్ఞాని వేమన. శతకవాఙ్మయమున యీయనిది అగ్రపీఠము.

నిద్రాణువై యున్న ప్రజాసముదాయమును తన పసిడిపలుకులతో ప్రబోధించుటయే వేమన ముఖ్య సంకల్పము. తమిళ ప్రాంతములోని తిరువళ్ళువార్, కన్నడ ప్రాంతంలోని సర్వజ్ఞ వేమనకు సమకాలికులని కొందరి యూహ.

వేమనకు మంత్ర తంత్రముల యెడ నమ్మకము లేదు. ఆయన కొన్ని పద్యములలో బ్రాహ్మణాది జాతులను తిట్టెను. కొన్ని పద్యములలో విప్రులను ప్రశంసించెను. కొన్ని పద్యములలో జాతి భేదములను ఖండించెను. కొన్ని పద్యములలో మంత్ర తంత్రాలను నిరసించెను. కొన్ని పద్యములలో యోగ సమాధిని కొనియాడెను. కొన్ని పద్యములలో శివునికి ప్రాధాన్యం యిచ్చెను. కొన్ని పద్యములలో శివలింగధారులను తీవ్రంగా నిరసించెను. కాని ఏ విషయమైననూ చక్కని ఉదాహరణములతో కుండ బ్రద్దలు కొట్టినట్లు నిర్భీతిగా చెప్పుటయే వేమనకు సమ్మతము. దానికి ఆటవెలది ఛందస్సు బాగుగా అతికినది. పొల్లు పదములను కుప్పగా చేర్చి అనిశ్చితముగా ఏదో చెప్పుట వేమన స్వభావం కాదు. చెత్తను చేర్చి కుప్పపోయుట ఆయనకు గిట్టదు. నీరసములై, సందర్భ శుద్ధిలేని పద్యములు చెప్పడనియే చెప్పవలయును.

వేమన పద్యములకు బహు ప్రచార మున్నందునను, ఆయన పలుకులు ప్రజలకు శిరోధార్యము లగుటవలనను ఇతర కవులు కొందరు తమ అభిప్రాయములను ప్రచారము పొందింప నిచ్చగించి ఎట్లో పద్యములల్లి వాటిని వేమన పద్యములలో చేర్చినందున, వేమన పద్యములుగా వేలకువేలు ముద్రింపబడుచున్నవి. స్త్రీ నింద, ఏహ్యావర్ణనము, శకునములు, చికిత్సలు మొదలగు వాటిని వివరించు పద్యములు వేమన రచితములుగా తోచుట లేదు.

వేమన వ్యవహార విజ్ఞత సాటిలేనిది. విషయమునే ప్రధానముగా ఎంచిన వేమన భాషకు, వ్యాకరణమునకు శ్రద్ధ తీసికొనలేదనియే చెప్పవచ్చును. ఆంధ్ర కవులు వేమనను కవిగా గ్రహించకపోవుటకు యిదియే కారణము కావచ్చును. వేమన గొప్పతనమును గ్రహించి ఆయనకు, ఆయన పద్యములకు గొప్ప ప్రచారం కలిగించినవారలలో కడచిన శతాబ్దంలో సాటిలేని భాషావాఙ్మయ సేవచేసిన ఆంగ్లేయుడైన సి.పి.బ్రౌను పండితుడు ప్రథమగణ్యుడు.

## 19. మరుపూరు కోదండరామిరెడ్డి

(ఈయన నెల్లూరు వాస్తవ్యులు. రైతుబిడ్డ. తెనుగు, సంస్కృతము,

ఆంగ్లములలో గొప్ప దిట్ట. కళాప్రపూర్ణ బిరుదు పొందిన పండితుడు. ఈయన షిర్డి సాయి భగవానుల శిష్యుడు. ఆంధ్రప్రదేశమంతటా వేమనపై చాల ఉపన్యాసాలిచ్చి గొప్పగా ప్రజల మన్ననలను పొందినాడు. ఈయన నార్ల, డాక్టర్ మంగమ్మగారలు ఆంగ్లంలో రచించిన "వేమన పాశ్చాత్యుల దృష్టిలో" అనే గ్రంథాన్ని తెనుగులోనికి అనువదించాడు.)

"వానకు తడవనివారును, వేమన బోధనను విననివారును, ఎక్కడ వెతికిననూ కన్పించరు" అని కవి చౌడప్పా అనే కవి ఏనాడో వక్కాణించాడు. నిజానికి వేమన లోకకవి. ఆయన తన కాలంలోనే ప్రజల ఆమోదాన్ని పొంది, ఆరాధింపబడినాడు. సమకాలికుల కుళ్ళుబోతుతనం ఆ జీవన్ముక్తునికి అంటలేదు. ఆయన పద్యాలు పల్లెలలోనూ, పట్టణాలలోనూ, ఆనాడు మొదలు యీనాటిదాక, ప్రజల నోళ్ళల్లో నానుతూనే వున్నాయి. రచనలు సులభగ్రాహ్యత, ఆచరణయోగ్యమైన వేదాంతము గొప్ప ఆకర్షణశక్తిని కల్పించినవి. ఆయన భాష, ప్రాణశక్తి గలది. ఆయన ప్రజల దృష్టిని దేవభాష అని చెప్పబడే సంస్కృతం నుండి దేశభాషయగు తెనుగు తట్టుకు మరలించినాడు. వేదాంత నిర్వచనానికి తెనుగుభాష పనికివస్తుందన్న తిక్కన సోమయాజి ప్రయోగాన్ని వేమన గట్టిచేసినాడు. ఈ కాపు కవి ప్రజల కొరకు ప్రజల భాషలో వ్రాసి ఆ తర్వాతి సంస్కర్తలకు పురోగామి అయినాడు.

ఇంతకుముందు ఆంధ్ర మత ప్రవక్తలు సంస్కృత భాషనే వ్రాసేవారు. కుమారిలభట్టు (7వశ), విద్యారణ్య (14వ శ), వల్లభాచార్య, నింబార్క మొదలగువారు తమతమ సిద్ధాంతాలను సంస్కృత భాషలోనే వ్రాసినారు. జాను (అందమైన) తెలుగులో దేశిఛందంలో (ద్విపద) వ్రాసిన శివకవులను వైదిక పీఠాధిపతులైన బ్రాహ్మణులు ఎక్కి రానియ్యలేదు. వీరశైవమతం బ్రాహ్మణేతరులకు ప్రాముఖ్యం యిచ్చింది. అందువలన తెనుగు భాషను, మతమును కైవశం చేసుకొని యుండిన బ్రాహ్మణులకు యిది గిట్టక దేశికవితా రీతులను తూలనాడినారు. కాని వేమన తెనుగులోనే వేదాంతాన్ని చెప్పి సామాన్య ప్రజలను మేల్కొలిపినాడు.

ఫ్రెంచి మత గురువు దుబాయి, ఆంగ్లేయులైన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్, చార్లెస్ గోవర్, క్యాంబెల్ మొదలగువారు వేమన పద్యాలను లాటిన్, ఫ్రెంచి, ఇంగ్లీషు

భాషలలోనికి అనువదించారు.

మూఢాచార పరిరక్షకులైన బ్రాహ్మణ పండితులు వేమనను ఒక వేదాంతి అని కూడ అనలేకపోవటంలో ఆశ్చర్యం లేదు. స్వదేశంలోనూ, విదేశంలోనూ వేమనకు వచ్చిన పేరునుబట్టి చూస్తే ఇది కొంగున అగ్గిని దాచిన విధంగా ఉన్నది. ఎట్లనైతేనేమి, వేమన కవితాకీర్తి తెనుగు చదువుల తల్లి కొలువు చావిడిలో రెడ్డిగం చేసికొని కూర్చొనివున్నది. ఆయన కవితాశక్తి ఆయనకు ఆంధ్ర కవితారంగంలో స్థానమేర్పరచినది.

ఎవరేమనుకొన్నా, వేమన తాత్త్వికుడు, సత్యవాది, సహజ ప్రజాకవి. సంఘ సంస్కరణాభిలాషి. కారణ విమర్శకుడు. దీనజన బాంధవుడు. మూఢ, అంధ విశ్వాసభంజనుడు, లోకహితైషి. ఆత్మానుభవంతో ఒక కులం, ఒక మతం, ఒక దేవుడు అని చాటిన శాశ్వత సార్వజనీన మతస్థుడు. ఎగుడు దిగుడులేని సరళ మానవతావాది. కుటిలాన్ని విమర్శించినా, నిష్కళంక బుద్ధికి అమ్ముడుబోయిన పెద్దమనిషి. వేమన కూడ మతానికి ఎంత విరోధో, సత్యమతానికి అంత పట్టుకొమ్మ ఆయన. యోగ్యతను పూజించే ఆదరదుగ్ధ పూర్ణహృదయుడు. వేమన మానవ సంఘంలో ఏర్పడిన కుళ్ళును విమర్శించినా, మానవుల నీతి, సచ్ఛీలంమీద అత్యంత పూజ్యభావం కలిగిన ఆశావాది. కుటిల కులటులను తిట్టి సాధ్వికి మ్రొక్కినాడు. తల్లిని ఆరాధించినాడు.

కవిబ్రహ్మ తిక్కన సోమయాజి తరువాత, పదకృపణమైన శయ్యతో భావం పల్లవింప ఆంధ్ర భాషకు తెనుగుదనంతో బంగారు నీరు సోసినది లోకకవి వేమన యోగియే. చేవగలిగిన చిన్న మాటలతో పెద్ద భావాన్ని ఇమిడ్చి పదాలకు పొందిక, ఒద్దికలతో పద్యాన్ని పంచలోహంతో మలిచినట్లు ఇద్దరూ అల్లినారు. (వేమన, తిక్కన) కాని వేమన పద్యాలు పండితుల, పామరుల నోళ్ళల్లో నాని బిరుసెక్కినవే గాని చీకిపోలేదు.

వేమన లోక కవిత సరళమైన హృదయాకర్షకమైన మేల్కొలుపు పాటను పాడినది. శాస్త్రాలలోని గుట్టును బట్టబయలు చేసింది. ప్రజలు బ్రహ్మ స్వరూపాన్ని, వేదాంత రూపాన్ని తెలుసుకోగలిగారు. మూఢాచారాలకు పెడమొగం పెట్టినాడు.

పురాణాలకు కొత్త చూపుతూచూచి వాటిబూటకాన్ని అర్థంచేసికొన్నాడు. మత విప్లవం, నవ భాషా చైతన్యం ప్రజలలో కలిగినది. ఇవి ఆధ్యాత్మిక సామ్రాజ్యాధికారాన్ని నిరంకుశంగా సాగించిన మత స్వాములను పురోహితులను, పౌరాణికులను రెచ్చగొట్టినవి. మతానికి మరుగు లేకుండా చేయడం వీరికి సుతరాం యిష్టంలేదు. ప్రతి దేశంలోనూ యిదే ఱంపు (కలహము) బయలుదేరింది. గూఢార్థమై అనేక శ్లోకాలలో చెప్పిన ఉపనిషత్తుల మూల సూత్రాలను మన మత మూలకందాలైన మహావాక్యాలను, తత్త్వాలను, ఒలిచి వేమన మూడు పొట్టి బంతులలో ఇమిడ్చి పామరుల అరచేతులలో పెడుతూన్నాడు. ఈ పద్యాలు సులభంగా నోట నిలిచి తత్త్వం మదికెక్కిపోతున్నవి.

వేమన్నది హేతువాదం; కాని నాస్తికవాదం కాదు. (దేవుడు లేడనే వాదం కాదు). ఈయన భక్తి, యోగానికి మొదటి మెట్టుగా మూర్తి పూజను సూచించినప్పటికీ, పై స్థాయి మనసుగలిగిన వారికి ఈ విగ్రహారాధనలు, బాహ్యాచారాలు, అవసరంలేదని భక్తిలేని విగ్రహారాధనను చులకన చేసినాడు. వేమన పరమ ఆస్తికుడు. అందులో అద్వైతి. బాహ్యాచారాలను, మూఢ విశ్వాసాలను పరిహరించి (విడిచిపెట్టి) హిందూమతానికి స్వచ్ఛత, పవిత్రతలను గూర్చుటకు యత్నించి సంస్కర్తలకు పురోగామి అయినాడు.

వేమన కావ్యాలు వ్రాయని కవి. కవి అనిపించుకోని మహాకవి. కల్పనాల కిటుకు ఎరిగిన కవితాశిల్పి. భావ వికాసానికి నెలవైన భాష గలిగిన పండితుడు. పదప్రయోగ మర్మమెరిగిన రసజ్ఞుడు. లోకమెరిగిన ఇంగిత జ్ఞాని యీగ్రామీణ కవి. నడక కుంటుపడేచోట, వ్యాకరణ సూత్రాలను పాటించని నిరంకుశుడు.

వేమన కవితలో సమాసాల సర్కసు లేదు. ఉపమానాలు అనుదినం మన కండ్లయెదుట కనబడేవే. ఆయన ఊహాలతలు మన్నువిడిచి మిన్నుకు ఎగబ్రాకవు. వేమన అనుప్రాస గమకం, కర్ణపేయమై పాఠకుని, శ్రోతను ఊపివేస్తుంది. భావం చదివిన, వినినవారు మనసంతా వ్యాపించి హాయిని గూరుస్తుంది. వేమన ఎగతాళిచేసి నవ్విస్తాడు. క్లిష్ట వేదాంతాన్ని విప్పిచెప్పి స్వానుభవానికి మొగ్గిస్తాడు. చిన్న చిన్న మాటలకు తిక్కన శిష్యుడై భావావేశాన్ని అనుభవింపజేస్తాడు. అదే ఆయన కవితకు

ప్రాణము. ఆయన లోక కవి. వేమన కప్పిచెప్పే కవి. విప్పిచెప్పే విమర్శకుడు.

ఒకసారి వినగానే నోటికి వచ్చే గుణం వేమన కవితకు ఉన్నందువల్లనే పల్లెమొదలు పట్టణముదాక, దేశం ఆయన కవితా వధూటిలాస్యానికి రంగభూమి అయినది. ఆయన ఎన్నో వాక్యాలు సామెతలై తెనుగునాట ఎలపాన గాలివలె పరచుకొనిపోయి ఉన్నవి.

వేమన పెద్ద చదువులేని పల్లెటూరువాడైనా పరిశుద్ధాత్ముడు. కాబట్టి ఈ శక్తి ఆయన కవితకు ప్రాణంపోసి శాశ్వతం చేసింది. వేమన యోగ బలం చేత స్థితప్రజ్ఞుడైనాడు. ఈ అదృష్టం ఆంధ్ర కవులలో ఏ కొద్దిమందికో పట్టినది.

తెలుగు మాటలు వేమన కవిత్వంలో లేచి ప్రాణంతో ఆడుతవి. వేమన తాను చూచినవాటిని వ్రాసి, చదివేవారికి వాటిని చూపిస్తాడు. ఈ చిత్రీకరణలో పదలాలిత్యం, సుభగత్వం, భావరామణీకత ఉట్టిపడుతుంటివి. యతులు, ప్రాసలు ముందుగానే వచ్చి బంతిలో కూర్చుంటవి. కొందరు వీటిని ఇనుప సంకెళ్లు అంటే, వేమన కవితాలక్ష్మికి ఇవి కుందనపు అందెవైకల నినాదంతో మురిపింపజేస్తున్నవి. నీటిమీదపొయ్యే పడవమాదిరి ఒడుదుడుకులు లేకుండా చదరంగా, వేమన కవిత నడుస్తుంది. అది లయాన్వితము.

వేమన రచనలో భిన్నపదసామ్యము ఏకమై వీనులకు విందు చేస్తుంది. దేశమంతా గాలిలో తేలియాడుతూ వుండిన మాటలను గ్రహించి తన పద్యాలలో ఇమిడ్చి కొన్ని కొత్త వాటినిగూడ సృష్టించాడు.

## 20. మీర్ మహమ్మద్ ఆలీఖాన్

(ఈయన పూర్వం నిజాం ప్రభుత్వంలోనూ ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోనూ సహాయ కార్యదర్శిగా గౌరవప్రదంగా పనిచేసి ఈ మధ్యనే విరామం పొందినారు. ఈయన వేమన నూరు పద్యాలను ఇంగ్లీషులోనికి అనువదించారు. వేమన హృదయాంతరాళాల్లోనికి దూరి, ఆ లోకకవి యోగి సత్య ప్రవచనాలను, తత్త్వాన్ని అర్థం చేసికొన్న సంస్కార హృదయుడు. ఈయన వేమన తత్త్వాన్ని బాగా అవగాహన చేసుకొన్న దిట్ట.)

హృదయస్పందనకారియై, ఆనందాన్ని కూర్చగలిగిన కవిత్వ రూపంలో నైతికసూత్ర నిధుల సంపదను తమ భావితరములకు సంక్రమింప జేసిన ఆంధ్రలోక కవులలో వేమన ఒకడు. సరస హృదయాలకు వేమన పద్యాలు ఎంతగానో నచ్చి మదికెక్కినవి. నేటికీ పల్లెవాసులచేత అవి వల్లింపబడి చదువుకొన్న నాగరికుల చేత మెప్పులందుకొనుచున్నవి. వేమన ప్రబోధాత్మకమైన ఆదర్శాలపట్ల నేను వ్యామోహితుడ నైనాను. వీటికి మత స్వాముల ఆధిపత్య స్వరూపంగాని, సంకుచితవర్గ గుణంగాని అంటలేదు. ఆయన ఉదాత్తభావ పరిధిలో అన్ని మతాలకు, విశ్వాసాలకు, భావాలకు భిన్న జీవిత విధానాలకు, సామరస్యం కుదర్చగలిగిన గుణాలు ఇమిడి వున్నవి. అందువల్ల తెనుగువంటి స్థానిక భాషా బంధనము నుండి ఆ భావాలను బయటకుదీసి దేశమంతటా ప్రాచుర్యానికి తేవడం నా అవసర కర్తవ్యమని భావించాను. వేమన దర్శించిన సత్యస్వరూపాలు కేవలం ఊహాజన్యాలు కావు. అవి ఆయన జీవిత వివిధ పరిణామ దశలలో ఆయన బుద్ధి సేకరించిన సానుభూతి సత్ఫలితాల సంకలనములే. వేమన జీవిత ప్రథమ దశలో జీవిత తుచ్ఛ విహార సుఖాలను మనసారా అనుభవించాడు. ఆ తర్వాత వికీర్ణమైన ఆ జీవిత భారంక్రింద తొట్రుపడి, ఆయాసపడి, చివరకు వెగటు చెంది దిమ్మరి సాధువైనాడు. కొంత కాలానికి యోగారూఢుడైనాడు. మానవసేవే యథార్థ మాధవ సేవని అర్థం చేసికొన్నాడు.

మానవ వ్యవహారాల కాలుష్యం ఆధిక్యతను పొందియున్నదని గాఢ వికల మనస్కులైన అపురూప పురుషుల్లో వేమన ఒకరు. ఆయన కాలంలో జనసామాన్యం సంఘపరంగా, మతపరంగా లోపల, బయట పూర్తిగా కుళ్ళిపోయి వుండినది. ప్రజలు దురాచార పాపాలకు ఒడిగట్టి సంతృప్తి జెందుతున్నారు. ఇదిచూచి వేమన మనస్సు ఆగ్రహావేశ పూరితమైనది. అందువల్ల తనచుట్టూ ఆవరించి అభివృద్ధి పొందుచుండిన దురాగత దురాచారాలమీదకు దయాదాక్షిణ్యాలు లేకుండా, వేమన తన క్రోధాగ్నిని వదిలిపెట్టినాడు. వేమన యీ విధంగా ఒక రుషి. సాంఘిక మత సంస్కర్త అయినాడు. దీనితో వేమన మానవాళికి పవిత్ర జీవితాన్ని, నైతిక వర్తనాన్ని, సాగించుటకు కావలసిన సత్యస్వరూపమైన సూత్రావళిని ప్రసాదించినాడు. కాని వేమన పదాలు, అవహేళనములు, విమర్శనలతో నిండిన సామెతలు ఆనాటి

పండితులైన కొందరికి నచ్చలేదు. ఇంతేకాకుండా ఆయనకు వెఱ్ఱి వేమన అని పేరుపెట్టి ఆయన బోధలను ఒక మతిచెడినవాని ప్రలాపాలన్నారు.

మతాధిపతులు, పురోహితులు వేమనను ఒక దైవదూషకుడుగానూ, విధర్మవాదిగానూ దూషించాడు. ఎందుకన తరతరాలుగా వారు ఆచరించి, సమర్థించి, సంరక్షిస్తూ వస్తున్న శ్రౌత (యజ్ఞము, తద్దినము, దినము) కర్మలను అనుష్ఠానములను తెగనాడిన జ్వలిత నిందావాక్య రూపాలే ఆయన ఉపదేశాలైనవి.

మతముయొక్క స్వచ్ఛజీవనము, దాని సారము, దాని ప్రధాన ఆదేశాలు, లక్ష్యాలు, యీ బూటకపు వైదిక కర్మలచేత మరుగుపరచబడి ఒక మూలకు నెట్టివేయబడినవి.

అప్పుడు వేమన వైదిక కర్మలమీద తిరుగుబాటు చేసినాడు. హృదయం పరిశుభ్రమై, పరిపక్వమై, ఆత్మ పవిత్రభూతమైతేగాని ఈ కర్మలు ఆధ్యాత్మిక ప్రగతికి సహాయకారులు కావని ఎలుగెత్తి చాటినాడు. మత మూలసూత్రాలు ఈ కర్మ కలాపాల రాశిలో లోతుగా పాతివేయబడినవి. ప్రధానమైన ఆ మూలసూత్రాలు సత్యబలముతో వేమన ఆ మూఢాచారాల గుడ్డినమ్మకాల గుట్టను గెలకను ప్రారంభించగానే అలజడి ప్రారంభమైనది. ఇవి అర్థంకాని మూక, ఆయనను మొరటుగా ఎదిరించి ద్వేషించినారు. ఆధ్యాత్మిక ప్రచారం చేస్తున్న మతస్వాములు వేమనను క్రింది చూపుతో చూచి కించపరచినారు.

వేమన తనకు నచ్చని సాంఘిక మతసంబంధమైన దురాచారాలన్నింటినీ తన–మన అనే తేడా లేకుండా నిర్మొగమాటంగా విమర్శించినాడు. ఇది కొంత మొరటుగా తోచినా కుత్సిత అవభాషణ స్పర్శమాత్రం దీనికంటలేదు.

వేమన వర్ణవ్యవస్థను తీవ్రంగా నిరసించి సమాజంలో పై అంతస్తు వారు అనుభవిస్తున్న విశేషాధికారాలను గుర్తించక, క్రిందుచేసినాడు. దరిద్రుల, దుర్బలుల, నెత్తిపై మోపబడిన దీనస్థితికి వగచి సానుభూతిని చూపించినాడు.

కులము, ధనము మానావాళిని ఒకరినుండి మరొకరు వేరుచేసి, నీచోన్నతుల నిర్ణయించి వ్యవహరించిన సాంఘిక దురాచారాలను, కులకట్టుబాట్లను తన శక్తినంతా ఉపయోగించి క్రోధంతో సర్వజనామోదకరమైన, అలంకార పూర్ణమైన

మధుర జీవభాషలో గర్జించాడు.

వేమన కౌమార దశలో సౌందర్య వశీకర శక్తులకు లోబడి మరులుగొన్నాడు. వెంటనే యీ వ్యామోహాలు తన నైతిక పతనానికి, అవినీతికి దారితీస్తవని కనుగొన్నాడు.

వేమన విగ్రహారాధనకంటే చిత్తశుద్ధికే ఎక్కువ ప్రాధాన్య మిచ్చినాడు. వేమన పైస్థాయి నందుకొనిన మర్మయోగి అయినందున ప్రాథమిక పూజావిధానం ఆయనకు నచ్చలేదు. ఆయన ఆధ్యాత్మిక శక్తుల విభూతి అత్యచ్ఛస్థాయి నందుకొనెను. అందువలన సాధారణ పూజావిధానాలు ఆయన మనస్సును ఆకర్షించలేక పోయాయి.

వేమన కవిత్వం ముఖ్యంగా నైతిక సూత్రోపదేశాలు గలవిగాను కన్పించును. ఆయన జీవిత యానంలో ఎదురయ్యే క్రిందు మీదులగుండా పయనిస్తూ తాను పొందిన అనుభవ స్వరూపాలే ఈ పద్యాలనవచ్చును. అయినప్పటికీ వేమన ఐహిక జీవిత లక్ష్యాన్ని, దాని ప్రయోజకత్వాన్ని ఉపేక్షించినవాడుగాదు. మనస్సుకు సూటిగా తాకి, నచ్చజెప్పే విధంగా సుభగ, సరళశయ్యలో పద్యాలరూపంలో సత్యం వివరింపబడుచున్నది. దీనికి తోడు వేమన కవితాశిల్పము ఒక ప్రత్యేక గుణంగా అలరారుచున్నది. అందువల్లనే నేటికి గూడ వేమన రచనలు సామాన్యుల హృదయాలకు ప్రీతి పాత్రలై ఉన్నవి. వేమన మనస్సు సహజ జ్ఞాన ప్రేరితము. వేమన వట్టి వేదాంతి మాత్రమే అయిఉండి కవిగాకపోయిన యెడల, అంతటి మహిమోన్నత భావపరంపరను, అంతటి సజీవ ఫక్కీలోచెప్పి ఒప్పించి యుండలేడు. తత్త్వజ్ఞానము, కవితానైపుణ్యము రెండూ పెనవేసికొనియున్న వేమన వంటివారికే ఇట్టి కవితాతీరులు ప్రాప్తించగలవు.

వేమన వెలిచూపేగాక, లోచూపుకూడ కలిగినవాడు. వేమన బుద్ధి ఎల్లప్పుడూ పరచింతనాసక్తమై వుండేది.

సామాన్యులకు బాగా అర్థమయ్యే దానికై వేమన తన శయ్య సరళ మనోజ్ఞంగా వుండేదానికై, తన రచనలలో ఎక్కువగా ఉపమానాలను, సామ్యరూపాలను వాడినాడు. ఈ వివరణశక్తి కవితాభిమానులకూ, గ్రామీణ ప్రజలకూ ఉపయోగ`పడేటట్లు వేమన ఉపయోగించినాడు. అందుకై వేమన ఉపమానాల

కోసం గ్రామీణ పరిసరాలలోనే వెదకినాడు.

వేమన పదప్రయోగంలో పొదుపును (కృపణత్వము) చూపినా తాను ప్రయోగించిన ప్రతిపదాన్నీ పిండి, దాని విలువను కడపటి బొట్టువరకు గుంజి, ఆ సారాన్ని తన పద్యాలలో ఉపయోగించి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయగలిగిన ఉచిత స్థానంలో వాటిని నిలిపినాడు. కాబట్టే ఆయన పద్యాలు మాటల కుదింపు, చిక్కదనము, చేవ గలిగి శయ్యానుగమంతో శోభిస్తున్నవి.

సూత్రప్రాయములైన వేమన పద్యాలు పరిచిత ఉపమాలంకారాలచేత ప్రస్ఫుట ఉచిత రూపాలు దాల్చి ఆబాలగోపాలాన్ని ఆకర్షించి, వారి హృదయాలలో జొరబడిపోతున్నవి. సామాన్యజన నైతికోన్నతే, వేమన లక్ష్యం. కాబట్టి పదాడంబర గర్వంతో తన కవితను ప్రజలకు దూరం చేయదలచలేదు. కొద్దిమంది మేధావులకొరకు (చదువుకొన్నవారి కొరకు) మాత్రమే దిగజారి వేమన వ్రాయదలచుకోలేదు.

వేమన హిందువుల దేవుళ్ళను, దేవతలను చులకనచేసి, నిందించినాడు. విగ్రహారాధనను వేమన ఎన్నడూ మన్నించలేదు. హిందువుల మూఢాచారాలను ఎగతాళిచేశాడు. వేమన తమ పూర్వీకులు చేయు తద్దినాలు, విడుచు తర్పణములను అపహాస్యము చేసినాడు. తీర్థయాత్రలు, పుణ్యక్షేత్రముల సేవనము చేయుట బుద్ధి జాడ్యమని అన్నాడు. శకునాదులను, ఇతర మూఢ విశ్వాసములను వేమన నమ్మనే నమ్మలేదు. సన్యాసులన్నా, యోగులన్నా వేమనకు అత్యంత గర్హణము. వేమన పద్యములను బ్రాహ్మణులు ద్వేషించేవారు. అందువల్ల వేమన పద్యములు చాలకాలం వరకు పాఠ్యగ్రంథాలలోనికి ఎక్కకుండా అణచివేయబడినవి. వేమన జన్మ తిథి క్రీస్తుశకము 1772, 1712 లేక 1652 సంవత్సరములు కావచ్చును. ఇందులో మూడవదే నిజము కావచ్చును.

## 21. మోటూరు హనుమంతరావు

(భారత కమ్యూనిస్టుపార్టీ మార్క్సిస్టు కేంద్ర కమిటీ సభ్యులు)

వేమన ప్రజాకవి, మానవతావాది, హేతువాది. లౌకిక తత్త్వవేత్త. మూఢాచారాలను, మూఢనమ్మకాలను ఎండగట్టిన విజ్ఞాని. కుల, మత,

విభేదాలన్నింటిని విసర్జించమని పిలుపిచ్చిన సంఘ సంస్కర్త, విద్యా, విజ్ఞానాలు, శాస్త్రజ్ఞానం ఇంతగా పెంపొందిన యీ కాలంలో కూడా ఆ బుద్ధులబ్బని, మేధావుల్ని కూడా మనం చూస్తుండగా, వెనుకబడిన ఆనాటి కాలంలోనే ఆయనకు స్వానుభవంలో కరతామలకంగా అబ్బడం అప్పటి సమాజాన్ని ధిక్కరించి ఆ వెలుగుబాటను తన పాటగా ఆయన పాడటం ఆయన ఘనతకు, మన చిన్నతనానికి తార్కాణము.

నేటికీ, కుల, మత, ప్రాంతీయ సంకుచిత తత్త్వాలతోనూ, మూఢ నమ్మకాలతోనూ క్రుంగి కుమిలిపోతున్న సామాజిక పరిస్థితుల గమనాన్ని పరిశీలిస్తే, కొన్ని వందల సంవత్సరాలనాడే వేమన ఎంత గొప్ప విశాల భావాలను సామాన్య భాషలో చక్కని కవిత్వ రూపంలో వెదజల్లాడా అన్న ఆశ్చర్యం కలగక మానదు.

నేటి శాస్త్ర విజ్ఞానం ఆనాడు లేదు. ఆనాటికున్న విద్యలను కూడా ఆయన నేర్చిన పండితుడు గాదు. ఆయనకున్నది లోకజ్ఞానం మాత్రమే. దాన్నే ఎంత చక్కగా తీర్చిదిద్దాడు? ఎంతటి మహత్తర భావాలను భావితరాలవారికి అందించాడు? ఆయన ఘనత వర్ణనాతీతం.

## 22. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

వేమన పద్యములు నోటికి రాని ఆంధ్రుడు లేడు. ఆంధ్రుల దైనందిన జీవితమున వేమన పద్యములు సామెతలుగా వ్యవహరింపబడుచున్నవి. అతని కవితలోని పద్యములు నిరక్షరాస్యులకు సైతము సుపరిచితములే.

వేమన తన భావమును చిన్న చిన్న మాటలతో స్పష్టముగా, సూటిగా, సరసముగా, హాస్యధోరణిలో చెప్పగల కవితా చమత్కారము గల వ్యక్తి. అతడు విశ్వసించిన తత్త్వమును నిస్సంకోచముగా, కుండబ్రద్దలు కొట్టినట్లు చెప్పగల ధైర్యశాలి.

వేమన తన పద్యములను ఒకచోట కూర్చుండి చెప్పినవికావు. సందర్భానుసారముగా హృదయస్పందన కల్గినపుడెల్ల చెప్పిన పద్యములవి. అంతేకాక యే పద్యమున కాపద్యము భావపూర్ణత కలిగియుండుటచేత అతని కవితాశైలి పైన

అభిమానముగల మరెవ్వడైన వేమన శైలిలోనే పద్యములు రచించి వానినిగూడ వేమన పద్యములుగా చెలామణి చేయించుటయు సంభావ్యమే. ఇట్లితర కవులు చేర్చిన పద్యములను ప్రక్షిప్తములందురు. వేమన నీతి పద్యములలోనే కల్తీ జరిగింది. ఎవ్వరూ కూడ తక్కినవాటి జోలికి పోలేదు. కావుననే నేడు వేమన పద్యముల సంఖ్య భిన్న భిన్నముగా గోచరించుచున్నది. వేమన కవితలో కందములు, పదములు, వచనములు, వృత్తములు అక్కడక్కడ కన్పించుచున్నవి. కాని వేమన ఆటవెలది పద్యమును అభిమానించినంతగా తదితర ఛందమును అభిమానించినట్లు కన్పించదు. వేమన పెద్ద పండితుడు కాడు. అతనికి భాషావిషయక పాండిత్యము ప్రధానముగాదు. సరళశైలిలో భావవ్యక్తీకరణమే ప్రధానము. వేమన కవిత్వమునకు అదే ప్రాణము.

వేమన కవిత్వము ఇరుప్రక్కల పదునుగల చురకత్తి. గాయపు మందు కత్తికే పూసి కొట్టినట్లుగా ఒకవంక దిట్టుచునే మరొకవంక నవ్వించు హాస్యకుశలత కవిత్వమునకు గలదు. సూక్ష్మదృష్టి హాస్యకుశలత వేమన కవిత్వమునకు మూలస్తంభములు. ఇట్టి అద్భుతవ్యక్తి ఒక మహా పురుషుడుగా ఆంధ్రులకు ప్రప్రథమమున పరిచయము చేసినవాడు ఒక ఆంగ్లేయుడైన బ్రౌనుదొర. వేమన 17వ శతాబ్దపు ప్రారంభమున ఉన్న ఒక విశిష్టవ్యక్తి. ఈతనినే యోగి వేమన అందురు. తాత్త్వికదృష్టితో యితడు ప్రచారముచేసిన అద్వైత సిద్ధాంతములు సాంఘిక దురాచార వ్యక్తీకరణములు. పద్యములరూపమున ఆంధ్రదేశంలో చిరస్థాయిగా నిల్చిపోయినవి.

మత సంబంధమైన అభిప్రాయములను దుయ్యపట్టుట, శైవ వైష్ణవుల వేషములను కర్మలను నిరాకరించుట మున్నగు బోధనలవలన వేమనను తిరస్కరించినవారే అధికమని చెప్పవచ్చును. ఈతని మతసిద్ధాంతములు విద్యావంతులకే అర్థంకావు. సాంఘికాచారములను ఖండించు వేమన నైజము చాలమందికి గిట్టదు. ప్రపంచ వ్యవహారమునకు విరోధి. సహజముగా ఉద్రేకి అయిన వేమన సంఘ సంస్కారిగా రాణించలేదు. తన సిద్ధాంతమును ధిక్కరించినవారిని దూషించగలడుగాని, నచ్చచెప్పలేని, ఓర్పులేనివాడు వేమన.

కాని వేమనలోని శ్రద్ధ, పట్టుదల ప్రశంసింపదగినవి. వేమన తాననుకొన్న

తత్త్వమే ఉత్తమమన్న విశ్వాసముతో లోకమునకు ప్రచారము చేయవలయునన్న దీక్షతో జీవితాంతము వరకు నడుముకట్టుకొన్నాడు. నిష్ప్రయోజనకరమైన యోగ విధానములను బోధింపక చిత్తశుద్ధికల్గి శాంతి సంపాదించు మార్గము మాత్రము బోధించి చరితార్థుడైనాడు.

వేమన భావదాస్యములేని కవి కావున భాషలో బిగువు కన్పించును. వేమన భావతీవ్రత, అడ్డమాకలులేని నాలుక కలవాడు. కనుక భావము, భాష సమముగా హృదయమునుండి ఉత్పన్నమైనట్లు కనిపించును. కావున వేమనకు ఛందస్సు, యతిప్రాసలు లొంగినవి; అలంకారమైనవి. ప్రాసతో కూడిన ఆటవెలది యీతని భావవేగమునకు దాసోహమన్నది. ఆటవెలది వేమన కవితా సామ్రాజ్యములో పట్టాభిషేకము పొందినది. వేమన యతికి ఎనలేని మర్యాద యిచ్చెను.

వేమన అచ్చు తెనుగునే ప్రయోగించాడు. తత్త్వ విషయములను చెప్పునపుడు వేమన అచ్చుతెనుగునే ఉపయోగించాడు. వేమన కవిత్వమును మెరుగుపెట్టి దుర్వారబలముగల దానినిగా చేసినది హాస్యము. కాని దీనిని ప్రాచీనులు (పండితులు) జుగుప్సాకరముగా, (బూతుగా) అసభ్యముగా చిత్రీకరించుటచే అంతగా రాణింపలేదు. కాని వేమన బోధకుడు; సంస్కర్త కనుక కొంతవరకు హాస్యరసము కలుషితమైనను సహజముగా స్వతంత్రుడు కావున నిజమైన హాస్యము కవిత్వములో కనపడును. హాస్యరసోస్ఫోరకంగా విషయము సాగదీసి చెప్పుట వేమన హాస్యవిధానంలో ఒకటి. సర్వ సామాన్య విషయము  సాగదీసి చెప్పుట వేమన హాస్యవిధానంలో ఒకటి. సర్వ సామాన్య విషయమును గంభీరంగా రెండు పాదములలో చెప్పి, మూడవ పాదములో అకస్మాత్తుగా అనుకోని మలుపు చూపి హాస్యము స్ఫురింపజేయుట వేమన ఇంకొక హాస్యలక్షణము.

వేమన నీతులు వేమన పేరును చిరస్థాయి చేసినవి. వేమన యజ్ఞయాగాదులను ధిక్కరించాడు. అహింసావ్రతమును, కన్యాదానమును వేమన ఎక్కువగా ప్రేమించాడు. వేమన ఆడవాళ్ళను బాగా విమర్శించినట్లగుపడును. వేమనకు పాపపుణ్యములనందు కొంత నమ్మకం వున్నప్పటికీ, నమ్మకంలేకుండుటయే ఆయన పద్యములలో ఎక్కువగా గోచరిస్తున్నది. పాపపుణ్యములు మానవ కల్పితములే

కాని దైవసృష్టములు కావని వేమన అభిప్రాయము.

వేమన పెక్కు బండబూతు పద్యములు వ్రాసెను. అట్టి పద్యములు మననోట నుచ్చరింపరానివను భావము మనము మరచిపోవువఱకును వాని యందలి కవితాధర్మము మనకు గోచరింపదు.

వేదముల కాలమునుండి మనలో బూతులు వున్నవి. మనలోనే యేల; అందరియందును గలవు. కామాతురులును, వారిని ఖండించు వారును అన్ని భాషలందును బూతు కవిత్వము వ్రాసినవారే. నేటికిని అట్టివి వ్రాయువారును, విని సంతసించు వారును విద్యావంతులలో కలరు. కాని వానిని బైలుపఱుపరాదను భావము ఇప్పుడు బలమగుచున్నది. అంతమాత్రముచేత అది కవిత్వము కాదనలేము.

## 23. లాయనెడ్ డేవిడ్‌బార్‌నెట్

(ఈయన చాలాకాలం వరకు భారతీయ శాస్త్ర పరిశోధకులైన ఆంగ్లేయులకు గురువుగా వుండెను. ఈయన సంస్కృతము, గ్రీకు, ల్యాటిన్, ఫ్రెంచి, జర్మనీ వగైరా పశ్చిమ భాషలన్నింటిని వ్రాయగలిగి చదువగలిగి వుండెను. హీబ్రూ, అరబ్బీ, ఫారశీకము, సింహళము, టిబెట్టు, బర్మా భాషలు కూడ ఈయనకు తెలుసును. హిందూ, బౌద్ధ మతముల వివిధ శాఖలందు ఈయనకు పూర్ణ పాండిత్యము వుండేది. ఈయనకు వేమన ఉపదేశములంటే అత్యంత గౌరవము. ఈయన వేమనను గురించి "భారతదేశ హృదయము" (The Heart of India) అనే పుస్తకమును వ్రాసినాడు. దానిలో వేమనను గురించి యిలా వ్రాశాడు.

వేమన అనే వ్యక్తి ఒకరు, రక్త-మాంసాకృతితో యీ భూమిపైన కాలిడి దీనిని పవిత్రము చేసినాడు. వేమన ప్రపంచ మహా ప్రవక్తలలో ఒకరు. వేమ, వేమన అనే శబ్దములు ఒక నిజమైన మనిషి పేరైనా వేమన పద్యములు వ్రాసిన కవి సంగతి ఏమీ తెలియకున్నది. వేమన పద్యములయందు రాయలసీమ గ్రామీణ కర్షకుల అకృతిమ హాస్యము, విజ్ఞానము, వేదాంతము, మతము నిండియున్నవి. ఆ పద్యములు రసవత్తరమైన ప్రజాకవిత్వ గుణికలు.

వేమన మతము శైవధోరణిలో ఉన్నది. అది ఉదారమై, సహనశీలమై

యున్నది. ఆయనకు మత విభాగములు కులవిభాగములు లెక్కలేదు. వైదిక బ్రాహ్మణుల ఆచార వ్యవహారముల పట్ల, సన్యాసుల పట్ల, వేమన కరకు నిందలు దొర్లించినాడు.

హిందూదేశంలో గల సన్యాసులను, గురువులను, ఆచార్యులను రెండు విభాగములుగా చేయవచ్చును. ఒకటి లాభములను పొందే గురువులు, పురోహితులు, అర్చకులు. రెండవ తెగకు చెందినది సన్యాసులు.మొదటి వారు తీర్థములలో, క్షేత్రములలో, దేవాలయములలో ప్రజాపత్యము వహించినవారు. వీరికి చదువు, సంస్కారములు చాల తక్కువ.ఇక సన్యాసులలో దేశదిమ్మరులు, బైరాగులు, కపట యోగులు, ధూర్తవైద్యులు, ప్రచారకులు కొందరు లేకపోలేదు.వారిలో కొందరు పండితులు లేకపోలేదు. గృహస్థాశ్రమ ధర్మమును పాటించు కులీన బ్రాహ్మణులు కొందరుగలరు. వేమన ఎగతాళి చేసినది మొదిటివారినేగాని, యిట్టి కులీన బ్రాహ్మణులను మాత్రం కాదు. మానవత్వమునకు సంబంధించిన దానిని దేనికీ వేమన వైముఖ్యం చూపలేదు. అధికారములోనికి వచ్చి పొయ్యే పుల్లాయలంటే వేమనకు అంత గౌరవము వుండేదికాదు. సోమరులు, మూఢాచార పరాయణులు ఆయన విమర్శకు గురియైపోయారు.

బైబిల్ నూతన నిబంధనలోని సామెతలలో– "శత్రువుల తలపైన నిప్పుకణములను పెట్టరాదు. అట్టివారికి మేలే చేయవలయును" అని వ్రాయబడినది. ఇదేవిధంగా వేమన అంటాడు– "చంపదగినయట్టి శత్రువు తన చేత జిక్కనేని కీడు సేయరాదు" పొసగమేలుచేసి పొమ్మనుటే చాలు" అని వేమన చెప్పిన నీతులు సువర్ణాక్షరములలో వ్రాయదగినవి. ఇవి మతావరణములలో పుట్టిన సత్యములు కావు. శ్రామిక ప్రజల ప్రేమపూర్వక హృదయకుహరములనుండి వెలికుబికిన శాశ్వత సత్యములు. అందువల్ల అవి పరమోత్కృష్టమైనవి.

## 24. వావిళ్ల రామస్వామిశాస్త్రి

వేమనయోగి రచించిన పద్యములలో నీతి పద్యములు పఠనీయములై యున్నవి చదివినంతన, శిశువులకైననూ, బోధమగు సులభశైలిలో, జక్కని

దృష్టాంతములతో వ్రాసిన వేమన పద్యములు జనాకర్షణము లనుటలో నతిశయోక్తిలేదు. ధార, మృదుమధురముగా నుండును.నిజమగు తెనుగు కవిత తిక్కన సోమయాజికి, తరువాత నొక వేమన యందే గాననగునను భాషా విమర్శకుల వాక్యమునందు సత్యము లేకపోలేదు.

వేమన వివిధ విషయములను గూర్చి వేలకొలది పద్యములను రచించెను. వానిని విషయవిభాగము గావించి తాత్పర్యములతో ప్రచురించియున్నాను. వేమన నీతి పద్యముల వలన మానవుడు నీతి తొలంగక యే విధంగా ప్రవర్తించిన ధన్యుడగునో తెలియును. మానవ జీవితమునకు నీతి ప్రధానము. నీతిని కాపాడుకొనినగాని ఐహిక ధర్మములను మానవుడు నిర్వర్తించుటకు అవకాశం వుండజాలదు.

వేమన రెడ్డి వంశీయుడనియు, దత్తమండలములోని కటారుపల్లెలో మరణించెననియు, కొండసీమ వ్రాసియనియు, చరిత్రకారుల అభిప్రాయము. ఈయన క్రీ.శ. 1540–1600 లోగా నుండి యుండెను. సామాన్య నీతులను విచ్చలవిడిగా జెప్పియున్నాడు.

## 25. వి. రామకృష్ణ

(ఈయన 1938లో ఆధునిక ఆంధ్ర సామాజిక చరిత్రలో విశేషమైన కృషిచేసిన పరిశోధకులు. ఈయన జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ చారిత్రక అధ్యయనాల కేంద్రంలో ఆచార్య సర్వేపల్లి గోపాల్ పర్యవేక్షణ కింద పి.హెచ్.డి. చేశారు. ఈయన ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ సంస్థకు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం భారతీయ చరిత్ర కాంగ్రెసు సంయుక్త కార్యదర్శి)

వేమన యే శాఖకు చెందినవాడు కాదు. యే మతశాఖనూ స్థాపించినవాడు కాదు; ఆయన తన చుట్టూ వుండిన జీవితాన్ని గమనిస్తూ దాని మీద వ్యాఖ్యానిస్తూ, దేశ సంచారం చేసిన సన్యాసి. ఆయన తన భావాలను సరళమైన, అతిస్పష్టమైన శైలిలో బ్రౌన్ అన్నట్లు కవితామయం కాకపోయినా, సాంప్రదాయకం కాకపోయినా మామూలు మనుషులకు ఉపయోగకరమైన శైలిలో వ్యక్తం చేశాడు.

హాస్యం ఆయన కవిత్వంలోని ఒక ముఖ్యలక్షణం. సున్నితమైన వ్యంగ్యమూ, మధురమైన హాస్యమూ, ఒకోసారి మహోకటువైన అవహేళనతో మిళితం చేయబడ్డాయి. నీతులను గురించి హృదయానికి నాటుకొనే శైలిలో, సామాన్యులకు అర్థమయ్యేటట్లు ఆయన రాశాడు.

పుట్టుకవల్ల వచ్చే సాంఘిక భేదాలనూ, అసమానతలనూ, ఆయన రెండు కారణాలవల్ల ఖండించాడు. మొదటిది అవి నైతికంగా తప్పు. రెండవది అవి సమాజముయొక్క సహజశక్తిని బలహీనపరచి, సమాజ విచ్ఛిత్తికి దారితీస్తాయి.

హిందూ మతానికిచెందిన ప్రతిబాహ్య అంశాన్నీ వేమన ఖండించాడు. లాంఛనప్రాయమైన అనుష్ఠానాలతో మోక్షం లభిస్తుందని ఆశించే బ్రాహ్మణ కర్మిష్ఠులనూ, బైరాగులనూ, ఆయన యేవగించుకొన్నాడు. ఆయన కులభేదాలను విమర్శించి మనిషి స్థాయిని అతని పుట్టుకకాక, గుణం నిర్ణయించాలని నొక్కి చెప్పాడు.

విగ్రహారాధన భక్తికి వ్యతిరేకమైనదంటూ విగ్రహారాధకులను ఆయన ఎన్నో విధాల అపహాస్యం చేశాడు. డంబంతో, మూఢ విశ్వాసాలతో, మూఢాచారాలతో, సంకేతాలతో నిండిన ఆనాటి మత సంప్రదాయాలన్నింటినీ ఆయన ఖండించాడు.

వేమన దేశమంతా సంచారంచేస్తూ, మనుష్యుల సమస్యలపట్ల శ్రద్ధ వహించి, తన పద్యాలద్వారా సమాజంలోని దురాచారాలను దుయ్యబట్టుతూ, వాటినుండి విముక్తి చెందండని ప్రజలకు ఉద్బోధించాడు. బీదల పట్ల, వాళ్ళ కష్టాలపట్ల వేమన సానుభూతిని ప్రకటించాడు. ఇతర తాత్త్విక కవులకు భిన్నంగా ఆయన ఐశ్వర్యంకంటే బీదరికమే మనుషులను యెక్కువ కలుషితం చేస్తుందని గుర్తించాడు.

కబీరులాగే వేమన భగవంతుడొక్కడేనని నమ్మాడు. ఆయన తాత్త్విక దృక్పథం సర్వమానవ సౌభ్రాతృత్వం. అంటరానితనాన్ని ఆయన నిరసించాడు. ఆయన దృష్టిలో మనుషుల స్థాయిని హీనపరిచేది జన్మకాదు. గుణహీనత, వేమన కులాలతో, మతాలతో, మూఢ విశ్వాసాలతో భ్రష్టమైన హిందూ మతంమీద తిరుగుబాటు చేశాడు.

## 26. విద్వాన్ పి.సి. మునుస్వామి ఎం.ఏ

(ఈయన మద్రాసులో పచ్చయ్యప్ప కాలేజీలో ఫిలాసఫీ ప్రొఫెసర్)

ఆంధ్రదేశమున తత్త్వ జ్ఞానులనబడు మూర్తిత్రయము– బౌద్ధ నాగార్జునుడు, వేమన, పోతులూరి వీరబ్రహ్మము. ఆంగ్లానువాదము వల్ల నాగార్జునుని ప్రతిభ భారతావనియందే గాక, ఇతర దేశాలలో కూడా విజ్ఞులకు తెలిసెను. గాని వేమన, వీరబ్రహ్మంగార్ల తాత్త్విక దృష్టియును, నీతిలోగనపడు వైశిష్ట్యము అందఱకును తెల్లముగాలేదు. వీరి తాత్త్విక సంపత్తి, తాత్త్విక అనుభవములు అమోఘములన అతిశయోక్తి గాదు.

వీరి సిద్ధాంతాలలో సర్వమత సామరస్యమును సర్వదార్శనిక సమ్మేళనము విదితమగుచున్నవి. వేమన అతీత మార్గానుయాయి. ఆయన ఈ నూతన ఫక్కీని నుగ్గడించి అనుభవ పూర్వక పద్యములచే, నందఱకు విశదం చేసెను. వీరి యతీతమార్గమున ఆంధ్రజాతి ప్రతిభ, మేధాసంపత్తి, ఆంధ్ర తత్త్వ వైశిష్ట్యము ప్రతిఫలించు చున్నవి. అందుచేత వేమన సిద్ధాంతం వైదిక బ్రాహ్మణ మతమును కొంత భిన్నముగనున్నది. ఆంధ్రదేశంలో తత్త్వములనబడు జానపద గీతాలతో వేమన ఉగ్గడించిన యతీతమార్గం ఘోషిస్తున్నది.

ఆంధ్రదేశంలో ఆబాలగోపాలం వేమన్నను యెఱిగియే యున్నారు. పండితపామరుల నోట్ల ఈయన పద్యములు తాండవమాడుచూనే యున్నవి. కొంతమంది పండితులు వేమన సూక్తులను తీర్చిదిద్ది వాటిని పాడుచేసిరి. అయినప్పటికీ ఆంధ్రమాతకు ప్రియసుతులలో వేమన అగ్రగణ్యుడు. వేమనలో ఆంధ్రత్వము పూర్ణముగా లీనమైయున్నది. తమిళులకు తిరువళ్ళువర్, కన్నడులకు సర్వజ్ఞ, తెలుగు జాతికి వేమన సార్వజనీన ప్రవక్తలు.

## 27. విల్. డ్యూరాంట్

బ్రాహ్మణులు సహజంగా, ప్రాయకంగా, సాకార బ్రహ్మమును కాదనే వేదాంతవాదులైనా, ఈ వాదమును సామాన్య ప్రజల మూఢవిశ్వాసాల మీద ప్రయోగించలేదు. భారతదేశ కవులందరు పవిత్ర సూత్రాచరణయందు గాఢాసక్తి కలిగి యున్నవారుగానే యున్ననూ, వారిలో కొందరు– కబీరు, వేమన వంటివారు– మూఢాచార బంధముక్తమైన ఈశ్వర వాదమునే– మతమునే– రక్షించిపోషించినారు.

వేమన 17వ శతాబ్దంలో వెలసిన దక్షిణ భారతకవి. ఈయన బూడిదబుంగలైన హఠయోగులను, తీర్థయాత్రాసంసేవనములను, కుటిల కులాచారములను, నిష్ఠురనిందా గర్భంగా విమర్శించినాడు.

## 28. విలియమ్ హ్యూవర్డ కాంబెల్

హిందూదేశంలోవలె, మతము యింతటి అతిశయ స్థానమును ఆక్రమించుకొనిన దేశము ఇంకొకటి లేకపోగా, ప్రజలమత జీవితము ఇంత కంటే ఎక్కువ కృత్రిమమమైన దేశము గూడ మరొకటిలేదు. నేడు హిందూదేశము మూఢాచారతంతులచే, అల్లబడిన వట్టి గిజిగాడు గూడైపోయింది. ఇంతేగాక ఆ మతావలంబకుల జీవితముపై ఎట్టి ఆధ్యాత్మిక ప్రభావముగాని కలిగించుటకు బొత్తిగా చేతగాక పోవుచున్నది. ఈవిషయం ఆమతము ఇప్పుడు ఆచరించే బాహ్యాచారములను గమనించినచో తెలియగలదు. కాని అది నేడు వ్యాప్తిలోనూ, ఆచరణలోనూ ఉన్నమత విధానమునందుగాని, మతసంస్థలందుగాని నెలకొనక, వాటికి ఎట్టి సంబంధంగాని లేక వైదొలగి కడగా నున్నది. ఈ మతము అమాయకులు, విద్యాగంధమెరుగని పల్లెటూరి వారియందే నేడు నిలిచియున్నది. తెల్లవారి నాగరికత పలుకుబడి వీరిపైన ఆవగింజంతకూడ పడలేదు.

ప్రతి పల్లెలో సామాన్య లోకాచారములను, సంప్రదాయములను విడనాడి పైమెట్టుకు ప్రాకి, అమరిన ఆధ్యాత్మిక ఆరాధనమును ఊహించుకొని అలవరచుకొనిన పురుషులు, కొందరు స్త్రీలు గూడ వున్నారు.

ఈ ఆరాధనమునకు విగ్రహాలు, ప్రతీకములు, ఆచారములు, యోగాది కల్పములతో ఎట్టి సంబంధంలేదు. ఇట్టి వారు తమ అభిప్రాయాలను బలవంతంగా ఇతరులమీద రుద్దరు. వీరు హిందువుల ముక్కోటి దేవతలను మాత్రం ఆరాధించరు. సర్వశక్తిమయుడు, సర్వవ్యాపకమైన ఒక పరబ్రహ్మమును నమ్మి ప్రార్థనలు, సంకీర్తనము, దానముచే బ్రహ్మజ్ఞానాన్ని పొంద ప్రయత్నిస్తున్నారు. ఈవర్గం వారు విగ్రహారాధనను గర్హించి గుడులలో జరుగు కొలువుల పొంతకు పోక, ఉత్సవములకు, పండుగలకు దూరంగా ఉందురు. వీరు బ్రాహ్మణాధికారమునకు తలలొగ్గక, తరచుగా

వారి మతాధిపత్యమును, వారి అధికార భావములను తీవ్రంగా ప్రతిఘటించు చుందురు.

ఈ బోధకులందరూ ఏదో ఒక గౌరవాస్పదమైన శూద్రజాతికి చెందిన వారే. కాని కొన్ని సందర్భాలలో మహమ్మదీయులు, మాలలు కూడా ఈ గురువులుగా వున్నారు. వీరందరూ కులవ్యత్యాసములను తృణీకరిస్తారు. వీరు వేదాలు, భగవద్గీత, భాగవతము వగైరాలను ప్రామాణ్యములు కావని చెప్పుదురు. బ్రాహ్మణులు వేమన బోధను తీవ్రంగా ప్రతిఘటించిరి. ఆయన రచనలను ఎప్పుడూ క్రిందుచేసి మాట్లాడుచున్ననూ, ప్రజాసామాన్యము వేమనను దేవుడుగా, గొప్ప యోగిగా, గొప్ప జ్ఞానిగా పూజించి ఘనపరచుచున్నది.

వేమన పద్యములను ఒకటి రెండిటిని ఉదహరించనిదే ఏ వివాదముగాని, తీర్మానముగాదు. కాని వేమనను గురించి విశదంగా తెలిసికోవటం చాలకష్టమైనపని. ఎందుకనగా, హిందూదేశంలో చరిత్ర అనునది ఒక అపరిచిత సాహిత్యశాఖ. అంటే చరిత్ర వ్రాసే అలవాటు యిక్కడలేదు. ఇక ఒకనికి సంబంధించిన చరిత్ర కల్పిత కథల క్రిందమరుగైపోయి వున్నందున అసలు చరిత్రను తెలిసికొనుట కష్టమైన పనియైయున్నది.

*వేమన జాతివారు ద్రావిడ నాగరికతకు చెందినవారు. ఆర్యులు అనబడే బ్రాహ్మణులు వగైరాలు ఎత్తివచ్చి, వారి కుల విధానమును, పౌరోహిత అధికారములను యిక్కడ ప్రవేశపెట్టినాదానికి లొంగక తమ పూర్వుల ఆచారాలనే ఆచరిస్తున్నారు.*

వేమన నూటికి నూరుపాళ్ళు కాపు. దిట్టమైన పశువుల కాపరి. విద్యాగంధములేని, కల్లాకపటములేని, ఒక పల్లెటూరి సేద్యగాడనని తనను చెప్పుకొన్నాడు.

కడప జిల్లాలోని కటారు పల్లెలో వేమన జన్మించాడని కొందరంటారు. ఈ గ్రామము రాతిగుండ్లకొండక్రింద వున్నది. అచ్చట ఒక చిన్న వాగు కొండలో నుండి బయలుదేరి వూరును ఆనుకొని ప్రవహిస్తున్నది. చెరువు క్రింద సాగుచేయబడును. పొలాలలో రైతులు సజ్జ, జొన్న, రాగి వైగరా పైరులు వేస్తారు.

మట్టిగోడల ఇండ్లు, పూరికప్పులను కలిగివుందురు. దగ్గరనే పశువుల శాలలు గలవు. చిన్నప్పుడు వేమనబ్రాహ్మడో, భట్రాజో చెప్పిన ప్రాథమికవిద్యను అభ్యసించినాడు. వేమనపండ్రెండేండ్ల వయస్సులో వున్నప్పుడు ఒకనాడు ఒక వృద్ధయోగి నీళ్ళు తెచ్చియివ్వమని అడిగెనట. ఒక కమండలంతో వేమన నీరు తెచ్చి యోగికి యివ్వగా యోగి వేమనను "నీవు గొప్ప కవి కాగలవు" అని ఆశీర్వదించెనని ప్రతీతి.

వేమన లింగాయతులైన శివభక్తుల ప్రభావమునకు లొంగిపోయాడు. ఎందుకన శైవమతము కుల కట్టుబాట్లను, విగ్రహారాధనను నిర్మూలించ ప్రయత్నించినది. అది బ్రాహ్మణ మతమును తిరస్కరించినది. శైవ మతస్థులు శాకాహారులు. వేమన దేవుణ్ణి శివుడనేవాడు.

ప్రజా కవులలో వేమన ఒక్కడే మహాకవి. వేమన నిక్కమైన ప్రజా కవి. ఆయన పండితులకొఱకు వ్రాయలేదు. పల్లెయందలి చదువు లేని ఆకృతిమ పామరజనం కొఱకే వ్రాసినాడు.

ఒక మానవుని స్థాయిని నిర్ణయించేది ఆ వ్యక్తి యొక్క యోగ్యతే గాని జన్మించిన కులము కాదని వేమన చెప్పును. వర్ణ వ్యవస్థ కలిగించిన దురితములను, కులాచార మూఢ విశ్వాసములను పారబట్టునపుడు చూపే తైక్ష్ణ్యము (విమర్శ) ఆయన మరి యే సందర్భమునకూడ ప్రదర్శింపడు.

మానవులను వేరుచేసే పక్షమున కల్లరి, వేషధారి, క్రూరుడు, వ్యభిచారి మొదలగువారే నిజమైన అంటరాని మాలలు గాని పుట్టుకతో మాలగా పుట్టినవాడు గుణమున మాలగాడనియు, కులము కంటే గుణమే ఎక్కువని వేమన వాదము. వట్టి కుల విభజనమేకాదు, వేమన ఒళ్ళు మండించింది. అగ్రజాతులవారు తమ మేలుకుగా, తామే కల్పించుకొని, సాంఘిక వ్యత్యాసములు గూడ ఆయనకు ఉడుకెత్తించినవి.

ఆడువారి స్వభావసిద్ధమైన సంకుచిత భావదాస్యము, పురాతన సంప్రదాయాలు, ఆచారములు వగైరాలపట్ల వారు (ఆడవాళ్ళు) ప్రదర్శించు అందానుమతి వేమనకు దిగ్భ్రమ గొలిపి ఆయన కార్యోత్సాహమును కొంత

మందగింపజేసి యుండును. అందువలన వేమన స్త్రీ అబలయనియు, ఆమె పలుకుబడి అంతా సాధారణముగా చెడువైపుకే మొగ్గుననియు నమ్మినట్లున్నది. అయినప్పటికీ వేమన గొప్ప సంఘ సంస్కర్త. ఆనాటి సాంఘిక, మత జీవితములందలి బూటకములను, చచ్చుదనమును బాగా గుర్తించి మూఢ సాంప్రదాయిక దాస్యమునుండి జనులను విముక్తిచేసి సత్య, ధర్మ, శౌచముల పరమోత్కృష్ట గౌరవమును గుర్తింపజేసి దేవునిపట్ల తమ ధర్మమును, మానవుని పట్ల తమ కర్తవ్యమును నెరవేర్చుటకు అనురక్తిని కలిగించవలయుననియే తన శక్తినంతా వినియోగించ సంకల్పించు కొనినాడు.

ఉపవాసములు, తీర్థయాత్రలు, కఠోర వ్రతాలు, బలులు, అర్పణములు, ఒక వ్యక్తి గుణ నిర్ణయమును చేయజాలవు. దైవ సాన్నిధ్యమున అతని స్థానమును అవి నిర్ణయించలేవు. ఈ సందర్భంలో ఆయన ఇలా అన్నాడు–

నీళ్ళ మునుగనేల; నిధుల మెట్టగనేల?
మొనసి వేల్పులకును మొక్కనేల?
కపట కల్మషములు కడుపులో నుండగా॥
అడవి దిరుగలేదు యాకసమున లేదు
అవని తీర్థయాత్రలందు లేదు
ఒడలు శుద్ధిజేసి యెడయుని జూడరా॥వి॥

ఇక విగ్రహారాధన మనిన తనకున్న తిరస్కారమునంతా వేమన వెడలగ్రక్కును. ఇది సత్యస్వరూపమైన ఆరాధన విధానమునకు కేవలం భిన్నము. అట్టి ఆరాధకులను తెలివిమాలిన వారనియు, పిచ్చివారనియు వేమన కోదెగము (ఎగతాళి) పట్టించాడు. ఈ దిగువ పద్యమును చూడుడు–

రాతి ప్రపతిమ దెచ్చి రాజసంబున నుంచి
పూజసేయు నరుడు బుద్ధిమాలి
భావమందు పరము భావింప నేరదో ॥వి॥

వేమన సన్యాసమును గర్హించి గృహస్థాశ్రమమును పొగడెను. మొదట సన్యాస యోగమును వేదకాలంనాటివారు ఎరుగరు. ఈ సందర్భంలో వేమన యిలా

అన్నాడు–

ఒడలు జడలజేసి యోగులమనువారు
మనసు కల్మషంబు మాన్పలేరు
పుట్టమీద గొట్టంబుచచుగా?నాభుజగ॥వి॥

సన్యాసము భక్తుల అవగుణములను అణచుటకు మారుగా, పెంచుచున్నది. దీని ఫలితముగా కపటకంచుకము క్రింద తన అవగుణములను దాచుకొని మెలగుటచే యిట్టి యోగులు భయంకరులై దారుణ అనర్థహేతువు లగుచున్నారు. ఈ సన్యాసుల జీవితాలు కపట నాటకములు, మృషాధిక్య ప్రకటనములే అనియు, వాటికి ఇహమందును, పరమందును ఫలితము దక్కదని వేమన ఎలుగెత్తిచాటినాడు.

వేమన చిల్లర మల్లర దేవతలను గర్హించి పరమపురుషుడైన సర్వేశ్వరుని నమ్మినాడు. ఆ సర్వేశ్వరుని యిలా వర్ణించాడు–

నకలాకారు డనంతుడు
సకలాత్మల యందు
సర్వసాక్షియు దానై
సకలమున నిర్వికారుల
డకలంక స్థితియె బ్రహ్మ మనబడు వేమా॥

వేమన దైవము కంటే కర్మ (పని) గొప్పదని చెప్పాడు.

వ్రాత వెంటగాని వరమీడు దైవంబు
చేత కొలదిగాని వ్రాతకాదు
వ్రాత కజుడు కర్త, చేతకు తా కర్త. ॥వి॥

కుత్సితమైన మానసమే సర్వ శ్లేషములకు జన్మస్థానము. ఇదే మానవుల సమస్త శాంతిని హరించి వారు రూపొందని ఊహా ఛాయలచే అనుచిత– అక్రమ వాంఛలనే వారిని నిహతులను జేసి తుదకు నాశనము నొందుచున్నవి.

మన హృదయ మాలిన్యమును కడిగివేసుకొనిన గాని మనలను దాసులనుగా జేసుకొని యున్న దుష్టరాగ ద్వేషాలను జయించినగాని మానవజాతి మనగలదనే ఆశలేదు.

పాపమును (చెడ్డపనిని), అబద్ధమును, జయించుటకు మానవునికి ఒకే ఒక మార్గము గలదు. అది దైవ సాక్షాత్కారమే.

అంటే సర్వమానవ సమత్వభావమును కలిగివుండి దానిని ఆచరణలో పెట్టుట.

మానవుడు వ్యక్తానుభవములో నిమగ్నుడై విశాలమును, పరిపూర్ణము అయిన జీవితస్థాయిని కనుగొనలేకపోతున్నాడు. కాని దైవ జ్ఞానమును (సర్వమానవ సమానత్వ భావమును) పొందినప్పుడు సంకుచితమును, స్వార్థచింతానురక్తము అయిన యీ ఉనికినుండి జీవుడు విముక్తి గాంచుచున్నాడు.

## 29. వెంకటేశ్వరరావు త్రిపురనేని

వేమన వట్టి బోధకుడుగా ఆరంభించి బోధకుడుగానే ముగిసినవాడు కాదు. ఆయన ఆదిలో పేదలకొఱకు ఉద్యమించినవాడు. కలవాళ్ళనుకొట్టి, లేనివాళ్ళకు పెట్టటం ధర్మం, కర్తవ్యం అన్నభావం వేమన్నదే. ఆయన మతభేదం చూడకుండా పేదవాళ్ళందరికీ కొల్లసొమ్ము పెట్టమన్నాడు. ఆయన దృష్టి మత ప్రసక్తిలేని సాంఘిక సమతాదృష్టి.

ఆర్థిక సమత్వం కొఱకు ఆయన లేనివాళ్ళకి వున్నవాళ్ళకీ మధ్యనే పెళ్ళిళ్లు జరగాలనీ, అలా జరిగితేనే మధ్యతరగతితనం ఏర్పడుతుందనీ వివాహ సంస్కరణ చెప్పసాగాడు. కన్యాశుల్కంలేకుండా పెళ్ళిళ్ళు కావాలన్నాడు. పేదయింటి మగపిల్లలకు కలయింటి ఆడపిల్లలను ఓలి (కన్యాశుల్కము) అడగకుండా పెళ్లిళ్ళు చేయాలన్నాడు.

కలవారు కలవారితోనూ, లేనివారు లేనివారితోనూ మనువులందు కోరాదన్నాడు వేమన. ఆయన కలవాళ్ళను దానధర్మాలు చెయ్యమని ఉదారబోధ ఎంతెంతో అందరిలాగ చెప్పడమేగాదు, చెయ్యకపోతే వచ్చే జన్మలో కటిక పేదలైపుట్టి అడుక్కోవలసి వచ్చును, పెట్టేవాళ్ళు లేకుండాపోయి అలమటిస్తారనీ, ఉత్తరజన్మలోని బాధలను చూసి కలవాళ్ళను భయపెట్టాడు. ఈ విధంగా దానధర్మ ప్రబోధం చేసేటప్పుడు కూడ వేమన ప్రత్యేకత వేమనదే. ఇంతేకాదు. ఆయన బోధించే ఆర్థిక మాధ్యమిక వాదం సర్వానికి సొంతశ్రమే మూలం. శ్రమ పడకుండా గడించడం

బ్రతకడం నేరమన్నది ఆయన భావం. "చెమట కారునట్లు శ్రమపెట్టి దేహంబు గడనచేసి, కూడు కుడవలయును. తల్లి దండ్రి సొమ్ము తాడింటకారాదు" అని తెగవేసి చెప్పాడు వేమన. కాయకష్టం పేదగానే గాదు కలిగినప్పుడు కూడా చెయ్యాలి అన్నాడు వేమన. ఉన్నవాడైనా కాయకష్టం మానకూడదన్నాడు. ఆయన ఉండి కష్టపడేవారిని ఎగతాళి చేయటం తప్పన్నాడు. కష్టించి గడించి కోరితే యితరులకు పెట్టేట్లు ఉండాలన్నాడు.

నరుని అవసరాన్ని నీలాభానికి ఉపయోగించుకోవడంలో కలుషితార్జనమని ఖండించాడు. సరిహద్దులు గదుముకోవడం, వెట్టిచాకిరి చేయించుకోవడం, ఆస్తిని కాజేయటం, కలుషితార్జన అన్నాడు వేమన.

కలుషితార్జన కలవారిలోనూ, పేదవారిలోనూ వున్నదన్నాడు వేమన. యాచకత్వము, దొంగతనము, అప్పుచేసి యెగవేయుట, వంటి మోసములే కలుషితార్థములన్నాడు.

గొప్పవార మనుకొనుచూత్రోవలు డొంకలుఅడ్డంగట్టి అడ్డమైన జనుల నంటగట్టి దోచుకొనుట, వల్లకాళ్ళను దున్ని మునువడిచెడి త్రోవలకు ముండ్లు కొట్టి పైరు పెట్టువారు పాపులని ఆయన అభిప్రాయము.

ఉమ్మడి భూములను అపహరించే మోతుబరులను ఆయన తెగడినాడు. అప్పు తీసికొన్నవారు తాకట్టుపెట్టిన వస్తువులను, నగలను వాడుకోవటాన్ని వేమన్న ఖండించాడు. కులాలమీద దాడిచేసిన వారలలో వేమన అగ్రగణ్యుడు.

మనం వేమనను సంఘ సంస్కర్తగా గ్రహించామేగాని ఆర్థిక సంస్కర్తగా గ్రహించలేదు. అచల సంప్రదాయం కుల నిర్మూలనాన్నిచెప్పుతున్నదేకాని వేమనగాని ఆర్థిక పునర్యవస్థీకరణ వాదాన్ని చెప్పడం లేదు. మాలపల్లి నవలకర్త ఉన్నవ లక్ష్మీనారాయణగారు కూడా వేమనను కుల విధ్వంసకుణ్ణిగానే చిత్రించారుగాని ఆర్థిక ప్రవక్తగా చెప్పలేదు.

వేమన సంఘంలో సమూలమైన ఆర్థిక పునర్వ్యవస్థీకరణను కోరినాడు.

## 30. సర్‌గ్రీర్‌సన్

(ఈయన వివిధ సాహిత్యశాఖలలో బహుముఖ పాండిత్యము, విశేషప్రజ్ఞ గలవాడు.)

సరియైన విధమున వేమన గుణవిశేషములను చిత్రించినచో, ఆయన కవితా సౌభాగ్యము రచనాశక్తివల్లనేగాక, మానవాళిపై ఆయన చల్లిన ప్రేమరసమువల్లను సర్వ ప్రపంచ హృదయమును లోబరచుకోగలదు. ఆయన కోపము, నింద, అవహేళనము, అసూయాప్రేరకములుగావు. పొరబాటు బడుతున్న మానవుల ధోరణివల్ల ఆయనకు కలిగిన ఆవేదనమే. ఈ రూపమున బయలపడింది. మానవుడు ఈ లోపములన్నిటిని వోదార్పు కొనవలెననియే ఆయన స్వచ్ఛకాంక్ష.

మానవుడు సగౌరవముగా ఈ భూమిలో తలఎత్తుకొని తిరిగి స్వతంత్రముగ మనవలయుననియే ఆయన వాంఛ. మానవ స్వాతంత్ర్యము, సమానత్వము, ప్రతిష్ఠను ఆకాంక్షించే ప్రపంచ దార్శనిక మహాకవులలో వేమన సర్వోత్తముడు.

ఇంతటి మహనీయుని జీవిత విశేషములు పురాణగాథల అంకమున నిదురించుచుండుట విచారకరము. చరిత్ర రచయితలు ఒకరు చెప్పినది ఇంకొకరు చెప్పక విషయమును గచ్చపొదచేసి యున్నారు. అయినప్పటికిని వేమన శాశ్వత చారిత్రక మహాపురుషుడు.

## 31. సి.ఎన్. అణ్ణాదురై

(ఈయన ఇ.వి. రామస్వామి నాయకర్ శిష్యుడైవుండి ద్రవిడ కళగంనుండి (డి.ఎం) చీలివచ్చి ద్రవిడ మున్నేట్రకళగం (డి.ఎం.కె) స్థాపించిన మహా ప్రజానాయకుడు; మాజీ తమిళనాడు ముఖ్యమంత్రి, గొప్ప వక్త, రచయిత).

ఆంధ్రదేశంలో ఆర్షసంప్రదాయాలకు తలఒగ్గ నిరాకరించి భావస్వాతంత్ర్యం కోసం, పాటుపడినవారిలో వేమన ముఖ్యుడు. నిజం చెప్పాలంటే వేమన పద్యాల ధోరణి నైతికపు కోటగోడలను కూల్చే ఆటంబాంబులనే చెప్పాలి. అవి సలసలకాగే నీళ్లు, ఏవో కొన్ని ప్రయోజనాల కోసం నిజాన్ని కప్పిపుచ్చే ధోరణిని వేమన

సహించలేకపోయాడు. చదివిన వెంటనే పామరులుగూడ అర్థంచేసుకోగలిగే సులభశైలి ఆయనది. కాబట్టే ఆయన రచన పండితుల అవసరానికి పూజా మందిరాలలో పదిలపరచడానికి పనికిరాకుండా, జనానికి మేలు గూర్చే ప్రబంధమైనది.

వేమన వైదిక సంప్రదాయాలను సమర్థించి వుంటే, ఆయనలాంటి గొప్ప మేధావి లేడని సాంప్రదాయక వాదులు స్తుతించి వుండేవారు. కాని సాంప్రదాయిక వాదులను ఆయన ఝాడించి వదలిపెట్టడంతో, ఆయనను గురించి కల్లనిజాలు వెలుగులోనికి అంతగారాలేదు.

## 32. హెన్రీ బవర్సు

(ఈయన 1874 ప్రాంతంలో తెనుగుదేశంలో స్కూల్సు ఇన్‌స్పెక్టరుగా పనిచేశాడు. తెలుగు పాఠ్యగ్రంథములను పరిశీలించి ఒక నివేదికను తయారుచేసి దానిలో వేమనను గురించి యిలా వ్రాశాడు)

వేమన హిందూ ఆచారములను, మతసిద్ధాంతములను గర్హిస్తూ కొన్ని పద్యాలు వ్రాశాడు. అట్టి పద్యములను బ్రాహ్మణ ఉపాధ్యాయులు బోధించలేక పోవుచున్నారు. హిందూ విద్యార్థులను క్రైస్తవమతంలోనికి కలుపు యత్నంలోనే ప్రభుత్వము వేమన పద్యములను పాఠ్యగ్రంథములలో ప్రవేశపెట్టిందనే అభిప్రాయము అంతటా వ్యాపించియున్నది. వేమనపద్యములపట్ల బ్రాహ్మణులకుగల ద్వేషం ప్రతివాడు అర్థంచేసుక్గోలడు. అందులో అధమము నూటికి ఎనభైమంది ఉపాధ్యాయులు బ్రాహ్మణులే. అందువల్లనే వేమన పద్యములను పాఠ్యగ్రంథములనుండి తీసివేయాలని నేను సలహా యిచ్చాను.

కవిగా వేమన ఏమంత పెద్దవాడుగాదు. ఆయన శైలి ఎక్కువగా గ్రామ్యమే. ఆయన రచనలలో ఛందోలోపములు ఎక్కువ. కాని విషయము మాత్రము ఒక్కొక్కప్పుడు గురుత్వమును దాల్చి, ఆకృత్రిమ కటుభాష జనులతో నిండియుండును.

ఒక ఐరోపియనుని దృష్టిలో వేమన తన కాలముకంటె ఎంతో ముందుకు

నడిచిన ఉదారుడుగా కాన్పించును. ఆయన చూపు, ఆయన విశ్వాసానురక్తి, సత్యశీలములు, ఆయనను పురోగామిగాచేయుచున్నవి. ఇట్టిశక్తివంతుడైన ఉత్సాహి, సంఘసంస్కర్త రచన, పూర్వాచార పరాయణులైన హిందువులకు నచ్చలేదు.

వేమన ఒక పద్యములో–

"పేరు ధర్మరాజు పెనువే పవిత్తయా"

అని అన్నాడని పూర్వాచారపరాయణులు వేమనను పలురకాలుగా నిందించి వెలివేసిరి. కాని తిక్కనసోమయాజి ధర్మరాజును గురించి "అంత్మదదుష్టుడు" "మెత్తటి పులిధర్మనూతి" "కపట ధర్మ కంచుకము దాల్చిన వాడు" అని ఇతరులచేత వర్ణింపజేసినాడు. కాని బ్రాహ్మణ పండితులు పెదవిమెదపలేదు. భారతములో అనుశాసనిక పర్వములో 2వ అధ్యాయములో 42వ పద్యమును చూడండి–

ఆ॥ "పలు సదువులు సదివి పండితమానియై
తనదు విద్య నొరుల ఘనయశంబు
దూలపుచ్చునట్టి దుష్టాత్మకుని బ్రహ్మ
హత్యనొందు సందియములేదు."

ఇట్లు తిక్కన సోమయాజి వ్రాయగా పూర్వాచార పరాయణులు ఒక్క వేమన మాటలకే ఉలికిపడి ఆయననే ఏల వెలివేయ వలెనో తెలియకున్నది. అచ్చతెలుగు భాషలో అందరికి బట్టబయలుచేసిన దానికి కాబోలు యీ శిక్ష! వేమన వ్రాసిన అనేక పద్యములలో ఆక్షేపణలేనివి కొన్నిగలవు. అవేచాలును వేమన కవితాగుణమును ప్రకటించుటకు, వాటికి బంతికి ఒక రూపాయి యిచ్చికొనినచాలును.

## 33. మేజర్ ఆర్.ఎమ్. మ్యాక్డొనాల్డు

(ఈయన మద్రాసులో ఒక సైనిక ఉద్యోగి. తరువాత విద్యాశాఖ ఉద్యోగిగా నియమింపబడినాడు. ఈయన తెలుగు బాగా నేర్చుకొని వీరేశలింగంగారి రాజశేఖర చరిత్రను ఇంగ్లీషులోనికి అనువదించాడు. అది లండన్‌లో ముద్రింపబడెను. ఈయన 1866లో వేమనను గురించి ఒక వ్యాసము వ్రాశాడు.)

వేమన ఇంగ్లీషు మహాకవులు– బేకన్, షేక్సుపియరులకు సమకాలికుడు

కావచ్చును. నిజానికి వేమన సిద్ధాంతము అద్వైతము. (జగదీశ్వర వాదము) ప్రకృతి లేక జగత్తునే దేవుడనుచున్నాడు వేమన. తత్త్వమనగా పరమాత్మనుగూర్చిన సత్యజ్ఞానము. దీనినే వేమన అన్వేషించునది. వేమన స్నేహము, వివాహము, కృతజ్ఞత, చౌర్యము, ధర్మము, ధనము, దారిద్ర్యము, దుఃఖము, వ్యభిచారము, పరోక్షనింద మొదలగు అనేకాంశములకు సంబంధించిన పద్యములు వ్రాశాడు.

వేమన పద్యములలో సొగసైన నడక గలదు. భాషలో తియ్యదనము గలదు. అది ఏ వ్రాతగానికీ అబ్బలేదు. వేమన భాష తెలుగు నేర్చుకొనే వారికి చాల సహాయకారి కాగలదు. వేమన కవికంటే దార్శనికుడుగా ఎక్కువ రాణించాడు.

వేమన పద్యములు ఆటవెలదులు, తేటగీతములు, కందములు వేమన తత్సమ శబ్దములకు మారు, తద్భవ శబ్దములనే ఎక్కువగా వాడినాడు. గృహమునకు "గురము" అను మాటను వేమన కల్పించినాడు. పశ్చిమాంధ్రకు సంబంధించిన కొన్న మాటలు- దుడ్డు అనే దానిని "కొట్టు" అనే అర్థంలోనూ, "బిత్తల" అనే దానిని దిగంబరమైన అనే అర్థంలో వాడినాడు.

వేమన పద్యముల మొదటి ముద్రణమును సి.పి.బ్రౌను (ఐ.సి.యస్) 1829లో వెలువరించినాడు. దానిలో మతమును గురించి 200 పద్యములు, నీతిని గురించి 214 పద్యములు, అవహేళనము గురించి 279 పద్యములు మొత్తం 693 పద్యములు గలవు. 1839లో మరల బ్రౌను వేమన పద్యముల రెండవ కూర్పును బయటకు తెచ్చినాడు. దీనిలో మతమును గురించి 416 పద్యములు, నీతిని గురించి 468 పద్యములు, అవహేళనము గురించి 279 పద్యములు మొత్తం 1163 పద్యములు గలవుర. తరువాత వేమన పద్యముల చిన్న చిన్న సంపుటములు చాల వెలువడినవి.

## వేడుకోలు

ఈ పుస్తకం కూర్పులో ఇంతకుమునుపే వేమన్నను గుఱించి వెలువడిన యీ క్రింది పుస్తకములు ఎంతో తోడ్పడ్డాయి. సదరు పుస్తకాలు గ్రంథ కర్తలకునూ, యీ పుస్తకాలను నేను కోరినవెంటనే నాకు సమకూర్చిపెట్టిన నా శిష్యులు, మిత్రులు హిందీ- తెలుగు పండితులు ఆచార్య వి. శ్యామసుందరదేవ్ గార్కి ముఱికిలేని నిండు గుండెతో దండములు చెప్పుకొంటున్నాను.

1. వేమన పద్యములు- నేదునూరి గంగాధరం
2. వేమన సూక్తిరత్నాకరము- నాదెళ్ళ పురుషోత్తమశాస్త్రులు
3. లోకకవి వేమనయోగి- కళాప్రపూర్ణ మరుపూవు కోదండరామిరెడ్డి
4. వేమన- రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
5. వేమన- నార్ల వెంకటేశ్వరరావు
6. విశ్వదాభిరామ వినురవేమ- త్రిపురనేని వెంకటేశ్వరరావు
7. వేమన పద్యాలు- బంగోరె (బండి గోపాలరెడ్డి)
8. వేమన్న వేదం- ఆరుద్ర
9. వేమన పద్య కఠిన పదార్థ మంజరి- నేదునూరి గంగాధరం
10. వేమన సాహిత్యం, ఓ పరిశీలన- క్రాంతికిరణ్
11. వేమన పద్య రత్నములు- గొల్లపూడి వీరాస్వామి సన్స్, రాజమండ్రి
12. వేమన్న వేదం- ఆరుద్ర
13. వేమన పద్యములు- వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్
14. వేమన నీతి పద్య రత్నావళి- గ్రంథ సుధాతలు- నేదునూరి వీర వెంకటాద్రి, వెంకట రామానుజం
15. వేమన చరిత్ర - విమర్శకాగ్రేసర బండారు తమ్మయ్య
16. వేమన శతకము
17. వేమన పద్య రత్నాకరము- ఉభయభాషా ప్రవీణ- బులుసు వెంకట రమణయ్య
18. వేమన జ్ఞానమార్గ పద్యములు- విద్వాన్ డి.పి. మునుస్వామి ఎం.ఎ

# ముందుమాట

మన తెలుగు ప్రాంతంలో మన తెలుగు బాసలో రెండుమూడు తరగతుల వరకు చదువుకున్న పెద్దలు– పిన్నలు కూడ వేమన కవి పేరును తప్పక వినియే వుంటారు. ఇంతేకాదు వారిలో చాలమంది వేమన పద్యాలలో ఒకటి– రెండు పద్యాలను కంఠస్థ పరచికూడ వుంటారు.

వేమన పేరు సామాన్య ప్రజలలో ఎక్కువగా వ్యాప్తి చెందటానికి ముఖ్యకారణం– ఆయన తన కాలంలో ఆనాటి సంఘంలో వ్యాపించివున్న మూఢాచారాలను, మూఢ నమ్మకాలను, కుల, మత మౌఢ్యాన్ని, విగ్రహారాధన తంతును, సాంఘిక అసమానతలను, మత గురువుల దురహంకారాన్ని, సన్యాసుల చెడు నడతలను, తేటతెలుగు మాటలలో ఘాటుగా, సూటిగా పరిహాసపూర్ణ శైలిలో విమర్శించి ప్రజలలో చైతన్యాన్ని కలిగించాడు.

వేమన పదాలను పొదుపుగానూ, నిజాన్ని నిర్మొహమాటంగానూ చెప్పిన ప్రజా మహాకవి. ఆయన సాధకుడు, బోధకుడు. ఆయన వివేకాన్ని నమ్మినంతగా విశ్వాసాన్ని నమ్మలేదు. ఆయన భక్తుడుకాదు. ఆయన తనలోనే భగవంతుణ్ణి చూచుకొన్నాడు. ఆయన తనకుతానే గురువు; తనకు తానే శిష్యుడు. ఆయన స్వయం కృషితోనే సత్యాన్ని స్వాయత్తం చేసికొన్న సాధకుడు. ఆయన హేతువాది, మానవతావాది, ఆస్తికవాదికూడా. వేమన సర్వస్వాతంత్ర్యం కలవాడు. భావంలోనూ, భాషలోనూ, ఆ స్వాతంత్ర్యం ప్రతిఫలించింది ఆయన తిట్టినట్లు చెప్పినా, కొట్టినట్లు చెప్పినా, వినేవాడికి ఆయన స్వాతంత్ర్యం మీద సానుభూతిని కలిగింపచేస్తుంది. ఉన్నది ఉన్నట్లు చెప్పి, విన్నవానికి ఉడుకెక్కించినా, కన్నది కన్నట్లు చెప్పెనని నిజాయితీ ఆయన మాటకు తలూపివేస్తుంది. బింకానికిపోని ఆయన భాష, బిగువుతో కూడిన సూటిదనాన్ని ప్రదర్శిస్తుంది.

బూతులు పలికినా, నీతులు చెప్పినా, నిర్లిప్తతతో నిండిన ఆయన నిర్మొగమాటం, మాటకొక నిండుతనాన్ని సంతరింపచేస్తుంది. ఆగ్రహంతో చెప్పినా, నిగ్రహంతో చెప్పినా, ఆయన మాటలో అంతర్వాహినిగా సాగివచ్చే హాస్యధోరణి నొచ్చుకున్నవానిని కూడ, నవ్వించివేస్తుంది. కవ్విస్తూ నవ్వించే శక్తి వేమనకే చిక్కింది.

వేమన దృష్టిలో మనిషే దేవుడు ఆయన తత్త్వం మానవతావాదం, మనుష్యుల మధ్య, తాత్త్వికంగా భేదాలు లేవంటాడు వేమన. కుల, వర్గ భేదాలు మానవ కల్పితాలంటాడు ఆయన. ఆయన మనిషిలో మానవత్వాన్ని చంపే మతాన్ని గర్హిస్తాడు. ఆయన ఉన్నత మానవతా గుణాలను ప్రబోధిస్తాడు. వేమన దృష్టిలో ప్రబోధ మెంత ప్రధానమో, సంస్కరణ అంత అవసరము.

మూఢ విశ్వాసాలను, అర్థరహిత ఆచారాలను, స్వార్థ పోషకాలైన వర్గ భేదాలను, వేమన గర్హిస్తాడు. వేమన సమాజ సముద్ధరణాన్ని కాంక్షించిన కర్మయోగి. మన ప్రాచీన కవులు "పవిత్రమని" చెప్పే ప్రతి దానినీ ఎదుర్కొని, దాని నిజాన్ని బట్టబయలు చేయటమే వేమన విధానము; కాని ఆయన నిష్టపరుడు.

వేమన గొప్ప విమర్శకుడు, సంఘ సంస్కర్త. ప్రజా మహాకవి, లోకకవి. వాడుక భాషావేత్త, ప్రకృతి ప్రియుడు, గొప్ప వేదాంతి. గొప్ప తిరుగుబాటు కవి. ఉపదేశకుడు. ప్రవక్త, నవయుగ పురోగామి, శివభక్తుడు అయినప్పటికీ బాహ్యాడంబరములను, లింగధారణను, ఉపవాసాదులను, తీర్థయాత్రలను, సన్యాసాన్ని ఖండించి పరిహసించాడు.

వేమన పద్యాలలో స్పృహ కొట్టవచ్చినట్లు కన్పించును. వేమన భాషాశైలి శక్తివంతమైనది. వేమన మాట్లాడుకొన్నది మాట్లాడుకొన్నట్లు ముక్తసరిగా, సరళమైన పదములతో ధారాళముగ కవిత్వం చెప్పాడు. "తమిళ్‌కురల్" లోని భక్తి పారవశ్యమును, సమతాభావములను, వేమన తన పద్యాలలో ప్రవహింపజేసి సాహిత్యాన్ని విప్లవసీమ పరిసరాలకు కొని పోయాడు.

వేమన ఖచ్చితమైన ప్రజా మహాకవి. కవిత్వము, ఉపదేశము యొక్క గొప్పతనంవల్లనే వేమనకు గొప్ప పేరు వచ్చింది. వేమన అందరికీ సులభంగా అర్థమయ్యేటట్లు చిన్న చిన్న మాటలతో నీతులు చెప్పాడు. ఆయన భాష పాతపడకుండా ఎల్లప్పుడూ శక్తివంతంగానే వుంటుంది.

వేమన గొప్పలు చెప్పుకొనుటకు యిష్టపడడు. ఒక చదువురాని సేద్యగాని వలెనే మాట్లాడును. ఆయన మాటలు ఉల్లాసాన్ని కలిగించేవిగా వుంటాయి. పోలికలను, దృష్టాంతాలను, ఉపయోగించినా, అవి సహజముగ, సరళముగ ఉండును. తెలుగు సాహిత్యంలోనికి ఐరోపీయులను వేమన రచనలు

ఆకర్షించినంతగా ఏ ఇతర గ్రంథకర్తల వ్రాతలూ ఆకర్షించి వుండలేదనుట అతిశయోక్తి కాజాలదు.

వేమన పద్యాలు దక్షిణాది భాషలన్నింటిలోనికి అనువదింపబడ్డాయి. సూత్రప్రాయములైన వేమన వచనాలు ఎన్నో సామాన్య సామెతలుగా వ్యాపించిపోయాయి. వేమన్న తెలుగు ప్రజల ప్రియతమ కవులలో శ్రేష్ఠుడు. వేమన పద్యాలు చిన్న చిన్న మాటలతో వుండును. వాటిలోని మరుగులేని నీతులు ప్రజలను ఆకర్షించాయి. వాటిని ఆలకించేవారు ఎక్కువైపోయారు. వేమన తన అనుయాయువు లెవరైనా, తప్పుచేసినపుడు తేళ్ళతో కుట్టించినట్లూ, వారి వీపులమీద కొరడాదెబ్బలు కొట్టినట్లూ మందలించేవాడు.

వేమన తెలుగుకవులలో సర్వశ్రేష్ఠుడు. ఆయన నిర్మాణాత్మకశక్తి గలవాడు. ఫలప్రదమైన భావనాశక్తిగలవాడు. సహజ ప్రజ్ఞ గలవాడు. ఆయన వ్యక్తిత్వం నిరాటంకంగా సంఘాన్ని కంపింపజేసి అజేయముగ వెలిగిపోయింది.

ఇక యీ పొత్తమును నేనెందుకు రాశానో మనవి చేసుకోవాలి. నేడు మన దేశంలోని 60 కోట్లు పైచిలుక జనాభాలో నూటికి 70 పైచిలుకు పామర జనులు కుత్సిత కుల మత కలహాలతోనూ, హత్యలతోనూ, రాజకీయనాయకుల, మత ప్రచారకుల, ఉద్యోగస్తుల, వ్యాపారస్తుల, భూస్వాముల, కపట దైవభక్తుల, బాబాల, యోగుల ఆర్థిక నిలువుదోపిడీతోనూ, బరితెగించిన బందిపోటుదారుల దారుణ దాడులతోనూ, హద్దూపద్దూ లేని ఆకతాయుల ఆగని ఆగడాలతోనూ, ఇనుపగజ్జెలతల్లి తాండవంతోనూ ఉక్కిరి బిక్కిరై దారీ తెన్నూ కానక తల్లడిల్లిపోతున్నారు. ఇట్టి తాఱుమాఱు పరిస్థితిలో వేమన వినిర్మల బోధలు పీడిత ప్రజానీకానికి కాస్త ఊరటను, ఊపును కలిగించగలవనే ఆశతోనూ, ఆశయముతోనూ యీ పొత్తమును కూర్చితిని.

ఇక యీ పొత్తమును కూర్చటానికి గల రెండవ కారణం వినిపించాలి. వేమన సంఘ దురాచారాలను, మూఢాచారాలను, గుడ్డినమ్మకాలను, విగ్రహారాధనను, మంత్ర తంత్రాలను, ఉపవాసాలను, వ్రతాలను, జపతపాలను, వైదికకర్మకాండలను, తీర్థయాత్రలను, శకునాలను, లగ్నాలను, యాగాలను, కులవ్యవస్థను, మతములను, వైష్ణవ శైవసాంప్రదాయికుల కుటిల నడతలను, దొంగసన్యాసుల కపటి వేషాలను,

వేదాలను, బ్రాహ్మణ కుల అహంకారమును, వర్గతత్త్వాన్ని చాలా కటువుగా విమర్శించాడు.

కాని ఇటీవలి కాలంలో వేమన పద్యాలను కొంతమంది విద్యావేత్తలనబడే వారు పుస్తకాల రూపంలో వెలుగులోనికి తెచ్చారు. కాని వాటిలో వేమన విమర్శించిన విషయాలకు సంబంధించిన పద్యాలు చాలా తక్కువగానూ, వేమన చెప్పినవని భావించబడే నీతిపద్యాలు చాల ఎక్కువగానూ కన్పిస్తాయి. అందుకని నేను వేమన విమర్శించిన విషయాలకు సంబంధించిన పద్యాలనే ఎక్కువగా చేర్చి, వాటికి నా లావు (శక్తి) కొలది కఠినశబ్దార్థాలను, భావార్థాలను రాశాను. వాటిలో కొన్ని పొరపాటులుండవచ్చును. కనుక వాటిని జాలిగుండె గల చదువరులు నాకు తెలిపిన రెండవ అచ్చులో వాటిని మార్చుకోగలనని మనవి చేస్తున్నాను.

**1986** **– యలమంచిలి వెంకటప్పయ్య**

# వేమన్న కొన్ని పద్యాల శబ్దార్థములు, భావార్థములు

# వేమన్న ఏమన్నాడు?

1. ఏది కులము నీకు? ఏది మతంబురా?
పాదుకొనుము మదిని పక్వమెఱిగి;
యాదరించుదాని, యంతము దెలియుము ॥వి॥

మదిని = మనస్సులో, పాదుకొనుము= గట్టిగా ఆలోచించుకో

నీవు నీ మనస్సులో గట్టిగా ఆలోచించుకొనిన యెడల యీ కులాలనూ, యీ మతాలనూ, కొంతమంది పరాన్నభుక్కులైన స్వార్థపరులు కల్పించి పామర జనాన్ని బౌద్ధికంగానూ, ఆర్థికంగానూ దోచివేస్తూ వారిని అనేక శారీరక యిబ్బందులకు గురిచేస్తున్నారని తెలిసికొనగలవు. సమాజానికి కీడు కలిగించే యీ బూటకపు కులాచారాలను, మతాచారాలను నీవు పాటించకుము. ఎందుకన నిజానికి నీవుకులము, మతములేని పరబ్రహ్మయొక్క అంశమును కలిగినవాడవు. కనుక నీకు కులములేదు, మతములేదు. ఈ భావమును నీవు నీ మనస్సులో గట్టిగా నిల్పుకొన్న యెడల నీవు పరబ్రహ్మను చేరగలవు.

2. కడగి జగమునందు కడసోమయాజిరా
పోతురాజుతోడ పుట్టినాడు;
మేకపోతులకును మిత్తియై తలపంగ ॥వి॥

కడు= మిక్కిలి, గొప్ప,మిత్తి= మృత్యువు, చావు, తలపంగ= ఆలోచించపగా, కడుగుల= పూనుట= యత్నించుట.

పూర్వకాలంలో ఋషులు, మునులు అనబడేవారు సోమరసం (కల్లు) త్రాగి యజ్ఞాలు చేసేవారు. ఆ యజ్ఞాలను సోమయాగాలు అనిన్నీ, ఆ యజ్ఞాలను చేసిన వారిని సోమయాజులు అని అనేవారు. ఈ సోమయాజులు సోమరసం సేవిస్తూ మేకపోతులను చంపి, వాటిని కాల్చుకొని తినేవారు.

3. సోమయాజిననుచు సొంపైన శాలువల్

మకర కుండలములు మనసుతీర,
దా ధరించు, మనకు దానేమిలాభించు? ॥వి॥

సొంపైన= అందమైన, మకర కుండలములు = మొసలి ఆకారము గల చెవిపోగులు, మనసుతీర= తనివితీర

సోమయాజిగారు అందమైన, విలువైన శాలువలు, బంగారు మకర కుండలములు ధరించి బడాయిగా తిరుగును. అందువల్ల ఇతరుల కేమి లాభము?

4. సోమయాజిననుచు సొంపుగా వేషంబు
గట్టిమాంస మెల్ల గాల్చి తినును;
ద్విజుడదాననగ, నధికమేమి తనవల్ల?॥వి॥

సొంపుగా = అందముగా, ద్విజుడు= బ్రాహ్మణుడు.

పూర్వం కొందరు బ్రాహ్మణులుండేవారు. యజ్ఞాలలో మేకపోతులను మెడలువిరచి చంపి వాటి మాంసమును కాల్చుకొనితిని తమను బ్రాహ్మణులమని గొప్పగా చెప్పుకొనేవారు. కాని ఇటువంటి స్వార్థపరులవల్ల సమాజానికి ఏమిలాభం వుండేది కాదు.

5. సోమయాజినిబట్టి సొడ్డువేసెనురంభ
మనసు తీర్చునపుడు మమతతోడ,
క్రతువు చేయుఫలము కాదెయీపాట్లకే? ॥వి॥

సొడ్డువేయుట= చివాట్లు పెట్టుట, మనసు తీర్చుట= కోరికను తీర్చుట, క్రతువు= యాగము= యజ్ఞము, మమత= మమకారము

రంభ స్వర్గలోకపు వేశ్య. ఈమె ఇంద్రుని కొలువుకూటములో నాట్యం చేస్తుంది. ఈ భూలోకంలో సోమయాగము చేసినవాడు స్వర్గలోకంలో యీ రంభను భోగించే అవకాశము లభించునట.

రంభ సోమయాజిగారి కోరికను తీర్చి ఆయనను ఎడాపెడా చివాట్లు పెట్టెను. సోమయాజిగారు యాగము చేయుట యీ అవమానం కొఱకే కాబోలు?

6. సోమలతల రసము సోలలకొలదినిద్రావ
రేలమేలటంచు నెన్నుచుంద్రె?

క్రతుఫలంబు కంఠగతమగు గాబోలు॥వి॥

సోమలతల రసము= యాగములో ఉపయోగించబడే పానీయము, లత= తీగె, కంఠగతమగుట= గొంతులోనికి వచ్చుట

సోమయజ్ఞంలో యజ్ఞంచేయువారు, చేయించేవారు అదేపనిగా సోమరసమును త్రాగెదరు. దానివల్ల కలిగే లాభం లేకపోగా అది మాటిమాటికి గొంతులోనికివచ్చి బాధించును. సోమయాగంవల్ల కలిగే లాభం ఇదే కాబోలు?

7. కసవు నేరితినెడు షసరము దినువాని
మాదెగంద్రు గాదె మహిని జనులు;
పంది, కోడిదిన్న ప్రాజ్ఞులందురు సుమీ ॥వి॥

కసవు= గడ్డి, పసరము= పశువు, మహిని= భూలోకంలో, ప్రాజ్ఞులు= బుద్ధిమంతులు

హిందూ సంఘంలో పెద్ద చదువులు చదివిన కొంతమంది పెద్దలు శుభ్రమైన గడ్డిని తినే పశువును చచ్చిన తరువాత తినేవానికి మాదిగవాడు అని పేరు పెట్టి వానిని తమ గ్రామాలకు ఎడంగా వుంచి వాణ్ణి అంటకూడదని కట్టడి యేర్పాటు చేశారు. కాని అందరిపెంటా తినే పందిని, అందరి పడిశము తినే కోడిని తినే ప్రబుద్ధులను బుద్ధిమంతులని ముద్రవేసి సంఘంలో వారిని గౌరవించవచ్చునని సెలవిచ్చారు.

8. వేదములను చదివి వెరవేమిగాంచిరి?
యరిగి తిరిగి వత్తు రందరిండ్ల;
బ్రహ్మమహిమ తెలిసి బ్రతుకుట నిజమయా ॥వి॥

వెరవు= ఉపయోగము= ఉపాయము= సాధనము= ప్రయోజనము

వేదములను చదివితిమని బ్రాహ్మణు లనబడేవారు గర్వించిన ప్రయోజన మేమి? వేదాలు చదివిన పండితులు యింటింట బిచ్చమెత్తుకొని బ్రతుక వలసి వస్తోంది. ఇంటింట బిచ్చమెత్తుకోటానికే వేదాలు ఉపయోగపడుచున్న మాట నిజమే. వేదాలు చదివేది వీధుల వెంటబడి యాచన చేయటానికేనా? సభలలో సన్మానాలను పొందటానికేనా? నిజానికి బ్రహ్మమును తెలిసికొన్న వానికే

బ్రాహ్మణత్వము సిద్ధించును. కాని వేదాలను కంఠస్థపరచుట వల్ల కలిగే లాభం ఏమీలేదు.

9. వేద శాస్త్రములను విరివిగాదానేర్చి
వాద మాడువాడు వట్టివాడు;
సారమైన గుఱుతు సాక్షిగా నెంచుము ॥వి॥

విరివిగా= ఎక్కువగా వాదమాడువాడు,= తనమాటే సరియైనదని వితండవాదము చేయువాడు, వట్టివాడు= పనికిమాలినవాడు.

వేదశాస్త్రములు నేర్చుకొనేది వాదవివాదాలు చేయటానికి కాదు. వితండవాది పనికిమాలిన వాడుగా ఎంచబడుతాడు. సర్వసాక్షియైన భగవంతుని తెలిసికొని తరించుటకు ఉపయోగపడే విద్యయే నిజమైన విద్య.

10. వేద విద్య లెల్లవేశ్యలవంటివి;
భ్రమల పెట్టి తేటపడగ నీవు;
గుప్త విద్య యొకటె కుల కాంతవంటిది ॥వి॥

వేశ్య= బోగముది, తేటపడగ నిచ్చుట= మంచిని తెలుసుకోవచ్చును, గుప్త= బయటకు కనిపించనిది= దాచబడిన, కులకాంత= ఇల్లాల=ఒక మగవానితోనే కాపురం చేయు ఆడుది.

వేదవిద్యలు భోగంవారివలె భ్రమలు పెట్టి తత్త్వమును తెలియనీయవు. బ్రహ్మమును తెలుపు విద్యయొక్కటే కులకాంతవలె ఉత్తమమైనది. అదే తరింపజేయును.

వేదములన్నీ ఏవేవో ప్రయోజనంలేని విషయాలను చెప్పి మనసును చీకాకు పరుస్తున్నవి. వేదాలు త్రిగుణాత్మకములు. కాబట్టి నీవు త్రిగుణాతీతుడవు కావాలని అర్జునునకు శ్రీకృష్ణభగవానుడు బోధిస్తాడు గీతలో.

11. వేనవేలుచేరి వెఱ్ఱికుక్కల వలె
అర్థహీనవేద మఱచుచుంద్రు.
కంఠశోషకంటె, కలిగెను ఫలమేమి? ॥వి॥

అర్థహీన= పనికిమాలిన, కంఠశోష= నోరు ఎండుకొని పోవుట= గొంతు

ఎండి పోవుట

వైదిక పండితులు వేలకొలది గుంపుగాచేరి పిచ్చికుక్కలు అరచినట్లు అర్థము తెలియని, అర్థములేని వేదములను చదువుచుందురు. వారికి కంఠశోషయే మిగులును. ఈ బడాయి చదువువల్ల వారికి కలిగే ఫలితం ఏమీలేదు. మహాభారతం వేదాలను వేమనకంటే కూడా ఎక్కువ ఘాటుగానే విమర్శించింది.

12. పేరు సోమయాజి పెను సింహబలుడాయె.
మేకపోతుబట్టి మెడను విరువ;
గాక, క్రతువువలన గలుగునా మోక్షంబు?

పెను= పెద్ద= గొప్ప, సింహబలుడు= సింహములాగ పరాక్రమవంతుడు క్రతువు= యజ్ఞము, సోమయాజి= యజ్ఞంచేయువాడు.

బూటకాచారపరాయణుడు సోమయాజినని పేరు పెట్టుకొని మేకపోతును చంపునంతటి మహా బలవంతుడగును. అతడు చేయు యజ్ఞమువలన ముక్తి కలుగకపోగా, జీవహింసవలన కీడు తప్పక కలుగును. యజ్ఞయాగాదులనే నెపంతో వైదిక పండితులు ఆ రోజులలో మాంసాహారమును లెస్సగా మెక్కుచుండేవారు.

13. వేదశాస్త్రంబుల వివరంబుగా చదివి
వస్తు వెఱుగకుండ వ్యర్థులైరి
వీధివీధులతిరిగి వెఱ్ఱులైపోయిరి. ॥వి॥

వివరంబుగా= వైనముగా= విపులముగా, వస్తువు= పరమార్థము= బ్రహ్మము, వెఱ్ఱులు= పిచ్చివాళ్ళు.

వేదకాలంలోనే ఆర్యులలో తాత్త్విక విచారణ మచ్చుకుకూడా కనిపించదు. వారు దేశదిమ్మరులై తిరుగుతూ వుండేవారు. ఒకచోట నిలకడగా వుండేవాడుకాదు. అప్పట్లో వారికి పరమాత్మ సంగతే తెలియదు. వారు ఇంచుమించుగా మూర్ఖులక్రింద లెక్కే.

15. వేదశాస్త్రములను విననేమిగుడిచిరి?
యరిగి తిరిగి చత్తు రందరట్లు;
బ్రహ్మయెఱుక దెలిసి బ్రతుకుట నిజమయా ॥వి॥

కుడుచుట= అనుభవించుట= తినుట=త్రాగుట, ఎఱుక = జ్ఞానము= తెలివి.

వేదశాస్త్రములను విన్నవారు, చదివినవారు బ్రహ్మజ్ఞానం పొందక అందరి ఇండ్లకు వెళ్ళి యాచించి అందరి వలెనే చత్తురు కాని బ్రహ్మజ్ఞానం గలవాని జీవితమే నిజమైన జీవితము. వేదముల వలన బ్రహ్మజ్ఞానం కలుగజాలదు. కాని వ్యర్ధమైన వాదము శక్తిమాత్రం పెరుగుతుంది.

16. వేదంబు చదివినంతట
వాదంబుల కొఱకె శాస్త్ర వాంఛలుగలుగన్,
భేదంబు గలిగినంతట
లేదందురు దానఫలము లేశము వేమా

వాదము= మాటలతో తగవులాడుట, వాంఛ= కోరిక, భేదము= వేఱుపాటు= ఇతరము, లేశము= మిక్కిలికొద్ది

వేదాలు చదివిన బాపనయ్యలు తామేదో గొప్ప ఘనకార్యమును సాధించామనియు, సమాజంలో తాము అందరికంటే గొప్పవారమనియు భావిస్తారు. ఈ వేఱుపాటు పాడుగుణము వారిలో పెనవేసుకొనిపోయింది. అందువల్ల వారు ఎపడూ మాటల మాయద్వారా కయ్యానికి కాలు దువ్వుతూ వుంటారు. అంతేకాని వారు పరమార్థాన్ని గురించి ఏ మాత్రమూ ఆలోచించరు. అందువల్ల వారికి వేదాలవల్ల ఏమీ లాభంలేకపోగా, వారు మోక్షానికి దూరమైపోతున్నారు.

17. వేదము జదివియు విఱ్ఱవీగుటెగాని,
యధమగతిని బడిరియయ్యలెల్ల;
బ్రహ్మ మహిమతెలిసి బ్రతికిన బ్రతుకయా ॥వి॥

విఱ్ఱవీగుట= గర్వించుట= తమను గొప్పవాళ్ళమని ఎంచుకొనుట, అధమగతి= నీచమైనస్థితి; అయ్యలు= బాపనయ్యలు

మేము బ్రాహ్మణ కులంలో పుట్టాము. మేము వేదాలు చదివినాము. మేము సంఘంలో అందరికంటే గొప్పవాళ్ళము అని బ్రాహ్మణులనబడేవారు విఱ్ఱవీగి బ్రహ్మమహిమను తెలిసికోలేక పరమ మూఢులై అధోగతిపాలై పోయారు; నిజానికి

బ్రహ్మమును తెలిసికొన్న వాని జీవితమే నిజమైన జీవితము.బ్రహ్మమును తెలిసికోలేనివాడు ఏ కులస్థుడైనను వాని బ్రతుకు బ్రతుకేకాదు.

18. వేదశాస్త్ర పురాణముల్ వెదకనేల?
ఆది తుదియును లేనిదే, యచలమగును;
సాదుమదిలోన వెలిగెడు సత్యమౌను,
వాదముల గానరాకుండి వరలు వేమ

అచలము= పరమాత్మ, వరలుట= నడచుకొనుట, సాదు= పరిశుద్ధమైన

వేదాలను, శాస్త్రాలను, పురాణాలను పరమాత్మను పొందటానికి వెదుకనక్కరలేదు. ఆద్యంతములులేక, స్థిరుడైయున్న, సర్వవ్యాప్తుడగు ఆ పరమాత్మను కోరిన చోటున చూడవచ్చును. కాని వాదోపవాదాలకు దిగినయెడల ఆయన కానరాడు. ఇంకా తేలికమాటలతో చెప్పాలంటే మొదలు చివరలేని, అంతటా నిండివున్న,మార్పు ఎరుగని పరమాత్మను నీవు వేదాలను, శాస్త్రాలను, పురాణాలను చదివి పొందలేవు. కాని ఆ పాండిత్య దురభిమానాన్నీ, దూరంగా నెట్టివేసి, విశాలమైన, నిర్మలమైన, స్థిరమైన మనస్సు, హృదయములతో తోటి పీడిత మానవులకు సేవ చేయాలి.

19. గుణము గలవానికుల మెంచగానేల?
గుణము గలిగెనేని కోటిసేయు,
గుణము లేనివానికులమెంత గొప్పైన,
నెంచవలదు, నీచుడెన్న వేమ

గుణము= మంచినడత= మంచి ఆలోచన = మంచిపని, ఎంచుట= లెక్కించుట = గొప్పదిగా ఎంచుట.

మంచి నడతగలవాడు ఎంత తక్కువ కులంలో పుట్టినా, వాని కులాన్ని చూడకూడదు. ఎందుకన మంచినడత గలవారు అందరికీ ఆప్తులుగావుండి తోడ్పడుతారు. ఎవ్వరికీ ఏమీ కీడుచేయరు. అతడు ఎంతో నియమము గలవాడుగావుంటాడు. కానిమంచినడత లేనివాడు ఎంత గొప్ప కులంలో పుట్టినా వానిని నీచునిగానే ఎంచాలి. ఎందుకన కులంకంటే గుణము గొప్పది.

20. కులమువలన గొంత, బలమువలన గొంత
కలిమివలన గొంత గర్వమొదప;
అంకు చదువు చదివి, జంకున జెడుదురు ॥వి॥

కలిమి= ధనము= సంపత్తి, ఒదవుట= కలుగుట, జంకు చదువు= పనికిమాలిన చదువు.

సమాజంలోని కొందరు తమ కులాన్ని చూచుకొని, కొందరు తమ శరీర బలాన్నిచూచుకొని, కొందరు ధనాన్ని చూచుకొని, కొందరు తమ చదువులను చూచుకొని గర్వంతో విర్రవీగుతూ తోటి మానవులను మానవులనుగా చూడక ఎందుకూ పనికిరానివారుగా తయారగుచున్నారు. ఇట్టివారిని నరపశువులన్నా తప్పులేదేమో?

21. కులము హెచ్చు తగ్గు గొడవల పనిలేదు;
సానుజాతమయెమ్య సకల కులము;
హెచ్చు తగ్గుమాట లెట్లెఱుంగవచ్చు?

గొడవ= కలత= జగడము, సానుజాతమగు= సమానముగా పుట్టుట = ఒకేమాదిరిగా పుట్టుట.

కులాలలో ఎక్కువ తక్కువ గొడవలేల? అన్ని కులాలు సమానముగానే పుట్టాయి. కులములన్నీ ఒకేచోట ఒకటిగానే పుట్టాయి. ఇక వాటి వ్యత్యాసములను గుణించుట ఎట్లు సాధ్యమగునూ? అన్ని కులాలవారు తమ తమ తల్లుల గర్భాలనుండే పుట్టుచున్నారు. ఏ కులంవారుకూడా, ఆకాశం నుండి ఊడిపడటంలేదు. పుట్టుటలోనూ, చచ్చుటలోనూ అన్ని కులాలవారూ సమానముగానే వుంటున్నారు. ఇక కులాల ఎక్కువ తక్కువలను గురించిన చిలిపి తగాదాల జోలికి పోకుండా మనం నడచుకొంటే, ప్రశాంతంగా బ్రతుకగలము.

22. చాకలి దానికి బుట్టెను
జేకొనిపో, నారదుండు చెప్పగవలెనా?
తోకా లోకములన్నిట,
నేకముగా రూఢికెక్కె నెఱుగుము వేమా

చేకొనిపో= గ్రహించు, రూఢికెక్కుట= పేరుచెందుట.

నారదమహాముని చాకలి కులంలోపుట్టి గుణముచేత గొప్ప దైవభక్తిగల బ్రాహ్మణుడయ్యెను. అట్లనే స్వర్గలోక వేశ్యఅయిన ఊర్వశికి పుట్టిన వసిష్టుడు, అగస్త్యుడూ, మాదిగ ఆడపడుచుకు పుట్టిన పరాశరుడు. పల్లెపడుచుకు పుట్టిన వేదవ్యాసుడు, చిలుకకు పుట్టిన శుకుడు. స్వర్గలోక వేశ్య అయిన ఘృతాచీ ప్రేరేపణవల్ల కొయ్యపాత్రలో పుట్టిన ద్రోణాచార్యులు బోయకులంలో పుట్టిన వాల్మీకి గుణముచేత బ్రాహ్మణులు కాగలిగారు.కనుక కులముకంటే గుణము గొప్పదని భావించి గుణవంతులు ఏ కులాలకు చెందినా, ఏ మతాలకు చెందినా, వారిని గౌరవించిన యెడల మానవాళి ఇంకా పది కాలాలపాటు పదిలముగా మనగలదు.

23. చిలుక గర్భమందు శ్రీశుకుడుదయించి
మునివరేణ్యులందు ముఖ్యుడయ్యె;
ప్రత్తికాయజిత్రపటములు పుట్టవా?

గర్భము= కడుపు, మునివరేణ్యులు = శ్రేష్టమైన మునులు, వటములు= గుడ్డలు

తక్కువ కులాలవారిలోకూడ గొప్పవారు పుట్టుచుందురు. చిలుక కడుపున శుకమహర్షి పుట్టి మునులలో ముఖ్యుడయ్యెను. ఎట్లనగా ప్రత్తికాయ దూదినుండి రంగు రంగుల విలువలగల గుడ్డలు తయారుచేయబడుట లేదా?

24. జననకాలమందు జందెపు త్రాళ్ళేవి?
తనకులేవు తన జననికినిలేవు;
నడుమ జందెమేయ నగుబాటు కాదొకో?

జననకాలము= పుట్టినవేళ, జనని= తల్లి

జందెమును బ్రహ్మసూత్రము, యజ్ఞోపవీతము, వడుగు, ఉపనయనము, వ్రత బంధము, జనేవూ అని అంటారు. హిందువులలో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు (కోమట్లు) అనబడేవారిలో బాలురకు మాత్రం వారిని బడికిపంపటానికి ముందు జందెము వేయబడేది. గురువు వద్ద వేసిన తరువాత వారు తమ, తమ గురువు యొక్క జీవన పోషణ భిక్షాటన వృత్తిలో చదువు పూర్తి అయ్యేవరకు

చేసుకొనేవారు.

ఈ రోజులలో ఆయా కులాలలో యీ జందెపు సంస్కారము పేరుకు మాత్రం చేయబడుతోంది. ఈ జందెమును కంసాలి, వడ్రంగి,సాలి మొదలగు కులాలవారు కూడ వేసుకొంటున్నారు. ఇటీవల కాలంలో బ్రాహ్మణ పురోహితులతో పోటీపడి కమ్మ, కాపు, మంగలి,చాకలి, పల్లెకార్లు కూడ జందెము వేసుకొనసాగారు. ఇక ఆర్య సమాజమువారు అన్ని కులాలవారికీ చివరకు అంటరాని వారని చెప్పబడే మాల మాదిగలకు కూడ జందెము వేసుకొనే హక్కు గలదని చెప్పి అందరకూ జందెములను వేయింపసాగారు. కొంతమంది మహమ్మదీయులు కూడ జందెములు వేసుకొంటారట.

25. తోక జంతువులను దొడరి గొంతులు గోసి,
మేక జీవములను మెడలు విరచి;
కడనువాటినెల్ల గాల్చుకు తినెదరు

తోక జంతువులు= ఆవు, గుఱ్ఱము, గేదె మొదలగు జంతువులు, తొడరి= యత్నించి, కడమ= తక్కిన= మిగతా.

యజ్ఞ యాగాదుల సందర్భాలలో వైదిక బ్రాహ్మణ పురోహితులు పుణ్యమని ఆవులు, గుఱ్ఱాలు, మేకలు మొదలగు జంతువులను చంపి కాల్చుకొని తినేవారు.

26. జనన మరణములకు సంధ్యత్రాడును లేదు
సంధ్యత్రాడులేదు జనని కెపుడు;
తల్లి శూద్రురాలు తానెట్లు బాపడో?

సంధ్యత్రాడు= జందెము, జనని= తల్లి, జనన మరణములు= పుట్టుట, చచ్చుట, బాపడు= బాపనయ్య= బ్రాహ్మడు.

పుట్టుకతో అందరూ శూద్రులే.ఎందుకన వారి తల్లులు శూద్రురాండ్రే అయినప్పుడు ఎవ్వడూ పుట్టుకతో బాపడు కాజాలడు. జన్మగత బ్రాహ్మణులు తమను గుణగత బ్రాహ్మణులమని చెప్పుకొనుట దుహంకారము మాత్రమే.

27. జాతులందు మిగుల జాతి యే దెక్కువో?
యెఱుకలేక తిరుగ నేమి ఫలమొ?

యెఱుక గలుగువాడె హెచ్చైన కులజుండు ॥వి॥

జాతి= కులము, యెఱుక= జ్ఞానము కులజుడు= కులస్థుడు

కులాలలో ఒకటి యెక్కువ, మఱొయొకటి తక్కువ కాదు. జ్ఞానము లేకుండా కులం పేరు చెప్పుకొని తిరిగిన ప్రయోజనం లేదు. ఎవడు జ్ఞానము కలవాడో,వాడే గొప్ప కులజుడు, కులముకన్న జ్ఞానమే గొప్పది.

28. తనదు తల్లి లంజె తనయాలు మాదిగ
శ్రీపతికి గురువు వసిష్ఠు డరయ;
తపముచేత ద్విజుడు తర్కింప కులమెట్లు?

ఆలు= పెండ్లాము.

వసిష్ఠునితల్లి ఊర్వశి దేవతల వేశ్య. భార్య అరుంధతి మాదిగపడుచు. వసిష్ఠుడు శ్రీరామచంద్రునికి గురువు. అతడు తపముచేత బ్రాహ్మణుడయ్యెను. నేటి బ్రాహ్మలంతా వసిష్టుని సంతతివారేనట.

29. కులము గలుగువారు గోత్రము గలవారు,
విద్యచేత విఱ్ఱవీగువారు,
పసిడిగల్గువాని బానిస కొడుకులు

కులము గలవారు= పెద్ద కులాలవారు, గోత్రము గలవారు = మంచి వంశస్థులు, విఱ్ఱవీగువారు= గర్వపడేవారు, పసిడి= బంగారము, బానిసలు= తొత్తు, బానిస కొడుకులు= తొత్తు కొడుకులు

పెద్ద కులాలవారమని చెప్పుకొనేవారూ, గొప్ప వంశస్థులమని చెప్పుకొనేవారు, గొప్ప విద్వాంసులమని చెప్పుకొని విఱ్రవీగేవారు తమ అలవాట్లను, కోరికలను అదుపులో వుంచుకోలేక ధనవంతునికి తొత్తు కొడుకులై పోయి వాని కాళ్ళవద్ద పడిగాపులు కాస్తూ వుంటున్నారు.

నిజానికి కనకము, కామము యీ రెండూ చాల బలవత్తరమైన శక్తి గలవి. అందువలన సర్వసంగ పరిత్యాగులైన సన్యాసులు కూడ యీ రెంటికీ బానిసలై పోతున్నారు. ఇక సామాన్యుని సంగతి చెప్పనక్కరలేదు.

30. తల్లి గన్న తల్లి, తన తల్లి పినతల్లి

తండ్రిగన్న తల్లి, తాత తల్లి

ఎల్ల శూద్రులైరి, యేటి బ్రాహ్మణుడిక? ॥వి॥

ఎల్ల= ఎల్లరు= అందరు. యేటి= ఏమి

తన, తన తండ్రి, తన తాత, మొదలగువారి తల్లులందరూ శూద్రులైతే, తాను బ్రాహ్మణుడనని బాపనయ్య చెప్పుకొనుట సిగ్గుచేటు కాదా? పచ్చి మోసము కాదా? బ్రహ్మవద్దనుండి చూడగా, బ్రాహ్మణ వంశము శూద్ర వంశముగానే కన్పిస్తోంది. ఇట్లు శూద్రుడైన బ్రాహ్మణుని గొప్ప తనము ఏముంది? దీనినిబట్టి కులభేదమును పాటించకూడదని తెలిసికోవాలి.

31. తండ్రి యజ్ఞముచేసి రంభను రమియించె

తనయు డట్లె రంభ దనర గూడె,

తల్లిని రమియింత్రు దబ్బర విప్రులు ॥వి॥

రమియించుట= రమించుట= జతకట్టుట= కూడుట, దబ్బర= తప్పు , డాళ్ళు= మోసగాళ్ళు, తనయుడు= కొడుకు, విప్రులు= బ్రాహ్మణులు.

బ్రాహ్మణ పురోహితులలో తండ్రి యీ లోకంలో యజ్ఞము చేసి, స్వర్గలోకంలో రంభను సంభోగించాడు. తరువాత ఆయన కొడుకుకూడ యజ్ఞము చేసి తల్లియైన రంభను సంభోగించాడు. నిజంగా బ్రాహ్మణ పురోహితులంత తప్పుడాళ్ళు మరెవ్వరూ లేరు. ఎందుకన వాళ్ళు తల్లులను రమిస్తారు.

32. తాతగన్న తల్లి తండ్రిని గను తల్లి

తన్ను గన్నతల్లి, తల్లి తల్లి,

తల్లి శూద్రురాలు, తానెట్లు బాపడో? ॥వి॥

తాతమ్మ, అమ్మమ్మ, నాయనమ్మ, తన తల్లి అందరూ శూద్రులైనప్పుడు జన్మ గత బ్రాహ్మణుడు గుణగత బ్రాహ్మణుడని చెప్పుకొనుట అనుచితము కాదా?

33. తాత జనించె గన్యకకు దండ్రులు దామునుగుండగోళ కు

ల్మాత వరానుకూలినియె, మక్కువ ద్రౌపది భర్త లేవురే?

నీతులు సెప్ప బాండవుల నీమము లిట్టి వటంచు నెన్నుదు

న్భూతల మందు నెంతయును బూమెలజేసిరి వెట్టి వేమనా

కన్య= పెండ్లికాని యువతి, కుండకులు= మగడు జీవించియుండగనే అంకు మగనివల్ల పుట్టిన పిల్లలు. గోళకులు= విధవకు అంకు మగనివల్ల పుట్టిన పిల్లలు, ఏవురు= అయిదుగురు, భూతలము= భూలోకము, బూమెల= బూమియ= మోసము.

మాదిగ పడుచుకు పుట్టిన పరాశరునికీ, పల్లెకన్యకైన మత్స్యగంధికీ, కౌరవుల పాండవుల తాతయైన వ్యాసమహాముని పుట్టెను. కౌరవుల తల్లి గాంధారి జన్మ నక్షత్రమును బట్టి విధవయగునని జ్యోతిష్యుల ద్వారా తెలిసికొని ఆమెకు ముందుగా ఒక గొట్టెపొట్టేలుతో పెండ్లిచేసి, ఆ పొట్టేలును చంపి, తరువాత ఆమెను ధృతరాష్ట్రున కిచ్చి పెండ్లి చేసిరి. అందువలన గాంధారికీ, ధృతరాష్ట్రునికీ కలిగిన కౌరవులు గోళకులు అని చెప్పబడ్డారు.

ధృతరాష్ట్రుడు, పాండురాజు శూద్రుడైన విదురుడు–ఈ ముగ్గురూ వ్యాసునివల్ల విచిత్రవీర్యుని వితంతువులైన అంబికా, అంబాలికా, దాసీకు పుట్టిరి. అందువలన వీరు గోళకులు. పాండవుల తల్లులైన కుంతీమాద్రులు ఇద్దరూ భర్తయైన పాండురాజు బ్రతికివుండగానే భర్త అనుమతి తీసుకొని యముడు, వాయువు, ఇంద్రుడు, అశ్వనీకుమారులు మొదలగువారివల్ల పాండవులను కనిరి. అందువల్ల పాండవులను “కుండకులు” అని అన్నారు. ద్రౌపదికి అయిదుగురు భర్తలు. ఇటువంటి అవకతవక వంశస్థులైన పాండవుల చరిత్రను కవులు మిక్కిలి పవిత్రమైనదని ప్రజలకు చెప్పి వారిని మోసగించారు.

34. శూద్రులందు బుట్టి శూద్రుల దూషించి
ద్విజులమనెడు పేరు నిజముచేసి;
మనసు నిల్పకున్న మహి, శూద్రుడధముండు ॥వి॥

ద్విజులు= బ్రాహ్మణులు= పక్షులు= అవివేకులు

తనను బ్రాహ్మణుడనని చెప్పుకొనే జన్మ గత బ్రాహ్మణుడు శూద్రురాలైన తన తల్లికి పుట్టికూడ అవివేకియై శూద్రులను దూషించు చున్నాడు. నిజానికి తన మనస్సును ఎవడైతే గట్టిగా వుంచుకోలేడో, వాడే ఎందుకూ పనికిరాని శూద్రుడు.

35. త్రాడు మెడకువేసి తనకు శ్రూద్రత్వంబు

పోయెననెడి దెల్ల, బుద్ధిలేమి;

మది నిలువక త్రాడు మఱి వన్నెదెచ్చునా?

మెడత్రాడు= జందెము, బుద్ధిలేని= తెలివితక్కువ తనము= మూర్ఖత్వము, మది= మనస్సు, వన్నె= అందము= గొప్పతనము

మెడలో జందెము వేసుకొని తనకు శూద్రత్వము పోయి బ్రాహ్మణత్వము వచ్చిందనుట తెలివితక్కువతనము. ఎందుకన మనస్సు నిలకడగా లేనపుడు, జందెము వేసికొన్నంతమాత్రాన ఎవ్వడూ జ్ఞాని కాజాలడు.

జందెము, పిలకజుట్టు, పిడికెడుజుట్టు, విభూతిరేఖలు, పంగనామాలు

బిళ్ళ గోచీలు మొదలగు బాహ్య చిహ్నములను (బయటకు కన్పించే గుర్తులను) ఎన్ని ధరించినా శూద్రత్వం పోయి జ్ఞానోదయం కలుగజాలదు. కాని సదాచారనిష్ఠవలన మాత్రమే జ్ఞానం కలుగగలదు.

36. మాదిగ చెయువులను మనసులో బెట్టుక

మాదిగలను తెగడు మాదిగెపుడు;

మంచిగుణములేక మఱిద్విజు డెట్లగు? ॥వి॥

చెయువులు= చెయిదములు= చేష్టలు= పనులు తెగడుట= నిందించుట= చులకనగా మాట్లాడుట, ద్విజుడు= బాపనయ్య, మాదిగ చెయివులు= చెడ్డపనులు= చండాలపు పనులు

ఎవడైతే చండాలపు పనులు చేస్తూ చండాలుని నిందిస్తాడో, వాడే చండాలుడు. మంచి గుణము కలవాడు ఏ కులానికి చెందినా,వాడే బ్రాహ్మణుడు. జన్మగత బ్రాహ్మణ కులంలో పుట్టి ఎవడైతే మంచి గుణములు కలిగివుండడో వాడు బ్రాహ్మణుడు కాజాలడు. మానవులకు వారి వారి గుణములు, ఆలోచనలు, పనులు వగైరాలను బట్టే బ్రాహ్మణత్వముగాని శూద్రత్వముగాని చండాలత్వముగాని లభించును.

37. మాదిగయనగానే మరి తక్కువందురు

మాదిగ యిలసురల మామగాదె;

మాదిగకును బిడ్డ మన యరుంధతిగదా.

ఇల= భూలోకము సురలు= దేవతలు, ఇలసురలు= బ్రాహ్మణులు

మాదిగలనగానే సవర్ణ హిందువులు వారిని మహా తేలికగా చూస్తారు కాని మహా జ్ఞానియైన మాతంగ మహర్షి బ్రాహ్మణులకు మామగాదా? అంటే వసిష్ఠ మహర్షికి మామగాదా? మాదిగపడుచైన అరుంధతి వసిష్ట మహర్షి మగువకాదా? ఎవనినైనా గుణమును చూచి గౌరవించాలిగాని కులమును జూచి కాదు.

38. మాతంగమునికి మనుమలు
భూతలమున బ్రాహ్మణులుగ బొలువగ నానా
జాతుల బుట్టిరి వీరలె
ఖ్యాతిగ నీ ధరణి జెడియకదరా వేమ ॥వి॥

భూతలమున= భూలోకములో, ఖ్యాతి= వాసి= మంచిపేరు, ధరణి= భూలోకము, పొలుపగ= ఒప్పుగా.

మాతంగముని వసిష్టునికి మామ, వసిష్టుని సంతతివారు మాతంగమునికి మనుమలు, మునిమనుమలు అంటే నేడు తమను బ్రాహ్మణలుగా చెప్పుకొనే జన్మ గత బ్రాహ్మణులంతా మాతంగముని మనుమలు. మాతంగ మహాముని మాదిగ. ఆయన కుమార్తెయే పతివ్రతా శిరోమణియైన అరుంధతీ దేవి.

39. మాదిగ యనవలదు మఱి వసిష్ఠునకును
మాదిగ చెలియ మగువయయ్యె;
మాదిగ గుణమున్న మహిద్విజుడెట్లౌను? ॥వి॥

చెలి= ఆడుది, మగువ= ఇల్లాలు= పెండ్లాము, మాదిగ గుణము= పాడు గుణము= చండాల గుణము= నీచగుణము, ద్విజుడు= బాపనయ్య

నేటి జన్మగత బ్రాహ్మణులందరికీ మూల పురుషుడైన వసిష్ఠ మహర్షి భార్య మాదిగ ఆడపడుచు కనుక మాదిగ గుణములేని జన్మగత మాదిగవారినిని మాదిగ అనకూడదు. మాదిగ గుణములేనివాడే బ్రాహ్మణుడు. మాదిగ గుణమున్న జన్మగత బ్రాహ్మణుని మాదిగ అనాలి. గుణము వల్లనే మానవుని కులము నిర్ణయింపబడాలి. మాదిగ గుణమున్నవాడు ఏ కులానికి చెందినవాడైనా మాదిగవాడే. మంచి గుణము

గలవాడు ఏ కులానికి చెందినా బ్రాహ్మణుడే. మాదిగ కులంలో పుట్టిన అరుంధతి గుణమువల్ల బ్రాహ్మణోత్తముడైన వసిష్టునికి పెండ్లాము కాగలిగినది. గుణము ముఖ్యము గాని కులము కాదని మన అరుంధతీదేవి రుజువు చేసింది.

40. పూజకన్న నెంచ బుద్ధి నిదానంబు;
మాటకన్న నెంచ మనసు దృఢము;
కులముకన్న మిగుల గుణమె ప్రధానంబు ॥వి॥

ఎంచుట= లెక్కించుట= భావించుట, నిదానం= స్థిరమైనది= దృఢమైన= గట్టిది, ప్రధానంబు= ముఖ్యమైనది.

పూజకంటె బుద్ధి గొప్పది. మాటకంటె మనస్సు గొప్పది. కులం కంటె గుణము గొప్పది. గుణము అనగా మంచి నడత. మంచి నడతగల మనిషి కులమును, మతమును పాటించక తన శక్తికొలది అందరకు సేవ చేయును. గుణవంతుడు తన మనస్సు, బుద్ధి, నాలుక మొదలగు ఇంద్రియాలను అదుపులో వుంచుకోగలుగుతాడు.

41. బాపడనగనేమి? భక్తుడనగనేమి?
జోగియనగనేమి? సొంపులేక
ఎన్ని పేరులైన ఇనజుడు పని తీర్చు ॥వి॥

బాపడు= బ్రాహ్మణుడు జోగి= యోగి, ఇనజుడు= యముడు, పని తీర్చుట= పనిపట్టుట= దండించుట.

ఈ కులాలు, మతాలు, మత సంప్రదాయాలు, వర్గభేదాలు మొదలగునవి కొంతమంది స్వార్థపరులైన మేధావులచేత సృష్టింపబడినవే కాని యముడు మాత్రం యీ మానవకల్పిత కులాలను, మతాలను, మత సంప్రదాయాలను, వర్గాలను పాటించక అందర్నీ వారి వారి పనులనుబట్టి తగిన రీతిని దండించును.

42. బాపలన్న దొడ్డ పరుపున జూడరు;
కాని పనులుసేయ హీనులండ్రు;
కులము లెక్కయేమి గుణమే ప్రధానంబు ॥వి॥

దొడ్డ= గొప్ప పరుపు= గౌరవము కానిపనులు= చెడ్డపనులు= చేయకూడని

పనులు, హీనులు= అధములు= పనికిమాలినవారు, ప్రధానము= ముఖ్యము.

వివేకవంతులు కులానికంటె గుణానికే ప్రాధాన్యమిస్తారు. జాతిగతి బ్రాహ్మణుడు చెడ్డపనిచేస్తే వానిని అగౌరవంగానే చూడాలి. జాతిగత చండాలనబడేవాడు మంచిపని చేస్తే వానిని గౌరవంగానే చూడాలి. గుణం ముఖ్యముగాని కులం ముఖ్యంకాదు. గుణం దైవనిర్మితం, కులం మానవ నిర్మితం. కనుక గుణవంతుడు ఏ కులానికి చెందినవాడైనా గౌరవించదగినవాడే.

43. బ్రహ్మ వంశభవులు, ప్రబలులై యుండగా,
నితర జాతుల కిల గతులు గలవె?
వనములోని కోతి, వసుమతినడుపునా? ॥వి॥

బ్రహ్మ వంశభవులు= బ్రాహ్మణులు ప్రబలులై= పరిపాలకులై= ప్రభువులై జాతి= కులము ఇల= ఈ లోకము= నేల, గతులు= బ్రతికే అవకాశాలు, వసుమతి= భూమి= భూలోకము.

మను ధర్మశాస్త్ర ప్రకారము బ్రాహ్మణుని వృత్తి చదువుట. ఇతర కులాలవారికి చదువు, మంచిచెడ్డలు చెప్పుట. ఉంఛవృత్తిలో (పరిగ ఏరుకొని) జీవించుట, క్షత్రియుల వృత్తి రాజ్యపరిపాలన, వైశ్యుల వృత్తి వ్యవసాయము, వ్యాపారము, శూద్రుల, చండాలుర వృత్తి పైకులాలవారికి ఊడిగము చేయుట, అయినప్పుడు బ్రాహ్మణుడు గనుక రాజ్య పరిపాలన చేయసాగితే, అడవిలో కోతి రాజ్యం చేసినట్లే వుండును. బ్రాహ్మణ పరిపాలనలో తక్కిన కులాలవారు సుఖంగా జీవించటానికి అవకాశాలుండవు. దేశంలో అరాచకము, అల్లర్లు చెలరేగిపోతాయి. సుఖ- శాంతులు కరువై పోతాయి. అందుకే నిలకడలేని పనులను కోతి చేష్టలు అని అంటారు.

44. మాలవాడయినను మరి ఆత్మమీదను
మనసు నిలిపెనేని మాలగాడు;
మనసు నిల్పకున్న మహిమీద మాలడే ॥వి॥

మాలవాడు= ఛండాలుడు= చెడ్డపని చేయువాడు మహి= భూలోకము మనసు నిలుపుట= స్థిరమైన బుద్ధిని పరమాత్మమీద నిలుపుట.

ఎవడైతే మాల కులంలో పుట్టి తన మనస్సును పరబ్రహ్మమీద స్థిరముగా

ఆత్మ సాక్షాత్కారానికై యత్నించునో వాడే బ్రహ్మజ్ఞాని. వాడు మాల కానేరడు.కాని ఏ జన్మ గత బ్రాహ్మణుడు బ్రాహ్మణకులంలో పుట్టానని విర్రవీగుతూ బ్రహ్మమీద తన మనస్సును నిలపడో, వాడే మాలవాడు. కనుక ఆత్మ శక్తిసాధనకు కులము,మతము, జాతి, దేశము, కాలము మొదలగునవి ఏవీ అడ్డు కాజాలము.

45. మాల యంటనుచును మఱినీళ్ళ మునిగిరి;
మాల కర్మచేత మాలడాయె;
ఏ తెలియలేరొ యీ నరపశువులు?

కర్మ= పని మాలకర్మ= క్రూరకర్మ= చెడ్డపని.

చేసే పనులనుబట్టేకులాలు యేర్పడ్డాయి. చెడ్డపని చేయుటవల్లనే మాలకులము యేర్పడెను. కనుక చెడ్డపని చేసినవాడు మాలవాడనిపించుకొన్నాడు. అట్టి మాల వానిని అంటుకొంటే తక్కిన సవర్ణ హిందువులు చన్నీళ్ళ స్నానం చేసేవారు. కానినేడు మాల పనిని చేయువారిని ముట్టుకొని చన్నీళ్ళ స్నానం చేసేవారు లేనేలేరు. కనుక చెడ్డపని చేసినవాడు ఏ కులానికి చెందినవాడైనప్పటికీ వాడే మాలవాడు.

46. మాలమేలు, గుణము మంచిది కల్గిన
మాలకూడు కుడుచు మనుజుని కంటెను;
గుణము మేలుగాని కులమేమి మేలురా?

మేలు= మంచివాడు, మాలకూడు = చెడ్డపని= చేయరాని పని, కుడుచుట= తినుట= చేయుట, మాలకూడు కుడుచుట= చెడ్డపని చేయుట.

మంచిపని చేయు జన్మగత మాలవాడు, చెడ్డపని చేయు జన్మగత బ్రాహ్మణుని కంటె ఎన్నోరెట్లు మంచివాడు. అంటే అతను సంఘానికి మేలు చేయును. గుణము ముఖ్యముగాని మానవ కల్పితమైన కులం గొప్పది కాదు.

47. మాల మాలగాడు, మహిమీద నేప్రొద్దు
మాట తిరుగువాడె మాలగాక।
వాని మాలయన్నవాడె పోపెనుమాల

మహి= భూలోకము, ఏ ప్రొద్దు= ఎల్లప్పుడు మాట తిరుగు= అన్నమాట తప్పుట, పెను= పెద్ద= గొప్ప.

ఎవడైతే జన్మగత మాలవాడై యుండి మంచి పనిచేయునో వాడు మాలవాడు కాడు. కాని ఎవడైతే అన్నమాటను తప్పునో, వాడే మాలవాడు. ఎవడైతే మంచిపనిని చేసిన జన్మగత మాలవానిని మాలవాడని అంటాడో, వాడే గొప్ప మాలవాడు. అన్నమాట తప్పుటే మాలతనము; చండాలత్వము.

48. మాల మాంసముదిన, మహిమీద జనులెల్ల
క్రొవ్వుద్రాగలేదొ కోర్కెతీర?
కులములన్ని ఒక్క కులముగా తెలియుడి ॥వి॥

క్రొవ్వు= నెయ్యి; కోర్కెతీర= తనివితీర.

జన్మగత మాలవాడు మాంసము మాత్రమే తింటాడు. కాని తక్కిన పెద్దకులాల వారందరూ నేయిత్రాగుతారు.నేయి మాంసముకంటె ఎక్కువదే గాని తక్కువదేమీకాదు. ఎందుకన పశువుల మాంసంలోని రక్తంనుండే నేయి తయారగును. కనుక నేయిత్రాగే పెద్ద కులాలవారందరూ మాలవాని కంటె ఎక్కువ మాంసాహారులే. అయినప్పుడు కేవలం మాంసంతినే జన్మగత మాలవానిని మాంసాహారి, చండాలుడు అని మాంసాహారులైన పెద్దకులాలవారు ఎందుకు నిందిస్తున్నారో అర్థంకావటం లేదు. కనుక పెద్ద కులాలవా రనబడేవారందరూ అన్ని కులాలు ఒక్కటేనని తెలిసికొని జన్మగత మాల మాదిగలతో కలసిమెలసి జీవించటం ఎంత తొందరదగా నేర్చుకొంటే సమాజానికి అంత మేలు కలుగును.

49. మాలవానినేల మహిమీద నిందింప?
నొడల రక్తమాంస మొకటికావె?
వానిలోన మెలగు వాని కులంబేది?

ఒడలు= శరీరము; రక్తము= నెత్తురు; నిందించు= తిట్టుట; మెలగుట= వర్తించు= సంచరించు=ఉండుట

మాలవాని శరీరంలోగల నెత్తురు, మాంసము, జీవాత్మ (ప్రాణము) మొదలగు వాటికినీ, పెద్దకులాలవారి శరీరంలోగల నెత్తురు, మాంసము, జీవాత్మలకునూ తేడా కన్పించదు. పరమాత్మ అంశమైన జీవాత్మకు కులమత బేదములేదు. సర్వప్రాణులలోనూ ఒకేదేవుడు వ్యాపించి యున్నాడని తత్త్వవేత్తలు

(వేదాంతులు) నెత్తిని నోరుపెట్టుకొని ఘోషిస్తున్నారు. అందరూ ఒకే దేవుని బిడ్డలైనపుడు, పెద్దకులాలవారు తమ మనసులను మార్చుకొని అన్ని కులాలవారినీ ప్రేమతో చూచుట నేర్చుకోవాలి.

50. మాలవానినేల మరి మరి నిందిప?
తోలు, మాంసములను తుదకు తినక,
కొవ్వు తినెడివారి గులముగా జూడండి ॥వి॥

నిందించుట= తిట్టుట

పెద్దకులాలవారు మాలవానిని మాంసం తింటాడని తిట్టిపోస్తారు. కాని పెద్ద కులాలవారు కొవ్వునుండి తయారయ్యే నేతిని లెస్సగా త్రాగుతారు. ఈ రకంగా మాంసం తినే మాలవానికంటె నేయి త్రాగే పెద్ద కులాలవారే ఎక్కువ మాంసాహారులు. కనుక మాంసం తినేవారు, నేయి త్రాగేవారు అందరూ మాంసాహారులే.కనుక అందరూ ఒకే కులానికి చెందినవారలని పెద్దకులాలవారు గ్రహించి ఎక్కువ తక్కువ తేడాలను విడిచిపెట్టి అందరితోనూ కలసి మెలసి జీవించటం నేర్చుకోవాలి.

51. రామనామ జపముచే మహివాల్మీకి
పాపి బోయడయ్యు బాపడయ్యె;
కులము ఘనము కాదు; గుణమే ఘనంబురా ॥వి॥

మహి= భూలోకము; బోయవాడు= పక్షులను వేటాడే వాడు. ఘనము= గొప్పది; బాపడు= బ్రాహ్మడు.

బోయవాడైన వాల్మీకి ఘోరంగా హింసచేయుచూ వుండేవాడు. అతనికి నారద మహాముని రామనామమును ఉపదేశించెను. వాల్మీకి రామనామ జపముచేసి మహామునియై, సంస్కృత భాషలో ఆదికావ్యమైన రామాయణమును వ్రాసి ఆదికవిగా ప్రసిద్ధి చెందెను. కనుక గుణము ముఖ్యముకాని కులము కాదని శూద్రుడైన మన వాల్మీకి రుజువుచేసెను.

52. శూద్రురాలి కొడుకు శుద్ధాంతరంగుడై,
వేదవేద్యమైన పాదుదెలిసి,
బ్రహ్మపదవిగన్న బ్రాహ్మణాగ్రజుడాయె ॥వి॥

పాద= మూలము= కుదురు; శుద్ధాంతరంగుడు= జ్ఞానంగలవాడు; బ్రాహ్మణాగ్రజుడు= బ్రాహ్మణులలో గొప్పవాడు.

పల్లెపడుచు మత్స్యగంధికీ, వసిష్ఠుని మనుమడైన పరాశర మహామునికీ పుట్టిన వేదవ్యాస మహాముని బ్రహ్మత్వమును పొంది గొప్ప జ్ఞానంగల బ్రాహ్మణ మహామునిగా పేరుచెందాడు. పూర్వకాలంలో ఋషులు, మునులు అనబడేవారి పుట్టుక ఏ కులంలో అయినప్పటికీ, బ్రహ్మత్వం పొందిన వారిని బ్రాహ్మణులనుగానే ఎంచి గౌరవస్థాన మిచ్చేవారు. అందుకని ఋషుల, మహామునుల, నదుల మూలాన్ని ఎన్నవలదనియు, గుణము ప్రధానంగాని కులం కాదని వారి అభిప్రాయం.

53. వెఱ్ఱికుక్కలవలె వేదముల్ చదివేరు,
ఆశయంబు లెరుగ రయ్యగాండ్రు;
వేదసారమంత వేమన ఎఱుగును ॥వి॥

వెఱ్ఱి= పిచ్చి ఆశయము= అభిప్రాయము= సారము అయ్యగాండ్రు= అయ్యగార్లు= బ్రాహ్మణులు.

బ్రాహ్మణ పండితులు పిచ్చికుక్కలవలె వేదాలను చదువుతారేగాని వాళ్ళకు వాటి అర్థం బొత్తిగా తెలియనే తెలియదు. వారు వేదాలను చదివేది, తమ కడుపు కూటికొరకు మాత్రమే. నిజానికి వేదసారము మాత్రం వేమనకు తెలుసు. అంతమాత్రంచేత వేమన్న వేదాలను ప్రామాణిక గ్రంథాలుగా అంగీకరించారనుటకు వీలులేదు. ఎందుకన వేమన వేదాలను ఖండించిన సందర్భాలున్నాయి.

54. బ్రాహ్మణ మనుచును బ్రహ్మత్వ మదిలేని,
బ్రాహ్మణ మదియేల? బ్రాహ్మణుడటె?
బొమ్మవలెను దాను దిమ్మపై గూర్చుండ ॥వి॥

దిమ్మ= దిబ్బ= గద్దె బ్రహ్మత్వము= బ్రహ్మజ్ఞానము.

నిజానికి ఎవనికి బ్రహ్మజ్ఞానం వుండునో, వాడే బ్రాహ్మణుడు. కాని నేడు తమను బ్రాహ్మణులమని చెప్పుకొనే జన్మగత బ్రాహ్మణులలో బ్రహ్మజ్ఞానంగలవారు ఒక్కరుకూడా కన్పించుటలేదు. కనుక బ్రహ్మజ్ఞానం లేకుండా తమను బ్రాహ్మణులమని చెప్పుకొని విర్రవీగేవారలను చూచినపుడు నేతిబీరకాయ, పెరుగుతోటకూర గుర్తుకు

వస్తున్నాయి. నిజానికి బ్రహ్మజ్ఞానంలేని బ్రాహ్మణుడు దిమ్మమీద వుంచబడిన దిష్టిబొమ్మతో సమానము.

55. సంధ్యవార్చనేమి? జపముసేయగనేమి?
వేదశాస్త్రములను వెదకనేమి?
పరము గననివాడు బాపడుగాడురా ॥వి॥

పరము= మోక్షము= పరమాత్మ; కనుట= చూచుట= తెలిసికొనుట

మూడు పూటలా సంధ్యవార్చుచున్నా, ఎడతెగకుండా జపము చేస్తున్నా, వేదాలను, శాస్త్రాలను తల్లక్రిందులుగా చదవగలిగినా, మోక్షమార్గాన్ని కనుగొన నంతవరకు, ఎవ్వనికినీ బ్రహ్మత్వం సిద్ధించదు. బ్రహ్మత్వం సిద్ధించనంతవరకు ఎవ్వడూ బ్రాహ్మణడు కాజాలడు.

56. సత్యమమరియుండ, జ్ఞానమమరియుండు;
జ్ఞానమమరియుండ, సత్యముండు;
జ్ఞానసత్యములవి, సమమైన ద్విజుడగున్ ॥వి॥

అమరుట= కలుగుట= లభించుట= నెఱవేరుట; ద్విజుడు= బ్రాహ్మణుడు

ఎక్కడ సత్యముండునో అక్కడ జ్ఞానం తప్పనిసరిగా వుండును. ఎక్కడ జ్ఞానం వుండునో, అక్కడ సత్యం తప్పనిసరిగా వుండును. సత్యము, జ్ఞానము యీ రెండూ పరమాత్ముని స్వరూపాలే. ఎవడైతే జ్ఞానిగానూ, సత్యవాదిగానూ వుంటాడో వాడే బ్రాహ్మణుడు. వాడే బ్రహ్మజ్ఞానియైన బ్రాహ్మణుడు.

57. లంజకొరకు మేకనంజుడు తినసాగె,
యజ్ఞమెల్ల కామ యజ్ఞమాయె;
మొదట సోమయాజి, తుదకుకామయాజిరా ॥వి॥

లంజ=అంకుది= చీకటి తప్పుచేయు ఆడది; నంజుడు= మాంసము (పచ్చడి, కూర) కామయజ్ఞము= కామముకొరకు చేయబడే యజ్ఞము; కామయాజి= కామాన్ని కోరేవాడు= బూతును కోరేవాడు.

పూర్వం వైదిక బ్రాహ్మణ పండితులు దేవతల వేశ్యయైన రంభను స్వర్గలోకంలో సంభోగించటానికొరకు యీ లోకంలో యజ్ఞాలు చేసేవారు. యజ్ఞాల

సందర్భంలో మేకపోతుల మెడలను నులిమి చంపి వాటిని కొల్చుకొని తిని కావలసినంత సోమరసం త్రాగేవారు. సోమయాజిగారు తుదకు కామయాజిగా మారిపోయేవాడు.

58. ద్విజకులంబునందు తేజరిల్లుచుబుట్టి,
తాదరించి, యొరుల దాటజేయ
లేని యాతడున్న, లేకున్న నొక్కటే ॥వి॥

ద్విజకులము= బ్రాహ్మణకులము; తరించుట=ముక్తుడగుట= దాటుట, దాటవేయుట= దాటించుట, దరిచేర్చుట, తరింపచేయుట, ముక్తిని కలిగించుట, తేజరిల్లుచు= బ్రహ్మాండంగా, గొప్పగా.

బ్రహ్మజ్ఞానం గలవాడే బ్రాహ్మణుడు. అట్టి బ్రహ్మజ్ఞానంగల బ్రాహ్మణకులంలో పుట్టిన బ్రాహ్మణుడు తాను ముక్తుడై, ఇతరులను ముక్తులను చేయాలి. అట్లా తాను తరించి యితరులను తరింపజేయలేని బ్రాహ్మణుడు వున్నా, లేకున్నా ఒక్కటే. వానిని బ్రాహ్మణుడనుగా ఎంచకూడదు. వాడు జన్మగత బ్రాహ్మడేగాని గుణగత బ్రాహ్మణుడు కాజాలడు.

59. అన్నిజాతులందు అధికుల మనుచును,
యజ్ఞపశువులను చంపి యగ్నినిడుచు,
మల్లయందుబెట్టి మాంసంబు తిందురు ॥వి॥

జాతులు= కులాలు; అధికులు= గొప్పవారు; యజ్ఞపశువు=మేకపోతు వగైరాలు, అగ్ని విడుచుట= యజ్ఞాగ్నిలో కాల్చుట, మల్ల= మట్టిపళ్ళెము.

బ్రాహ్మణులు తమ కులము అన్ని కులాలకంటె ఎక్కువ గొప్పది, పవిత్రమైనదని వదరుచుందురు (ప్రేలుచుందురు). కాని యజ్ఞమనే నెపంతో మేకపోతులను చంపి వాటిని యజ్ఞాగ్నిలో కాల్చుకొని వాటి మాంసమును కొత్తమట్టి పళ్ళెములలో పెట్టుకొని తనివితీర తిందురు.

పరాన్నభుక్కులైన బ్రాహ్మణ పండితులు యజ్ఞంకొరకు మేకపోతులు చంపబడుచున్నాయేగాని మా కొఱకు కాదనే మోసపు మాటను పైకి చెప్పి సామాన్య ప్రజలను మూఢులనుగా ఎంచి వారిని బౌద్ధికంగానూ, ఆర్థికంగానూ దోచుకుంటూ

కపట జీవితాన్ని గడుపుకొంటున్నారు.

60. కుటిలమగు ఋషికులంబున
బటుతరముగ బుట్టినట్టి బాపనవార
ల్కుటిలంబు గానలేకయే
యటు బ్రహ్మకులంబనంగ, నమరునె? వేమా? ॥వి॥

కుటిలమ= కపటము= మోసపు స్వభావము, అమరుట= ఒప్పుట= అంగీకరించుట, బ్రహ్మకులము= బ్రహ్మదేవుని కులము= బ్రాహ్మణ కులము.

కపటులైన ఋషులు నానా రకాలుగా నానా కులాల వారికీ పుట్టిన అట్టి కుటిల ఋషులు కులంలో పుట్టినామని చెప్పుకొనే బాపనయ్యలు తమ కపటమును వీడక తమను బ్రహ్మ కులంలో పుట్టినామని చెప్పుకొంటున్నారు. కాని వారిలో బ్రహ్మత్వము లేదని సామాన్య ప్రజానీకం యిప్పుడిప్పుడే తెలిసికోగలుగుతోంది.

61. ఇన్ని జాతులందునే జాతి ముఖ్యమొ'॥
నెఱుక గల్గువారె యెచ్చుగారె?
యెఱుగ లేనివారలే జాతియన్నను
మాల కంటె జెడుగు మహిని వేమ॥

62. ఇన్ని జాతులందునే జాతి ముఖ్యమొ
ఎఱుక గల్గువారె హెచ్చువారు।
ఎఱుక లేనివార లే జాతి నున్నను
హీన జాతియందు నెఱుగు వేమ॥

జాతి= కులము, ఎఱుక= జ్ఞానము, మహి= భూలోకము, హీనజాతి= నీచకులము.

హిందూమతంలో వున్నన్ని కులాలు ప్రపంచంలో ఏ మతంలోనూ లేవు. హిందూమతంలో గల కులాలలో 18 కులాలు ముఖ్యమైనవి. ఈ 18 కులాలలోనూ ఏ కులంలోనైతే గుణవంతులు (జ్ఞానం గలవారు) వుండరో ఆ కులం ఎంత గొప్పదైనా నీచకులంగా ఎంచబడుతుంది. గుణానికి జ్ఞానానికి అవినాభావ సంబంధం గలదు. ఎక్కడ గుణం వుండునో, అక్కడ జ్ఞానం వుండును. ఎక్కడ జ్ఞానం వుండునో అక్కడ

గుణం వుండును. అంటే గుణము జ్ఞానము అన్నదమ్ములవలె వుండును.

63. శూద్ర శూద్ర యనుచు శూద్రుల బోనాడు
శూద్ర కులము తన్ను జుట్టుకొనగ।
మనసు శుద్ధిలేక మఱి ద్విజుండెట్లౌను? ॥వి॥

పోనాడుట= నిందించుట, తిట్టుట, ద్విజుడు= బ్రాహ్మణుడు

నేడు శూద్రులనబడే వారు ప్రాచీన ఆర్యుల లోకాచార ప్రకారం నాలుగు వర్ణాలలోనూ నాల్గవ వర్ణానికి చెందినవారట. వీరిని దాసులు, పాదజులు, అంత్యజన్ములు, ద్విజదాసులు, ద్విజసేవకులు, పాపాత్ములు, బ్రాహ్మణ దాసులు అని అనేవారట.

ఈ శూద్రవర్ణస్థుల ముఖ్యవృత్తి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణముల వారి సేవ చేయుట. యజుర్వేదములో యీ శూద్రులు మానవ సమాజమనే శరీరం యొక్క కాళ్ళతో పోల్చబడిరి. అందువల్ల శూద్రులు బ్రహ్మదేవుని యొక్క కాళ్ళనుండి పుట్టారని కొంతమంది ఆర్య పండిత ముఖ్యులు వక్కాణించారు. శూద్రులు వేదాలను చదవకూడదు; వినకూడదు. నేడు అంటరానివారనబడేవారు యీ శూద్రులలోని వారేనని కొంతమంది ఆర్య బ్రాహ్మణ శాస్త్రకారుల అభిప్రాయమట.

నేడు బ్రాహ్మణుడనబడే వాడు తాను శూద్రుడుగా పుట్టి కూడ శూద్ర కులాల వారిని నిందిస్తున్నాడు. నిజమాలోచిస్తే ఎవని మనస్సైతే పరిశుద్ధంగా వుండదో, వాడే శూద్రుడు. మనస్సు పవిత్రంగా లేనివాడు బ్రాహ్మణ కులంలో పుట్టినా, వాడు శూద్రుడు క్రింద లెక్కే. వానిని బ్రాహ్మణుడని అనరాదు.

64. చిలుక గర్భమందు జెలగి శుకుడు పుట్టె;
మఱియొకండు పుట్టె ఖరము వలన;
నిట్టి ఋషి కులంబు నెంచంగ బనిలేదు ॥వి॥

ఖరము= గాడిద, ఎంచుట= విమర్శించుట.

మన పూర్వపు బ్రహ్మవేత్తలైన మహర్షులందరూ నానా జాతుల వారికీ, నానా పశుపక్ష్యాదులకు పుట్టిన వారే. వసిష్ఠుడు, అగస్త్యుడు, దేవతా వేశ్యకును, పరాశర మహాముని మాదిగ పడుచుకును, నారద మహాముని చాకలి పడుచుకును,

వ్యాస మహాముని పల్లెపడుచుకును, శుకుడు చిలుకకును, కొందరు కొయ్య పాత్రలలోనూ, కొందరు గాడిద మొదలైన జంతువులకును పుట్టిరి. ఇటువంటి ఋషుల పుట్టు పూర్వోత్తరాలను గురించి విమర్శించి మనం మన విలువైన కాలాన్ని వృధా చేయటం తెలివిగల పనిమాత్రం కాదు.

65. కల్లటికెకు భూతి గట్టిగా బెట్టిన
నందులోని కంపు లడగనట్లు;
మెడను ద్రాడువేయ మెరవుతో ద్విజుడౌనె? ॥వి॥

కల్లటిక= కల్లు+ అటిక= కల్లుకుండ; భూతి= విభూతి; మెడను ద్రాడు= మెడకు త్రాడు; జందెము; ద్విజుడు= బ్రాహ్మడు.

కల్లుకుండకు దట్టముగా పైన విభూతిని పూసినప్పటికీ దానిలోని చెడు కంపు ఏవిధంగానైతే పోదో, జన్మగత బ్రాహ్మణుడు తన మెడకు జందెము వేసుకొన్నప్పటికీ, అతనిలోని కుటిల స్వభావము పోజాలదు.

66. కన్నెతోడ వరుడు కామించి కదియంగ
నొక్కమారు పిండముద్భవించు;
కులజుడేడి అచట? కులహీను డేడయా? ॥వి॥

కన్నె= పెండ్లికాని పడుచు; వరుడు= మగవాడు; కామించుట= మోహించుట; కదియుట= జతకట్టుట, సంభోగించుట; ఉద్భవించుట= పుట్టుట; కులజుడు= మంచి కులస్థుడు; కులహీనుడు= చెడ్డ కులస్థుడు.

అన్ని కులాల వారు తమ తమ తల్లిదండ్రుల శుక్ర శోణితముల వల్లనే (వీర్యము, రక్తము) తమ తల్లుల ఆడగుఱిగుండానే (పూకు గుండానే) పుట్టుచున్నారు. పుట్టుటలోనూ, చచ్చుటలోనూ ఎక్కువ తక్కువలు లేవు. అందరూ ఒకే మాదిరిగానే పుట్టుచున్నారు, చచ్చుచున్నారు. కనుక కుల పిచ్చిని, మత పిచ్చిని వదలి మనమందరం అన్నదమ్ముల వలె బ్రతుకుదాం.

67. పరగగడ్డి దినెడు పశువుల విశసించి
మనుజులు తిని భువిని మాలలైరి;
అందరి పియ దినెడు పందుల కోళ్ళను

తినిన కులమదేటి దిలను? వేమ॥

విశసించుట= చంపుట; పియ= పెంట; ఇల= భూలోకంలో

సవర్ణ హిందువులలో కొందరు పెద్దలు, గడ్డితినే పశువుల మాంసముతినే మాదిగ వారిని చండాలురని దూషించి వారిని తమ ఊళ్ళకు దూరంగా వుంచినారు. కాని ఊళ్ళో వారి అందరి పెంట తినే పందుల కోళ్ళ మాంసముతినే కులాల వారిని కులీనులనుగానే సంఘంలో గౌరవిస్తున్నారు. సవర్ణ హిందూ పెద్దల ఈ అన్యాయమును గమనించిన తరువాత "నోరున్న వాడిదే రాజ్యం", "దుడ్డున్న వాడిదే గొడ్డు" అనే సామెతలు గుర్తుకు వస్తున్నాయి. నిజమాలోచిస్తే, గడ్డి తినే పశువు మాంసము అందరి పెంట తినే పంది కోళ్ళ మాంసం కంటే ఎన్నోరెట్లు మంచిదిగా కన్పిస్తోంది. కనుక గొడ్డు మాంసం తిన్నవాడు చండాలుడో, పెంట తినే పంది మాంసం తినేవాడు చండాలుడో వివేకవంతులైన చదువరులే నిర్ణయించుకోవాలి.

68. ఉదయమందు శూద్రుడుత్తమోత్తము డెట్లు?
సతికి శూద్రతనము సత్యమెకద!
తల్లి శూద్ర యాయె, తానెట్లు బాపడో? ॥వి॥

ఉదయమందు= పుట్టినపుడు; సతి= ఆడది= పెండ్లాము, ఉత్తమోత్తముడు= అందరి కంటె గొప్పవాడు.

అన్ని కులాల ఆడవాళ్ళూ శూద్రులేనని మను మహారాజుగారు ఏనాడో శాసించారు. కనుక ఆడు దానికి పుట్టినవాడు ఏ కులస్థుడైనా శూద్రుడు గానే ఎంచబడాలి. కాని తన తల్లి శూద్రురాలైనప్పటికీ జన్మగత బ్రాహ్మణుడు తనను గుణగత బ్రాహ్మణుడనని చెప్పుకొంటూ తాను అన్ని కులాల వారికంటె గొప్పవాడనని బింకాలు పోతూ విర్రవీగుతున్నాడు.కాని శూద్ర జాతికిపుట్టిన వాడు శూద్రుడేగాని గుణగత బ్రాహ్మణుడెన్నటికీ కాజాలడు. కనుక జన్మతో అందరూ శూద్రులే.

69. వేసమునకు నైన దాసరి కావచ్చు
హంగు తప్పువేళ జంగమగును
పదియువేలకైన బాపడు కారాదు ॥వి॥

దాసరి= సాతాని= విష్ణుభక్తుడైన శూద్రుడు, వైష్ణవుడు= విష్ణు భక్తుడైన

బ్రాహ్మణుడు, హంగు= బలము; అండ, జంగము= శివభక్తుడైన శూద్రుడు, శైవుడు= శివభక్తుడైన బ్రాహ్మణుడు; బాపడు= బ్రాహ్మడు.

ఆ రోజులలో సాతానులు, జంగాలు తమ తమ శక్తికొలది తమ తమ మత సంప్రదాయాలకు చెందిన నియమాలను తు.చ. తప్పకుండా పాటిస్తూ వుండిరి. వైష్ణవుల మరియు శైవుల మనియు చెప్పుకొనే జన్మగత బ్రాహ్మణులు తమ తమ మత సంప్రదాయాలకు చెందిన నియమాలను ఉల్లంఘించి తమ యిష్టమొచ్చినట్లు చేయరాని పనులు చేయుచుండుటను చూచి వేమన తన మానసిక ఆవేదనను యీ విధంగా పై పద్యములో వెల్లడించుకొన్నట్లు తోస్తున్నది. ఎట్లనగా పరిస్థితులు మారినపుడు సాతానిగా గాని, జంగంగా గాని మారవచ్చునుగాని ఎన్ని కష్టాలు వచ్చినా బ్రాహ్మణుడుగా మాత్రం మారవద్దని వేమన గట్టిగా సలహా యిచ్చాడు.

70. యాగము చేసిన విప్రుడు
భోగించును రంభతోడ పుత్రుడు మరలన్
యాగంబు చేయ తల్లిని
భోగించుటగాదె యజ్ఞ పుణ్యము వేమా?

యాగము= యజ్ఞము; విప్రుడు= బ్రాహ్మణుడు, భోగించుట= జత కట్టుట, కామించుట= కామ సుఖము అనుభవించుట.

ముఖ్యంగా వైదిక కాలంలో బ్రాహ్మణులనబడేవారు స్వర్గలోకంలో దేవతల వేశ్యయైన రంభను సంభోగించడానికి యీ లోకంలో బ్రతికివున్నప్పుడు సోమరసం తనివితీరా త్రాగి, యజ్ఞాలు చేసేవారు. ఆ యజ్ఞాలను సోమయాగాలు అనేవారు. యజ్ఞాలు చేసినవారిని సోమయాజులు అనేవారు. సోమయాజిగారి పెండ్లాన్ని సోమ దేవమ్మ అనేవారు. ఆ యజ్ఞాల సందర్భాలలో వారు మేకపోతు వగైరా జంతువులను దేవతలకు బలి యిచ్చి వాటి మాంసమును కాల్చుకొని యజ్ఞం చేసినవారు, చేయించినవారు మిక్కుటముగా మెక్కి సోలల కొలది సోమరసం త్రాగేవారు. అయితే రంభను సంభోగించడానికి తండ్రి– కొడుకు, అన్న– తమ్ముడు, బావ– బావమరిది, మామ అల్లుడుకి యీ జంటలు సోమయాజు లయినప్పుడు, వావివరుసలు నట్టేట కలసినట్లేగదా? నిజం చెప్పాలంటే వైదిక కాలంనాటి బ్రాహ్మణులని చెప్పబడేవారు

పూర్తిగా కామాంధత వల్లనే యిటువంటి చేయరాని, చెప్పరాని పాడుపనులు చేసేవారని వ్రాయటానికి విచారపడుతున్నాను.

71. దాసరట్టుల గావచ్చు వేషమునను
జంగముగ నుండవచ్చును లింగమేసి,
పరగ లక్షలకైనను పారునివలె
నుండగా రాదు గద యెన్న నుర్వి వేమ॥

పారుడు= బ్రాహ్మణుడు, ఉర్వి= భూలోకము.

మానవుడెవడైనా పంగనామాలు పెట్టుకొని దాసర, (సాతాని)న్నా కావచ్చును. లింగమును మెడలో కట్టుకొని జంగమ దేవరన్నా కావచ్చును; కాని మెడలో జందెము వేసుకొని బ్రాహ్మణుడుగా ఎంతలాభం కలిగినా, ఎన్ని కష్టాలు వచ్చినా వేషం వేయవద్దని యీ పద్యంలో కూడ వేమన సలహా యిచ్చినట్లు కన్పిస్తోంది.

72. పుట్టినపుడు లేదు; పురిటింటిలో లేదు;
తల్లి మెడకులేదు; తనకులేదు;
తల్లి శూద్రురాలు; తాను బ్రాహ్మణుడట? ॥వి॥

బ్రాహ్మణుడంటే అసలర్థం బ్రహ్మజ్ఞానం కలవాడు. అంతేకాని 3-9 నూలుపోగుల జందెము వేసుకొన్నంత మాత్రాన ఎవ్వడూ బ్రాహ్మణుడు కాజాలడు. జాతి శూద్రుడైనా, చండాలుడైనా బ్రహ్మ జ్ఞానం కలిగినవాడైనట్టయితే, వాడే బ్రాహ్మణుడు. కాని జాతి బ్రాహ్మణుడైయుండి బ్రహ్మజ్ఞానంలేని వాడయినట్టయితే, వాడు శూద్రుడుగా గాని, చండాలుడుగా గాని ఎంచబడుతాడు. కనుక బ్రాహ్మణుడంటే బ్రహ్మజ్ఞానం కలవాడేగాని 3-9 నూలుపోగుల జందెము వేసుకొన్నవాడు మాత్రం కానేరడు.

73. బ్రహ్మ పరువు చెడును బ్రాహ్మణులా దొడ్డ
బ్రహ్మ వలనబుట్టి పరగి రనగ;
బ్రహ్మవేత్త యగును బ్రాహ్మణుండేయైన ॥వి॥

పరువు= గౌరవము, పరగుట= వ్యాప్తి చెందుట= వృద్ధిచెందుట, దొడ్డ= గొప్ప, బ్రహ్మవేత్త= బ్రహ్మమును= తెలిసికొన్నవాడు= బ్రహ్మజ్ఞాని.

చదువు సంధ్యలు, సంస్కారాలు తక్కువగల జాతి గత నామమాత్రపు బ్రాహ్మణులు తమను బ్రహ్మ సంతతి వారలమని చెప్పుకొనుచుంటే బ్రహ్మదేవునికి తలవంపులగును. బ్రహ్మజ్ఞానం లేనపుడు వారు బ్రహ్మసంతతివారు అనిపించుకోరు. ఏ కులంలో పుట్టినవాడైనా బ్రహ్మజ్ఞానం కలిగివున్నవాడైతే, వాడు బ్రహ్మసంతతివాడు అనిపించుకొనును. జన్మగత బ్రాహ్మణులు బ్రహ్మజ్ఞానం లేకుండా మేము బ్రాహ్మ సంతతి వారలమని, గొప్ప దైవభక్తులమని, ఋషుల సంప్రదాయముల వారమని పెక్కు విధముల బింకాలు పోతారు. కాని వారు బ్రహ్మజ్ఞానం కలిగిన వారలైతేనే గౌరవింపబడుదురు. లేనిచో వారు సంఘంలో గౌరవింపబడరు.

74. మాల వాడంటితే నీళ్ళలో మునుగును;
కాటికేగిన వెనుక కాల్చు మాల;
అప్పుడంటిన అంటు యిప్పుడెందేగెనో? ॥వి॥

కాడు= వల్లకాడు; కాటికేగుట= వల్లకాటికి చేరుట= చచ్చిపోవుట

సవర్ణ హిందువు బ్రతికివున్నప్పుడు మాల, మాదిగలను అంటుకొంటే వెంటనే చన్నీళ్ల స్నానం చేస్తాడు. కాని అతను చనిపోయినపుడు, అతని పీనుగను వల్లకాటిలో మాదిగవారే కాల్చుతారు. అప్పుడు ఆ సవర్ణ హిందువుకు అంటు పట్టింపులేదు. నిజం చెప్పాలంటే సవర్ణ హిందువులు తమ కులాధిక్యతను చలాయించుకోటానికే అంటరానితనాన్ని పాటిస్తున్నారు కాని ఆరోగ్య దృష్టితో మాత్రంకాదు. ఏదేని అంటురోగం గలవాడనిగాని ఏదేని క్రూరకర్మ చేసినవాడనిగాని ఏ కులానికి చెందినవాడైనా, వాడే అంటరాని వాడుగా ఎంచబడాలి. అంతేగాని జన్మతో ఎవ్వడూ అంటరానివాడుగా గాని, బ్రహ్మజ్ఞానం లేకుండా బ్రాహ్మణుడుగా గాని కాజాలడు.

75. వడుగు ద్విజులకెల్ల కడు ముఖ్యమందురు;
వడుగు జేసెదమని వదరుచుంద్రు;
కడగు ద్రావికాకి కట్టు కట్టన్నట్లు ॥వి॥

వడగు= జందెము; కడు= మిక్కిలి; వదరుట= ప్రేలుట= అర్థంలేకుండా అరచుట, కడుగు= బియ్యం కడిగిన నీరు= కుడితి; వడుగు చేయు= జందెము

వేయుట; జన్మగత బ్రాహ్మణులు డాంబికముగా తమ బాలురకు వడుగు చేయుట ముఖ్యమనియు, దానిని తప్పక చేయుదుమనియు కుడితి త్రాగిన కాకుల వలె అదేపనిగా వదరుచుందురు. కాని వారు యీ వడుగు తంతును సంఘంలో తాము అందరికంటె గొప్ప వాళ్ళమని చూపించి శరీర శ్రమ చేయకుండా నోరులేని కష్టజీవుల కష్టార్జితాన్ని కాజేయటానికే చేస్తున్నారనక తప్పదు. హిందువులలో అగ్రకులాలవారి యీ వడుగుతంతు, మహమ్మదీయులలో సున్తీ తంతువంటిది. అయితే సున్తీ తంతు ఆరోగ్య దృష్టితో చూస్తే కాస్త ఉపకారిగానే కన్పిస్తుంది. కాని వడుగు తంత మాత్రం పూర్తిగా మోసంతో కూడికొని యున్నదనుటలో సందేహం లేదు.

76. కావుకావు మనుచు కాళ్ళుండి పలికెడి
కాకి కరణి బల్కి కానరారు;
బాపలైన వారు బ్రాహ్మము నెఱుగరు ॥వి॥

కరణి= విధము; రీతి, బాపలు= బ్రాహ్మలు

కాకులు కావుకావు మని అర్థం లేకుండా కూసినట్లే, కొంతమంది జన్మ గత బ్రాహ్మలు వేదమును అర్థం తెలుసుకోకుండానే బిగ్గరగా అరుస్తూ చదువుతారు. వారు తమను బ్రాహ్మణులమని చెప్పుకుంటారేగాని వారికి బ్రహ్మ పదార్థం తెలియనే తెలియదు. బ్రహ్మ పదార్థం తెలిసికొన్నవారే బ్రాహ్మణులు. బ్రాహ్మణుడైనవాడు తప్పక బ్రహ్మజ్ఞానిగా వుండాలి.

77. చదివినయ్యకన్న చాకలయ్యేమేలు;
కులము వేల్పుకన్న కుక్కమేలు;
బాపనయ్యకన్న, బైనీడు మేలయా

వేల్పు= దేవత, బైనీడు= బుడబుక్కలవాడే మేలు.

78. చదువరి మతికన్న సాధకు మతిమేలు;
వేదములనులేదు, వాదములను;
ఒడలు శుద్ధిచేసి యొడయని జూడరా ॥వి॥

చదువరి= చదువుకున్నవాడు; మతి= మనస్సు, సాధకుడు= సాధించేవాడు= ప్రయత్నించేవాడు= అభ్యాసం చేయువాడు, ఒడలు= శరీరము ఒడయడు= స్వామి=

పరమాత్మ.

వేదములు చదివి వితండ వాదములు చేయు విద్వాంసునికంటే, చదువు సంధ్యలులేని సాధకుడే గొప్పవాడు. ఎందుకన సాధకుడు తన శరీరాన్ని, మనస్సును తన అదుపులో వుంచుకొని ఏకనిష్ఠతో పరమాత్మను కనుగొనటానికి యత్నిస్తాడు.

79. బ్రహ్మ సంతతియన భక్తులై వెలసిరి;
ఋషులజాతు లెన్నొరీతులయ్యె;
రోతకెక్కువారి, రోయక పిలుతురా?

సంతతి= సంతానము= బిడ్డలు, వెలయుట= ప్రసిద్ధిచెందుట. రీతి= తెఱగు= విధము; రోత= ఏవగింపు= ఏవము= అసహ్యత, రోయుట= అసహ్యించుకొనుట= హీనంగా చూచుట.

జాతి (జన్మగత) బ్రాహ్మణులు తాము బ్రహ్మసంతతి వారలమనియు, గొప్ప భక్తులమనియు, ఋషుల సంప్రదాయముల వారమనియు డాంబికంగా పెక్కురీతుల చెప్పుకొని విర్రవీగుతున్నారు. వారిలో బ్రహ్మజ్ఞానం పేరుకుకూడ లేదు. నిజంగా వారు బ్రాహ్మణులని పిలవబడుటకు కూడ యోగ్యులు కాదు. కాని వారు బ్రహ్మ విచారణచేసి బ్రహ్మజ్ఞానం సంపాదించుకోనంతవరకు వారిని సంఘం గౌరవించక అతి నీచంగా చూస్తుంది.

80. చదువులందులేదు, శాస్త్రంబులనులేదు;
వేదములనులేదు; వాదములను లేదు;
బయటనున్న ముక్తి పాటించి చూడరా ॥వి॥

బయలు= బయటి ప్రపంచము; పాటించుట= ఆచరించుట.

ముక్తిమార్గము చదువులోగాని, శాస్త్రాలలోగాని, వేదాలలోగాని, వాదములలోగాని లేదు. కాని సర్వాంతర్యామియైన (అంతటావున్న) బ్రహ్మమును తెలుసుకొన్నవాడే ముక్తిని సాధించగలడు.

81. పాడిగాదు జగతి బంచాంగములు చెప్పి
కొంచెమైన బుద్ధి నెంచలేక;
బ్రహ్మమెఱుగకిట్లు పౌరోహితముచేసి

యనని బ్రాహ్మణుల మటంద్రు వేమ ॥వి॥

బ్రాహ్మణుడు అనగా అసలు అర్థం బ్రహ్మమును తెలుసుకొన్నవాడు, కాని నేడు తమను బ్రాహ్మణులమని చెప్పుకొనేవారలతో నూటికి ఒక్కడు కూడ బ్రహ్మమును తెలిసికొన్నవాడు లేడు. కాని వారు పంచాంగములకు చూచి మంచి చెడ్డలుచెప్పి తద్దినాలు, దినాలు, శాంతులు, జపములు, పెండ్లిండ్లు వగైరాలను చేయించి సామాన్య ప్రజలను బెదరేసి వారి మనస్సులలో మూఢనమ్మకాలను, మూఢాచారాలను పాదుకొల్పి వారిని ఆర్థికంగా దోపిడిచేసే వారుగా తయారైనాడు. ఎట్లనగా, పెండ్లికంటే దినానికే పురోహితునికి ఎక్కువ ఆర్థికలాభం కలుగుతుంది. అందుకే ప్రజలకు రోగాలు రావాలని వైద్యులు, దేశంలో కరువులు రావాలని వ్యాపారస్తులు, ప్రజలలో చావులు రావాలని పురోహితులు కోరుతూ వుంటారని పెద్దలంటారు. సారాంశం బ్రాహ్మణుడై యున్నందుకు బ్రహ్మమును తెలుసుకోవటానికి యత్నించాలిగాని పంచాంగములు చెప్పి పౌరోహిత్యముచేసి డొక్కలు నింపుకొనుట తగినపని కాదు.

82. ఆలిఱంకుదెలుప నఖిల యజ్ఞంబులు
తల్లిఱంకు దెలుప తద్దినములు;
కాని తెరువు కర్మకాండ కల్పితమాయె ॥వి॥

ఱంకు= చీకటి తప్పు; తప్పి చరించుట= ఇతరులతో జతకట్టుట; తెరువు= దారి, ఉపాయము కాని తెరువు= పనికిమాలిన దారి= పనికిమాలిన ఉపాయము; కర్మకాండ= తద్దినం, దినం వగైరాలు. ఆలి= పెండ్లాము.

సోమయాజిగారు రంభా సంభోగానికై యజ్ఞం చేసేటప్పుడు ఆయన భార్య సోమిదేవమ్మను యజ్ఞం చేయించే పురోహితుడు “నీకు ఎంతమంది ఱంకుమగలు గలరు?” అని అడిగితే ఆమె నోటితో చెప్పలేక సైగలతో యింతమంది అని తెలుపునట. ఈ విషయం ఒక మంత్రం ద్వారా పురోహితుడు వెల్లడిస్తాడు.

చనిపోయిన పెద్దలకు ఏడాదికొకసారి వారి పేరున వారు చనిపోయిన రోజును గుర్తుచేసుకొని వారి తాలూకువారు వారికి తర్పణాలు (నీరు మొదలగునవి) వదలుతారు. ఆ కర్మకాండను “తద్దినము” అంటారు.

తద్దినము పెట్టునపుడు పురోహితుడు రెండు మంత్రాలు చదువును. ఒక మంత్రంలో తద్దినము పెట్టే యజమాని యిలా అంటాడు– "నా తల్లి నా తండ్రిమీద అసక్తురాలు కాకుండా కామోద్రేకంతో పరపురుషుని (విటునితో)తో చరించి వున్నట్లయితే, నేను సమర్పించే యీ తర్పణ జలము ఆ అన్య పురుషునికి చెందకుండా వుండుగాక! అతడు నిరాశజెంది తిరిగి పోవుగాక!"

రెండవ మంత్రంలో తద్దినముపెట్టే ఆసామి యింకా యిలా అంటాడు. "నిలకడ లేకుండా అంతటా పాటి ప్రతిదానిని తడుపుతూ సర్వ ప్రపంచాన్ని భరించునట్టి యీ నా తర్పణజలం నా తల్లి పెనిమిటికాని ఆ అన్య పురుషుణ్ణి అడ్డగించి అతనిని దూరంగా నెట్టివేయుగాక!" అని తర్పణజలం వదులుతాడు. నేటికీ యీ బూతు మంత్రాలను పురోహితులు తద్దినాలు పెట్టించేటప్పుడు చదువుచున్నారంటే మనం సిగ్గుపడాలో, ఏమిచేయాలో ఆలోచనగల వారందరూ ఆలోచింపవలసిన విషయం.

83. పిండములనుజేసి పితరుల తలపోసి,
కాకులకుబెట్టు గాడ్దెలార!
పియ్యతినెడుకాకి పితరుడెట్లాయెరా? ॥వి॥

పిండము= పిండిముద్ద, పితరులు= చనిపోయిన పితృదేవతలు తలపోయుట= తలచుకొనుట= ఆలోచించుట= చింతించుట= గుర్తుచేసుకొనుట.

84. కొత్తకుండదెచ్చి కోరి వంటలుసేసి
కాకులకు నిడెదరు కర్మలార!
పెంటదినెడుకాకి, పెద్దయేలాగయ్యె? ॥వి॥

ఇడుట= పెట్టుట, కర్ములు= కర్మలు చేయువారు.

చనిపోయిన మనిషి 3 లేక 10 లేక 15 రోజుల వరకూ మన మధ్యనే గాలి రూపంలో వుంటాడనియు, వానిని తృప్తిపరచటానికై దినముచేసి బ్రాహ్మణులకు తినుబండారాలు, గుడ్డలు, గొడుగులు, పీటలు, గ్లాసులు, చెప్పులు, గోవులు, భూములు, బంగారము మొదలగువాటిని దానం చేయాలని బ్రాహ్మణ పండితులు చెబుతారు. ఇంతేకాదు దినం చేయనియెడల, చనిపోయినవాని తాలూకా

బ్రతికివున్నవారికి ఏదో ఒక కీడు తప్పక కలుగునని కూడ బెదరేస్తారు. కాని నిజానికి యీ శ్రాద్ధకర్మ కేవలం బ్రాహ్మణులు తమ డొక్కలు నింపుకోటానికి పన్నిన పన్నాగము మాత్రమే.

పురోహితులు చనిపోయిన వ్యక్తి తింటానికని కొత్తకుండలో చప్పిడి అన్నమును వండించి కాకులకు పెట్టిస్తారు. కాకులు ఆ అన్నమును తింటే చనిపోయినవ్యక్తి దానిని తిన్నట్లేనని పురోహితులు దినంచేసిన ఆసామికి నచ్చచెప్పెదరు. ఈ బూటకపు కర్మకాండను కొందరు నిజమని నమ్మిన్నీ, కొందరు సంఘానికి భయపడి చేస్తున్నారు. ఈ మూఢనమ్మకం ధనము, చదువు వున్నవారిలోనే ఎక్కువగా కన్పిస్తోంది.

85. ఛాగములనుగోసి జన్నంబులనుజేసి,
పడయు దేవలోకఫలమదేమొ?
జంతుహింస పాపమింతనరాదురా. ॥వి॥

ఛాగములు= మేకపోతులు, జన్మంబులు= యజ్ఞములు, జంతుహింస= జంతువులను చంపుట, పడయుట= పొందుట.

పూర్వకాలంలో బ్రాహ్మణులు యజ్ఞసందర్భాలలో మేకపోతులనుగాని, ఆవులనుగాని, గుఱ్ఱాలనుగాని దేవతలకు బలియిచ్చి వారి మాంసమును వారే కాల్చుకొని తినేవారు. వారు ఆ రోజులలో జంతుహింసను లక్ష్యపెట్టే వారుకాదు. వారికి అది తప్పుగా తోచేదికాదు.

86. మాయజగమటంచు మనుజులు చెప్పేరు
మాయకాదు కర్మమయముగాని,
మాయయైన జగము మఱియెడనున్నదో? ॥వి॥

87. మాయజగమటంచు మఱి పల్కుచుందురు
మాయగాదు బ్రహ్మమయముగాని;
మాయయైన జగముమఱి యెందునున్నదో? ॥వి॥

ఈ భూలోకాన్ని కర్మభూమి అని కూడ అంటారు. ఎందుకనగా యిక్కడ

ప్రతిప్రాణి నిత్యమూ ఏదో ఒక పనిని చేస్తూనే వుంటుంది. శరీరంతో పని చేయకూడదనే దొంగసన్యాసులు కూడ నిత్యమూ గాలిపీల్చుకొని వదలుట, చూచుట, మాట్లాడుట, తినుట, నిద్రించుట మొదలగు పనులు చేస్తూనే వుంటున్నారు. కాని వారు తమ జీవన పోషణకై మాత్రం శరీరంతో ఏమీ పనిచేయక సోమరులై తేరసొమ్ము తినే పేరయ్యల్లాగ తయారై కష్టజీవులైన సంసారులను బెదరించి ఆదరించి బ్రతుకుతున్నారు. నిజానికి యీ ప్రపంచంలో ప్రతి మానవుడు తన జీవన పోషణకై ఏదో ఒక పని చేయటానికి ఎంతో అవకాశం వుంది.

ఇక తాత్త్వికదృష్టితో చూస్తే యీ ప్రపంచం అంతా బ్రహ్మమయంగానే కన్పిస్తుంది. ఈ కంటికి కన్పించే కోట్లాది ప్రజలు యీశ్వరాంశ సంభూతులనే చెప్పాలి. కనుక యీ ప్రపంచం కర్మమయము బ్రహ్మమయము. అందువల్ల మనం నిత్యమూ కర్మచేస్తూ బ్రహ్మమును తెలుసుకోవటానికి  యత్నించాలి.

87. విప్రవరుల ముహూర్త విభవమునమ్ముచు
పెద్దల నొగి గూర్చి పెండ్లి సేయు;
ఉవిద ముండయౌ, ముహూర్తము నిజమెట్లు? ॥వి॥

ఈ భూలోకాన్ని కర్మభూమి అని కూడ అంటారు.ఎందుకనగా యిక్కడ ప్రతిప్రాణి నిత్యమూ ఏదో ఒక పనిని చేస్తూనే వుంటుంది. శరీరంతో పని చేయకూడదనే దొంగసన్యాసులు కూడ నిత్యమూ గాలిపీల్చుకొని వదబిలుట, చూచుట, మాట్లాడుట,, తినుట, నిద్రించుట మొదలగు పనులు చేస్తూనే వుంటున్నారు. కాని వారు తమ జీవన పోషణకై మాత్రం శరీరంతో ఏమీ పనిచేయక సోమరులై తేరసొమ్ము తినే పేరయ్యల్లాగ తయారై కష్టజీవులైన సంసారులను బెదరించి ఆదరించి బ్రతుకుతున్నారు. నిజానికి యీ ప్రపంచంలో ప్రతి మానవుడు తన జీవన పోషణకై ఏదో ఒక పని చేయటానికి ఎంతో అవకాశం వుంది.

ఇక తాత్త్వికదృష్టితో చూస్తే యీ ప్రపంచం అంతా బ్రహ్మమయంగానే కనిపిస్తుంది.ఈ కంటికి కన్పించే కోట్లాది ప్రజలు యీశ్వరాంశ సంభూతులనే చెప్పాలి. కనుక యీ ప్రపంచం కర్మమయము బ్రహ్మమయము. అందువల్ల మనం నిత్యమూ కర్మచేస్తూ బ్రహ్మమును తెలుసుకోటానికి యత్నించాలి.

87.  విప్రవరుల ముహూర్త విభవనమ్ముచు
పెద్దల నొగి గూర్చి పెండ్లి సేయు;
ఉవిద ముండయౌ, ముహూర్తము నిజమెట్లు?  ॥వి॥

విప్రవరులు= శ్రేష్టమైన బ్రాహ్మణులు; ముహూర్తము= లగ్నము; విభవము= గొప్పతనము,శుభము, ఉవిద= ఆడుది=పెండ్లికూతురు; ఒగి= క్రమముగా= సక్రమముగా.

88.  విప్రులెల్లకూడి వెట్టికూతలు గూసి
సతిపతులను గూర్చ సమ్మతమున;
మునుముహూర్తముంచ ముండేలమోసెరా?  ॥వి॥

మన ఆంధ్రప్రాంతంలో చాలా పెండ్లిండ్లు జ్యోతిష్కులు పెట్టిన ముహూర్తాలతోనే తు.చ. తప్పకుండా బ్రాహ్మణ పురోహితులు పవిత్రమైన వేదమంత్రాలతో చేయిస్తున్నారు. కాని వాటిలో ఎన్నో పెండ్లిండ్లు భగ్నమైపోతున్నాయి. నిజంగా మూహూర్తాలలో గనుక శక్తివుంటే ఆ పెండ్లిండ్లు ఎందుకు భగ్నమైపోతాయి? కనుక ముహూర్తాలలో బలంలేదని తేలింది. అంటే జ్యోతిష్యము బూటకమని రుజువైనది. నిజానికి జ్యోతిష్యము కేవలం సిద్ధాంతుల భుక్తికొరకు యేర్పడిన ఒక బూటకపు వృత్తివిద్యమాత్రమే. ఈ బూటకపు జ్యోతిష్యపు పిచ్చి ఇటీవల కాలంలో మన దేశంలోని రాజ్యాధినేతలలోనూ, ఉద్యోగస్తులలోనూ, సామాన్య ప్రజానీకంలోనూ ఎన్నడూ లేనంతగా అలుముకొనిపోయింది. ఈ బూటకపు జ్యోతిష్యపు పిచ్చి మన దేశంలో సామాన్య ప్రజానీకంలో నిజమైన వైజ్ఞానిక చైతన్యం కలగనంత వరకు మనదేశాన్ని విడిచిపెట్టి వెళ్ళేటట్టు కనిపించటంలేదు.

89.  భూమిపేరువల్ల పుణ్యస్థలంబాయె;
వెలయరాళ్ళవల్ల వేల్పులాయె;
నీళ్ళపేరువల్ల నిఖిల తీర్థములాయె?  ॥వి॥

వేల్పు= దేవత; నిఖిల= సర్వము, అన్ని.

ఊరు, నీరు, రాయి మొదలగునవి సామాన్యమైనవే. కాని వాటికి కాశి అని, గంగ అని, వెంకటేశ్వరుడని పేర్లు పెట్టగానే అవి పవిత్రములుగా ఎంచబడి

సేవించబడుచున్నవి. భూ ప్రదేశాలవల్లనే పుణ్యక్షేత్రాలకు, రాళ్ళవల్లనే విగ్రహాలకు, నీళ్ళవల్లనే తీర్థములకు నామరూపములు ఏర్పడుచున్నవేగాని వాని విశేషమేమీలేదు. చోటు, ఏఱు, కొండరాయి సామాన్యమైన జడపదార్థాలే. కాని కొంతమంది సోమరులైన పండితులు వాటికి కాశి, గంగా, ఏడుకొండల వెంకన్న అని పేర్లుపెట్టి అక్కడ గొప్ప మహత్తుగలదని కల్పిత కథలను అల్లి సామాన్య ప్రజానీకాన్నేగాక స్వార్థపరులైన మేధావులను కూడ ఆకర్షింపజేసి వారిని ఆర్థికంగా నిలువుదోపిడీ చేస్తున్నారు. ఈ రకంగా ఈ పుణ్యస్థలాలు, దేవాలయాలు, తీర్థాలు కేవలం పనికి దొంగలైన పండితుల పొట్టలకొఱకే యేర్పాటు కాబడ్డాయి. నేడు యీ పుణ్యస్థలాలు అన్నిరకాల చెడుగులకు నిలయమై పోయాయి. అక్కడ వ్యభిచారం మొదలుకొని తాగుడువరకు అన్ని దురభ్యాసాలు వీరవిహారం చేస్తున్నాయి. వీటన్నిటికీ మూలకారణం మతపిచ్చి. ఈ మతపిచ్చి నిర్మూలింపబడనంతవరకు యీ దురాచారాలు దూరం కాజాలవు.

90. నీళ్ళమునగనేల? నిధులమెట్టగనేల?
మొనసి వేల్పులకును మ్రొక్కనేల?
కపట–కల్మషములు కడుపులో నుండగా? ॥వి॥

నిధులు = దేవాలయాలు; మెట్టుట = త్రొక్కుట, అడుగిడుట, వెళ్ళుట; మొనసి= యత్నించి, వేల్పు= దేవత.

చెడ్డనడతగలవాడు, కుటిలహృదయంగలవాడు ఎన్ని పుణ్యతీర్థములలో మునిగిననూ ఎన్ని పుణ్యస్థలాలను దర్శించిననూ, ఎన్ని దేవతా విగ్రహాలకు పూజలు చేసిననూ ముక్తిని పొందలేడు. కాని కల్లాకపటములేని,మంచి హృదయంగల సామాన్యుడు దేవతా విగ్రహాలకు పూజలుచేయకుండానే, తీర్థములలో మునగకుండానే, పుణ్యస్థలాలు దర్శింకుండానే అతి తేలికగా ముక్తిని పొందగలుగుతున్నాడు.

91. తాము నిలుచుచోట దైవంబులేడని,
పామరజనులు తిరుపతుల కరుగ
జోగివేడిజేతి సొమ్మెల్లబోజేసి

చెడియు గృహముల జొరబడరేమ ॥వి॥

పామరజనులు= కల్లాపటము ఎరుగని సామాన్యజనులు; జోగి= బిచ్చము, బోజేసి= పోగొట్టుకొని; చొరబడుట= చొచ్చుట, దూరుట.

దైవము మనలోనూ, మన చుట్టుప్రక్కల అంతటా వ్యాపిఒంచి వున్నాడని ఒక చెంప ఉపనిషత్తులు వెలుగెత్తి ఉపదేశిస్తుండగా, మరొక చెంప స్వార్థపరులైన కొంతమంది పండితులు తిరుపతి, కాశీ, ప్రయాగ, గయా, రామేశ్వరం మొదలగు చోట్లయందు దైవము కనిపెట్టుకొని వుంటున్నాడనియు, ఆయనను దర్శించి ఆయనకు నైవేద్యాలు, కానుకలు వగైరాలను సమర్పించినవారు అతి తేలికగా ముక్తిని పొందగలరని మాయమాటలు చెప్పి పామరజనాన్ని ఆర్థికంగా నిలువుదోపిడీచేసి వారిని దివాళా తీయించుతున్నారు. పాపం పామరజనులు కపటులైన పండితుల మోసపు మాటలను నిజమనినమ్మి ఆయా పుణ్యస్థలాలకు వెళ్ళి ఇల్లూ ఒల్లూ గుల్లచేసికొని చచ్చిచెడి తడిసి ముప్పందవై వట్టిచేతులతో కొంపలకు చేరుకొంటున్నారు. అందుకే కాబోలు "తిరుపతి క్షౌరము" అనే సామెత చాల వాడుకలో వుంది.

92. విత్తమొకరికిచ్చి వితరణ గుణమును
చిత్త మొకరికిచ్చి చెఱచినాడు;
బ్రహ్మచేతలన్ని పాడైనచేతలు ॥వి॥

విత్తము= డబ్బు; వితరణము= దానము; చేత= పని.

93. పూతగడ్డికేల పుట్టించెవాసన?
కనకము తనకేమి కల్లజేసె?
బ్రహ్మచేత లెల్ల పాడైన చేతలు ॥వి॥

పూతగడ్డి= దర్భజాతిలోని ఒక జాతిగడ్డి, దీని వేళ్ళనే "వట్టివేళ్ళు" అంటారు. కనకము= బంగారము; కల్ల= పొరపాటు, నష్టము.

94. పునుగుపిల్లికేల పుట్టించె వాసనల్
దాని మహిమ ఏమి ధరణిలోన?
బ్రహ్మచేతలెల్ల పాడైనచేతలు.

పునుగుపిల్లి = పిల్లివలెనుండి పొలాలలో తిరుగు ఒక జాతి పిల్లి. దీని పెంట సువాసన కలిగివుంటుంది. ఆ వాసనను "పునుగు" అంటారు. అది చాల విలువైన వాసన ద్రవ్యము.

బ్రహ్మదేవుని పనులు మనకు చాల విచిత్రంగానూ విడ్డూరంగానూ కన్పిస్తాయి. కాని వాటి రహస్యం మనము తెలుసుకోలేకపోతున్నాము. ధనమున్న వానికి దానగుణం వుండదు. దానగుణం కలవానికి ధనం వుండదు. పనికిమాలిన గడ్డివేళ్ళకు, పొలాలలో గాలికి తిరిగే పునుగుపిల్లి పెంటకు ఎక్కడేని సువాసనలను భగవంతుడు కలిగించాడు. ఆయన పనులను మనం విమర్శింపజాలము.

95. దశమి, యేకాదశియని వ్రతములు పూని
మెతుకు దినకున్న దుర్గుణమది యడగునె?
పుట్టపైగొట్ట నురగంబు గిట్టబోదు
తీరెఱుంగని మౌఢ్య మీ తెఱగు వేమ॥ ॥వి॥

దుర్గుణము= చెడ్డగుణము; అడగుట= అణుగుట= తగ్గిపోవుట;నశించుట; ఉరగము= పాము, తెఱగు= విధము; మౌఢ్యము= మూర్ఖత తీరు= ఉపాయము; మతి= మనస్సు గిట్టుట = చచ్చుట, నశించుట.

ఉపవాసము= ఉప+ వాసము ఉప అంటే సమీపమున వాసము అంటే ఉండుట. ఉపవాసశబ్దమునకు మొత్తం అర్థం సమీపమున ఉండుట. ఎవరికి సమీపమున ఉండుట అంటే భగవంతునికి సమీపమున వుండుట అని ఆధ్యాత్మికవేత్త లంటారు. ఇంతేకాదు దాని అర్థం భగవంతుణ్ణి స్మరిస్తూ ఉండుట అని వారు వివరంగా చెబుతారు.

ఆధ్యాత్మికదృష్టితో ఉపవాసం చేసేవారు చాలమంది ఉపవాసంరోజున మామూలు తిండిని మానుకొన్నా, అల్పాహారమనో, ఫలహారమనో ఆకలి తీరే అంత పరిమాణంలో తీసికొంటారు. ఉపవాసం చేయుటవల్ల మనలోని మానసిక మాలిన్యము నశించునని చాలమంది నమ్మెదరు. ఏమీ తినకుండా వున్నందువల్ల కూడ మనలోని మానసిక మాలిన్యం పోవుట అసంభవం. ఎట్లనగా పుట్టలోనున్న పామును చంపటానికి పుట్టపైన బాదినప్పటికీ పాము ఏవిధంగా చావదో అదే

విధంగా ఉపవసించినంత మాత్రాన మనలోని మానసిక మాలిన్యం నిర్మూలింపబడ జాలదు.

96. నీళ్ళమునుగువాడు నిర్మలాత్ముడుకాడు
పూర్ణమైనముక్తి బొందలేడు;
నీరుకోడి యెపుడు నీళ్ళను మున్గదా? ॥వి॥

నిర్మలాత్ముడు= మురికిలేని ఆత్మగలవాడు= మురికిలేని మనస్సు గలవాడు, మురికిలేని నడతగలవాడు; నీరుకోడి= ఎప్పుడూ నీళ్ళల్లోనే వుండే పిట్ట= నీళ్ళకాకి.

మానవుడు నదులలోనూ, కోనేరులలోనూ, సముద్రంలోనూ, చెరువులలోనూ ఎన్నిసార్లు స్నానం చేసినా అతని శరీరంపై గల మురికి పోవునేగాని శరీరంలోగల మనస్సు యొక్క మురికి పోజాలదు. అతడు మురికిలేని మనస్సుగలవాడు కాజాలడు. ఎట్లనగా నీరుకోడి ఎల్లప్పుడూ నీటిలోనే కాపురం వుంటుంది. కాని దానికి ముక్తిలేదు. కనుక మనలోని మానసిక మురికిని పైపై నీటి స్నానాలు పోగొట్టజాలవు.

97. నీళ్ళలోన మొసలి నిగిడి ఏనుగు బట్టు;
బయట కుక్కచేత భంగపడును;
స్థానబలిమికాని తన బల్మి కాదయా ॥వి॥

నిగిడి= ధైర్యంగా; భంగపడుట= అవమానింపబడుట, ఓడి పోవుట.

స్వస్థానబలం చాలా గొప్పది. స్వస్థానం విడిచిపెట్టినపుడు మన బలం దెబ్బతినిపోతుంది. మనం బల హీనులమైపోతాము. నీటిలో వున్నప్పుడు మొసలి ఏనుగును కూడ కదలకుండా పట్టగలదు. కాని బయట నేలమీద కుక్కచేత పట్టుబడిపోతుంది.

98. నీళ్ళమీద నోడ నిలిచి తిన్నగసాగు,
బైట మూరెడైన బ్రాకలేదు;
నెలవు దప్పుచోట, నేర్పరి కొఱగాడు ॥వి॥

నెలవు= చోటు, ఇల్లు; నేర్పరి= తెలివిగా పనిచేయువాడు; కొఱ= ఉపయోగము, ప్రయోజనము; కొఱగాడు= ఉపయోగించనివాడు, పనికిరానివాడు,

పనికిరాడు.

99. నీళ్ళలోని మీను నిగిడి దూరముపాఱు
బయట మూరెడైన బాఱలేదు,
స్థానబలిమికాని తన బల్మి కాదయా ॥వి॥

మీను= చేప; పాఱుట= నడచుట, ప్రవహించుట.

స్వస్థాన బలము చాల గొప్పది. నీళ్ళపైన గంటకు కొన్ని మైళ్ళ ప్రయాణము చేయగల ఓడ నేలపైన మూరెడు దూరం కూడా పోజాలదు. అట్లనే చేప నీటిలో వున్నప్పుడు గంటకు కొన్ని మైళ్ళ దూరం పోగలదు. కాని నేలపైన ఒక మూరెడు కూడ పోజాలదు. కొద్ది మాటలలో చెప్పాలంటే మొసలి, ఓడ, చేప మొదలగునవి నీటిలో వున్నప్పుడు వాటిని పట్టశక్యం కాదు. కాని నేలమీద వాటి ఆటలు ఏమాత్రము సాగనేరవు. ఎందుకన నేల వాటికి అనుకూలమైన చోటు కాదు. నీటి ఆధారంతోనే అవి బలముగలవిగా రాణిస్తున్నాయి. అట్లనే అనుకూలము కానిచోట్లయందు బలమైన, తెలివైన మనుషులుకూడ ఎందుకూ పనికిరాకుండా పోతారు. కాని అనుకూలమైన చోట్లలో స్థాన బలిమివల్ల బలహీనులు, తెలివిహీనులు కూడ బాగా రాణిస్తారు. ప్రతి మనిషి తన బలంకంటే స్థానబలం ఎక్కువ గొప్పదని గుర్తుంచుకోవాలి.

100. భస్మధారిజూడ పాపమందురు జనుల్,
నామధారిజూడ నయమటంద్రు;
భస్మ–నామములకు పరమాత్మ యెవ్వడు?

భస్మధారి= శైవ సంప్రదాయము ననుసరించువాడు= శైవుడు, ఆ శివునిపూజించేవాడు. నామధారి= నామములు(పంగనామములు) పెట్టుకొను వాడు= వైష్ణవుడు= విష్ణువును పూజించువాడు. భస్మము= విభూతి నామము= నామాలు= పంగనామాలు; నాము= పంగనామాలకు ఉపయోగింపబడే తెల్లని మన్ను.

శైవులు తమ శరీరంమీద 12 చోట్ల మూడేసి విభూతి రేఖలను (గీతలను) ధరిస్తారు. వైష్ణవులు నాముతోనూ, తిరుచూర్ణముతోనూ తమ శరీరం మీద 12 చోట్ల పంగనామాలు పెట్టుకుంటారు. పూర్వం కొంతకాలం వరకు శైవులు, వైష్ణవులు

దేవునికై తగాదాలాడుకొని ఒకరినొకరు, నరుక్కొని అలసిపోయి చివరకు చెరి ఒక దేవుణ్ణి పెట్టుకొనిరాజీపడ్డారు. శైవులు శివుణ్ణి, వైష్ణవులు విష్ణువుని తమ తమ దేవాలయాలలో వుంచుకొని పూజింప సాగారు.

ప్రజలు ఉభయుల గుళ్ళల్లో గల శివకేశవులకు నైవేద్యాలు, కానుకలు, ముడుపులు వగైరాలను చెల్లించేవారు. నేడుకూడ కొన్ని గ్రామాలలో విష్ణాలయము, శివాలయము రెండూ కన్పిస్తాయి. ఈ రకంగా వైష్ణవ, శైవ బ్రాహ్మణులు తమ పొట్ట పోషణకై దేవుణ్ణి రెండుగా చీల్చి పూజిస్తున్నట్లు నటిస్తారు. నిజానికి వారు దేవుణ్ణి తమ భుక్తికొరకు అడ్డము పెట్టుకొని బ్రతుకుతున్నారు. పిచ్చి ప్రజలు వారి మోసంలో పడిపోతున్నారు.

101. భస్మదూషకులట భస్మంబుపాలైరి;
మంటి దూషకులును మంటిపాలు;
దూషణ ఫలమెల్లతోడనే చూపెరా ॥వి॥

మంటి= నామము, పంగనామములు; భస్మ దూషకులు= వైష్ణవులు, మంటి దూషకులు= శైవులు; దూషణ= నింద; మంటిపాలగుట= మంటిలో కలిసిపోవుట; భస్మంబుపాలగుట= బూడెదలో కలసిపోవుట, తోడనే= వెంటనే.

శైవులను బూడెద పూసుకొంటారని నిందించిన వైష్ణవులు చనిపోయినపుడు వారు కాల్చబడి బూడిదైపోతున్నారు. వైష్ణవులు ఒక విధమైన మన్నైన నామమును ధరిస్తారని నిందించిన శైవులు చనిపోయినపుడు పాతివేయబడి మన్నైపోతున్నారు. ఈ రకంగా శైవులు వైష్ణవులు ఒకరినొకరు ఘోరంగా నిందించుకొంటూ ఇద్దరకూ దేవుడు ఒక్కడేననే సత్యాన్ని మరచిపోయి పై వేషాలకై పోట్లాడుకొనునంత మూర్ఖులైపోయారని వేమ తన ఆవేదనను పైవిధంగా వెల్లడించాడు.

102. మన్ను మన్నున గలియు మత భేదములు యేల?
నీరు నీరున గలియ నిష్ఠ యేల?
అగ్ని అగ్నిని గలియ ఆనందపడనేల? ॥వి॥

ఏదో ఒకనాడు అన్ని మతాలవారు, అన్ని సంప్రదాయాలవారు, అన్ని కులాలవారు, అన్ని వర్గాలవారు, చదువుకొన్నవారు, చదువు లేనివారు, ఆడవాళ్ళు,

మగవాళ్ళు అందరూ చనిపోయిన తరువాత నీరు, గాలి, మన్ను, అగ్ని మొదలగు పంచభూతాలలో కలసిపోవలసిందే. అక్కడ ఎలాంటి హెచ్చుతగ్గులు, తేడాలు వుండవు. అక్కడ ఎటువంటి పక్షపాతము ఉండదు. అట్లాంటప్పుడు మనమందరం బ్రతికియున్న యీ నాలుగు రోజులయినా మతము, కులము, వర్గము, లింగము మొదలగు తేడాలను మరచి పోయి అందరం కలసిమెలసి మానవత్వంతో జీవించుట మంచిది కాదా?

103. అంగమెల్ల సడలి, యటు దంతములు నూడి
తనువు ముదిమిచేత తఱచు నడక;
ముప్పుతిప్పలబడి మోహంబు విడువడు ॥వి॥

అంగము= శరీరము, సడలుట= ఊడుట, జారుట, శిథిలమై పోవుట= కదలిపోవుట, తనువు= శరీరము; ముదిమి= ముసలితనము; ముప్పుతిప్పలుబడి= అష్టకష్టాలు అనుభవించి, మోహంబు= ఆడవాళ్ళయందు కోరిక= కామేచ్ఛ.

శరీరం కృశించిపోయి, పండ్లూడిపోయి, ముసలితనంతో శరీరం గజగజ వణకుచున్నా, ఎన్నో కష్టాలనుభవిస్తూ కూడా మగవాడు ఆడవాళ్ళమీద కోరికను వదలలేకపోతున్నాడు.

104. కలలోని సంపదలెల్లను,
కలగని మేల్కొన్న పిదప కనపడకేగున్
పలు భోగ-భాగ్యగుణములు,
కలరీతిగ, నమ్మవలెను ఘనముగ వేమా

సంపద= ఆస్తి; పలు= అనేకము; గణములు= గుంపులు, మందలు, సమూహములు; ఘనముగ= గట్టిగా, భోగ-భాగ్యములు= సంపదలు= ధనధాన్యాదులు.

కల వట్టిదే. ఎందుకన కలలో మనకు కనిపించే వస్తువులు మనం మేల్కొన్న తరువాత కనపడకుండా పోతున్నాయి. అట్లానే మన కంటికి కనిపించే యీ ప్రపంచ సంపదలు చివరకు మన శరీరాలు కూడ నశించిపోతున్నాయి. కనుక ఇటువంటి తిరములేని సంపదలను కూడబెట్టాలనే ఆరాటము కలిగివుండుట తెలివితక్కువతనమే.

105. అన్న మధికమైన అరయ మృత్యువునిజం;
అన్నమంటకున్న ఆత్మనొచ్చు;
చంప,పెంప బువ్వచాలదా వేయేల? ॥వి॥

అరయ= ఆలోచించగా, కనిపెట్టి చూడగా, పరిశోధించగా; మృత్యువు= చావు; నొచ్చుట= నొప్పి చెందుట= బాధపడుట.

మనం ఆకలి తీరేవరకే అన్నంతింటే, అది మనలను పెంచి పెద్దవాళ్ళను చేస్తుంది. తినవలసిన దానికంటే ఎక్కువగా తింటే అది మనలను చంపుతుంది. అంటే బ్రతికించటానికీ, చంపటానికీ అన్నమే కారణము. అయితే తినవలసినంత తిని వూరకుంటానికి మన నాలుక మన అదుపులో వుంటేగా? నిజానికి మనమంతా నాలుకకు తొత్తులమైపోయాము. అందువల్లనే మనం తినవలసిన దానికంటే ఏమాత్రమైనా ఎక్కువగానే తింటూ వుంటాము. అందువల్లనే మనం మాటిమాటికీ జబ్బుపడి మందులు సేవిస్తున్నాము. కాని మనం సాధ్యమైనంతవరకు ఆకలి తీరేంతవరకే తిని రుచి కొరకు తినకుండావుంటే మనం ఆరోగ్యవంతులముగా వుండవచ్చును.

106. అక్షరాశివెంట అడవుల వెంటను
కొండరాలగోడు కుడువనేల?
హృదయమందు శివుడుండుట తెలియరో ॥వి॥

అక్షరాశి= జపమాల; గోడు= ఏడ్చుట, కష్టము; కుడుచుట= అనుభవించుట.

దైవము సర్వప్రాణుల శరీరాలలోనూ, బ్రహ్మాండమంతటా నిండి వున్నాడని ఉపనిషత్తులలో వ్రాయబడివుంది. కాని చాలమంది మతిస్థిమితము లేక జపమాలలోనూ, అడవులలోనూ, కొండ గుహలలోనూ దైవాన్ని వెతకుచూ తమ విలువయిన జీవితాలను వ్యర్థపర్చుతున్నారు.

107. దేవుడనగ వేఱె దేశమందున్నాడె?
దేహితోడనెపుడు దేహమందె;
వాహనంబులనెక్కి వడి తోలుచున్నాడు ॥వి॥

దేహి= జీవాత్మ, శరీరములో వుంటున్న ఆత్మ; వాహనములు= ఇంద్రియాలనే వాహనములు; వడి= వేగముగా; తోలుట= నడుపుట.

దేవుడు (పరమాత్మ) మరెక్కడోలేడు. ఆయన జీవాత్మతోపాటు ప్రతిప్రాణి యొక్క శరీరంలోనూ వుంటూ ఇంద్రియాలచేత పనులు చేయిస్తూ వుంటున్నాడు. కనుక నిన్ను నీవు తెలుసుకొంటే నీవు దేవుణ్ణి తెలుసుకొన్నట్లే.

108. వెన్నచేతబట్టి వివరంబు తెలియక
ఘృతము కోరునట్టి యతని భంగి;
తాను దైవమయ్యు దైవంబుదలచునే?

వివరంబు= వివరము; వైనము= పద్ధతి; ఘృతము= నేయి; భంగి= విధము, రీతి.

వెన్నపూసను తన అరచేతిలో వుంచుకొని దానిని నేయిగా చేసుకొనే పద్ధతిని తెలుసుకోలేక, నేతికై బాధపడు అమాయకునివలె ప్రతి మానవుడు తన దేహంలోనే దైవం వున్నాడనే సంగతిని తెలుసుకోలేక ఆయన ఎక్కడో వున్నాడని వెతుకుతూ తికమకపడుచున్నాడు.

109. ఇట్టి ఘటములోన పెట్టిన జీవుని
కానలేక నరుడు కాశికేగి,
వెతకి వెతకి తుదకు వెట్టియై చెడిపోవు ॥వి॥

ఘటము= శరీరము; వెట్టి= పిచ్చివాడు; నరుడు= మానవుడు

110. దేహమందున్న దేవుని దెలియక
తీర్థవాసులగుచు తిరుగువాడు;
గంధతరువు మోయు గాడిదె చందంబు ॥వి॥

తరువు= చెట్టు, కొయ్య; చందంబు= విధమున, వలె.

గాడిద మంచి గంధపుచెక్కను ఎన్నాళ్లు మోసినా, అది మంచి గంధపు చెక్కల సువాసనను గ్రహించలేదు. అట్లనే మూర్ఖులు ఎన్ని తీర్థములను సేవించినప్పటికీ వారు దేవుని తెలుసుకోలేరు.

111. శైవవైష్ణవాది షణ్మతంబులకెల్ల

దేవుడొక్కడనుచు తెలియలేరె?

తమకు భేదమైన, తత్త్వంబు భేదమా? ॥వి॥

షణ్మతంబులు= ఆరు హిందూ మత సంప్రదాయాలు వాటిలో శైవ వైష్ణవ సంప్రదాయాలు ముఖ్యమైనవి. భేదము= తేడా, వేరు; తత్త్వంబ= తత్త్వము; పరమాత్మ= సారము.

క్రీస్తుమతంగాని మహమ్మదీయ మతంగాని హిందూమతంతో తగాదాలు పెట్టుకొన్నట్లు వేమన తన పద్యాలలో ఎక్కడా వెల్లడించినట్లు కనిపించదు. కాని హిందువులలో స్వార్థపరులయిన కొంతమంది మేధావులు శైవ, వైష్ణవ పేరులుగల రెండు సంప్రదాయాలను ఎసైబుష్టించుకొని సర్వ ప్రాణికోటికి దేవుడు ఒక్కడే అనే పపరమసత్యాన్ని మఱుగుపరచి తమ ఆర్థిక లాభానికై చెరి ఒక దేవుణ్ణి పెట్టుకొని సామాన్య ప్రజలను రెండుగా చీల్చి వారిలో కలతలు కలిపించి వారిని అనేక కష్టాలపాలు చేయుచుందుట చూచి వేమన్న తన తీవ్ర వేదనను, వెగటును కొన్ని పద్యాలలో ఘాటైన మాటలలో వెల్లడించాడు. అందులో ఈ పద్యం ఒకటి.

శైవ వైష్ణవాది అన్ని మత సంప్రదాయాలకు దేవుడు ఒక్కడే అనియు, మానవులకూ, మానవులకూ మధ్య తేడాలుంటే యుండవచ్చునుగాని పరమాత్మకు అటువంటి తేడాలుండవనియు ఈ నరపశువులు ఎందుకని తెలిసికోలేకపోతున్నారని వేమన అదేపనిగా వాపోయాడు.

112. ఏఱుదాటి మెట్టకేగిన పురుషుండు

పుట్టివరకు గొనకపోయినట్టు

యోగపురుషుడేం యెడలు పాటించురా? ॥వి॥

మెట్టకు= ఒడ్డుకు, నేలమీదకు; పుట్టి= గుండ్రని కొయ్యపడవ, సరకు గొనకపోవుట= లెక్కచేయక పోవుట, లక్ష్యపెట్టకపోవుట; ఒడలు= శరీరము; పాటించుట= మన్నించుట= లక్ష్యపెట్టుట.

ఏవిధంగానైతే ఏఱుదాటి ఆవలిఒడ్డుకు చేరిన పెద్దమనిషి, ఏఱు దాటటానికి తనకు ఉపయోగపడిన పడవను విడిచిపెట్టి వెళ్ళిపోవునో, అదే విధంగా యోగమెరిగిన సిద్ధపురుషుడు తన శరీరాన్ని లెక్కచేయడు. అతడు శరీరాధీనుడు కాడు. శరీరమే

అతని అధీనంలో వుండును.

113. చదువులందు రాజ్యపదవులందు పాడి
మొదవులందు స్త్రీల పెదవులందు
ఆశలుడిగినట్టి అయ్యలు ముక్తులు ॥వి॥

పదవి= ఉద్యోగము; మొదవు = ఈనిన ఆవు; ఉడుగుట= నశించుట, పోవుట

విద్యలందును, ఉద్యోగాలందును, పాడి పశువులందును ఆడవాళ్ల యందును ఆశలేనివాడే ముక్తికి అర్హుడు. ఆశలున్నంతవరకు మానవుడు ముక్తి పొందజాలడు.

114. జాతివారలెల్ల జాతివిద్యలునేర్చి
జాణులైరి మీరి జగతిలోన
బ్రాహ్మణులనువారు బ్రహ్మమునెరుగరు ॥వి॥

జాతి= కులము; జాతి విద్యలు= కుల విద్యలు, కులవృత్తులు; జాణులు= సమర్థులు, నేర్పరులు, నేర్పుగలవారు, తెలివిగలవారు.

అన్నికులాలవారు తమ తమ కుల వృత్తులను నేర్చుకొని నేర్పరులైనారు. కాని బ్రాహ్మణులమని చెప్పుకొనేవారు మాత్రం తమ కులవృత్తియైన బ్రహ్మవిద్యను నేర్చుకొనక భ్రష్టులైపోయికూడా తాము బ్రాహ్మణులమేనని చెప్పుకొని నవ్వులపాలై పోతున్నారు.

115. టిప్పణములుచేసి చప్పని మాటలు
చెప్పమందురన్ని స్మృతులు శ్రుతులు
విప్పిచెప్పరేల వేదాంతసారము? ॥వి॥

టిప్పణము= టీక, వ్యాఖ్య, అర్థ వివరణము; చప్పని= సారం లేని; స్మృతులు, శ్రుతులు= గుర్తున్నవి, విన్నవి, వేదములు.

పండితులమని చెప్పుకొనే కొంతమంది స్వార్థపరులు వేదములు మొదలగు మత గ్రంథాలు సామాన్య ప్రజానీకానికి అర్థం కాకూడదనే కుటిల బుద్ధితో వాటికి సామాన్య ప్రజలకు అర్థంకాని గ్రాంథిక భాషలో టీకలు వ్రాశారు. ఇటువంటి

కుటిల స్వభావంగల పండితులు వేదాంతసారమును ప్రజలకు అర్థమయ్యే తేలికమాటలో చెప్పుటకు అసలే అంగీకరించరు.

116. తత్త్వవాదులుంద్రుధర నెందఱైనను
తత్త్వవేదిజూడ ధరణిలేదు;
కలిగెనేనివాడు గానంగరాడయా ॥వి॥

తత్త్వవాదులు= తత్త్వమును గురించి మాటలతో వాదించువారు; ధర= భూలోకం; తత్త్వవేవ= తత్త్వమును ఎరిగినవాడు, తత్త్వము= బ్రహ్మపదార్థము.

ప్రపంచంలో వేదాంతాన్ని గురించి సామాన్య ప్రజలకు అర్థంకాని భాషలో అదేపనిగా వాదించే ప్రబుద్ధులు ఎక్కువగా కన్పిస్తున్నారు. కాని వేదాంతసారమును అవగాహన చేసుకొన్న నిజమైన తత్త్వవేత్త చాల మితముగా మాట్లాడుతూ వితండవాదాలకు దిగక ప్రజలలో అనామకుడుగా తిరుగుతూ వుంటాడు. అతనిని గుర్తించడం సాధ్యంకానిపని.

117. తనువులోననున్న తత్త్వంబు తెలియక
వేరెయాత్రపోవు వెఱ్ఱివాడు;
గంతమోసిమోసి, గాడిద తిరుగదా? ॥వి॥

గంత= గోనెసంచి; బరువు= బొంత; తనువు= శరీరము; తత్త్వము= పరమాత్మ, బ్రహ్మము

పరమాత్మ (దైవము) సర్వప్రాణులలోనూ, బ్రహ్మాండం అంతటా నిండివున్నాడని ఉపనిషత్తులు వగైరా ధార్మిక గ్రంథాలు ఉపదేశిస్తుండగా,మూర్ఖుడు తనలోవున్న పరమాత్మ స్వరూపాన్ని తెలిసికోటానికి ప్రయత్నించక మరెక్కడో కాశీలోనూ, గయలోనూ, తిరుపతిలోనూ వున్నాడని గంతమోసే గాడిదవలె యాత్రలకు పోవుచుందురు. అందువల్ల అతనికి కలిగే ఫలం ఏమీలేదు.

118. మాటలాడుటొకటి, మనసులోనొక్కటి,
ఒడలిగుణమదొకటి, నడతయొకటి,
ఎట్లు కలుగుముక్తి, యిట్టులుండగతాను? ॥వి॥

ఒడలు= శరీరము

దుష్టులు చెప్పేదొకటి,చేసేదొకటి, మనసులో ఆలోచించేదొకటి, నడచే నడతొకటి. వారు నిజం ఎన్నడూ ఎవరితోనూ చెప్పరు. ఇటువంటి నీచులకు ముక్తి ఎలా దొరుకును? కాని మనస్సుతోనూ, వాక్కుతోనూ, శరీరంతోనూ ఒకేవిధంగా నడచుకొను వానికే మనశ్శాంతి వుండగలదు. మనశ్శాంతినే ముక్తి అంటారు.

119. మాళ్ళు వెంటరావు మణులు వెంటనురావు;
ఆలుబిడ్డలు హితలరయారు;
తానునిచ్చునీవి తనవెంటవచ్చురా ॥వి॥

మాడు= మేడ; మాళ్ళు= మేడలు; మణులు= ఆస్తిపాస్తులు, ధనధాన్యాదులు; హితులు= మేలుకోరేవారు; జతగాండ్రు, ఈవి= దానము

ఎన్నో అబద్ధాలాడి, ఎన్నో మోసాలుచేసి, ఎన్నో హత్యలు చేసి మనం కట్టుకొన్న గొప్పగొప్ప మేడలుగాని, బ్యాంకులలో దాచుకొన్న డబ్బుగాని, చేసుకొన్న పెండ్లాలుగాని, కన్నబిడ్డలుగాని, మన జతగాండ్రు గాని, మనం చనిపోయేటప్పుడు మనవెంట రారని మనందరకూ బాగా తెలిసినసంగతే. కాని మనంచేసిన దానధర్మాలు మాత్రం మనవెంట వస్తవని పెద్దలంటారు.

120. అంతరంగమందు నపరాధములుచేసి
మంచివానివలెను మనుజుడుండు;
నితరులెరుగకున్న నీశ్వరుడెరుగడా? ॥వి॥

అంతరంగము= మనస్సు; అపరాధము= తప్పు, నేరము

ప్రపంచంలో రెండు రకాల మనుషులు కన్పిస్తున్నారు. కొందరు తమ మనస్సును అదుపులో వుంచుకోలేక తమ అవయవాలతో తప్పులుచేసి ప్రజలచేతను, ప్రభుత్వంచేతను దండింపబడుచున్నారు.

కొందరు తమ అవయవాలను అదుపులో ఉంచుకొని తమ మనస్సులతో, శరీర అవయవాలతో తప్పులు చేసినవారికంటేకూడ ఎక్కువనేరం చేస్తున్నారు. కాని ప్రజలుగాని, ప్రభుత్వంగాని మనస్సుతో నేరంచేస్తున్న మోసగాళ్ళ మోసాన్ని కనుగొని వారిని దండించలేకపోతున్నారు. అందువలన మనస్సుతో ఘోరమైన నేరాలుచేసిన పెద్దమనుషులు తాము పవిత్రమైన వ్యక్తులమని ప్రపంచానికి బాహాటంగా నిర్భయంగా

చాటుకొని ప్రపంచాన్ని మోసగిస్తూ కులుకుతున్నారు.

కాని వారి నేరాలను ప్రజలు ప్రభుత్వం కనుగొని వారిని శిక్షించలేకపోతే పోవచ్చునేమోగాని, సర్వాంతర్యామియైన సర్వేశ్వరుడు మనస్సుతో నేరాలుచేసిన మోసగాళ్ళను దండించక విడిచిపెట్టునా? ఏదో ఒక రోజున వారిపని పట్టితీరుతాడు.

121. ఆడదానిపొందు ఆశించనటువంటి
పురుషుడన్నవాడు పుడమిలేడు;
ఆడుదాన్నివిడిచి ఆ దేవుడెందా?

పొందు= పొత్తు, కలయిక; పుడమి= భూలోకము

122. కులము నీఱుచేసి, గురువును వధియింప,
పొసగ నేను గంత బొంకు బొంకె;
పేరు ధర్మరాజు, పెనువే పవిత్తయా ॥వి॥

కులము= వంశము; నీఱుచేయుట= నాశనం చేయుట, వధియించుట= చంపుట; బొంకు= అబద్ధము; బొంకుట= అబద్ధమాడుట; పెను= పెద్ద, గొప్ప; నీఱు= నిగుఱు, నివుఱు, బూడెద.

పేరునుబట్టి గుణంగాని, నడతగాని ఉంటుందనుకొనుట పొరపాటు. చాలమందికి "సత్యనారాయణ" అనే పేరు పెట్టబడుతోంది. కాని వారిలో ఒక్కరుకూడ సత్యము మాట్లాడరు. కొందరకు "పిచ్చయ్య" అనే పేరు పెట్టబడుతోంది. కాని వారిలో పిచ్చికి బదులు అమోఘమైన ఆలోచనలు, విశాలమైన పరోపకారబుద్ధి వుంటున్నాయి. చాలమందికి "శాస్త్రి" అనే పేరు పెట్టబడుతోంది. కాని వారిలో శాస్త్రజ్ఞానము పేరుకు కూడ వుండటం లేదు. చాలమంది ఆడవాళ్ళకు "ధనలక్ష్మి" అనే పేరు పెట్టబడుతోంది. కాని వారిండ్లల్లో ధనలక్ష్మి బదులు "ఇనుపగజ్జెల తల్లి" తాండవనృత్యం చేస్తున్నది. కనుక పేరునుబట్టి గుణముగాని నడతగాని పరిస్థితిగాని వుంటుందనుకొనుట గొప్ప పొరపాటు. చూడండి. "ధర్మరాజు అనే పేరు మంచిదే. కాని ఆ పేరు పెట్టబడిన (కుంతీదేవికీ, యమధర్మరాజుకు పుట్టిన) కుర్రవాడు తన వంశాన్ని బూడిదపాలు చేయటమేగాకుండా తన పూజనీయుడైన గురువును కూడ తన పొట్టన పెట్టుకొన్నాడు. ధర్మరాజుపేరు మంచిదే; కాని గుణము

మాత్రం వేపవిత్తుకంటె ఎక్కువ చేదుగావుంది. అంటే విషపూరితమైంది.

ద్రోణాచార్యుని కొడుకుపేరు అశ్వత్థామ. పాండవుల సేనలోని ఒక ఏనుగు పేరుకూడ అశ్వత్థామ. ద్రోణాచార్యుడు కౌరవుల తరపున చాల భయంకరంగా యుద్ధం చేయసాగాడు. అప్పుడు మాయలమారి కిట్టయ్య ధర్మరాజుచేత "అశ్వత్థామ చచ్చెను" అని ఒక పెద్ద పచ్చి అబద్ధము ఆడించాడు. ద్రోణుడు ఆ వార్తను విని తన కుమారుడు చనిపోయాడని దిగులుపడి యుద్ధంచేయుట మానివేసెను. అప్పుడు పాండవులు ఆయనను చంప గలిగారు.

వేమన్న ధర్మరాజును గురించి యీ పై పద్యము వ్రాసినందులకు బ్రాహ్మణ పండితులంతా వేమన్నమీద విరుచుకొని పడ్డారట. కాని నన్నయ ధర్మరాజును గురించి వేమన్నకన్న ఎక్కువ ఘోరంగా విమర్శిస్తే వారెవ్వరూ నోరు మెదపలేదట. వైదిక న్యాయము ఇంతే కాబోలు!

123. ఆడువారిగన్న, నర్థంబు బొడ గన్న
సారమైన రుచుల చవులుగన్న
అయ్యవార్లకైననాశలు పుట్టవా? ॥వి॥

కనుట= చూచుట, అర్థము= డబ్బు; పొడ= పొత్తు, స్నేహము; సారమైన రుచులు= రుచిగల వస్తువులు; చవి= రుచి; అయ్యవార్లు= గురువులు; నిష్టగలవారు= పెద్దచదువులు చదివిన పండితులు.

సృష్టిలోని ప్రాణముగల ప్రాణము లేని అనేక వస్తువులు మానవులను ఆకర్షిస్తున్నాయి. అందులో ఆడవాళ్ళ చక్కదనము, వయ్యారాలు, ధనము, రుచిగల తినుబండారాలు, వాటి వాసనలు మొదలగు వాటినిపొందినపుడుగానిచూచినపుడు గాని ఎంత నిష్ఠగలయోగికైనా ఆశకలుగక మానదు.కాని ఆ ఆశను, అరికట్టగలిగినవాడే మనశ్శాంతిని పొందగలడు. వాడే ముక్తుడు కాగలడు.

124. ఆకటికి దొలంగు నాచార విధులెల్ల;
చీకటికి దొలంగు చిత్తశుద్ధి;
వేకటికి దొలంగు వెనుకటి బిగువెల్ల ॥వి॥

ఆచార విధులు= స్నానము, సంధ్య, జపము, మడి వగైరా ఆచారములు;

చీకటికి= చీకటి పడగానే; చిత్తశుద్ధి= మనోనిగ్రహము, మనో నిబ్బరము, వ్రేకటి= గర్భిణీ స్త్రీ, నిండుచూలాలు; బిగువు= బింకము, పటుత్వము; తొలగుట= పోవుట

మేము గొప్ప ఆచారపరులము, గొప్ప కులాలవారము, స్నానము చేయకుండానూ, సంధ్యవార్చకుండానూ, మడికట్టుకోకుండానూ తిండితినమని కోతలుకోసే పండితవరేణ్యులు తిండిదొరకని రోజులలో తమకు తిండి దొరికినపుడు తమ మడులను, సంధ్యలను, స్నానాలను ఒక మూలకునెట్టి ఆత్రముతో తినసాగుదురు.

అట్లనే మేముగొప్ప ఇంద్రియ నిగ్రహముగల జితేంద్రియులము అని బింకాలు పలికిన నిక్షేపరాయుళ్ళు ప్రొద్దుకూకగానే కామానికి తొత్తులై గోచీలు వూడదీస్తారు.

అట్లనే, నేను గొప్ప శరీరపటుత్వము గలదాననని గప్పాలుకొట్టిన గర్భిణీ స్త్రీ తన తొలికాన్పుతోనే తన శరీరముయొక్క బిగువెల్లా పోగొట్టుకొని బక్కచిక్కిపోతుంది.

125. న్యాయశాస్త్ర మరయ నన్యాయ మొనరించు;
ధర్మశాస్త్ర మొసగు, దుర్మతంబు,
జ్యోతిషము జనులనీతులు దప్పించు ॥వి॥

దుర్మతము= అధర్మము, మూఢాచారము; ఒసగుట= ఇచ్చుట, అర్పించుట; ఒనరించుట= కలిగించుట.

న్యాయ సంస్థాపనకు తోడ్పడే న్యాయాధీశులు (జడ్జీలు) న్యాయ వాదులు, (ప్లీడర్లు, లాయర్లు), ధర్మసంస్థాపనకు తోడ్పడే పండితులు, మఠాధిపతులు, పీఠాధిపతులు, మతప్రచారకులు, జ్యోతిషమును చెప్పే సిద్ధాంతులు మొదలగు మేధావులందరూ పచ్చి స్వార్థపరులై విలాసాలకు,పైసలకు బానిసలైపోయినందున న్యాయాలయాల్లో న్యాయానికి బదులు అన్యాయము, ధర్మానికి బదులు అధర్మము, నిర్భయత్వానికి బదులు పిరికితనము సామాన్య ప్రజానీకాన్ని పెనవేసుకొనిపోయినందున వారుకూడ అవినీతికి బలికావలసి వస్తోంది. నేడు దేశం అన్ని రంగాలలోనూ అవినీతిని ఎదుర్కోవలసి వస్తోంది.

126. బ్రహ్మ జాతివారు భ్రష్టులై పోయిరి;

ఋషుల జాతివారు రిత్తలైరి;

రోతయైన వారిని రోయక పిల్తురా?" ॥వి॥

భ్రష్టులు= అవినీతిపరులు, చెడిపోయినవారు; రిత్తలు= అబద్ధములాడువారు, సోమర్లు; రోత= ఏవగింపు, ఏవము, అసహ్యము; రోయుట= ఏవగించుకొనుట, నీచంగా చూచుట, అసహ్యించుకొనుట.

నేడు తమను బ్రహ్మజాతివారమనియు, ఋషి వంశస్థులమనియు చెప్పుకొనే జన్మగత బ్రాహ్మణులు విలాసాలకు, పైసలకు బానిసలై బ్రష్టులైపోయారు. అందువలనవారికి సమాజంలో గౌరవమర్యాదలు గాని, ఆదరాభిమానాలుగాని లేకుండా పోయాయి. సమాజం అదేపనిగా వారిని ఏవగించుకొంటున్నది.

127. కబ్బమొకటిపూని గడగడ జదివిన

లోనియర్థమెట్లు తానెఱుంగు?

ఃఎరుకమాలు చదువులేటికో తెల్పరా? ॥వి॥

కబ్బము= పుస్తకము, కావ్యము; ఎరుక= జ్ఞానము; ఎరుకమాలు= జ్ఞానంలేని; పూనుట= తీసికొనుట.

జ్ఞానాన్ని కలిగించనిచదువులు అడవిగాచిన వెన్నెలవంటిది. వాటివల్ల చదివిన వారికి, సమాజానికి కలిగే లాభం సున్న "జ్ఞానాన్ని తెలిపే చదువే నిజమైన చదువు" తక్కిన చదువులు చదువులేకాదు.

128. చదివి చదివి చదివి చావంగ నేటికి?

చావులేని చదువు చదువ వలయు;

చదువులేక కోటిజనులు చచ్చిరిగదా ॥వి॥

చావులేని చదువు= శాశ్వతానందం కలిగించే చదువు

ఇది ముందు డబ్బుయుగం. ఆ తరువాతే అణుయుగం, ఎందువలన నేడు ప్రపంచ మానవులమీద డబ్బు పెత్తనం చెలాయిస్తోంది. డబ్బులేనివాడు డుబ్బుకు కొరగాడనేమాట ఎంత సత్యమో నేడు డబ్బు మానవుణ్ణి పసరముగా (పచ్చి స్వార్థపరునిగా) తయారుచేస్తున్న మాట కూడ అంత నిజమే. నిజానికి డబ్బులేనిది

మానవజీవితం గడచుట అసంభవమనే మాట కూడ నిజమే. అందుకని ప్రతివాడు డబ్బును సంపాదించాలని ఆరాట పడుతున్నాడు. అందుకూ ప్రతి మానవుడు డబ్బు సంపాదించటానికి పనికివచ్చే చదువునే చదవసాగారు. ఈ చదువును "డబ్బు చదువు"లని అంటున్నారు. కాని యీ డబ్బు చదువు మానవుణ్ణి వేషంలో గొప్ప నాగరికునిగానూ, ఆచరణలో గొప్ప అనాగరికునిగాను తయారు చేస్తోంది. అంటే ఈ డబ్బు చదువు వలన మానవుడు తనతోటి మానవులయందు సానుభూతిని కూడ చూపనంతటి నిర్దయుడుగా తయారైపోతున్నాడు.

ఇంతేకాదు. యీ డబ్బు చదువు మానవునికి అనేకరకాలైన దురభ్యాసాలను నేర్పి అతనిని గొప్ప అవినీతిపరునిగా తయారుచేస్తోంది. అంతేకాదు, డబ్బు చదువు మానవుణ్ణి డబ్బుకు దాసునిగాచేస్తోంది. ఈ డబ్బు చదువు వల్ల సమాజంలో ధనకాంక్ష, మోసము, దౌర్జన్యము, సోమరితనము, వ్యభిచారము, త్రాగుడు, ఓర్వలేనితనము, మొదలగు దుర్గుణాలు విచ్చలవిడిగా వీరవిహారం చేస్తూ సంఘాన్ని ఛిన్నాభిన్నం చేసివేస్తున్నాయి. సమాజంలో నేడు నీతి నిజాయితీ, పరోపకారబుద్ధి, సత్ప్రవర్తన మొదలగు సద్గుణాలు నామరూపాలు లేకుండా పోయాయి. అందువల్ల ప్రపంచమానవాళి నిజమైన స్థిరమైన శాంతిభద్రతలు లేక తమ ప్రాణాలను అరచేతిలో వుంచుకొని కొనవూపిరి నిల్పుకొంటున్నది. ఈ సమయంలో "జ్ఞానం చదువు" నిరాశా నిస్పృహలతో కొట్టుమిట్లాడుతున్న ప్రపంచమానవాళికి ఎంతైనా అవసరం.చాలమంది జ్ఞానం అంటే కేవలం దైవాన్ని తెలుసుకోవటానికి తోడ్పడే చదువని అనుకొంటారు. కాని జ్ఞానం చదువు మానవునికి నిత్యజీవితంలో ఎంతో ఉపకారిగా వుంటున్నది. ఎట్లనగాజ్ఞానంచదువు మానవుణ్ణి పశుత్వం నుండి మానవత్వం వైపుకు మరల్చగలదు. అది మానవుణ్ణి దురభ్యాసాల నుండి కాపాడగలదు. అది మానవుని డబ్బుకు దాసునిగాకానియ్యదు. పైపెచ్చుడబ్బును మానవునిచేతిలో కీలుబొమ్మగా చేసివేయదు. జ్ఞానం చదువు మానవుణ్ణి తన తోటి మానవులతో కలసిమెలసివుండేలాగున చేస్తూ అతనిని తన తోటిమానవుల బాగోగులను తన బాగోగులుగా ఎంచేలాగునచేసి వానిని వారికి సహాయకునిగా తయారుచేస్తుంది. జ్ఞానం చదువువల్ల మానవుడు మితాహారిగానూ, మితభాషిగానూ,

పరోపకారిగానూ తయారుకాగలడు.

టూకీగా చెప్పాలంటే జ్ఞానం చదువు, మానవుణ్ణి, శరీరాన్నీ మనస్సునూ అదుపులో పెట్టుకోగల స్థితప్రజ్ఞునిగా తయారుచేయును. జ్ఞానం చదువు చదివిన మానవుడు తనసుఖము, క్షేమము, అభివృద్ధి పదిమంది సుఖము, క్షేమము, అభివృద్ధులలో ఇమిడి వుంటున్నాయని తెలిసికోదగిన వాడుగా తయారు కాగలడు. అంటే జ్ఞానం చదువు వల్లమానవుడు నిష్కామకర్మ యోగిగానూ మహామనీషిగానూ గొప్ప మానవసేవకుడుగానూ తయారు కాగలడు. ఇటువంటి మానవసేవకుడే ముక్తుడనబడుతున్నాడు. ముక్తుడనగా సంపూర్ణ మనశ్శాంతి గల మానవుడు. ఇటువంటి వాడినే దైవభక్తుడంటారు. ఇతడే దైవకృపకు పాత్రుడు.

కనుక మనం జ్ఞానం చదువును ఎంత తొందరగా నేర్చుకొంటే మనకూ ప్రపంచమానవాళి కంతకూ మనశ్శాంతి, సుఖము, భద్రత చేకూరగలవు. లేక యీ డబ్బు చదువునే యింకా కొంతకాలం పాటు మనం సాగనిస్తే ప్రపంచమానవజాతి మొత్తం అతిస్వల్ప కాలంలోనే భూగోళంనుండి తుడిచిపెట్టుకొనిపోయినా పోవచ్చును.

129. మేక జంక బెట్టి మెలగుచు మందలో
భ్రమసి తిరుగు గొల్ల పగిదిగాను;
దేవునెఱుగక, పరదేవతల దలంచు ॥వి॥

మెలగుట= తిరుగుట; భ్రమసి= పొరపాటుపడి, మరచిపోయి; పగిడి= విధము, రీతి; పర= ఇతర.

ఏ విధంగానైతే గొఱ్ఱెల యజమాని తన చంకలో గొఱ్ఱెపిల్లను పెట్టుకొని మతిమరుపువల్ల దానికై మందంతా వెతికి వ్యర్థుడైపోతున్నాడో అదేవిధంగా మానవులు మూర్ఖతవల్ల తమ శరీరములలో గల దేవుణ్ణి కనుగొనలేక ఇతర చోట్ల నున్న చిల్లరదేవతా విగ్రహాలను సేవిస్తూ తమ జీవితాలను వ్యర్థపుచ్చుతున్నారు.

130. తరువ దరువ బుట్టు దరువు నందనలంబు
తరువ దరువ బుట్టు చదివి వెన్న;
తలఁపదలప బుట్టు దధిని దత్త్వంబు ॥వి॥

తరుచుట= మథించుట, చిలుకుట, త్రచ్చుట, రుద్దుట; తరువు= చెట్టు,

కొయ్య, కర్ర; అనలంబు= నిప్పు; దధి= పెరుగు; తలపుట= తలచుట; తత్త్వము= ఆత్మజ్ఞానము= పరమాత్మ; తనువు= శరీరము.

రాయగారాయగా కొయ్యనుండి నిప్పు, గిలకొట్టగా పెరుగు నుండి వెన్నపూస, పుట్టుచున్నవి. అట్లనే చింతన చేయగా చేయగా మన శరీరంలో గల ఆత్మతత్త్వము మనకు తెలిసిపోగలదు.

131. తన కులగోత్రము లాకృతి
తన సంపద కలిమిబలిమి తనకేలనయా?
తన వెంటరావు నిజమిది
తన సత్యమె తోడవచ్చు దనతో వేమా॥

ఆకృతి= ఆకారము, రూపము, శరీరము; కలిమి= ధనము; బలిమి= బలము.

మానవుడు చచ్చిపోయినపుడు అతని వెంట అతని కులము, మతము, ఆకారము, బలము, సంపద, సంతానము, పెండ్లాము, పుస్తకాలు, జపమాలలు, రుద్రాక్షమాలలు, దేవతార్చన సామగ్రి మొదలైనవి ఏవీ అతని వెంట వెళ్ళవు.కాని అతడు చేసిన మంచి మాత్రం అతనివెంట వెళ్లును కనుక మనం సత్ప్రవర్తనము గల వారలముగా వుండాలని వేమన మనకు ఉపదేశిస్తున్నాడు.

132. పాపవర్తనుండు బ్రాహ్మణుండయ్యును,
నిజము శూద్రుని కంటె నీచ తముడు;
సత్య, శౌచ, ధర్మశాలి శూద్రుండయ్యు,
అతడు సద్విజుండు అనిరి మునులు వేమ॥ ॥వి॥

వర్తనము= నడత; పాపవర్తనుడు= చెడ్డ పనులు చేయువాడు, సద్విజుడు= నిజమైన బ్రాహ్మణుడు; శౌచము= శుభ్రము.

బ్రహ్మ ముఖమునుండి పుట్టానని చెప్పుకొనే జన్మగత బ్రాహ్మణుడు చెడ్డ నడతగల వాడైనట్టయితే, వాడు శూద్రుడని చెప్పబడే జన్మగత శూద్రుని కంటె కూడా ఎక్కువ నీచుడుగా ఎంచబడును. కాని మంచి నడత గల శుభ్రముగా వుంటూ వున్న ధర్మబుద్ధి గల శూద్రుడే నిజమైన బ్రాహ్మణుడు అని మునులే అన్నారు.

133. మైలకోక తోడ, మాసిన తల తోడ,
ఒడలి ముఱికి తోడ వుండెనేని,
అధిక కులజునైన అట్టట్టుపొమ్మండ్రు ॥వి॥

మైలకోక= మురికిగుడ్డ; ఒడలు= శరీరము; కులజుడు= కులంగల వాడు; అట్టట్టు= దూరంగా= అసంట; మాసిన= ముఱికి గల.

పరిశుభ్రతను జనం కులంకంటే ఎక్కువ గౌరవంగా చూస్తారు. పరిశుభ్రంగా వున్న తక్కువ కులం వానిని, పరిశుభ్రముగా లేని ఎక్కువ కులం వానికంటే ఎక్కువ గౌరవంగా చూస్తారు. అగ్రకులం వాడు మురికిగా వుంటే వానిని జనం తమ దరికి చేరనివ్వక అతనిని రోతరించుకొని దూరదూరంగా పొమ్మంటారు.

134. ఈక లంటజేసె, తోకలంటగజేసె,
కోక లంటజేసె లోకమునకు;
మాన రక్షణంబు మర్యాదయని తెల్ప ॥వి॥

అంటచేయుట= కలిగించుట= యేర్పాటుచేయుట; కోక= గుడ్డ, పంచె; లోకము= జనులు; మానరక్షణము= ఆడగుఱిని మగగుఱిని కప్పుట; మర్యాద= గౌరవము

135. ఈకెలనుచు గొన్ని, తోకలనుగొన్ని
కోకలనుచు గొన్ని, గోరులనుచు;
గొన్నయయ్యె నున్నగుఱుఁ తును మూయగా ॥వి॥

కోకలు= చీరెలు, గుడ్డలు; గుఱుతు= ఆడగుఱి, మగగుఱి (పూకు, చుల్లి).

ఆడగుఱిని మగగుఱిని కప్పుకోటానికే మానవులకు గుడ్డలు, గోచీలు, పశువులకు తోకలు, పక్షులకు ఈకెలు దేవుడు ఏర్పాటు చేసెను. అంటే ప్రాణికోటి దిగంబరముగా (గుడ్డలేకుండా) వుండక ఏదో ఒక దానితో తమ మర్మాంగమును కప్పివుంచాలి.

136. కట్టెయందు నిప్పుకానని చంద మీ
తనువు నందు ఆత్మ తగిలియుండు;
మఱుగు తెలిసి పిదప మార్కొనవలెనయా ॥వి॥

కట్టె= కొయ్య; చందము= విధము; తనువు= శరీరము; మఱుగు= రహస్యము; కిటుకు; మార్కొనుట= ప్రయత్నించుట, ఎదుర్కొనుట; పిదప= తరువాత.

పూర్వం ఋషులు రావి, జమ్మి, ఉసిరిక, జిల్లేడు, కంది మొదలగు వాటి రెండు ఎండు పుల్లలను ఒకదానిపై ఒకటి వుంచి రుద్ది నిప్పును సృష్టించుకొనేవారట. ఆ పుల్లలను "అరణులు" అనేవారట. అట్టి నిప్పును స్వాభావికమైనది యెంచి ఋషులు దానితోనే యజ్ఞం చేసేవారట. కట్టెలో నిప్పు కనపడకుండా వున్నట్లే, మన శరీరాలలో కూడ ఆత్మయున్నదని తెలిసికొని దానిని పొందటానికి మనం యత్నించవలయును.

137. అజ్ఞానమే శూద్రత్వము
సుజ్ఞానము బ్రహ్మమౌట శ్రుతులను వినరా
ఆ జ్ఞాన ముడిగి వాల్మీకి
సుజ్ఞానపు బ్రహ్మమెంచె జూడర వేమ॥

శ్రుతులు= వేదములు; ఉడుగుట= నశించుట; సుజ్ఞానము= గొప్ప జ్ఞానము; శ్రుతులు= వేదములు.

శూద్రత్వం అంటేనే అజ్ఞానము. శూద్రుడనే కులం వేరే లేనే లేదు. అజ్ఞానం గలవాడే శూద్రుడు. ఏ కులానికి చెందినవాడైనా జ్ఞానం లేనపుడు, తాను శూద్రుడుగానే ఎంచబడాలి. జ్ఞానమే పరబ్రహ్మ స్వరూపము. బోయవంశస్థుడైన వాల్మీకి నారదుని ఉపదేశంవల్ల బ్రహ్మజ్ఞానమునొంది బ్రహ్మర్షి అయ్యెను.

138. విష్ణుభక్తులెల్ల వెలిబూడిదపాలైరి;
వాదమేల? మత విభేదమేల?
తెలియ లింగధరులు, తిరుమంటిపాలైరి ॥వి॥

వెలిబూది= విభూతి; వెలిబూదిపాలైరి= కాలి బూడిదై పోయిరి. తిరుమంటిపాలైరి= చచ్చి మంటిలో కలిసిపోయిరి.

వైష్ణవులు శైవులను బూడిద ధరిస్తారని నిందించి చచ్చిన తరువాత కాల్చబడి బూడిదైపోతున్నారు. శైవులు వైష్ణవులను నామును ధరిస్తారని నిందించి చచ్చినపుడు పాతివేయబడిన తరువాత కొన్నాళ్ళకు మన్నై పోతున్నారు. అందువలన పుట్టుటలోనూ

చచ్చుటలోనూ అందరూ సమానులే. మత సాంప్రదాయాలనుబట్టి వాద వివాదాలు పెంచుకొన్న లాభమేమున్నది? శైవులు వైష్ణవులుగానూ, వైష్ణవులు శైవులుగానూ చచ్చిన తరువాత మారుటలేదా? కనుక ఒకరినొకరు నిందించుకొనుట అవివేకము.

139. అరయ దోచుకొనుచు గురువని తన్నెంచి
తిరుగువాడు తన్ను నరయలేడు;
పనికిమాలినట్టి బానిస కొడుకురా

అరయుట= వెతకుట, తెలిసికొనుట; ఎంచుట= అనుకొనుట, లెక్కించుట; పనికిమాలిన= పనికిరాని

పూర్వం చాలమంది వానాకాలపు చదువులు చదివిన బాపనయ్యలు తాము గురువులమనియు, అయ్యవార్లమనియు చెప్పుకొని గుఱ్ఱాల మీద, పల్లకీల మీద ఎక్కి పగటి కాగడాలతోనూ బాకాలతోనూ గ్రామాదులలో మతబోధ చేస్తూ ప్రజలను ఆర్థికంగా దోచుకొనేవారు.ఇప్పుడు కూడ కొందరు తమ నిజస్థితిని ఏమాత్రం గ్రహించక తమను గొప్ప వారలమని భావిస్తున్నారు. ఇట్టివారు ఎందుకూ పనికిరాని తొత్తుకొడుకులు.

140. అక్షమాలబూని యలపటజెందక
కుక్షి నింపుకొనుట కొదువకాదు
పక్షికొంగ రీతి పైచూపులేటికో? ॥వి॥

అక్షమాల= జపమాల; అలసట= ఆయాసము; కుక్షి= పొట్ట; కొదువ= కొదవ, తక్కువ; కొరత= లోటు.

కొంగ చేపలను తినటానికై పైచూపు చూస్తూ జపము చేస్తున్నట్లు నటించి వీలునుబట్టి ఒక్కొక్క చేపను ప్రక్క చేపలకు తెలియకుండా పట్టుకొని తన పొట్టను నింపుకొంటూవుంటుంది. ఇదేవిధంగా కొందరు కుక్షింభరులైన దొంగ దైవభక్తులు జపమాలలను చేతబూని కళ్ళు మూసికొని జపము చేయుచున్నట్లు నటిస్తారు. ఈ నటనంతా పొట్టకూటికొరకే. ఇటువంటి దౌర్భాగ్యపు దొంగ దైవభక్తులు ముక్తిని పొందజాలరు.

141. కడుపుచిచ్చుచేత, కామానలముచేత

క్రోధవహ్ని చేత కుతిలపడక
యుక్త మనసుతోడ నుండినప్పుడెముక్తి ॥వి॥

చిచ్చు= నిప్పు, మంట; కడుపు చిచ్చు= ఆకలి; ఆనలము= నిప్పు; కామానలము= కామోద్రేకము, కామవాంఛ; క్రోధము= కోపము; వహ్ని= నిప్పు కుతిలపడుట= నొచ్చుకొనుట, బాధపడుట; యుక్త= తగిన; ముక్తి= మోక్షము= మనశ్శాంతి.

ఆకలి, కామము(బూతు), కోపము యీ మూడూ స్వాభావికంగా ప్రతి మనిషిని బాధిస్తాయి. అందువల్ల వీటి బాధలను తట్టుకోలేక చాలమంది వీటికి తొత్తుకొడుకులై భ్రష్టులైపోతారు. అట్టివారికి ముక్తి లభించదు. కాని స్థిరమైన నిర్మలమైన మనస్సుతో ఆకలి, కామము, క్రోధముయొక్క బాధలను తట్టుకొనగలిగితే ముక్తి అతి తేలికగా లభ్యమౌతుంది.

142. పచ్చవిల్తుచేత, గ్రచ్చుఱ జనులెల్ల
తచ్చనాడబడిరి ధరణిలోన;
కులజుడెవ్వడిందు? కులహీనుడెవ్వడు? ॥వి॥

పచ్చనిల్తుడు= పచ్చని విల్లుకలవాడు, మన్మథుడు; కామదేవుడు= లైంగిక ప్రేమను కలిగించు దేవుడు; క్రచ్చుఱ= వెంటనే; తచ్చనాడబడుట= పరిహసింపబడుట, ఆడింపబడుట; కులజుడు= ఎక్కువ కులంవాడు; కులహీనుడు= తక్కువ కులంవాడు, ధరణి= భూలోకము.

ఆడ, మగ జతకట్టాలనే కోరికను కామము లేక బూతు అంటారు. ఈ కామానికి అన్ని కులాలవారు, పండితులు, పామరులు, ఆడ, మగ కలిమిగలవాళ్ళు, కలిమిలేనివాళ్ళు అందరూ తొత్తులే.కామానికి కులం, మతం, కాలం, చోటు, వరుస, వాయి, కలిమి, లేమిడి వగైరాల పట్టింపులుండవు. కామం చేతిలో అందరూ– ఎక్కువ కులాలవారు– కీలుబొమ్మలే. కామానికి ఒక దేవుడు గలడు. అతనిని కామదేవుడు అంటారు. రోమనులకు గ్రీకులకు కూడ కామదేవుడున్నాడంటారు.

143. వ్రతము లాచరింప వట్టి కష్టమెకాని
బ్రతుకుమీద నాశపడుట యేల?

వ్రతముచేత పరుని వెదుకంగలేరయా ॥వి॥

పరుడు= పరమాత్మ

144. వ్రతములెన్నియైన వట్టి చిక్కులెకాని
ఆత్మ చిక్కుగాన అలవికాదు;
ఆత్మ చిక్కు బాపునతడెపో ఘనయోగి ॥వి॥

చిక్కు= కష్టము, మెలిక; పాపుట= చిక్కుతీయుట, పరిష్కార మార్గం కనుగొనుట; మన=గొప్ప, వ్రతము=దీక్ష, శ్రద్ధ.

హిందూ మతము వ్రతాలకు పుట్టిల్లు. హిందువులలో డబ్బున్నవాళ్ళు, డబ్బు చదువు చదువుకొన్నవారు, హెచ్చు కులాలవారు యీ వ్రతాలను ఎక్కువగా చేస్తూవుంటారు. ఎక్కువ వ్రతాలను ఆడవారు మాత్రమే చేస్తారు. కాని ఆడమగ ఇద్దరూ కలిసిచేసే వ్రతాలుకూడ లేకపోలేదు. ఆలుమగలుకలిసి చేసే వ్రతాలలో "సత్యనారాయణ వ్రతం" ముఖ్యమైనది. అతి చౌకపారైనదీ, ఎక్కువ వాడుకలో వున్నదీ కాని ఈ వ్రతం పేరులోనే యీ వత్రం యొక్క ఉద్దేశము తేటతెల్లమగుచున్నది. వ్రతం చేయించే పురోహితుడు వ్రతం చేసే ఆలుమగలతో "నేటి నుండి మేము సత్యమునే పలుకుదుము, అబద్ధం ఆడము" అనిపిస్తాడు. పాపం వ్రతం చేసేవారు చిలక పలుకుల్లాగ పురోహితుడు చెప్పిన మాటలను వల్లెవేస్తారు. చూడండి. ఎన్నో అబద్ధాలాడి, ఎన్నో మోసాలుచేసి, ఎన్నో హత్యలు చేసి, ఎన్నో లంచాలుబట్టి, తినుబండారాలలో ఎన్నో కలపరాని వస్తువులను కలిపి డబ్బు సంపాదించిన యజమానులచేత డబ్బుకు తొత్తయిన పురోహిత బ్రాహ్మడు సత్యనారాయణ వ్రతం చేయించుట సత్యస్వరూపుడైన నారాయణుని నవ్వులపాలు, బజారుపాలు చేయటం కాదా? ఇటువంటి చిత్తశుద్ధిలేని వ్రతాలవల్ల ఆత్మకు సంబంధించిన చిక్కు విడదు. వ్రతము చేయుట వ్యర్థమే. అయితే ఆత్మను గూర్చిన సందేహాల్ని తీర్చినవాడే గొప్పయోగి.

145. కుండ కుంభమన్న, కొండ పర్వతమన్న,
ఉప్పు లవణమన్న నొకటికాదె?
భాషలిట్లు వేరు పరతత్త్వ మొక్కటె ॥వి॥

పరతత్త్వము= పరమాత్మ

పలు మతాల భాషలు, పద్ధతులు వేరు వేరుగా వున్నందున ఒకే వస్తువును వేరు వేరు పేర్లతో పిలుస్తున్నారు. మనం తెలుగులో కుండ అనే దాన్ని కొందరు కుంభము, కొందరు ఘటము, కొందరు ఘడా, కొందరు పాట్ అనితమ తమ భాషలలో పిలుస్తున్నారు. కాని అందువల్ల కుండలో మార్పేమీ కలుగుటలేదు. అట్లనే భాషలు, పద్ధతులు వేరైనప్పటికీ పరతత్త్వము ఒక్కటే. కనుక వివిధ మతాలవారంతా అందరూ ఒకే దేవుని బిడ్డలేనని యెంచి కలసిమెలసి వుంటే అందరూ సుఖించగలరు.

కాని ఆయా మత ప్రచారకులు స్వార్థపరులై మత కలహాలను చాటున నుండి సామాన్య ప్రజలలో రెచ్చగొట్టుచున్నారు. అందువల్ల ఏదో ఒక మూల నిత్యమూ మత కలహాలు జరుగుతూనే వుంటున్నాయి. నేడు ప్రపంచంలో రాజకీయ కలహాలకంటే మత కలహాలే ఎక్కువ ప్రమాదకరమైనవిగానూ భయంకరమైనవిగానూ కన్పిస్తున్నాయి. అందువల్ల ప్రపంచ మానవులు పలు కష్టాలకు గురికావలసివస్తోంది. కనుక ప్రపంచంలోని మానవతావాదులంతా ఏకమై మానవులను పశువులకంటే హీనంగా చూచే యీ క్రూరమైన మతాలను మన్నుచేసి నిజమైన మానవతా మతాన్ని స్థాపించటానికి ప్రయత్నించాలి.

146. ఋగ్యజుస్సులెటిగి యోగ్యతలేకున్న
విప్రుడైన నెట్లు విహితుడగును?
భర్తగలిగియన్య భావించు సతివలె ॥వి॥

విహితుడు= మన్నింపదగినవాడు, సతి= పెండ్లాము; విప్రుడు= బ్రాహ్మణుడు; యోగ్యత= మంచి నడత

ఏ విధంగానైతే మగనియందు భక్తిగలిగియున్ననూ పరపురుషుని కోరు ఆడుదానిని సంఘం వెలివేయునో అదేవిధంగా నాలుగు వేదాలనూ తల్లక్రిందులుగా చదివిన ఘనాపాఠియైన బ్రాహ్మణుడు యోగ్యతను కలిగియుండని యెడల, అతనిని సంఘం తప్పక వెలివేయును. అంటే మంచినడతలేని పండితుణ్ణి సంఘం మన్నించదు. అతనిని సంఘం వెలివేసి తీరుతుంది.

147. పరగ బొమ్మ గ్రుడ్డు పరికించి చూచిన,
కులము లన్నియందె కూడి పుట్టె;
అందఱొకట గలియ, నన్నదమ్ములెగదా? ॥వి॥

బొమ్మగ్రుడ్డు= బ్రహ్మాండము; పరికించుట= చూచుట,వెతకుట

ఈ బ్రహ్మాండములో కులములన్నీ ఒకటిగా పుట్టాయి. కనుక మానవులందరూ అన్నదమ్ములేగదా. అయినప్పుడు కులభేదా లెందుకు? అందరం ఒకే దేవుని బిడ్డలమేగదా! మూలమున ఒకటే అయినప్పుడు శాఖలకేల భేదముండాలి? చెట్టుకొమ్మలకు, దాని బోదెకు గుణ భేదముండునా?

148. సకల జాతి పురుష సాంకర్యమునకును
సతుల నిచ్చి తాము సమ్మతింత్రె?
ఉన్నది కనలేని యోగులు బాపలా? ॥వి॥

సాంకర్యమునకు= జతకట్టడానికి, సంభోగించటానికి; సతులు= పెండ్లాలు; కనలేని= చూడలేని; కనుగొనలేని.

యోగులు తమ పెండ్లాలు అన్ని కులాల మగవాళ్ళతోనూ బట్టబయలు నందే స్వేచ్ఛగా జత కట్టుచుంటే చూచి కూడా వారిని మందలించకుండా మిన్న కుంటున్నారు. ఇటువంటి యోగులు తమను బ్రాహ్మణులమని చెప్పుకొనుట సిగ్గుచేటు కాదా?

149. జన్నములను మఱియు జన్నియ లననేక
ముల నొనర్చి యున్న ఫలము కాన
రాకయందు నీతిలేకున్న మాత్రాన ॥వి॥

జన్నములు= యజ్ఞములు, జన్నియలు= వ్రతములు, ఒనర్చుట= చేయుట.

నీతి అనే శబ్దానికి చాలా అర్థాలు గలవు. మంచి నడత, తనకు, తన సంఘానికి మేలు కలిగించేపని, దేశకాల పాత్రలను బట్టి పాటించవలసిన విషయము మొదలగు అర్థాలు గలవు. కనుక మంచి నడత లేకుండా ఎన్ని యజ్ఞాలు, ఎన్ని వ్రతాలు చేసినా ప్రయోజనం లేదు. నడత కులము మతము కంటె గొప్పది.

150. ఏమి యైనది పరతత్వ మెఱుగలేక;

సోమయాజులు పశువుల (గ్రుక్కడించి,
సామ మేర్పడ చదివినచావదేల?
బాధకంబైన దుర్గుణ పంక్తి వేమ॥

పరతత్త్వము= పరమాత్మ; గ్రుక్కడించుట= చంపుట; పంక్తి= సమూహము, గుంపు; సామము= సామవేదము.

పూర్వం కొంతమంది బ్రాహ్మణులు శరీర శ్రమ చేయలేక తమ భుక్తికై యజ్ఞాలను కల్పించి వాటిని చేసిన సర్వజనులు సుఖంగా ఉంటారని బూటకపు మాటలు చెప్పి ప్రజలనుండి భోజన సామగ్రితోపాటు కొన్ని మేకపోతులను కూడ దానంగా పొంది వాటిని చంపి కాల్చుకొని తినేవారు. తాము చేసిన హింస పోవటానికని సామవేదాన్ని వల్లెవేసేవారు. కాని వారు చేసిన పాపకార్య ఫలితాన్ని వారు అనుభవించితీరాలి. సామవేద గానంవల్ల వారి దుర్గుణాలు నశించవు. వారు యజ్ఞాలు కేవలం తమ పొట్టలకొరకే చేస్తున్నారుగాని పరమాత్మ ప్రాప్తికొరకు కాదు.

151. ఆపగాళివెంట, నడవుల వెంబను
కొండరాలవెంట పడగనేల?
ఉల్లమందె శివుడుండుట తెలియరో ॥వి॥

ఆపగ= ఏఱు, నది; ఉల్లము= హృదయము; ఆళి=ఆరి, సమూహము.

మూర్ఖులైన కొంతమంది సన్యాసులు తమ హృదయాలలో వున్న పరమాత్మను కనుగొనలేక అడవులలోనూ కొండ గుహలలోనూ, నదుల వెంట పరమాత్మను వెతుకుతున్నారు వారు పరమాత్మను యీ విధంగా ఎన్నటికీ పొందలేరు.

152. ఉపవసించియుండి యొగినీళ్ళ మునిగియు
కూడువండి వేల్పుకుడుపుమనుచు
దాని నోరుగొట్టి తామె తిందురుకదా ॥వి॥

ఒగి= లెస్సగా, బాగా; కుడుచుట= త్రాగుట, తినుట; నోరుగొట్టి= నోటికాడిది తీసికొని; వేలుపు= దేవత.

కొందరు కుక్షింభరులైన (తిండిపోతులు) బూటకపు దైవభక్తులు గొప్ప దైవభక్తులుగా నటిస్తూ ఉపవాసాలు, స్నానాలు,జపాలు చేస్తూ దేవతా విగ్రహాలకు

నైవేద్యంపెట్టి ఆ కూటిని తామే తనివితీర తింటారు. ఈ బూటకపు దైవభక్తులు తమ బొజ్జలు నింపుకోటానికి పన్నిన పన్నాగాలను యీ దేవుని నైవేద్యంతంతు. తమను దైవభక్తులమని చెప్పుకొనేవారు దేవుడు విగ్రహానికి నైవేద్యం (అన్నం) పెట్టి దేవుని విగ్రహం దానిని ఆరగించిన తరువాత దానిని తాము తింటున్నామని వక్కాణిస్తారు. కాని ప్రాణంలేని ఆ దేవతా విగ్రహం నిజంగా నైవేద్యాన్ని ఆరగిస్తే అంటే తింటే పూజారులకుగాని, దైవభక్తులకుగాని నైవేద్యం మిగలదుగదా! కనుక ప్రాణంలేని దేవతా విగ్రహం నైవేద్యాన్ని ఆరగించడం అనేమాట వట్టి బూటకమే. పూజారులు, పురోహితులు, సిద్ధాంతులు, మఠాధిపతులు, పీఠాధిపతులు, బాబాలు మొదలగు వారంతా ఇటువంటి బూటకాలతోనే సుఖజీవనం చేస్తున్నారు.

153. కొండరాళ్ళు తెచ్చి కోరిక గుడికట్టి
గుళ్ళలోన తిరిగి కుళ్ళనేల
పాయరాని శివుడు ప్రాణియై యుండగ ॥వి॥

పాయరాని= విడువరాని, అంటిపెట్టుకొనివున్న, వదిలించుకోవటానికి వీలులేని

విడువరాని శివుడు మన శరీరాలలోనే జీవమై యుండగా ప్రాణంలేని రాళ్ళతో కట్టిన గుళ్ళల్లో ప్రాణలేని రాతివిగ్రహాలలో ఆయన్ని వెతుకుతూ బాధపడనేల?

154. గట్టురాళ్ళుతెచ్చి కాళ్ళచేతుల త్రొక్కి
కాచిపులుల చేత గాసిజేసి,
మొఱటురాళ్ళ కెఱగు మెప్పెలనేమందు? ॥వి॥

గట్టు= కొండ; గాసి= చెక్కి; ఉలి=రాయిని చెక్కే యినుప పనిముట్టు; మొఱటు= మోటు, గట్టి; ఎఱగుట= మ్రొక్కుడు, మెప్పెలు= మూర్ఖులు.

కొండరాళ్ళను కాళ్ళతో తొక్కి ఇనుప ఉలులతో ఎడాపెడా చెక్కి విగ్రహాలుగా చెక్కి వాటిని దేవుళ్ళుగా ఎంచి వాటికి మ్రొక్కేవారు పరమ మూఢులుగా ఎంచబడతారు.

155. ఉపవసించినంత ఊఱపందిగబుట్టు,
తపసియై దరిద్రతను వహించు;

శిలకు మ్రొక్కనగునె జీవముగల బొమ్మ? ॥వి॥

శిల= రాయి; జీవముగల బొమ్మ= ప్రాణముగల మనుష్యుడు

చిత్తశుద్ధి లేకుండా ఉపవాసము చేసినవాడు ఊఅపందిగా పుడతాడు. చిత్తశుద్ధిలేకుండా తపస్సు చేసినవారు దరిద్రుడుగా పుడతారు. ప్రాణంగల మానవుడు ప్రాణంలేని రాతిబండకు మ్రక్కుట మూర్ఖతగాదా?

158. జీవలింగ పూజచేసినవారికి

శిలల రూపమందు జింతయేల?

చెలగి మధువుగ్రోల, చేదు రుచించునా? ॥వి॥

చెలగుట= యత్నించుట; మధవు= తేనె; క్రోలుట= త్రాగుట, తినుట.

తమ శరీరంలోనే ప్రాణరూపంలో వున్న శివుని పూజచేయు వారికి ప్రాణంలేని రాతిలింగ పూజ సమ్మతమగునా? ఇష్టపడరు. వారికి రాతిపూజ నచ్చదు. అది వారికి సుతరాం గిట్టదు. తీపి తినుచున్నవాని నోటికి చేదు రుచించునా?

157. తోలుకడుపులోన దొడ్డవాడుండగ

రాతిగుళ్ళనేల రాశిబోయ?

రాయి దేవుడైన రాసులు మ్రింగదా?

దొడ్డవాడు=పరమాత్మ; రాశి= కుప్ప, పోగు; రాశిబోయుట= దేవతకు నైవేద్యానికై అన్నము కుప్పగా పోయుట; కుంభము= అన్నపు రాశి; రాసులు= కుప్పలు.

మన దేహంలోనే ఆత్మ ఉండగా రాతి విగ్రహాలలో ఆత్మ ఉన్నదనుకొని పూజించుట మూర్ఖత మాత్రమే. రాతి విగ్రహాలలో దేవుడు గనుక వుంటే మనం పెట్టే నైవేద్యాలన్నీ ఆయనే తినివేయడుగదా? లేక మనం పెట్టే నైవేద్యాలు ప్రాణంలేని విగ్రహాలు తిన మొదలెడితే, పాపం పూజారుల నోట దుమ్మేగదా? నిజమేమంటే ప్రాణంలేని విగ్రహాలకు నైవేద్యాలు పెట్టించి పూజారులే వాటిని తింటున్నారు. పూజారులు తమపోషణకై యీ తంతు చేస్తున్నారు.

158. పడిపడి మ్రొక్కగ నేటికి?

గుడిలోగల కఠినశిలల గుణములు చెడునా?

గుడి దేహ మాత్మ దేవుడు
చెడురాళ్ళకు వట్టి పూజసేయకు వేమా॥

పట్టి= పిచ్చి

రాతిగుళ్ళల్లోగల రాతి విగ్రహాలలో ప్రాణంలేదు కనుక వాటిని పూజించుటవలన అవి మన కోర్కెలను తీర్చలేవు. కాని అవి పూజారులకు భుక్తిని కలిగించే మాట నిజమే. నిజానికి దేవునికి మన శరీరమే గుడి. మన శరీరంలోగల ఆత్మయే దేవుడు. వేరేచోటున దేవుని రాతివిగ్రహాన్ని పూజించేవాడూ, పూజ చేయించేవాడూ ఇద్దరూ మూర్ఖులే. కాని పూజారి తన పొట్టకొరకు యీ తంతును యెరిగుండియే నడుపుతున్నాడు.

159. ప్రాణప్రతిష్ఠన ప్రపంచమేకాని
వేరులేదు; భువిని వెదకిచూడ
ప్రాణప్రతిష్ఠచే ప్రతిమలు పల్కునా?

ప్రతిష్ఠ= కలిగించుట, నెలకొల్పుట, స్థాపించుట; ప్రపంచము గొప్ప మోసము= పచ్చిమోసము; ప్రతిమ= విగ్రహము, బొమ్మ; ప్రాణప్రతిష్ట చేయుట= ప్రాణం పోయుట, ప్రాణం కలిగించుట.

ఆగమశాస్త్ర పండితవరేణ్యులు ప్రాణంలేని రాతి విగ్రహాలలో ప్రాణం కలిగించగలమని వక్కాణిస్తారు. నిజానికి ప్రాణంలేని రాతివిగ్రహాలలో ప్రాణమును ఆగమశాస్త్ర పండితులు కలిగించగలిగివుంటే, అవి కనీసం పూజారులతోనైనా మాట్లాడాలి. అన్నం తినాలి, గుడ్డలు స్వయంగా కట్టుకోవాలి. పంగనామాలుగాని విభూతిరేఖలుగాని స్వయంగా పెట్టుకోవాలి. ఆడ విగ్రహాలైతే వారే స్వయంగా చీరెలు కట్టుకోవాలి. మగ పూజారులతో అవి చీరెలు కట్టించుకోకూడదు. ఎవరైనా తమను ఎత్తుకొనిపోవటానికి వచ్చినపుడు పోరాడి వారిని పోలీసులకు అప్పగించాలి. కాని ప్రత్యక్షంగాగానీ పరోక్షంగాగానిరాతి విగ్రహాలు యీ పనులేవీ చేసినట్లు కన్పించడంలేదు. కనుక ప్రాణంలేని రాతి విగ్రహాలలో ప్రాణప్రతిష్ఠ చేయుట కేవలం పచ్చి మోసమని బల్లగుద్ది చెప్పవచ్చును. కనుక ప్రాణంలేని రాతిబండలను ప్రాణముగల మానవులు పూజించుట మానుకోవాలి.

160. రాతి ప్రతిమదెచ్చి రాజసంబుగ నుంచి
పూజ సేయు నరుడు బద్ధిమాలి;
భావమందు పరము భావింపనేరడు ॥వి॥

రాజసంబుగా= గొప్పగా; బుద్ధిమాలి= బుద్ధిలేక, భావమందు= మనస్సునందు; పరము= పరమాత్మ.

చాలమంది మనుషులు భగవంతుడు తమలోనే ఉన్న సంగతిని తెలిసికోలేక బుద్ధిలేనివారై రాతిని దేవవిగ్రహముగా భావించి దానికి ఘనంగా పూజలు చేయుదురు.

161. రాతిబసవనిగని రంగుగా మ్రొక్కుచు
రూఢి బసవనిగని గ్రుద్దుచుంద్రు,
బసవభక్తులెల్ల పాపులు తలపోయ ॥వి॥

బసవడు= ఎద్దు; రాతిబసవడు= నంది విగ్రహము; రూఢిబసవడు= బ్రతికివున్న ఎద్దు; తలపోయుట= ఆలోచించుట.

శైవులు ప్రాణంలేని రాతినంది విగ్రహాన్ని ఎంతగానో గౌరవించి పూజిస్తారు. కాని ప్రాణంగల యెద్దుకు సరిగా మేతవేయరు, వేళకు నీళ్ళు పెట్టరు. దానిని అప్పుడప్పుడు కొట్టనుకూడ కొట్టుదురు. దానిచేత ఎక్కువగా పని చేయించుకొంటారు. ఇటువంటి దొంగ బసవభక్తులను గొప్ప పాపాత్ములని చెప్పాలి.

162. రాతిబొమ్మకేల రంగైనవలువలు
గుళ్ళు గోపరములు కుంభములును,
కూడుగుడ్డ తానుకోరునా దైవంబు? ॥వి॥

వలువలు= గుడ్డలు; రంగైన= అందమైన; కుంభము= అన్నపు పోగు, అన్నపు కుప్ప

ప్రాణంలేని రాతి విగ్రహాలు అన్నం తినలేవు; గుడ్డలు కట్టుకోలేవు, స్నానం చేయలేవు, నగలు ధరించలేవు,మాట్లాడలేవు, చూడలేవు, వినలేవు, నడవలేవు, కదలలేవు. కాని పరాన్నభుక్కులైన పూజారులు రాతి విగ్రహాలకు గుడ్డలు, తిండ్లు, నగలు, నగదు, కానుకల రూపంలో సంపాదించి వాటిని తామే స్వాహాచేస్తున్నారు.

అంతేకాని సర్వమును సృష్టించగల సృష్టికర్తయైన సర్వేశ్వరునికి ఏ వస్తువుకు లోటులేదు. కాని దేవుని పేరుచెప్పి పూజారులు శ్రమలేకుండా హాయిగా బ్రతుకుతున్నారు. పూజారులకొరకే రాతి విగ్రహాలు.

163. రాళ్ళుతెచ్చి జనులు రమణతో గుడికట్టి
తవిరి మరొకరాయి దేవుడనుచు,
శిలకు సేవచేయు ఫలమేమికద్దురా? ॥వి॥

రమణతో= ప్రేమతో; తినిరి= ప్రయత్నించి; శిల= రాయి; కద్దురా= కలదురా?

ప్రాణంలేని రాతి బొమ్మలను పూజించుట వలన మనము ముక్తినిగాని భుక్తినిగాని పొందలేము. కాని పూజారులు మాత్రం లెస్సగా భుక్తిని మాత్రం పొందుతారు. అవి పూజారుల డొక్కలు నింపటానికి యేర్పాటు చేయబడినవే.

164. రాతిప్రతిమతెచ్చి రాజసంబుగ నుంచి
పూజసేయు నరుడు బుద్ధిమాలి;
ప్రాణియందె శివుడు పాటించియున్నాడు

బుద్ధిలేని మానవులు ప్రాణంలేని రాతి విగ్రహాలకు ఘనంగా పూజలు, నైవేద్యాలు వగైరాలు చేస్తూవుంటారు. కాని భగవంతుడు ప్రతి ప్రాణిలోనూ వుంటున్నాడు.

165. రామభక్తులమని రాతిబొమ్మకు మ్రొక్కి
భజనసేయనేల భక్తిలేక;
భక్తి నిలుపునతడు భజనను చేయునా?

తమను రామభక్తులమని చెప్పుకొనేవారు రాతి బొమ్మకు మ్రొక్కి దాని యెదుట వట్టొట్టి భజనలు చేయుచుందురు. నిజమైన దైవభక్తులు రాతిబొమ్మల యెదుట దొంగభజనలు చేయక దేవుని ధ్యానించెదరు.

166. గట్టురాళ్ళు తెచ్చి కాళ్ళు చేతులమర్చి
ఉరము శిరముగాను నొనరుజేసి
మొఱకు రాళ్ళకెఱగు మొప్పెలనేమందు? ॥వి॥

గట్టు= కొండ; ఉరము= రొమ్ము; అమర్చుట= నిర్మించుట; ఒనరు= ఒనర్చు, నిర్మించు, కలుగజేయు; మొఱకు= మోపైన, గట్టి, ఎఱుగుట మ్రొక్కుట, మొప్పెలు= మూఢులు, బుద్ధిలేనివాళ్ళు

కొండరాళ్ళు తెచ్చి కాళ్లు చేతులు వగైరాలను అమర్చి వాటిని దేవుళ్ళని భావించి మ్రొక్కువాళ్ళు పరమమూఢులుగా ఎంచబడుదురు.

167. జగమునను జనులకు దగినట్టి దగులింగ
ముండ, రాతిలింగముండనేల?
రాతిలింగమేమి రక్షించునో? సృష్టి
చేయునేరదయ్య క్షితినివేమ

రాతిలింగము= రాతిశివలింగ విగ్రహము, క్షితి= భూలోకము

రాతి శివలింగ విగ్రహము రక్షించలేదు; సృష్టించలేదు, కదలలేదు, మెదలలేదు. కనుక రాతిశివ విగ్రహాన్ని పూజించక ఆత్మశివలింగాన్ని ధ్యానించుట శ్రేయస్కరము.

168. మంటితోడగొన్ని, మ్రానితోడగొన్ని
రాతితోడగొన్ని రాగిగొన్ని
ప్రతిమలెన్నొచేసి భగవంతుడని మ్రొక్క
ముక్తి యెట్లునిచ్చు మొననివేమ ॥వి॥

మ్రాను= మాను; చెట్టు, కొయ్య; ప్రతిమ= విగ్రహము, బొమ్మ

విగ్రహాలు మన్ను, కొయ్య, రాయి, రాగి, ఇత్తడి, ఇనుము వగైరాలతో నిర్మింపబడును. ప్రాణంలేని విగ్రహాలకు మ్రొక్కినయెడల ముక్తినిగాని భుక్తినిగాని యివ్వజాలవు. కాని అవి పూజారులకు మాత్రం ముక్తినిచ్చును. అవి పూజారులు వగైరా పరాన్నభుక్కులు నిర్మించినవే.

169. పలుగురాళ్ళు తెచ్చి పరగగుడులుగట్టి
చెలగిశిలల సేవచేయనేల?
శిలలసేవచేయ ఫలమేమికల్గురా?

పలుగు=తెల్లని, చెలగి= ఉత్సాహపడి.

తెల్లని రాళ్ళు తెచ్చి గుడులు కట్టించి వాటిలో రాతి విగ్రహాలనువుంచి పూజించుట వలన ప్రయోజనంలేదు. రాతి విగ్రహాలలో ప్రాణంలేదుకదా. ప్రాణంలేని రాయి మనకేమి ఉపకారం చేయగలదు? ప్రాణంలేని రాతి విగ్రహాన్ని దేవుడని చెప్పి పూజారి డబ్బు సంపాదించగలడు. అమాయకులు వాటిని దేవుళ్ళని నమ్మి దానాలు చేస్తారు. ఆ దానాలతో పూజారులు పుంజుకుంటారు.

170. రాళ్ళుతెచ్చి నరులు రమ్యమౌ గుడికట్టి
రాతిప్రతిమజేసి ఖ్యాతిగాను
దేవుడనుచు మ్రొక్క దీవించిపలుకునా? ॥వి॥

రమ్యమైన= అందమైన; ఖ్యాతిగాను= గొప్పగాను.

ప్రజలు రాళ్ళతో అందమైన గుళ్ళుకట్టి వాటిలో రాతి విగ్రహాలను వుంచి దేవుళ్ళని మొక్క పూజించెదరు. కాని ఆ రాతి విగ్రహాలు వారితో పలుకలేవు, వారిని దీవించలేవు, ప్రజలు యీ అమాయకత్వాన్ని పూజారులు బాగా ఉపయోగించుకోగలుగుతున్నారు. పూజారులు పురోహితులు, సిద్ధాంతులు, మఠాధిపతులు, పీఠాధిపతులు వగైరా అమాంబాపతు పరాన్నభుక్కులు సామాన్య ప్రజలను మూఢులనుగా చేసి వారిని ఆర్థికంగా దోచివేస్తున్నారు.

171. రాళ్ళబూజచేసి రాజ్యముల్ తిరిగియు
కానలేరు ముక్తికాంతనెపుడు;
తాను యుండుచోట దైవంబునుండడా? ॥వి॥

కానలేరు= చూడలేరు, కనుగొనలేరు; కాంత= ఆడుది.

మూర్ఖులు దేశములు తిరుగుతూ విగ్రహాలను పూజిస్తూ మోక్షము పొందగోరుచుందురు. కాని వారు తామున్నచోటనే దైవము ఉన్నాడని తెలుసుకోలేకపోతున్నారు.

172. శిలను ప్రతిమజేసి చీకటింటనుబెట్టి
మ్రొక్కవద్దు వెట్టిమూఢులార!
జీవులందెగాని శిలలందులేడయా ॥వి॥

శిల= రాయి; వెట్టి= పిచ్చి

రాతిని విగ్రహంగాచేసి గుడిలోని చీకటి గదిలోవుంచి మ్రొక్కుట వలన ప్రయోజనం లేదు. భగవంతుడు శిలలందులేదు. సర్వప్రాణులలోనూ వుంటున్నాడు. కనుక ప్రాణికోటికి తన శక్తికొలది సేవ చేసినవాడే భగవద్భక్తుడు. మోక్షమును పొందేది కూడ వాడే.

173. శిలలు దేవతలని చెలరేగి చెలరేగి
మొనసి పూజసేయు మూఢులార!
జీవులందెగాని శిలలందు నేముంది? ॥వి॥

చెలరేగి= విర్రవీగి, మిక్కిలి విజృంభించి; మొనసి= యత్నించి, పట్టుబట్టి.

ప్రాణంలేని రాతి విగ్రహాలలో దేవుడులేదు. ప్రాణంగల జీవులందే భగవంతుడుంటున్నాడు.'శిలలను పూజించువారు మూఢులే'

174. శిలలజూచి నరులు శివుడని భావింత్రు
శిలలు శిలలేగాని శివుడుగాడు;
తనదులోని శివుని దానేల తెలియడో? ॥వి॥

175. శివుడు గలడటంచు శిలలను మ్రొక్కెడి
వెఱ్ఱిజీవులార! వెతలవిడుడు;
జీవులందెగాక శిలలనేమున్నది? ॥వి॥

వెత= బాధ, దుఃఖము; వెఱ్ఱి= పిచ్చి

176. శివుడిటగలడంచు శిలలకు మ్రొక్కెడి,
వెఱ్ఱులార! జగతి వెడగులార!
జీవులందెగాని శిలలందు లేదయా ॥వి॥

వెడగు= అవివేకి, మూర్ఖుడు.

177. శిలలు దేవతలని స్థిరముగా రూపించి
మంటిపాలెయైరి మనుజులెల్ల;
మంటిలోనిరాళ్ళ మదిలోనదెలియరు ॥వి॥

స్థిరముగా= గట్టిగా; రూపించుట= నిరూపించుట,చూపించుట, రుజువు చేయుట; మంటిపాలగుట= మంటిలో కలసిపోవుట

రాళ్ళ విగ్రహాలను, దేవతలని నిరూపించిన వారందరూ కూడ మట్టిలోనే కలిసిపోయారు. కాని వారు తామనుకొన్న రాతిదేవతా విగ్రహాలు మంటిలోని రాళ్ళేగాని వేరుకాదని తెలుసుకోలేకపోయారు.

178. హృదయమందు శివు డుండుట తెలియక
శిలలకేటి కెఱగి చేతులెత్త
అంధకుండు ముకురమరసి జూచినయెట్లు ॥వి॥

శిలల కేటికి= శిలల కెందుకు; ఎఱగుట= మ్రొక్కుట; అంధకుడు= గ్రుడ్డివాడు; ముకురము= అద్దము.

మూఢులైన మానవులు తమ హృదయములందుగల భగవంతుని తెలిసికోలేక ప్రాణం లేని రాతి విగ్రహాలకు చేతులెత్తి మ్రొక్కుతున్నారు. ఏవిధంగానైతే గ్రుడ్డివానికి అద్దము ఏమీఉపయోగపడుట లేదో, అదే విధంగా ప్రాణంలేని రాతి విగ్రహాలు మూర్ఖులకు ఏమీ ఉపయోగపడజాలవు.

179. అక్షరంబెఱుగక అడవుల తిరుగుచు
కొండరాళ్ళు, గుళ్ళు కొలువనేల?
హృదయమందు శివుని ఏర్పాటు తెలియరో ॥వి॥

అక్షరము= నశించనట్టి పరమాత్మ; కొలుచుట= సేవించుట, పూజించుట.

180. ధరను దేవళముల తగులువీడిన నాడు
తనువు గుడిగజేసి తన్ను నిలిపి
లోకబుద్ధివిడిచి లోచూపుచూడరా ॥వి॥

తగులు= తగులము= తగువులు; ఆసక్తి= బంధము=మోహము,వీడి= విడిచిపెట్టి, ధర= భూలోకము; లోకబుద్ధి= ప్రపంచ వ్యామోహము

ప్రపంచంలోని రాతి దేవాలయాల వ్యామోహాన్ని విడిచిపెట్టిన సాధకుడు తన శరీరాన్నే దేవాలయంగా జేసికొని స్థిరమైన బుద్ధితో ప్రపంచ వ్యామోహంలో పడకుండా తనలోని పరమాత్మను పరిశోధించును.

181. దేవపూజలందు దేవాలయములందు,
దేవుడనుచు మ్రొక్కి సేవజేసి

తెలియ విశ్వమెల్ల దేవాదిదేవుడు ॥వి॥

విశ్వము= ప్రపంచము; దేవాదిదేవుడు= పరమాత్మ

అమాయక ప్రజలేగాక మాయ ప్రజలు కూడ (మేధావులు కూడ) దేవాలయాలలోని విగ్రహమే దేవుడని భావించి దానిని పూజించి మ్రొక్కుచుందురు. కాని పరమాత్మ ప్రపంచం అంతటా అన్ని చోట్లా అందరిలోనూ వ్యాపించి వున్నాడనే సత్యాన్ని వారు తెలుసుకోలేకపోతున్నారు. ఎందుకన కొంతమంది పరాన్నభుక్కులైన గొప్ప గొప్ప పండితవరేణ్యులు భగవంతుడు దేవాలయాలలోని విగ్రహాలలోనే వున్నాడని బూటకపు, శాస్త్రప్రమాణాలను చూపించి ప్రజలను మోసపుచ్చి వారిని ఆర్థికంగా దోచుకొంటున్నారు.

182. దేవపూజలందు దేవాలయములందు
దేవుడంచు మ్రొక్కి తెలియలేక
తిరుగుచుండువాడు దేవాదిదేవుడా? ॥వి॥

183. దేవ భూములందు దేవాలయములందు
దేవుడనుచు మ్రొక్కి సేవచేసి
తెలియ విశ్వకర్మ దేవాదిదేవుడొ ॥వి॥

విశ్వకర్మ= శిల్పి, విగ్రహాలను నిర్మించేవాడు; దేవాదిదేవుడు= పరమాత్మ

దేవాలయములోని విగ్రహములనే దేవుడుగా భావించి వాటిని మూఢులు సేవించి మ్రొక్కుతున్నారు. విగ్రహాలే దేవుడైతే విగ్రహాలను నిర్మించిన శిల్పి దేవాదిదేవుడగును గదా!

184. పుట్టుబ్రహ్మ లైదు పుడమిని నడుపగా
చేత బ్రాహ్మడేల శ్రేష్టమగును?
ఏల విగ్రహములు?ఎత్తుకోదినుటకా?

పుట్టు బ్రహ్మలు= పంచభూతాలు= గాలి,నీరు, నిప్పు, నేల, ఆకాశము; పుడమి= భూమి; ఎత్తుకోదినుట= ఎత్తుకొనిదినుట, అడుక్కొని తినుట.

గాలి, నీరు, నిప్పు వగైరా పంచభూతాలు భగవంతుని ఆజ్ఞప్రకారం ప్రపంచాన్ని నడుపుచుండగా విగ్రహాల, బ్రాహ్మణుల గొప్పతనం ఏముంది?కాని

ప్రాణంలేని విగ్రహాలను పెట్టుకొని అడుక్కొని తినడానికి పనికి వస్తారు బ్రాహ్మలు.

185. అక్షరం బెరుగని యాచారమదియేల?
తాను తినని యెట్టి ధనమదేల?
నొరుల మేలు జూచి యోర్వని తనువేల? ॥వి॥

అక్షరము= ఆత్మ, పరమాత్మ; ఆచారము= నడవడి; నిష్ఠ= నియమము; తనువు= శరీరము; ఒరులు= ఇతరులు

భగవంతుణ్ణి తెలుసుకోటానికి ఉపయోగపడని ఆచారనిష్ఠలేల? తాను తినజాలని ధనం ఎందుకు? ఇతరుల మేలు జూచి ఓర్వలేని శరీరం ఎందుకు?

186. ఎచ్చుకులముల నొంది యెన్నాళ్ళు బ్రతికిన
చచ్చిపుట్ట జన్మ శతము లగును?
మెచ్చునట్టి పూజ మెప్పుగా బూనరా ॥వి॥

శతము= నూఱు,వంద; పూనుట= ధరించుట, పూనుకొనుట, ప్రయత్నించుట, మెప్పుగా= ప్రేమతో, అందరూ పొగిడేటట్లుగా.

187. ఎంబెరు మతమని యెనగి మాంసము దిని
మాఱు పేర్లు పెట్టి మధువు త్రాగి,
వావి వరుస తప్పి వర్తించి చెడుదురు ॥వి॥

మధువు= కల్లు; వర్తించుట= నడచుట; ఎంబరు= ఎంబేరు మానార్. ఇది రామానుజాచార్యుని మతము.

హిందువులలో ముఖ్యమైన మత సాంప్రదాయాలు రెండు– శైవులు, వైష్ణవులు. శైవులు శివుణ్ణి, వైష్ణవులు విష్ణువుని పూజిస్తారు. ఈ సంగతి లోగడ చెప్పబడింది. వైష్ణవమత సాంప్రదాయ ప్రచారకులలో రామానుజాచార్యులు ముఖ్యులు వైష్ణవులు. ఆయనను "ఎంబెరు మానార్" (మారక్షకుడు, మా దేవత) అని గౌరవించేవారు. వైష్ణవులలో అనేక పండుగలు కలవు. వాటిలో "రవికెల పండుగ" ఒకటి. ఈ పండుగ ఏడాదికొకసారి జరుపబడును. ఆ రోజు రాత్రి వైష్ణవులు– ఆడ, మగ– వావివరుసలు లేకుండా ప్రవర్తిస్తూ, కల్లుకు "మెడ సన్నని గోవిందు",

"పెరుమాళ్ళ తీర్థం" అని పేర్లు పెట్టి త్రాగి మాంసమును "లక్ష్మీ ప్రసాదం" అని చెప్పి తిందురు. ఈ మత సంప్రదాయంలో మధువు (కల్లు), మాంసము, మైధునము (జతకట్టుట) ముఖ్యములు. అందుకని ఈ సాంప్రదాయాన్ని "మకారత్రయ" సంప్రదాయమని కూడా అంటారు.

188. ఒడలు బడలజేసి మోగులమనువారు
మనసు కల్మషమును మాన్పలేరు;
పుట్టమీద గొట్ట భుజగంబు చచ్చునా? ॥వి॥

ఒడలు= శరీరము; బడలజేయుట= అలుపు కలిగించుట, శ్రమ కలిగించుట, కష్టపెట్టుట; భుజగము= పాము; కల్మషము= మలినము, మురికి.

ఏ విధంగానైతే పుట్టలోని పామును చంపటానికి పుట్టపైన కర్రలతో ఎంత బాదినా పుట్టలోని పాము చావదో అదే విధంగా చాలామంది యోగులు తమ మనస్సులలో గల వికారాలను నిర్మూలించగోరి తమ శరీరంతో ఆసనాలు, స్నానాలు, ఉపవాసాలు చేసి, తల వెంట్రుకలు గొరిగించుకొని కాషాయ గుడ్డలు ధరించినప్పటికీ వారి మనస్సులలోని వికారాలు నిర్మూలనం కాజాలవు.

189. కరక్కాయలు దిని కాషాయ వస్త్రముల్
బోడి నెత్తి కల్గి పొరయచుంద్రు
తలలు బోడులైన తలపులు బోడులా? ॥వి॥

కరకాయలు= కరక్కాయలు; పొరయుట= పొలయుట, సంచరించుట; తలపు= కోరిక; బోడులగుట= నశించుట.

చాలామంది యోగులమని చెప్పుకొనేవారు తమ మనో వికారములను పోగొట్టుకోవటానికని తలలను నున్నగా గొరిగించుకుంటున్నారు. కాషాయ వస్త్రాలు కట్టుకొంటున్నారు. కామవాంఛ కలుగకుండా లేత లేత కరక్కాయలు తింటున్నారు. కాని వారిలోని మనో వికారాలు ఏమాత్రం పోవటంలేదు. పై వేషాలవల్ల మనస్సులోని మాలిన్యం పోజాలదు.

190. కొండగుహలనున్న, కోవెలలందున్న,
మెండుగాను బూది మెత్తియున్న,

దుష్టబుద్ధులకును దుర్బుద్ధి మానునా? ॥వి॥

కోవెల= గుడి; మెండుగా=దట్టముగా, ఎక్కువగా, మెత్తుట= పూయుట; దుర్బుద్ధి= చెడ్డగుణము; మానునా= పోవునా?

చెడ్డనడతగల వేషధారులైన సన్యాసులు కొండగుహలలో వున్నా దేవాలయాలలో వున్నా, ఒంటినిండా విభూతి దట్టంగా పూసుకొన్నా, వారి లోపల గల చెడ్డగుణములు పోజాలవు. కాని వారి పైవేషాలు వారికి కూడును సంపాదించి పెట్టుచున్నాయి.

191. అల్లబోడి తలలు, తెల్లని గొంగళ్ళు
ఒడలు బూతి పూసియుందురెపుడు;
ఇట్టి వేషములెల్ల పొట్టకూటికె సుమీ ॥వి॥

అల్ల= నున్నని; ఒడలు= శరీరము

మనదేశంలో పరాన్నభుక్కులైన దొంగ సన్యాసుల సంఖ్య మనకు రాజకీయ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేవాలయాలతోపాటు పెరిగి పోయింది. ఇంకా యిపుడు రోజు రోజుకూ దేవాలయాలతోపాటు పెరుగుతూనే వుంది. ఈ దొంగ సన్యాసులు తమ తలలు నున్నగా గొరిగించుకుంటారు. తెల్లని గొంగళ్ళు కప్పుకుంటారు. ఒంటినిండా వీభూతి దట్టంగా పూసుకొంటారు. ఈ వేషాలన్నీ మోక్షము కొరకు కాదు; కూటి కొరకే. కనుక "కూటి కొరకు కోటి విద్యలు" అనే సామెతను "కూటికొరకు కోటి వేషాలు"గా మార్చుట మంచిదేమో!

192. కౌండిన్యుడు ముండుకొడుకు
మాండవ్యుడు కప్పకపుడు మహిలోబుట్టెన్
చండాలి మతంగ మునిని
బిండంబుగబెట్టలేదె పృధివిని వేమా॥

మహిలో= లోకంలో; పృధివి= భూలోకము

కౌండిన్య మహాముని ముండకు పుట్టెను. మాండవ్య మహాముని కప్పకు పుట్టెను. మాతంగ మహామునిని ఒక బ్రాహ్మణమగువ ఒక మంగలివాని ద్వారాకన్నది. అట్టే చూడగా ఎక్కువమంది మహర్షులు, మహామునులు తక్కువ కులాలవారికీ,

పక్షులకూ, జంతువులకూ పుట్టిన వారుగానే కన్పిస్తున్నారు. కాని వారంతా బ్రహ్మజ్ఞానంవల్ల బ్రాహ్మణులు కాగలిగారట.

193. పొడవుగల్గు జడలు పులితోలు భూతియు;
కక్షసాలలు పది లక్షలైన
మోత చేటేగాని మోక్షంబు లేదయా ॥వి॥

భూతి= విభూతి, వీబూది; కక్షపాలలు= సన్యాసులు ధరించే పెద్ద జోలి, సంచి; మోతచేటు= మోతబరువే

దొంగసన్యాసులు కొందరు పొడుగాటి జడలు ధరించి పులితోలు కప్పుకొని ఒల్లంతా దట్టముగా విభూతి పూసుకొని పెద్దసంచిని ఒకదానిని చంకకు తగిలించుకొని శివభక్తులవలె నటిస్తూ పొట్ట పోషించుకుంటున్నారు. ఈ పై వేషాలను చూచి అమాయక ప్రజలు మోసపోయి యీ దొంగ సన్యాసులకు తమ శక్తికొలది దానధర్మాలు చేస్తూవుంటారు. ఈ పై వేషాలు అనేకమంది సోమర్లకు బహుళదేవుళ్ళు గల మన భారతదేశంలో భుక్తిని చాల తేలికగా శ్రమలేకుండా సంపాదించి పెట్టుచున్నాయి.

194. దేశదేశములను తిరుగంగ తిరుగంగ
ఆత్మయందు ధ్యానమంటుకొనునె?
కాసులకును దిరుగ, గల్గునామోక్షంబు? ॥వి॥

అంటుకొనుట= అబ్బుట; కాసులు= డబ్బులు

దొంగసన్యాసులు దేశంలో తిరిగేది డబ్బుల సంపాదన కొరకేగాని మోక్షము కొరకు గాదు.

195. దేశదేశమ్ము తిరుగుట తిండికొరకె.
పూనివేషంబు వేయుట పొట్టకొరకె
మనసునందున గుఱినుంచి మరిగితిరిగి
పుట్టకుండెడి పదవిని పూను వేమ॥

గుఱి= లక్ష్యము; కాంచుట= చూచుట; పూనుట= యత్నించుట; పుట్టకుండెడి; పదవి= మోక్షము, ముక్తి; మరగుట= ఆశించుట; ఆశపడుట.

కొంతమంది సోమరపోతులు పనిచేయలేక సన్యాసుల వేషం వేసుకొని డబ్బు సంపాదనకై దేశంలో నలుమూలలు తిరుగుతూ వుంటున్నారు. కాని మనస్సును దృఢంగానూ నిర్మలంగానూ వుంచుకొని భగవంతుని ధ్యానిస్తూ తనవంతు కర్మను శరీరంతో చేస్తూవున్న వానికే తిరిగి జన్మలేని పదవియైన మోక్షపదవి లభించును. ఇటువంటివాడే నిజమైన సన్యాసి.

196. బూదిదేహమందు పూసితెనాయెనా?
నిష్టశివునియందు నిలుపవలయు;
భస్మమందుగాడ్దెబడి పొర్లదాజూడ ॥వి॥

నిష్ఠ= చలించని మనస్సు; పొరలుట= దొర్లుట.

చలించని మనస్సుతో పరమాత్మను ధ్యానించగా ధ్యానించగా మోక్షం కలుగవచ్చును. కాని శరీరం మీద ఎంతదట్టంగా విభూతిని పూసుకున్నా, మోక్షము కలుగదు. గాడిదెఎల్లప్పుడూ బూడెదలోనూ పొర్లాడుతూ వుంటుంది. కాని దానికి మోక్షం కల్గునా? పై వేషాలకంటే చిత్తశుద్ధి ఎంతో గొప్పది.

197. బోడితలల, వెల్లబూడిదపూతల,
నాసనముల, మారుతాసనముల,
యోగిగాడు లోనుబాగుగాకుండిన ॥వి॥

వెల్ల= తెల్లని; మారుతాసనము= ప్రాణాయామము; మారుతము= గాలి.

తలలను నున్నగా గొరిగించుకొని తెల్లని బూడిద శరీరంమీద పూసుకొని ఆసనాలు, ప్రాణాయామము మొదలగునవి చేయగలిగినప్పటికీ ఎవ్వడూ యోగి కాజాలడు. మనస్సును నిర్మలముగా వుంచుకొని భగవంతుని ధ్యానించువాడే నిజమైన యోగి.

198. కాళ్ళు చేతులుండ కర్మలుచేయక
యోగిననుచు సాకదొకటివన్ని
మౌనియైన, ననరె మాయలమారని ॥వి॥

కర్మలు= పనిపాటలు; సాకు= వంక; పన్నుట= కల్పించుట; మాయలమారి= టక్కరి, మోసకాడు.

ఎవడైతే అవయవాలు బాగా వుంచుకొనికూడా ఏమీ పనిచేయక తనను యోగినని చెప్పుకొని ప్రజలమోసగించి జీవితం గడుపుకొనుచుండెనో వానిని ప్రజలు ఎదురుగా కాకపోయినా చాటునన్నా దొంగసన్యాసి. మోసగాడు అని అనుకొంటారు. నిజానికి యోగియైనా కర్మచేసి తీరాలి. కర్మచేయని వానికి తిండి తింటానికి అర్హత లేదు. కర్మచేయకుండా తిండితినేవానిని పగటి దొంగ అనాలి.

199. పరమయోగులమని పరము చేరగలేని
మాయజనులకెట్లు మంచికలుగు?
వేషములను విడిచి విహరింపముక్తియౌ ॥వి॥

పరము= మోక్షస్థానము; పరమయోగి= మోక్షాన్ని గురించి యత్నించువాడు; విహరించుట= సంచరించుట, నడచుకొనుట.

పరమేశ్వరునికి దొంగవేషాలు, భాషాడంబరాలు పనికిరావు. కనుక వేషాలను, భాషాడంబరాన్ని విడిచిపెట్టగలిగిన వారే ముక్తిని పొందగలరు.

200. తనువుల స్థిరమని, ధనముల స్థిరమని
తెలుపగలరు తాము తెలియలేరు
చెప్పవచ్చు జనులు చేయుటకష్టమౌ ॥వి॥

తనువు= శరీరము; అస్థిరము= ఎల్లప్పుడూ వుండనట్టి.

దొంగవేదాంతులు శరీరము, ధనము మొదలైనవి శాశ్వతములు కావని యితరులకు వట్టొట్టి బోధలు చేస్తారు. కాని తాము మాత్రం తెలిసికొని ప్రవర్తించరు. ఎందుకన ఇతరులకు బోధించుట తేలిక కాని తాము చెప్పిన దానిని ఆచరించేవారు ప్రపంచంలో చాలా తక్కువనే చెప్పాలి. అందుకే అంటారు- చెప్పటం ఎంత తేలికో చెయ్యటం అంత కష్టము.

201. కావిబట్టగట్టి ఘనయోగివలెనుండి
వెలయరారిగాగ విడిచిపెట్టి
తొడరి తిరుగువాడు దొరకోలు సన్యాసి ॥వి॥

తొడరుట= ప్రయత్నించుట; దొరకోలు సన్యాసి= నమ్మించి మోసపుచ్చే దొంగ సన్యాసి

చాలమంది సన్యాసులు పగటియందు కాషాయ గుడ్డలుగట్టి గొప్పజ్ఞానివలె నటించి చీకటిపడగానే లంజెగృహంలోనికి దూరుతారు. ఇటువంటి సన్యాసులను దొరకోలు సన్యాసులంటారు.

202. తీర్థయాత్రకనుచు తిరుగబోయినవాడు,
పామరుండుగాక భక్తుడగునె?
తీర్థయాత్రచేత దివ్యుడు కాలేడు॥ ॥వి॥

తీర్థము= పుణ్యక్షేత్రము, పామరుండు= అజ్ఞాని, మూర్ఖుడు; దివ్యుడు= జ్ఞాని, తెలివిగలవాడు, వివేకి

తీర్థము అంటే పుణ్యక్షేత్రము. అంటే పవిత్రమైనచోటు, తీర్థము, బ్రహ్మతీర్థము, పితృతీర్థము, ప్రజాపత్య తీర్థము, దైవతీర్థము అని నాలుగు రకాలు. కాశీ, ప్రయాగ, గయా, శ్రీశైలం, తిరుపతి మొదలగునవి హిందువులకు ముఖ్యమైన తీర్థములు. వీటిలో కాశీని "తీర్థరాజ్ఞి" అనియు, ప్రయాగను "తీర్థరాజ్" అనియు అంటారు.

ఎక్కువగా యీ తీర్థాలు ఏ నది ఒడ్డునో, ఏ కొండపైనో ఏ గొప్ప సరస్సు ఒడ్డునో వుంటాయి. ఈ తీర్థములవద్దనే ఒకటి రెండు దేవాలయాలు, ఒకటి రెండు యింకా ఎక్కువ మఠాలు, ఆశ్రమాలు వుంటాయి.

అమాయక ప్రజలు పుణ్యము సంపాదించుకోవాలనే కోరికతో తీర్థయాత్రకు బయలుదేరుచుందురు. యాత్రికులు ముందుగా బ్రాహ్మణ పురోహితుల చేత సంకల్పం చెప్పించుకొని నదిలో స్నానంచేసి తరువాత బ్రాహ్మణ పురోహితునకు తగిన దక్షిణ (డబ్బు) యిస్తారు. తరువాత యాత్రికులు దేవాలయాలలోని దేవతా విగ్రహాలను దర్శించి పూజారులచేత శఠగోపం పెట్టించుకొని పూజారికి తగిన దక్షిణ యిచ్చుకుంటారు. తరువాత మఠాలకు, ఆశ్రమాలకు వెళ్ళి అక్కడి మఠాధిపతులకు తగిన దానధర్మాలుచేసి దారిలో కనిపించిన సన్యాసులకు బిచ్చగాండ్రకు తమశక్తికొలది దాన ధర్మాలు చేస్తారు. నదివద్ద సంకల్పం చెప్పేవారు, దేవాలయంలో పూజలు చేసేవారు, మఠాలలోనూ, ఆశ్రమాలలో వున్నవారు అంతా ఎక్కువగా బాపనయ్యలే. ఈ తీర్థయాత్రలవల్ల జనులు పారమార్థికలాభం పొందుచున్నారోలేదో చెప్పలేముగాని,

తీర్థయాత్రలవల్ల యాత్రికులకు ఆర్థిక నష్టం మాత్రం కొట్టవచ్చినట్లు కన్పిస్తుంది. ఈ తీర్థాలవల్ల బ్రాహ్మణ పురోహితులు, బ్రాహ్మణ పూజారులు, బ్రాహ్మణ మఠాధిపతులు, పీఠాధిపతులు లెస్సగా భుక్తిని సంపాదించుకోగలుగుతున్నారు.

తీర్థయాత్రకు పోవువాడు పామరుడని, యాత్రలవల్ల యాత్రికుడు జ్ఞానికాజాలడని మన వేమన్న అభిప్రాయము.

203. ఆత్మశుద్ధిలేని ఆచారమదియేల?
భాండశుద్ధిలేని పాకమేల?
చిత్తశుద్ధిలేని శివపూజలేలయా? ॥వి॥

ఆత్మశుద్ధి= మంచి హృదయము, మంచి మనస్సు; భాండము= కుండ; శుద్ధి= శుభ్రము, శుభ్రత; పాకము= వంట, తిండి; చిత్తశుద్ధి= మంచి మనస్సు= స్థిరమైన మనస్సు.

శుద్ధమైన మనస్సుతో ఆచరించని ఆచారము, శుభ్రములేని పాత్రలో వండినపాకము, శుద్ధమైన మనస్సుతో చేయని దైవపూజ నిరుపయోగములు.

204. ఇంటియాలివిడిచి యిలజారకాంతల
వెంటదిరుగువాడు వెఱ్ఱి వాడు;
పంటచేను విడిచి, పరిగయేరినట్లు ॥వి॥

ఆలి= ఆలు, పెండ్లాము; ఇల= భూలోకము; జారకాంత= లంజె, జారిణి, అంకులాడి; పరిగ= పైరు తీసికొనిపోయిన తరువాత పంటచేనిలో జారిపోయిన పైరు పరకలు.

ఏ విధంగానైతే తెలివిమాలిన పిచ్చిరైతు తన పంట చేనులోని మంచి పైరును విడిచిపెట్టి ప్రక్కవారి చేనులోని పనికిమాలిన పరిగ పరకలను ఏరుకొని సంబరపడునో, అదే విధంగా కామాంధుడైన మనిషి తాను చేసుకొన్న సుగుణవతియగు పెండ్లాన్ని విడిచిపెట్టి కురూపులైన ఇతరుల పెండ్లాల వెంట తిరుగుతూ సంబరపడుతున్నాడు.

205. ఉసురులేని తిత్తి, యిసుమంతసూదిన,
పంచలోహములును భస్మమౌను;

పేదలుసురుమన్న పెనుమంటలెగయురా ॥వి॥

ఉసురు= ప్రాణము, నిట్టూర్పు; ఉసురులేని తిత్తి= కుమ్మరివాని కొలిమి తోలుతిత్తి, ఇసుమంత= మిక్కిలి కొంచెము, పంచ= అయిదు; ఉసురుమనుట= దుఃఖించుట, నిట్టూర్పు విడుచుట; పెను= గొప్ప, పెద్ద.

ప్రాణంలేని కొలిమితిత్తిని ఏమాత్రం ఊదినా కఠినమైన ఇనుము వగైరా లోహాలు కరిగి భస్మమైపోతున్నాయి. ఇక ప్రాణంగల బ్రహ్మ స్వరూపులైన పేద ప్రజలు ఉసూరుమంటూ వుంటే, లోకాలు తగులబడి పోవా?" బీదలు ఏకమైతే రాజులు తరాజులైపోతారు. "బీదల ఉసురు తప్పక కొట్టి తీరుతుంది" అని అంటారు.

206. ఎండిన మానొకటడవిని
నుండిన నందగ్నిపుట్టియూడ్చును చెట్లన్
దండిగల వంశమెల్లను
చండాలుడొకడుపుట్టి చదువును వేమా॥

మాను= చెట్టు; అగ్ని= అగ్గి, నిప్పు; ఊడ్చుట= నాశనము చేయుట; దండి= ప్రతాపము, గొప్పదనము, గౌరవము; చడుపుట= పాడుచేయుట, చదునుచేయుట.

అడవులలో ఎండినచెట్ల కొమ్మలు ఒకదానితో నొకటి రుద్దుకొనినప్పుడు వాటినుండి నిప్పుపుట్టుచుండును. ఆ నిప్పును కార్చిచ్చు, దావానలము, దావాగ్ని, దవము మొదలగు పేర్లతో పిలుస్తారు. ఆ నిప్పు మూలాన అడవిలోని వేలాది చెట్లు తగులబడి బూడిదైపోతాయి. ఇదే విధంగా ఒక మంచి వంశములో ఒక నీచుడు (చెడ్డవాడు) పుట్టి ఆ వంశగౌరవాన్నంతనూ నాశనం చేసివేస్తాడు.

207. ఏమి కొంచువచ్చె? ఏమి తాగొనిపోవు?
పుట్టువేళనరుడు గిట్టువేళ,
ధనములెచటికేగు? తానేగునెచటికి? ॥వి॥

కొంచు= తీసికొని, వెంటబెట్టుకొని; కొనిపోవు= వెంటతీసికొనిపోవు; గిట్టుట= చచ్చుట.

మానవుడు పుట్టినపుడు తనవెంట ఏమీ తెచ్చుటలేదు. అతడు చచ్చిపోయినపుడు తనవెంట పుచ్చిన ఒకవొక్కనైనా తీసుకొనిపోవటం లేదు. అతడు

సంపాదించిన భూములు, ధనము, లోగిళ్ళు, పశుసంతతి, సంతానము ఏదీ కూడా అతని వెంట పోవుటలేదు. కనుక అతడు బ్రతికివున్న రోజులలోనే పిసినిగొట్టు కాకుండా తనతోటి మానవులకు తన శక్తికొలది విరివిగా తోడ్పడిన యెడల అతడు మానవజన్మ పొందినందుకు కృతకృత్యుడు కాగలడు.

208. ఓర్పులేనిభార్య యున్నఫలంబేమి?
బుద్ధిలేనిబిడ్డ పుట్టియేమి?
సద్గుణంలేని చదువదిఏలరా? ॥వి॥

సద్గుణము= మంచినడత, మంచిగుణము

209. కల్లుత్రాగువాని కల్లుమ్రుచ్చనరాదు;
కల్లలాడువాడె కల్లుమ్రుచ్చు;
కల్లుత్రాగుటకంటె కల్లలాడుటకీడు ॥వి॥

మ్రుచ్చు= దొంగ; కల్ల= అబద్ధము.

సామాన్యంగా సంఘంలో కల్లు త్రాగినవానిని కల్లుదొంగ అని అంటారు. నిజానికి కల్లుత్రాగినవాడు తాను శారీరకంగానూ, ఆర్థికంగానూ నష్టపడిపోతాడేగాని ఇతరులకు కీడు కలిగించడు. కాని కల్లలాడువాడు, అబద్ధాలాడేవాడు– తన మేలుకై ఇతరులకు కీడు కలిగించటానికి ఏమీ సందేహించడు. కనుక కల్లుత్రాగిన అమాయకునికంటే, అబద్ధములాడే కుటిల మేధావియే సంఘానికి ఎక్కువ కీడును కలిగిస్తాడు.

210. నిజము లాడునతడు నిర్మలుడై యుండు,
నిజములాడునతడు నీతిపరుడు;
నిజముపల్కకున్న నీచచండాలుడు ॥వి॥

నిర్మలుడు= మురికిలేని మనస్సుగలవాడు; ఆడుట= పలుకుట; ఛండాలుడు= చెడ్డపని చేయువాడు, నీచుడు.

నిజముపల్కువాడు నిర్మలమైన మనస్సుగలవాడు అతడు నీతిపరుడు. మంచి నడతగలవాడు. నిజముపల్కనివాడే నీచుడు ఛండాలుడు. కాని జాతిగత చండాలుడు చండాలుడు కాడు. జాతిగత బ్రాహ్మణుడైనా అబద్ధమాడితే అతడు ఛండాలుని

క్రింద లెక్క.

211. కాంచనంబుపైన, కాంతలపైనను
బెమ్మకైనపుట్టు రిమ్మతెగులు;
తోయజాక్షివిడుచు దొరయెవ్వడునులేడు. ॥వి॥

కాంచనము= బంగారము; కాంత= ఆడుది; రిమ్మ= భ్రమ, కోరిక; తెగులు= జబ్బు; తోయజాక్షి= కమలములవంటి కన్నులుగల ఆడుది; దొర= ప్రభువు, దేవుడు.

హిందూ మతస్థులకు చాలమంది దేవుళ్ళుగలరు. ఆ దేవుళ్ళలో కొంతమందికి ఇద్దరు ముగ్గురు పెండ్లాలున్నారు. ఆర్య ఋషులకు కూడ ఆ రోజులలో ఇద్దరు ముగ్గురు పెండ్లాలుండేవారట. ఆర్య పురోహితులకు కూడ ఆ రోజులలో చాలమంది ఆర్యజాతి పెండ్లాలుండుటేగాక వారికి అనార్యజాతి ఉంపుడుకత్తెలుకూడ చాలమంది ఉండేవారట. ఆర్యజాతి రాజులకు కూడ చాలమంది పెండ్లాలు, ఉంపుడుగత్తెలు ఉండేవారట. ఆర్యజాతి దేవుళ్ళల్లో బ్రహ్మదేవునికి నోటియందు సరస్వతి అనే పెండ్లాము, విష్ణువునకు రొమ్ముమీద లక్ష్మీదేవి అనే పెండ్లాము, అనార్యజాతి దేవుడైన శంకరునికి కూడా యిద్దరు ముగ్గురు పెండ్లాములుండేవారట. ఆయన నెత్తిమీద గంగ, సగం శరీరంలో పార్వతి ఉండేవారట. దేవుళ్ళకే ఆడవాళ్ళమీద యింత మోజుంటే, ఇక సామాన్యుల సంగతి ఏమని చెప్పాలి?

212. కానివానితోడ కలసిమెలంగిన,
కానివానిగానె కాంతురవని;
తాటిక్రిందపాలు త్రాగినచందమౌ ॥వి॥

కానివాడు= చెడ్డవాడు, తనస్థాయికి తగనివాడు; కాంచుట=చూచుట; అవని= భూలోకము; తాటి= తాడిచెట్టు.

213. కానివానితోడ గలసిమెలంగిన
హానివచ్చునెంత వానికైన;
కాకిగూడి హంస కష్టంబుపొందదా?

కూడి= జతనుచేరి, స్నేహముచేసి

గుణవంతుడు గుణహీనునితో స్నేహంచేస్తే గుణవంతుణ్ణి కూడ ప్రపంచం

గుణమీనునిగానే లెక్కించును. తాటిచెట్టుక్రింద పాలు త్రాగితే జనం కల్లుకల్లు అని గల్లంతు చేస్తారు. హంస కాకితో స్నేహంచేస్తే కష్టాలను అనుభవించును.

214. నీళ్ళలోని చేప నెఱిమాంసమాశకు
గాలమందుజిక్కి కూలినట్లు;
ఆశపుట్టుమనుజు డారీతిచెడిపోవు ॥వి॥

ఎఱి= ఎఱ, ఎఱ్ఱ, వానపాము, మట్టిపాము; కూలుట= చచ్చుట; రీతి= విధము; గాలము= చేపలనుబట్టే ఒక పనిముట్టు.

వానపామును చిన్న చిన్న ముక్కలుగా కోసినప్పటికీ అది చావదు. ప్రతి ముక్కలోనూ ప్రాణం వుంటుంది. అందువలన చేపలను పట్టుకొనే వాళ్ళు వానపామును ముక్కలు ముక్కలుగా కోసం ఒక టెంకాయి బుర్రలో వుంచుకొని ఒక్కొక్క ముక్కను గాలానికి గుచ్చి నీళ్ళల్లోనికి గాలాన్ని వేయుదురు. ఎఱ్ఱ ముక్కలను తినటానికి చేప వచ్చి ఆ ఎఱ్ఱను మ్రింగగానే అది గాలానికి చిక్కిపోయి పట్టుపడుతున్నది. తరువాత చేప గతిని గురించి చెప్పపనిలేదు. ఇదేవిధంగా ఆశచేత మానవుడు ఎన్నో ఇడుముల పాలై పోవటమేగాక ఒక్కొక్కప్పుడు ప్రాణాలనుకూడ కోల్పోతాడు.

216. అనువుగానిచోట అధికులమనరాదు
కాలమొక్కరీతి గడుపవలయు;
విజయుడిమ్ముదప్పి, విరటుని గొల్వడా ॥వి॥

అనువుగానిచోట= అనుకూలం కానిచోట; విజయుడు= అర్జునుడు; ఇమ్ము= వీలు; కొలుచుట= ఊడిగము చేయుట, చాకిరీ చేయుట; విరటుడు= విరాట్ మహారాజు.

పాండవులు అజ్ఞాతవాసకాలంలో విరాట్ మహారాజు కొలువులో తలా ఒక పనిని చేయసాగారు. అప్పుడు అర్జునుడు బృహన్నల వేషము అనగా ఆడవేషము వేసుకొని విరాట్ మహారాజు కూతురు ఉత్తరకు గానవిద్య నేర్పెను. కనుక అనుకూల పరిస్థితులు లేనపుడు కాలానుగుణ్యముగా కాలము గడుపుట వివేకవంతుల లక్షణము.

217. గుణయుతునకు మేలు గోరంతచేసిన,

కొండయగునువాని గుణముచేత;

కొండయంతమేలు గుణహీనుడెరుగునా? ॥వి॥

గుణయుతుడు= మంచినడతగలవాడు; గోరంత= చాలకొద్ది; గుణహీనుడు= నడతలేనివాడు, నీచుడు.

బుద్ధిమంతుడు కొద్దిపాటి మేలునుకూడ గొప్పగా భావిస్తాడు. దానిని ఎల్లకాలం గుర్తుంచుకుంటాడు. కాని బుద్ధిహీనుడు తనకు చేసిన గొప్ప మేలునుకూడ గుర్తుంచుకోక వెంటనే మరచిపోతాడు. ఈ యుగం మోసములతో కూడిన ధనయుగం. అందువలన ఈ యుగంలో చేసిన మేలును తలచేవాడేలేడు. ఇది చేసినమేలును మరచేయుగం కూడా.

218. చంపదగిన యట్టి శత్రువు తనచేత

జిక్కనేని కీడు సేయరాదు;

పొసగి మేలుచేసి పొమ్మనుటే చాలు ॥వి॥

పొసగి= అనుకూలించి; శత్రువు= పగవాడు.

ఋగ్వేదకాలంలో ఆర్య ఋషులు, మునులు, బ్రాహ్మణులు అనబడే వారికి శత్రువు చేజిక్కితే, వాని చర్మము ఒలిచి వానిని చిత్రవధ చేసేవారట. శత్రువుని చంపుటే న్యాయమని ఆనాటి వారి ధర్మశాస్త్రం చెప్పేదట. కాని మన వేమన్న మహా శివయోగి గనుక ఆయన శత్రువుని కూడ మానవునిగా యెంచి, వానికి మేలుచేసి సగౌరవంగా సాగనంపమని మనకు సలహా యిచ్చాడు. మహాశివయోగికి మహా ఋషికి తేడా యిదే.

219. చెఱకు తీపిలేమి, చెత్తనా బడునట్లు

పరగ గుణములేని పండితుండు

దూరుపడునుగాదె, దోషమటుండగ ॥వి॥

చెత్త= పనికిమాలిన వస్తువు; లేమి= లేకపోవుట; ఉండమి= కలుగమి; దూరువడుట= నిందింపబడుట; దూరుట= నిందించుట, తిట్టుట; దూరు= దూఱు, తిట్టు.

మంచినడతలేని పండితుడు ఎంత గొప్ప విద్వాంసుడైనా, ప్రజలు వానిని

గౌరవించక నిందించి దూరంగా నెట్టివేస్తారు. ఎట్లనగా పంచదార చెఱుకులో తీపి లేకపోతే జనులు దానిని చెత్తగా ఎంచి పెంటపోగుమీద పారవేస్తారు. కనుక విద్య, ధనములతోపాటు నడతకూడా వుండాలి.

220. తనమది కపటము కలిగిన
తనవలెనే కపటముండు తగుజీవులకున్
తనమది కపటము విడిచిన
తనకెవ్వడు కపటిలేడు ధరలో వేమా ॥వి॥

మది= మనస్సు; ధర= భూలోకము

221. కుక్కజూచిసామిగొలుచుట నేర్చుకో,
కాకి జూచి హితుల కలయికగను,
గాడిదెగని యోర్పు గడువడి దెలియరా ॥వి॥

సామి= యజమాని; హితులు= మేలుకోరువారు, మిత్రులు; కలయిక= కలుపుకోలుతనము= కలుపుకొట్టు తనము; కదు= మిక్కిలి ఎక్కువ, వడి= వేగముగా; కొలుచుట= సేవించుట; కనులు= చూచుట.

జంతువులన్నింటిలోనూ కుక్క చాల విశ్వాసముగల జంతువు. అది నమ్మకంగా తన యజమానుని కనిపెట్టుకొని వుంటుంది. కాకికి పక్షులన్నింటిలోను ఒక విశేష స్థానం గలదు. పితృపిండాలు కాకులకే పెట్టబడును. కాకి కలుపుగోలు తనానికి చాల ప్రసిద్ధి. తినుటకు ఏదైనా దొరికినపుడు అది తన తోటి కాకులను పిలుచును. జంతువులలో గాడిదంత ఓర్పుగల జంతువు మరొకటిలేదు. పెద్దబరువులు మోయుటలోకూడ గాడిద చాల ప్రసిద్ధి. అందుకే ఎక్కువబరువు "గాడిదబరువు" అంటారు. జంతువులలోనూ, పక్షులలోనూ గల విశ్వాసము, కలుపుకోలు తనము, ఓర్పు మొదలగు సద్గుణాలు నేడు నాగరికులమని చెప్పుకొని విర్రవీగే నరమానవులలో ఇంచుమించుగా లేనట్లే. అయితే నేడు వారిలో అవిశ్వాసము, అబద్ధము, పితలాటాలు, పరపీడన, ఓర్వలేని తనము, హింసాభావము, ధనకాంక్ష, పదివీ వ్యామోహము నిండివున్నాయి. ధనార్జనకొరకు నేటి మానవులు నానాగడ్డి తింటూ ఎన్నో అవినీతి కార్యాలను దేవుళ్ళకు ముడుపుకట్టి నిర్భయముగా చేస్తున్నారు. నేటి మానవుడు

తన సహజమైన మానవ గుణాలను మరచిపోయి పశు పక్ష్యాదులకంటె కూడ దిగజారిపోయారని చెప్పుటకు విచారపడుతున్నాను.

222. తోటకూరకైన దొగ్గలాకులకైన
తవుడుకైన, తాలు తప్పకైన
కావ్యములను జెప్పు గండ్యాలు ఘనులైరి ॥వి॥

గండ్యాలు= పగటివేషగాండ్రు, వికృత వేషాలువేసి ప్రజలను నవ్వించువారు, పనికిమాలిన కవులు.

పాండిత్యంలేని చవుకపారు కవులు కొందరు పగటివేషగాళ్ళవలె తలాతోకాలేని కబ్బములు వ్రాసి కొద్దిపాటి డబ్బుకు కక్కుర్తిపడి వాటిని అమ్ముకొని తమ డొక్కలు నింపుకొంటున్నారు. ఇటువంటివారికే ఈరోజులలో ధనము పేరు లభిస్తున్నాయి. కాని ఆత్మాభిమానంగల పోతనవంటి కవులు కొంతమందికూడ లేకపోలేదు. వారు పోతన్నవలెనే నిరాడంబర జీవితాలు గడుపుతూ దేశంలో మారుమూల ప్రదేశాలలో అనామకులుగా జీవిస్తూ వుంటున్నారు.

223. వెఱ్ఱివానికైన వేషధారికినైన,
రోగికైన, పరమయోగికైన,
స్త్రీల జూచినపుడు చిత్తంబు రంజిల్లు ॥వి॥

వెఱ్ఱివాడు= పిచ్చివాడు; వేషధారి= సన్యాసి; చిత్తము= మనస్సు; రంజిల్లుట= సంబరపడుట= ఆనందించుట= సంతోషపడుట.

మానవులలో ఆడ, మగ రూపాలు వేరువేరు నిర్మాణం లేనట్టయితే మానవోత్పత్తి కాజాలదేమో అనిపిస్తోంది. అందుకే కాబోలు ఆడుదాని అవయవాలు చాల సుకుమారంగానూ, సొగసుగానూ నిర్మింపబడుతున్నాయి. అవి మగవానిని ఆకట్టుకోవటం ప్రకృతిసిద్ధమైన ఒక అనివార్య నియమాన్ని యోగాభ్యాసాలుచేసిన మహామహులు కూడ ఆడవాళ్ళ పొడ– అందులో కాస్త అందమైన, వయ్యారంగల ఆడవాళ్ళ పొడ– తగులగానే శారీరకంగా కాకపోయినా మానసికంగా ఏమాత్రమైనా చలించక ఉండేలేరేమో అనిపిస్తోంది. ఇంతేకాదు అందమైన ఆడది మగవానిని – వాడు పేదవాడైనా, రోగియైనా, వెఱ్ఱివాడైననూ, యోగియైననూ– ఆకర్షించుట ప్రకృతి

సిద్ధమైన అనివార్య నియమంగా కన్పిస్తోంది. కనుక ఆడ, మగ ఒకరి నొకరు ఆకర్షించుట అందులో ఈడూ-ఓడూ, మనసూ కలిసినప్పుడు అనివార్యమేమో అనిపిస్తోంది. కనుక ఆడ, మగ తమకు ఏ విధమైన శారీరక, మానసిక బాధలు కలుగని రీతిలో కలిసివుండి కాపురం చేసికొనుటలో తప్పేమీలేదు. కుల, మత, వర్గ భేదాలను ఆడ, మగ, ఆకర్షణ సరకు గొనదు.

224. వేలకొలది భువిని వేషముల్ దాల్తురు
ప్రాలు మాలి బువ్వ ఫలము కొఱకు;
మేలుగాదు మదిని మిన్నంది యుండరా ॥వి॥

భువిని= భూలోకంలో; తాల్చుట= ధరించుట; ప్రాలుమాలుట= సోమరులైపోవుట, సోమరితనము పొందుట; బువ్వ= అన్నము; మేలు= శుభము, మంచికార్యము; మది= మనస్సు, మదిని= మనస్సులో; మిన్నందుట= తృప్తిచెందుట= తృప్తిపడుట.

నేడు మన పవిత్ర భారతదేశంలోని మానవులలో- అందులో కాస్తో కూస్తో చదువుకున్నవారిలో- ఎక్కువమంది తమపొట్టకూటికై అనేకమైన వేయరాని వేషాలు వేసి, ఆడరాని అబద్ధాలాడుచూ, చేయరాని పనులు చేస్తున్నారు. చదువుకున్నవారిలో ఎక్కువమంది అబద్ధాలతోనూ, మోసాలతోనూ డొక్కలు నింపుకుంటున్నారు. కొందరు రాతి దేవుళ్ళను ఆధారంగా చేసికొని నైవేద్యాలు, కానుకలు మొదలగువానిద్వారా బ్రతుకుచున్నారు. కొందరు చనిపోయినవారికి తద్దినాలు, దినాలు, ఏడూరులు మొదలగు పనికిమాలిన తంతులద్వారా డొక్కలు నింపుకుంటున్నారు. కొందరు తమను దైవభక్తులమని చెప్పుకొని ప్రజలను ఆర్థికంగా దోపిడీచేస్తూ బువ్వ సంపాదించు కుంటున్నారు. కొందరు తమను మంచిచెడులను చెప్పే సిద్ధాంతులంజ్యోతిష్యులం అని చెప్పుకొని పెద్ద పెద్ద గ్రంథాలను తిరగవేసి మంచి చెడులను చెప్పినట్లు నటిస్తూ లెస్సగా శుల్కాలు అమాయక ప్రజలనుండే కాకుండా డొక్కశుద్ధిగల పెద్దమనుషులనుండి కూడ వసూలుచేస్తూ కుక్షిని నింపుకుంటున్నారు. ఇక సన్యాసుల, మఠాధిపతుల, పీఠాధిపతుల, సంగతి చెప్పనక్కరలేదు. వీరందర్నీ పక్కా పగటి దోపిడీగాంధ్రన్నా తప్పులేదు.

ఇటు మనదేశంలో నేడు రాజ్యాంగాధినేతల వేషాలు మత వేషధారులకంటే కొన్ని రెట్లు ఎక్కువైపోయాయి. రాజకీయ నాయకులు, రాజ్యాంగాధికారులు మొదలగువారిలో ఎక్కువమంది పసిడికి, పదవికి తొత్తుకొడుకులైపోయారు. వారు ఊసరివెల్లి వలె (ముదురుతొండ) పార్టీలు మారుతూ అనేక అవినీతి పనులు చేయ సాహసిస్తున్నారు. నేడు దేశాన్ని ఒక వైపున మత ప్రచారకులు, మరొకవైపున రాజకీయ నాయకులు పచ్చి స్వార్థపరులై ఛిన్నాభిన్నం చేసివేస్తున్నారు. దేశంలో శాంతిభద్రతలు కరువైపోయాయి. కనుక మానవతా వాదులందరూ ఏకమై దేశాన్ని అధోగతి పాలుకాకుండా  కాపాడవలసిన సమయం యిది.

225. సుతులు సతులు మాయ, సుఖదుఃఖములు మాయ,
సంస్కృతియును మాయ జాతి మాయ
మాయబ్రతుకున కిన్ని మాయలు కల్పించే ॥వి॥

మాయ= మోసము, కపటము; సుతులు= కొడుకులు; సతులు= పెండ్లాలు; సంస్కృతి= ఆచార పద్ధతులు; జాతి= కులము; కల్పించుట= సృష్టించుట, నిర్మించుట

మాయ అనే మాటకు ధనము, ఐశ్వర్యము, లక్ష్మీదేవి, అజ్ఞానము, భ్రమ, మోసము, కపటము, ఇంద్రజాలము, ఈశ్వరాజ్ఞతో పనులను చేయు శక్తి మొదలగు అర్థాలు కలవు. అసలు మాయ అంటే ఒక వస్తువు కొంత కాలంపాటు మన కండ్లకు కన్పిస్తూ తరువాత కొంత కాలానికి కనపడకుండా పోవుట– దీనినే వేదాంతులు “మిథ్య” అంటారు. మన కంటికి కన్పించే ప్రాణముగల, ప్రాణంలేని వస్తువులన్నీ వెనుకా ముందుగా ఏవో ఒక రోజున మన కండ్లకు కనపడకుండా పోయేవే. అట్లనే మనం కూడ పోయేవాళ్ళమే కనుక ఆటిని మాయ వస్తువులనుట న్యాయమే. బాగుగా పరిశీలించి చూడగా యీ ప్రపంచంలో ఎల్లకాలం వుండే ప్రాణముగల, ప్రాణంలేని వస్తువులలో ఏదీ లేదు. అందుకే వేమన్న కొడుకులు, పెండ్లాలు, గొడ్లు, ఇండ్లు, వాకిళ్ళు మొదలగునవి అన్నీ మాయ అని వక్కాణించుట ఎంతో ఉచితముగా కన్పిస్తోంది. ఈ మాయ బ్రతుకునకు మనం ఎన్నో చేయరాని పనులను ఎరిగుండే చేసి మన చుట్టూ మాయలను కల్పించుకొని అనేక ఇడుములలో చిక్కుకొని ఉక్కిరిబిక్కిరైపోతున్నాము. వివేకవంతులు యీ మాయనుండి

తప్పించుకొనుటకు యత్నించాలి.

226. అస్థిరమగు మేని కధిక పాటులుపడి
పెక్కు విధములు పెంచి పెంచి;
అగ్నికిచ్చు లేక యడవి నక్కలకిచ్చు ॥వి॥

మేను= శరీరము; అస్థిరమగు= స్థిరముకాని, ఎల్లకాలం ఉండనట్టి; పాటులు= కష్టాలు, శ్రమలు.

మన శరీరం స్థిరమైనది కాదనేమాట అందరకూ తెలిసినదే. అయితే అందరూ ఆ సంగతి మరచిపోతూ వుంటారు. కాని అట్లని మనం మన శరీరాలను పోషించకుండా వుండలేము. మనం బ్రతికి వున్నంతకాలం మనం మన శరీరాలను తప్పక పోషించాలి. కాని పోషించటానికై మనం ఎన్నో చేయరాని పనులు చేయటానికి వెనుకాడుటలేదు. ఎందుకన మనం అనేక తుచ్ఛమైన భోగాలకు లోనై ఎన్నో చేయరాని పనులు చేస్తున్నాము. మనం మన నాలుకలను స్వాధీనంలో వుంచుకోలేక ఎన్నో తినరాని తిండ్లు తింటూ రోగులమై పోతున్నాము. మనలో చాలమంది "మనం తింటానికే పుట్టాము" అనే సాకుతో అడ్డమైన కూళ్లూ కుడుస్తూ అనేక చెప్పరాని జబ్బులకు గురైపోయి నానారకాల ఇడుములు అనుభవిస్తున్నారు. కొందరు జబ్బులు రావటం పూర్వజన్మ కర్మల ఫలితమని సరిపుచ్చుకుంటున్నారు. కాని మనం ఆరోగ్యంగా బ్రతకటానికి తగిన తిండి తినాలిగాని అడ్డమైన గడ్డీ తినటానికి బ్రతకవద్దని వేమన మనలను పరోక్షంగా మందలించాడు.

227. మంచి శకునములని యెంచి పెండిలి సేయ
వారలొకరు లేరు వసుధలోన,
జనుల కర్మములను, శకునముల్ నిల్పునా? ॥వి॥

శకునము= శకినము, మంచి చెడులను సూచించునది; వసుధ= భూలోకము; కర్మ= పని.

మంచిచెడ్డ శకునాలు, కొన్ని పక్షులు, కొన్ని జంతువులు, కొన్ని కులాలవారు, పక్షుల, పశువుల అరుపులు, నీళ్ళకుండ, కొత్త కుండలు, కాళీకుండ, శవము, బంగారము, వెండి మొదలగు కొన్ని ధాతువులు, శరీర అవయవాల కదలికలు,

మొదలగువాటి ద్వారా తెలుపబడునని చాలా మందికి నమ్మకంకలదు. లగ్నాలు కూడా ఒకరకంగా శకునాల క్రింద లెక్కే. కాని అనుభవంలోమాత్రం మంచి లగ్నాలనియు, మంచి శకునాలనియు ఎంచి పనులు చేసినవారికి మంచి ఫలితాలు కలుగని సందర్భాలు చెడ్డ శకునాలలో, చెడ్డ లగ్నాలలో పనులు చేసినవారికి మంచి ఫలితాలు కలిగిన సందర్భాలు ఎన్నో కలవు.

నా సొంత అనుభవాన్ని ఒక దానిని తెలుపుతాను. 1984లో నేను కుటుంబసహితంగా కాశీలో చదవటానికి యింటినుండి బయలుదేరగా క్రొత్త కుండలకావడితో కుమ్మరి ఎదురయినాడు. అది చూచి అక్కడేవున్న కొంతమంది పల్లెకారుల ఆడపడుచులు నాతో "బాబాయిగానూ! ఈ రోజుకు మీరు ప్రయాణం మానుకొని యింటికి తిరిగివెళ్లుట మంచిది. క్రొత్త కుండల కావిడి ఎదురుగావస్తే ప్రయాణం చేసేవారలలో ఎవరో ఒకరు తప్పక చచ్చిపోతారు. కనుక మీరు యీ రోజుకు ప్రయాణం మానుకోండి" అని నాకు సలహా చెప్పారు. కాని నేను వారి సలహాను పాటించక కాశీ వెళ్ళి 2 సంవత్సరాల తరువాత ఒక అబ్బాయినికూడ వెంటబెట్టుకొని అందరం క్షేమంగా యింటికి వచ్చాము.

నిజానికి శకునాలకు లగ్నాలకు మన పిరికితనమే విలువనిస్తున్నది. అంతేకాని వాటిలో పస ఏమున్నది? మంచిపనికి చెడ్డ సమయము, చెడ్డ పనికి మంచి సమయంలేదు" అనే వినోబాభావేగారి సూక్తి ఎంతో అనుభవంతో చెప్పింది.

228. మతపు వేషదార్లు మహిమీద పదివేలు
మూఢ జనుల గలవ మూగుచుండ్రు;
కొంగలు గుమిగూడి కొఱకవా ఓదెలు ॥వి॥

కలవ= మోసపుచ్చటానికి; మూగుట= ప్రోగగుట; ఓదెలు= పండిన పైరును ఎండటానికని కోసి చేనుమీద పెట్టిన ఒక చిన్న పోగు.

నేడు ప్రపంచంలో బౌద్ధ, క్రైస్తవ, హిందూ, మహమ్మదీయ మతాలు ఎక్కువ సంఖ్యగలవి. ప్రస్తుతం మనదేశంలో హిందూ, క్రైస్తవ, మహమ్మదీయ మత ప్రచారకులు "మా మతం గొప్పదంటే మా మతం గొప్పదని" ఒకరినొకరు ద్వేషించుకుంటూ, దూషించుకుంటూ తమ తమ అనుయాయులను వారిలో వారు

నరుక్కొనిచచ్చే స్థితికి తీసికొని వచ్చారు. నేడుకూడ యిదేపని జరుగుతూవుంది. ఇందువల్ల యీ మూడు మతాలలోనూ ఆర్థికంగానూ, సాంఘికంగానూ వెనుకవడివున్న అమాయక ప్రజల స్థితి నానాటికీ హీనాతిహీనమైపోతోంది. అందువల్ల వారు ఆర్థికంగానూ శారీరకంగానూ యింకా అనేక బాధలకు గురి కావలసి వస్తోంది.

పరాన్నభుక్కులైన యీ మత ప్రచారకులు యీ మతకలహాలవల్ల లేశమాత్రం కూడ ఏ విధమైన కష్టనష్టాలు పొందుటలేదు. వారు తమ తమ అనుయాయులను మాయమాటలతో మోసపుచ్చి వారిని తమ నీచస్వార్థానికై బలి చేసివేస్తున్నారు. ఈ మతకలహాలవల్ల కష్టజీవులు యింకా కష్టాలపాలై పోతున్నారు. వారు సుఖశాంతులకు నానాటికీ దూరమైపోతున్నారు. వారు మత ప్రచారకుల మోసపు మాటలను గ్రహించే స్థితిలో లేనంత మత పిచ్చి మత్తులో కూరుకొనిపోయారు. కనుక వారిని ఈ మతపిచ్చి ఊబిలోనుండి పైకి తీసుకొనిరావాలంటే దేశంలోని ప్రజాస్వామ్యవాదులు, మానవతావాదులు ఏకమై ప్రయత్నించాలి. మానవులంతా ఒకే దేవుని బిడ్డలమనే భావం వారిలో కలిగించి ప్రపంచమంతటికీ ఒకే మానవతామతాన్ని స్థాపించాలి.

229. తల్లి బిడ్డలకును తగవుపుట్టించెడి
ధనము సుఖము గూర్చదని వచింత్రు;
కాని, గడవలేక గడచుట ఎట్లురా? ॥వి॥

వచించుట= చెప్పుట; గడన= ధన సంపాదన; కడచుట= జరుగుట, సాగుట.

230. తల్లి బిడ్డలకును దగవు పుట్టించెడి,
ధనము సుఖము గూర్చునని గణింత్రు
కాని యెల్లయెడల ఘన దుఃఖకరమున ॥వి॥

తగవు= పోట్లాట; గణించుట= లెక్కించుట, ఎంచుట; దుఃఖకరము= కష్టాలు కలిగించేది.

ధనానికి డబ్బు, పసిడి, అర్థము, సంపతి మొదలగు అర్థాలుగలవు. నేడు–నాడు ప్రపంచ వ్యవహారమంతా ధనంమీదనే ఆధారపడివుంటున్నదనుట పరమసత్యము. అందువలన ధనార్జన ప్రపంచ వ్యవహారాలకు చాల అవసరమే.

కాని ధనార్జన ఇతరులను పీడించి మాత్రం చేయకూడదు. అందుకే కొంతమంది పూర్వీకులు "ధర్మం, అర్థం, కామం" అని నుడివినారు. అంటే డబ్బు సంపాదనలో ధర్మాన్ని పాటించాలి. ధర్మం అంటే ఇతరులకు శారీరక మానసిక పీడను కలిగించని పని. కనుక ధర్మాన్ని పాటిస్తూ ధనాన్ని ఎంతైనా సంపాదించవచ్చును. అయితే ధనసంపాదనకై ధర్మాన్ని ఎంతగా పాటించాలో దానిని ఖర్చుపెట్టుటలో కూడ అంతగా ధర్మాన్ని పాటించవలసివుంటుంది. అంటే దనాన్ని తనకు, ఇతరులకు ఏవిధమైన శారీరక మానసిక బాధకలిగించని పనులకే ఉపయోగించాలి. అప్పుడే ధనం హానినిగాని, కలహాలనుగాని కలిగించలేదు. కాని నేడు ప్రపంచంలో ఎక్కువమందికి ధనసంపాదన తెలుసునే కాని ధనాన్ని సద్వినియోగం చేయుట బొత్తిగా తెలియకపోవుటవల్ల ధనం అనేక అనర్థాలకు కారణమగుచున్నది. కనుక ధర్మయుక్తంగా ధనాన్ని సంపాదిస్తూ, ధర్మయుక్తంగా దానిని ఖర్చుపెట్టిన యెడల మనకు మేలుచేయునేగాని ఏవిధమైన కీడును కలిగించదు.

231. దశగలారినెల్ల, తమ బంధువులటంచు
దశయులేమి నెంద్రు తక్కువగను;
దశయనంగను ధన దశ యొప్పునొక్కటే ॥వి॥

దశ= స్థితి; డబ్బు= ఆర్థికస్థితి.

నేడు ప్రపంచంలో ఎక్కువమంది ధనాన్నే దేవుడుగా భావించి పూజిస్తున్నారు. నేడు ధన సంపాదన ఎక్కువగా వున్న వారిని గొప్పనీతివంతుడుగానూ, పెద్దమనిషిగానూ ఎంచుతున్నారు. ఈ డబ్బు దేవుళ్ళకు కూడ సోకింది. ఏ దేవునికైతే ఎక్కువ డబ్బు కానుకలరూపంలో వస్తుందో ఆ దేవుడు గొప్పఏ హహిమగలవాడుగా భావింపబడి పూజింపబడుచున్నాడు. మన తిరుపతి వెంకన్నకు ఆదాయంలేని రోజులలో అతనిని తొంగిచూచినవారు లేరు. నేడు అతని ఆదాయం కోట్ల సంఖ్యలోనికి పెరిగింది. అందువలన నేడు ఆయన గొప్ప మహిమగల దేవుడని మనదేశంలోనేగాక ప్రపంచమంతా చెప్పుకుంటున్నారు. దేవుళ్ళే ధనం మీద ఆధారపడి పేరు ప్రతిష్ఠలు సంపాదించుకొంటూ వుంటే, ఇక మానవుల సంగతి ఏమని చెప్పాలి? అందులో ఆర్థిక దుస్థితిలో వున్న వారిసంగతి ఏమని చెప్పాలి? నేడు ధనం వున్న

వాడు పరాయవాడైనప్పటికీ ప్రతివాడూ వానిని మావాడేననియు, మా దగ్గిర బంధువనియు చెప్పుకొని గర్వపడుతున్నారు. డబ్బులేనివాడు దగ్గిర బంధువైనప్పటికీ ప్రతివాడూ అతనిని తన బంధువు కాదని చెప్పి అతని ఊసే ఎత్తడు; అతని పొడేగిట్టదు. ఇటువంటి వారిని పసిడి తొత్తుకొడుకులన్నా తప్పులేదు.

232. పసరంబుతోసమయు ప్రజలెన్నటికికారు;
పసరమాసించేదికసవు నొకటె!
ప్రజలు ఆశించేది పలువిధతిండ్లురా ॥వి॥

పసరము= పశువు; కసవు= గడ్డి; పలు= అనేకమైన.

మానవులు పశువులతో ఏ పరిస్థితిలోనూ సమానం కాలేరు. ఎందుకన పశువులు పాపం ఒక్క గడ్డినే తింటాయి. కాని మానవులు నానారకాలగడ్డినీ (తిండినీ) తింటారు. కాని పశువులకు కూడ మానవులవలె మాటలు, వారినాలుకలు గనుక వుంటే అవి కూడ మానవులవలె నానారకాల మాటలు మాట్లాడుతూ, నానారకాల తిండ్లూ తప్పక తినేచూ వుండేవే. లేక పశువుల నాలుకలు గనుక మనుషులకు వుండి వుంటే, పాపం మానవులు యిన్నిపిచ్చితిండ్లు ఎందుకు తింటారు? కనుక మానవులు నానారకాల గడ్డి తినటానికి కారణం పాపం వారు మాత్రంకాదు. కాని వారి దుష్టనాలుకలే. వారిని నానారకాల తిండ్లను తినటానికి ప్రేరేపిస్తున్నది వారి నాలుకలే. అయితే మానవునికి తన నాలుక వగైరా అవయవములను అదుపులో వుంచటానికి సహజంగానే ఒక శక్తివుంది. కాని నాలుక యొక్క చాపల్యానికి ముందు మానవుని ఆ శక్తి యొక్క ఆటలు సాగటంలేదు. అందువల్లనే పాపం మానవుడు తన నాలుక ప్రోద్బలంవల్లనే నానారకాల కూళ్ళను వేళాపాళా లేకుండా మితిమీరి తింటూ పలురకాల జబ్బులను కొనితెచ్చుకొని డాక్టర్ల పంచల పడివుండి ఇల్లూ ఒల్లూ గుల్లచేసుకొని గల్లంతై గూటికి చేరుకుంటున్నారు. మనం ఆరోగ్యంగా బ్రతకటానికి సరిపడ తినాలేగాని నానారకాల తిండ్లను తినటానికి బ్రతకవద్దని వేమన్న మనలను పరోక్షంగా హెచ్చరించాడు.

233. బహుళ కావ్యములను పరికింపగా వచ్చు;
బహుళ శబ్దచయము పలుకవచ్చు;

సహన మొక్కటబ్బచాల కష్టంబురా ॥వి॥

బహుళ= పలు, అనేకమైన; పరికించుట= వెతకుట, పరిశోధించుట; చయము= సమూహము, గుంపు, మంద; సహనము= ఓర్పు, విసుగులేనితనము; కావ్యముల= పద్యములుగల పుస్తకములు; అబ్బుట= అలవడుట= అలవాటగుట, పట్టుపడుట.

నేడు సమాజంలో పెద్ద పెద్ద చదువులు చదివిన విద్వాంసులకు కొరత లేదు. గంటలకొలది అనర్గళముగా ఉపన్యసింపగల ఉపన్యాసకేసరులకు కొరతలేదు. రసవంతమైన గొప్ప గొప్ప కావ్యాలను వ్రాయగల కవివరేణ్యులకు కొరతలేదు. కాని ఇతరుల సహేతుకమైన వాదాలను కూడ విని ఓర్చుకొనే ఓర్పుగల పండితులు కొరతగా కన్పిస్తున్నారు.కొరతగాకాదు లేరనే చెప్పాలి. అందువల్ల ఎన్ని పెద్ద పెద్ద చదువులు, ఎంత గొప్ప వక్తృత్వ శక్తి ఎంతగొప్ప రసవంతమైన కవిత్వ ధోరణి వున్నప్పటికీ ఓర్పులేని పండితుడు నైతికంగా గొప్పవాడు కాలేకపోతున్నాడు. నిజానికి ఓర్పుగల వాడే గొప్ప విద్వాంసుని కంటేనూ, గొప్ప ఉపన్యాసకుని కంటేనూ గొప్ప కవికంటేనూ ఎక్కువగా గౌరవింపబడుతున్నాడు. అంటే గొప్ప పాండిత్యము, గొప్ప వక్తృత్వ శక్తి, గొప్ప కవిత్వ శక్తి వగైరాలు కలిగిన పండితుడు ఓర్పులేని వాడైన యెడల, సమాజంలో గౌరవింపబడడు.

234. భాషలాడనేర్చి పలుమోసములుచేసి
గ్రాసమునకు వేషగాడనయితి;
దోసకారులకిల,దొరకునా సూక్ష్మంబు? ॥వి॥

పలు= అనేకమైన; గ్రాసములు= కూడు, ముద్ద; ఖలుడు=మోసగాడు, దుర్మార్గుడు; దోసకారి= నేరస్థుడు.

ముద్దకోసం మాయమాటలు చెప్పి జనాన్ని మోసగించిన నాబోటి దుర్మార్గులకు మోక్షము తన్నుకొనిచచ్చినా దొరకు.

235. మంచివారులేరు మహిమీద వెదకిన
కష్టులెందరైన గలరు భువిని;
పసిడిలేదుగాని పదటెంత లేదయా? ॥వి॥

మహి= భూలోకము; కష్టులు= ఇతరులను కష్టపెట్టువారు, చెడ్డవాళ్ళు; పసిడి= బంగారము; పదడు= బూడిద, దుమ్ము.

చెట్టు ఎక్కుట ఎంత కష్టమో యితరులకు మేలుచేయుట అంత కష్టము. చెట్టు మీద నుండి దిగుట ఎంత తేలికో, ఇతరులకు కీడు చేయుట అంత తేలిక. లోకంలో బంగారం ఎక్కడపడితే అక్కడ దొరకదు. కాని దుమ్ము మాత్రం ఎక్కడబడితే అక్కడ కావలసినంత దొరుకును. అట్లనే ప్రపంచంలో ఇతరులకు మేలుచేసేవారు చాల తక్కువ. కాని కీడుచేసేవారు కావలసినంతమందిగలరు. అందుకే బంగారానికి వున్న విలువ దుమ్ముకు లేదుగా.

236. మలముజారవిడుచు మతిపాయు పథమున
మలము విడువ బలముమనుజునకును;
మలము బిగిసెనేని మతిప్రాణహానియౌ ॥వి॥

పెంట కడుపులో పేరుకొనిపోవుటవల్లనే మానవునికి జబ్బులు రావటానికి మూలకారణం.కనుక పెంటను కడుపులో నుండి ఎప్పటి కప్పుడు బయటకు వెళ్ళగొట్ట గలిగితే, మనిషికి జబ్బంటూ వుండదు. మలం గనుక కడుపులో బిగుసుకొనిపోతే అంటే పేరుకొనిపోతే మనిషి తప్పక చచ్చిపోతాడు.

237. నీచుల వినుతులు సేయుచు
యాచకమున దిరిగి తిరిగి యలయుటకంటె
న్నేచిన ఇంద్రియ పశువుల
గాచెడి నాడిందునందు ఘనుడగు వేమా॥

ఏచుట= చెలరేగుట, ఉద్రేకించుట, రెచ్చిపోవుట; వినుతి= వినతి; దండము= యాచకము= బిచ్చము; అలయుట= అలసిపోవుట; ఇంద్రియములు= నాలుక చుల్లి వగైరాలు; కాచుట= కాపాడుట, అదుపులో పెట్టుకొనుట; ఘనుడు= గొప్పవాడు.

కండ్లు, చెవులు, ముక్కు, నాలుక, నోరు, కాళ్లు, చేతులు, చుల్లి, పూకు మొదలగునవి ఇంద్రియాలనబడును. చదివినవాడుగానీ చదువులేని వాడుగానీ ఆడగానీ, మగగానీ పనికి దొంగైనపుడు డబ్బులు కటకటలాడిపోతాడు. అప్పుడు

తన ఆకలిని శాంతపరచడానికై అడ్డమైన గాడ్దెకొడుకులనూ పొగడి అడుక్కొని తినవలసిందే. కాని ఎవడైతే తన నాలుకను, చుల్లిని అదుపులో వుంచుకోగలుగుతాడో వాడు అడ్డమైన గాడ్దెకొడుకులవద్దకు అడుక్కోవటానికి వెళ్ళి వాళ్ళ కాళ్ళకు వంగి వంగి మ్రొక్కడు. కనుక ముఖ్యంగా నాలుకను, చుల్లిని అదుపులో వుంచుకోగలవాడు శారీరకంగానూ, మానసికంగానూ ఎంతో ఆరోగ్యంగా వుండగలడు. ఇటువంటి వానినే జితేంద్రియుడంటారు.

238. ఓజమాలు మగువ ఓలిమాడలచేటు,
పాటులేని మగడు కూటిచేటు,
పనికిమాలుదాని బత్తెంబు చేటురా ॥వి॥

ఓజ= నీతి, మంచినడత; ఓజమాలు= మంచి నడతలేని; మగువ= ఆడుది; మాడలు= డబ్బులు; ఓలి=కన్యకు యిచ్చే కట్నము, కన్యాశుల్కము; బత్తెము= కూడు, కూలి; పాటు= పరిశ్రమ.

పూర్వము కొన్ని వెనుకబడిన కులాలలో పెండ్లికూతుర్ని డబ్బిచ్చి కొనుక్కొనే ఆచారముండేది. ఆ డబ్బును "ఓలి" అంటారు. ఓలిని నాగరికులు "కన్యాశుల్కము" అంటారు. ఈ ఆచారం ఇప్పుడూ కొన్ని వెనుకబడిన కులాలలో కానవస్తున్నది.

ఈ రోజులలో పెద్దకులాల వారిలో యీ కన్యాశుల్కమునకు బదులు "వరశుల్కము" లేక "వరకట్నము" విపరీతంగా వ్యాపించియున్నది. ఈ వరకట్నం సామాన్య ఆస్తిపాస్తులుగల ఆడపిల్లల తల్లిదండ్రుల ప్రాణాలు తీసివేస్తోంది. వరకట్నం చాలినంత తేలేదని ఎంతోమంది ఆడపిల్లలు రోజూ రోజూ భర్తలచేత అత్తమామలచేత హత్యచేయబడు తున్నారు. కాని పూర్వం కన్యాశుల్కం తక్కువ యిచ్చాడని ఏ పురుషుని భార్య హత్య చేసినట్లు చరిత్రలో ఎక్కడా కనిపించదు.

239. పుత్తడిగలవానిని పుండు బాధయుగూడ,
వసుధలోన చాల వార్తకెక్కు,
పేదవానియింట పెండ్లయిన యెరుగరు ॥వి॥

పుత్తడి= బంగారము; వసుధ= భూలోకము; వార్తకెక్కుట= అందరికీ తెలిసిపోవుట

నేటి సమాజంలో ధనప్రభావంవల్ల గుణహీనుడు కూడ గుణవంతుడుగా చెలామణియైపోతున్నాడు. ధనహీనుడు ఎంత మంచి గుణము గల వాడైనప్పటికీ వాని గుణాన్ని గుర్తించి గౌరవించేవారే నేటి సమాజంలో కరువైపోతున్నారు. ఇంతేకాదు యీ రోజులలో ఒక గుణములేని ధనవంతుని యింటిలో పిల్లి నీళ్లాడినా లేక కుక్కలకు పెండ్లిచేసినా లేక వానికి చిన్న కురుపు లేచినా వార్తాపత్రికలో పెద్ద పెద్ద అక్షరాలలో ప్రకటింపబడుతోంది. కాని ఒక ధనహీనుని యింటిలో పెండ్లి జరిగినప్పటికీ ప్రక్కయింటివాడు కూడ గమనించరు. అవునులే. ఈ రోజులలో దేవుళ్ళకు కూడ ధనంవల్ల గౌరవం కలుగుతూవుంటే ఆ దేవుడు అంత గొప్ప మహిమ గలవాడని పరాన్నభుక్కులైన పండితవరేణ్యులు వక్కాణిస్తారు.

240. చంపకూడదెట్టి జంతువునైనను
చంపవలయులోని శత్రుగుణము;
తేలుకొండి గొట్ట తేలేమి చేయురా? ॥వి॥

శత్రుగుణము= చెడ్డగుణము; కొట్టుట= తీసి వేయుట, నరికి వేయుట.

మానవులనే కాదు, ఏ చిన్న యితర ప్రాణిని కూడ హింసించరాదని బుద్ధభగవానుడు ఎప్పుడో సెలవిచ్చాడు. ఈ అహింసా సిద్ధాంతాన్నే పూజ్య బాపూజీ (గాంధీజీ) యిలా వ్యాఖ్యానించారు– నేను ఇంగ్లీషు వారిని ద్వేషించుటలేదు. దూషించుటలేదు వారికి హాని కలిగింపకోరుటలేదు. కాని వారిలోగల చెడ్డగుణాన్ని ద్వేషించి దూషించి దానిని నశింపచేయ కోరుతున్నాను. నేను ఇంగ్లీషువారిని భారతదేశంనుండి వెళ్లిపొమ్మనటం లేదు. కాని మానవ సంస్కృతికి హానిని కలిగించేవారి సంస్కృతిని పొమ్మంటున్నాను.”

తేలుకు కొండెములో యితరులకు హాని కలిగించే విషము వుంటుంది. కనుక దాని కొండెము చివర ముల్లును తీసివేసిన యెడల, అది యెవరికీ హాని చేయలేదు. ఇది వేమన సూక్తి.

241. జాతిభేదమెంచి జన్మముల్ తెలియక
ముక్తి కానలేరు మూర్ఖజనులు,
జాతులెంచనేల? జన్మంబు తెలియుము ॥వి॥

జాతి= కులము; ఎంచుట= లెక్కించుట, పాటించుట.

జన్మతో అందరూ సమానులే అనే సత్యాన్ని అవివేకులు తెలుసుకోలేక కులభేదాలతో కుమ్ములాడుకుంటూ మోక్షానికి దూరమైపోతున్నారు. కులము, మతము, వర్గము మొదలగు తేడాలను తెంచుకున్నవాడే ముక్తిని పొందగలడు.

242. జాతి నీతి వేఱు జన్మంబు లొక్కటె!
అరయ తిండ్లు వేరె ఆకలొకటె;
దర్శనములు వేఱు దైవమొనొక్కటె ॥వి॥

జాతి= కులము; నీతి= ఆచారాలు, పద్ధతులు; దర్శనములు= దైవాన్ని తెలిపే తత్త్వశాస్త్రములు

ప్రపంచ మానవుల కులాలు, ఆచార పద్ధతులు, తిండ్లు వేరైనప్పటికీ మానవజాతి అంతా దేవుని బిడ్డలే. అట్లనే దైవమును తెలుపు శాస్త్రాలు వేరైనప్పటికీ దైవమొక్కటే. తిండ్లు వేరైనప్పటికీ ఆకలి ఒక్కటే. కనుక మానవులంతా కుల మత భేదాలను వదలి కలసి మెలసి బ్రతుకుట నేర్చుకోవాలి.

243. బొంది వేఱు కాని భువి ప్రాణమొక్కటె;
అన్నము లిలవేఱు ఆకలొకటె;
పుష్పములిటు వేఱు పూజ యొక్కటె సుమ్మ ॥వి॥

బొంది= శరీరము; భువి= భూలోకము

244. పసుల వన్నె వేఱు పాలెల్ల నొక్కటె
పుష్పజాతివేఱు పూజయొకటె;
దర్శనంబులారు; దైవంబదొక్కటె ॥వి॥

పసులు= పశువులు; వన్నె= రంగు; దర్శనములు= తత్త్వశాస్త్రములు

ప్రకృతిలో పువ్వులరంగులు వేరైనప్పటికీ పూజకు అన్నీ సమానమే. పశువుల రంగులు వేరైనప్పటికీ అన్నిటిపాలు ఒకే రంగు కలిగి వుంటున్నాయి. తినుబండారాలు వేరైనప్పటికీ ఆకలి ఒక్కటే. శరీరాలు వేరైనప్పటికీ, ప్రాణం ఒక్కటే. దైవతత్త్వాన్ని తెలిపే విధానాలు వేరైనప్పటికీ దైవము ఒక్కడే. అయినప్పుడు ప్రపంచంలోని వివిధ మతాల ప్రజలు కలిసిమెలసి ఎందుకని వుండలేకపోతున్నారు? తమలో తాము

ఎందుకు కలహించుకొని ఒకరినొకరు ఎందుకు నరుక్కొని చస్తున్నారు? కాస్త వివేకంగల వారంతా ప్రశాంతంగా ఆలోచించుకోదగ్గ విషయము.

దైవతత్త్వాన్ని తెలిపే విధానాన్ని మతమని కొందరంటారు. మతము యొక్క ముఖ్యోద్దేశము దేవుణ్ణి తెలిసికొనుటేనని అన్ని మతాల ప్రచారకులు పైకి చెప్తూవుంటారు. కానినేడు ప్రపంచంలో ప్రతి దేశంలోనూ మతకలహాలు, మత హత్యలు అదే పనిగా జరుగుతున్నాయి. ఇవి ఎవరి ప్రేరేపణవల్ల ఎందుకు జరుగుతున్నాయో బాగా పరిశీలించి చూడగా సోమరుపోతులైన పరాన్నభుక్కులైన కొంతమంది ఆయా మతాలలోనివారు తమ పొట్టలు నింపుకోటానికై తమతమ ప్రజలమధ్య కలహాలను హత్యలను చాటుగా వుండి ప్రోత్సహించి వారిని ఆర్థికంగానూ, శారీరకంగానూ బౌద్ధికంగానూ సర్వనాశనం చేస్తూ ఆనందిస్తున్నారు. కనుక యీ దుష్టమత ప్రచారకుల యీ దుష్టపన్నాగాన్ని నాశనంచేయనంత వరకు ప్రపంచంలో శాంతి భద్రతలు పదిలముగా వుండజాలవు.

245. కలిగిన మనుజుడు కాముడై సోముడై
మిగుల తేజమున మెఱయుచుండు;
విత్తహీనుడైన ఉత్త సన్యాసిరా ॥వి॥

కలిగిన=ధనముగల; కాముడు= మన్మథుడు, భోగాలను బాగా అనుభవించువాడు; సోముడు= చంద్రుడు, ప్రకాశించువాడు; తేజము= ప్రభావము, గొప్పతనము; మెఱయుట= ప్రకాశించుట; విత్తము= డబ్బు; ఉత్త= వట్టి.

డబ్బుంటే కొండమీదకోతైనా దిగివస్తుంది! డబ్బులేనివాడు డుబ్బుకు కొరగాడు. డబ్బు ముడ్డిలో దేవుడున్నాడు, ధనమూల మిదంజగత్ అనేసామెతలు ధనంయొక్క గొప్పతనాన్ని తెలుపుతున్నాయి. ఈయుగం ధనయుగం. ఈ యుగంలో నీతి, నియమాలను పాటించకుండా చిన్నాపెద్దా ఆడామగా అందరూ డబ్బును సంపాదించటానికి రేయనక పగలనక విరామం లేకుండా ఆరాట పడుతున్నారు. అందువలన యీ రోజులలో డబ్బు సంపాదనకు అబద్ధము, మోసము, హింస ముఖ్యసాధనాలుగా వుంటున్నాయి. అందువలన యీ రోజులలో అబద్ధము, మోసము, హింస మొదలగునవి దుర్గుణాలుగా ఎంచబడుటలేదు. ఈ రోజులలో

అబద్ధం చెప్పకపోతే బ్రతకగలమా? నిజం చెప్పితే నమ్మేదెవరు? అనే నానుడులు వ్యాప్తిలో ఉన్నాయి. నిజానికి యీ రోజులలో డబ్బుకున్న విలువ దైవానికికూడ లేదనే చెప్పాలి. ఎందుకన డబ్బుతో దైవాన్ని పూజించేది మోక్షము కొఱకుకాదు; కేవలం తమ డబ్బును వృద్ధిచేయమని దేవుని వేడుకొనుటకే. ఈ రోజులలో దైవం యొక్క విలువకూడ డబ్బుమీదనే ఆధారపడి వుంటున్నది. ఎట్లనగా ఏ దేవునికి డబ్బు ఎంత ఎక్కువగా కానుకల రూపంలో వచ్చునో ఆ దేవుడు అంత ఎక్కువ మహత్తుగలవాడుగా భక్తులచేత ఎంచబడుతున్నాడు.

డబ్బు వుంటే ఎన్ని దుర్గుణాలుగల మానవుడైనా సర్వగుణ సంపన్నుడుగా ఎంచబడుతున్నాడు. కాని సర్వగుణ సంపన్నుడైననూ డబ్బు లేనపుడు దుబ్బుకు గొఱగాడు. అతడు గడ్డిపరక కంటె కూడ హీనంగా చూడబడుతాడు.

246. నొసలు బత్తుదయ్యె నోరు తోడేలయ్యె
మనసు భూతమువలె మలయగాను
శివునిగాంతు ననుచు సిగ్గేలగాదురా ॥వి॥

నొసలు= నుదురు,లలాటము; బత్తి= భక్తి; బత్తుడు= భక్తుడు; భూతము= దయ్యము; మలయుట= వ్యాపించుట, ఉద్రేకించుట; కాంచుట= చూచుట.

247. వాక్కు శుద్ధిలేని వైపగుదండాలు
ప్రేమ గలిగినట్లే పెట్టనేల?
నొసటబత్తిజూపు నోరుతోడేలయా ॥వి॥

వైపగుదండాలు= వంక వంక దండాలు

వేమన్న పైకి శైవమత సంప్రదాయానుయాయిగా కన్పించినప్పటికీ ఆయన వైష్ణవమత సంప్రదాయాన్ని ఎంత ఘాటుగానూ, నిర్దాక్షిణ్యంగానూ విమర్శించాడో, అంత ఘాటుగానూ అంత నిర్దాక్షిణ్యంగానూ తన శైవమత సంప్రదాయాన్ని కూడ విమర్శించకపోలేదు. ఏ సంప్రదాయమైనా మంచి నడతగలిగి వుండాలనే ఆయన ఆకాంక్ష, ఆదుర్దా.

తమను గొప్ప శివభక్తులమని చెప్పుకొనే శైవులు తోడేలు కడుపువలె ఎంత తిన్నా ఆకలితీరని తిండిపోతులై, పైకి నొసట,భుజాలు, చంకలు, పిఱ్ఱలు వగైరాలమీద

మూడు తెల్లని విభూతి గీతలను పూసుకొని ప్రజలను అదేపనిగా మోసంతో ఆర్థికంగా దోచుకుంటూ తమ బానపొట్టలను నింపుకొంటున్నారు. శైవులమని చెప్పుకొనే యిలాంటి తిండిపోతులకు శివసాన్నిధ్యం లభించుటకల్ల. కాని తమను శివభక్తులమని చెప్పుకొనే యిటువంటి దుష్టులకుసిగ్గేల కలగడంలేదో తెలియకున్నది. కొంతమందితాము శివభక్తులమని చెప్పుకుంటూ వంకరమాటలతోవంక దండములు పెటునే కాని ప్రేమ అనేది వారిలో కన్పించదు. విభూతిపెట్టి శివభక్తుల్లాగ నటిస్తూ తోడేలు వలె ఇతరులను మ్రింగటానికి యత్నిస్తూవుంటారు.

248. జిహ్వాలంపటంబు జీవనంబైయుండు
జిహ్వాలంపటంబె జీవపోష
జిహ్వాచేత నరులు చీకాకుపడిరయా ॥వి॥

జిహ్వా= నాలుక; లంపట= ఆశ, అత్యాశ; చీకాకుపడుట= కష్టపడుట; కష్టాలనుభవించుట; జీవపోష= జీవనపోషణ

నాలుకను సంస్కృత భాషలో ''జిహ్వా'' అని అంటారు. మన తెలుగునానుడులో చాలామంది ఆడవాళ్ళు జిహ్వాకు బదులు "జిమ్మ" అని అంటారు. వారికి ఎవరిమీదనైనా కోపం వస్తే వానిని "నీ జిమ్మదియ్య" అని తిడతారు.

నాలుక ముఖ్యంగా రెండు పనులు చేస్తుంది. అది మాట్లాడడానికీ, తినుబండారాలను నోటిలో అటునిటు త్రోయుచూ వాటి రుచిని చూడటానికీ ఉపయోగపడును. అది మనకు మాటలతోనూ, తినుబండారాలతోనూ మేలుతో పాటు కీడును కూడ కలిగిస్తోంది. ఎట్లనగా అది ఆరోగ్యకరమైన తినుబండారాలను మితముగా మనలను తిననిచ్చినపుడునూ, మంచిమాటలను మాట్లాడనిచ్చినపుడునూ అది మనకు మేలుచేయును. మంచి తినుబండారాలను కూడ మితము తప్పిన్నీ చెడ్డ తినుబండారాలను తిననిచ్చినపుడున్నూ చెడ్డమాట లను అననిచ్చినపుడునూ అది మనకు కీడును కలిగిస్తుంది. అంటే మనం మన నాలుకను అదుపులో ఉంచుకొని మంచి మాటలు మాట్లాడినా మితముగా తినదగిన తినుబండారాలు తిన్నా అది మనకు మేలుచేయును. కానినాలుకను అదుపులో పెట్టుకొనుట అందరూ సాధ్యమయ్యే పనికాదు. ఎంతోమంది మహాజ్ఞానులైన మహర్షులు, బ్రహ్మర్షులు కూడ నాలుకను

స్వాధీనం చేసుకో జాలక పోయారని మన పురాణాలు వక్కాణిస్తున్నాయి. అందుకే వేమన్న నాలుక యొక్క చాపల్యాన్ని అదుపులో వుంచుట దుస్సాధ్యమని నుడివినాడు. నిజానికి నాలుక మన అదుపులో వుంటే మనం సంపూర్ణ ఆరోగ్యవంతులముగా వుంటాము. లేక మనం దానికి తొత్తుకొడకులముగా వుంటే అది మన ప్రాణాలు నిలువునా తీస్తుంది.

249. రాళ్ళు నమ్మియున్న రాజాధిరాజులు
కూటికెడలి భువిని కూలిచనిరి;
రాళ్ళు పగులగొట్టి రాక్షసపుత్రులు
సూళ్ళు సూళ్ళు గలిగి మనిరి వేమ

ఎడయుట= దూరమైపోవుట; కూలిచనిరి= చచ్చిపోయిరి; కూటి కెడలి= కూడులేకుండా; మాళ్లు= పెద్దపెద్ద మేడలు; ఊళ్ళు= గ్రామాలు, రాక్షస పుత్రులు= తురకలు; మనుట= జీవించుట; రాళ్లు= రాతివిగ్రహాలు.

రాతివిగ్రహాలలో ప్రాణప్రతిష్ఠ చేశామనియు, అవి చైతన్యవంతమైన వనియు, అవి తమ భక్తులకు కీడుకలిగించే దుష్టులను తునుమాడ గలుగగల వనియు ఆగమ వైదికపండితవరేణ్యులు అదే పనిగా వదరుతుండేవారు. ఇంతేకాదు. వారు విగ్రహాలను ఎగతాళిచేసినవారి కండ్లుపోతాయనికూడ ప్రజలను బెదరేసేవారు. కాని టర్కీ వాసులైన తురకలు ఆ విగ్రహాలను సమ్మెటలతో పటాపంచలుగా పగలగొట్టి వాటిక్రింద నేలలో పాతిపెట్టబడిన ధనాన్ని తీసికొని ఒంటెలమీద తమ దేశానికి తరలింపజేసి తాము యిక్కడ పెద్దపెద్ద మేడలను, మసీదులను నిర్మించుకొని రాజ్యాలను స్థాపించుకొని పరిపాలించారు. కాని ప్రాణంలేని రాతి విగ్రహాలను నమ్మి వాటిని పూజించిన హిందూ రాజులు, ప్రజలు కూటికి గుడ్డకు కరువాసిపోయి బికారులై చనిపోయారు. విగ్రహాలలో ప్రాణ ప్రతిష్ఠ చేశామని బూటకపు మాటలు చెప్పిన ఆగమవైదిక పండితుల పత్తాలేదు. నేడు మన స్వతంత్ర భారతదేశంలో ఆ రాతి విగ్రహాల, దేవాలయాలజోరు మరీ ఎక్కువైపోయింది. విగ్రహాలద్వారా బ్రతికే బాబాల సంఖ్యకూడ నానాటికీ పెరిగిపోతూనేవుంది. ప్రతి పట్టణములోనూ, ప్రతి గొందిలోనూ, ప్రతి కూడలిప్రదేశంలోనూ ఒక్కొక్కగుడి గాని మసీదుగాని చర్చిగాని

నిర్మింపబడుతోంది. మత దురహంకారము యింతగా పెరగటానికి మూల కారణం మన రాజ్యాంగాధినేతలు, మతాచార్యులు, మత ప్రచారకులు ఒకటవ నెంబరు స్వార్థపరులైపోవటమే. దేశంలో బీదరికము, అరాచకము, అవినీతి రోజు రోజుకూ పెరిగిపోతూనే వుంటున్నాయి. దేశంలో నిజమైన శాంతిభద్రతలు కరువైపోతున్నాయి. అమాయకపు ప్రజలు అంతులేని యాతనలకు గురైపోతున్నారు. వీటిని అరికట్టే నాధుడు కన్పించుట లేదు.

250. జపము బాహ్యపూజ జాలగా జేసియు
గపటము నిడలేక కష్టనరులు
ముక్తిపొందలేక మునిగిరి తమమున ॥వి॥

బాహ్య= బయటకు కన్పించే; తమము= అజ్ఞానమనే చీకటి, అజ్ఞానము.

జపములు, తపములు, యజ్ఞములు, వ్రతములు మొదలగునవి బయటకు కన్పించే దైవ పూజలుగా ఎంచబడుతున్నాయి. కాని నిజానికి ఇవి మతమనే కొంపను పది కాలాలపాటు పదిలముగా వుంచే కంబములుగా ఉపయోగ పడుతున్నాయి. ఇవి మతాన్ని ఆధారంగా చేసికొని బ్రతికే కొంతమంది పరాన్న భుక్కులైన సోమరులకు కూడా ఆధారంగా వుంటున్నాయి. కాని యీ వ్రతాలు, యీ యజ్ఞాలు,యీ పూజలు మొదలగు వాటిని చేసేవారు, చేయించేవారు తమ మనస్సులలోని కపటము, ద్వేషము, ఈర్ష్య, క్రోధము, దురాశ మొదలగు దుర్గుణాలను కలిగివున్నంతవరకు వారు ముక్తిని పొందలేరు. వారు అజ్ఞానులుగానే వుండిపోతారు.

251. హింసచేయకుండుటే ముఖ్య ధర్మంబు
యనక హింసచేతురవని సురులు
చావుపశువు దినెడు చండాలుడేమేలు ॥వి॥

అవనిసురులు= బ్రాహ్మణులు; చావుపశువు= చచ్చినపశువు; చండాలుడు= మాదిగవాడు.

హిందూమత పెద్దలు కొందరు, మాదిగవారనిపిలవబడే వారు చచ్చిన గొడ్డుమాంసం తింటున్నారని వారిని తమ గ్రామాలకు ఎడంగావుంచి వారు తమ గుడులకు, బావులకు, బడులకు, బజారులకు రాకూడదనియు, వారిని ముట్టుకొనుట,

వారితో మాట్లాడుట, వారిని చూచుట మహాపాపమని ధర్మశాస్త్రాలలో రాశారు. అందువల్ల వారు కొన్ని వందల ఏండ్లనుండి అంటరానివారుగా ఎంచబడిన వర్ణహిందువుల గ్రామాలకు చాల ఎడంగా గూడాలలో చాలీచాలని గుడిసెలలో తలదాచుకొంటున్నారు. వారికి చండాలురు అని పేరు పెట్టారు. కాని శూద్రునికి బ్రాహ్మణ ఆడుదానికి పుట్టినవాడే ఛండాలుడు అని మనుమహారాజుగారు ఒకచోట సెలవిచ్చారు. కాని చచ్చినగొడ్డుమాంసం తిన్నందున మాదిగవారికి చండాలురు అని పేరుపెట్టిన వైదిక బ్రాహ్మణ పండితులు యజ్ఞాలలో బ్రతికివున్న పశువులను చంపి కాల్చుకొని తినేవారట. కనుక చచ్చిన గొడ్డుమాంసం తిన్నవారు చండాలురైతే, బ్రతికివున్న గొడ్డును చంపితినే పెద్దలకు ఏమి పేరు పెట్టాలి?

252. అధికమైన యజ్ఞ మల్పుడు తాజేసి
మొనసి శాస్త్రములనిమురువు జూపు
దొబ్బనేర్చినకుక్క దుత్తలు మోయునా? ॥వి॥

అల్పుడు= సంస్కారంలేనివాడు, నీచుడు; మొనసి= యత్నించి; మురువు= గర్వము; దొబ్బుట= తినుట, కాజేయుట; దుత్త= చిన్న కుండ, ముంత

అల్పుడైన బ్రాహ్మణుడు బడాయికి యాగముచేసి పశువును చంపి దానిని కాల్చుకొని తింటాడు. అది శాస్త్రసమ్మతమని గర్వంగా చెప్పుకుంటాడు. కాని వాడుచేసిన హింసకు ఫలితము వాడు అనుభవించకుండా వుండగలడా? కుక్కకుండలోని కూడు తినగలదుగాని కుండను మోయగలదా?

253. జాతి, కులములందు జనులెల్ల బద్ధులై
భావపరమునందు బ్రాలుమాలి
చచ్చిపుట్టుచుంద్రు జడమతులైభువి ॥వి॥

బద్ధులు= బంధింపబడినవారు, లొంగిపోయినవారు, కట్టుబడిపోయినవారు; భావము= ఆలోచన; ప్రాలుమారుట= అశ్రద్ధచేయుట,సోమరులగుట; జడమతులు= అజ్ఞానులు, మూఢులు, మంతమతులు.

అవివేకులు కులానికి జాతికి, ఆధిక్యతయిచ్చి వాటికి దాసులైపోయి అజ్ఞానంలో పడిపోయి ముక్తికి దూరమైపోయి చచ్చుచూ పుట్టుచూ వుంటారు. కాని

కులాన్ని, మతాన్ని జాతినిపాటించనివారే ముక్తిని పొందగలుగుతారు.

254. బ్రాహ్మణులకుబెట్టఫలము కద్దందురు
కుక్కలకునుబెట్ట కొదువయేమి?
ఇందునందు శివుడె ఏకమై యుందురా ॥వి॥

కద్దందురు= కలుగుతుందంటారు; కొదువ= లోటు, కొఱత, శివుడు= పరమాత్మ.

సర్వప్రాణులలోనూ వున్నది ఒకే సర్వేశ్వరుడు. కనుక సర్వప్రాణులూ సమానమైనవే. హెచ్చుతగ్గులులేవు అని అద్వైత తత్త్వశాస్త్రము చెప్పుతున్నది. అంటే బ్రాహ్మణునిలోవున్న సర్వేశ్వరుడే కుక్కలోకూడ వున్నాడు. కనుక నోరున్న బాపనయ్యకు పెట్టుటకంటే, నోరులేని కుక్కకు పెట్టుటే ఎక్కువ మేలు కలుగును. బాపనయ్యకు పెట్టినా కుక్కకు పెట్టినా ఫలితం ఒక్కటేగదా.

255. బ్రాహ్మణులకు సకల భాగ్యంబు లీయవచ్చు
గౌరవించవచ్చు గలియవచ్చు
జ్ఞానమొసగిజనుల గడతేర్చగలిగిన ॥వి॥

ఒసగుట= ఇచ్చుట; కడతేర్చుట=తరింపచేయుట, జ్ఞానులుగా చేయుట

బాపనయ్యలు జనులకు జ్ఞానం బోధించి వారిని కడతేర్చినయెడల, వారిని గౌరవించి ధన ధాన్యాదులు వారికి యివ్వవచ్చును. వారితో కలిసి మెలసి తిరగవచ్చును. వేమన్నకు బ్రాహ్మణులయందు యుదారమైన యాశయముగలదు. పైకి బ్రాహ్మణులను చెడదిట్టినను, తిట్టుటకు మూలము అసూయగాక బ్రాహ్మణులలోగల లోపములను దిద్దవలెనను నిష్కళంక శ్రద్ధయేయగుటచే, వేమన్నను చాలమంది విప్రులుగూడ గౌరవించిరి. ఈ పైమాటలు చెప్పిది రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు.

256. కనియుగానలేడు గదలింపడానోరు
వినియు వినగలేడు, విస్మయమున
సంపదగలవాని సన్నిపాతంబిది ॥వి॥

కనుట= చూచుట; విస్మయము= వింత.

సన్నిపాతము=సన్నిపాతజ్వరం. ఈ జ్వరంలో రోగి పిచ్చిమాటలు మాట్లాడును. దీనినే సంధి జ్వరము అనికూడ అంటారు. సంపదగలవాడు= డబ్బున్నవాడు.

257. కనియుండి కానలేరట
వినియుండియు వినగలేరు విస్మయమేమో!
కనుగ్రుడ్డి వినెడు చెవుడం
చనునది నిజమయ్యె జగమునందును వేమా॥

258. కనియు గానకుండు గడుఠీవి తోడను
వినియు వినయయుండు విస్మయముగ
సంపదలగలదేని సన్నిపాతముపూను ॥వి॥

కడు= మిక్కిలి, ఎక్కువ; ఠీవి= వైభవము, వయ్యారము; పూనుట= వహించుట, ధరించుట; విస్మయము= వింత, ఆశ్చర్యము.

పడుచుతనము, బలుపు, డబ్బు, చదువు, కులము, మతము మొదలగునవి ఆలోచనలేని మనిషికి అహంకారము కలిగిస్తాయి. అహంకారాన్ని అహంభావము, మదము, క్రొవ్వు, తలబిరుసుతనము అని కూడా అంటారు. కాని అన్ని మదాలలోనూ డబ్బు మదము చాల అపాయకరమైనది, భయంకరమైనది. ఎందుకన డబ్బు మదం కలవాడు ఇతరులు తనకంటె తక్కువ అనే అహంకారం కలిగివుండి ఇతరులతో కలసిమెలసి ఉంటానికి యిష్టపడడు. ఇతరులతో కలిసిమెలిసి ఉండడం తన హోదాకు అగౌరవమని ఎంచుతాడు. అతని పరిస్థితి సన్నిపాత జ్వరం వచ్చిన రోగికివలె ఉండును. అతడు కండ్లతో చూచుచూ కూడ చూడనట్లు, చెవులతో వింటూ కూడా విననట్లు నటిస్తాడు. అతడు ఇతరులతో మాట్లాడడానికి తన నోరును తెరవటం కష్టం. ఇతరులతో మాట్లాడటం అగౌరవమని తలచును. ఈ రోజులలో యీ డబ్బు మదంవల్ల మానవ సమాజము ఎన్నో ఆపదలను, అవమానాలను ఎదుర్కోవలసి వస్తోంది. నేడు ప్రపంచంలో యీ డబ్బు మదం వల్లనే ఈర్ష్యా, ద్వేషము, హత్యలు, మోసాలు, మారణాయుధాలు, మత కలహాలు, రాజకీయ పితలాటాలు విచ్చలవిడిగా రోజురోజుకూ ఎక్కువై పోతున్నాయి. నేడు ప్రపంచ మానవులలో సహోదరభావము,

సహకార భావము, మానవత్వము, శాంతిభద్రతలు మటుమాయమైపోయాయి. నిజానికి నేడు ప్రపంచ మానవజాతి గొప్ప అగ్నికొండమీద కూర్చున్నదని చెప్పవచ్చును.

259. అన్నము తినువేళ నాత్మరుచులుగోరు
టదియు నాల్క సెప్పనడుగు మనసు;
నాత్మకు దృణమైన నయ్యె యో యనరాదు ॥వి॥

తృణము= గడ్డిపరక, లేశమాత్రం.

మనం అన్నం తినేటప్పుడు రుచులను కోరేది మన నాలుకే. కాని దాని కోరికను అమలుపరచేది మనస్సు కనుక మనస్సును మనం అదుపులో వుంచకపోయినట్టయితే మనం నాలుకకు తొత్తులమైపోయి అనేక జబ్బులను కొనుక్కొని తెచ్చుకోవలసి వస్తుంది. పాపం ఆత్మ ఏమీ కోరదు. అది అంటీ అంటనట్లుంటుంది.

260. ఆరు మతములందు నధికమైన మతంబు
లింగ మతముకన్న లేదు భువిని;
లింగ ధారులకన్న దొంగలువేరయా ॥వి॥

మతము= సంప్రదాయము; లింగమతము= శైవ సంప్రదాయము; భువిని= భూలోకంలో.

హిందూమతంలో శైవులు, వైష్ణవులు, కాపాలికులు, శాక్తేయులు, జైనులు, చార్వాకులు మొదలగు సాంప్రదాయకులుగలరు. ఈ సంప్రదాయాలన్నింటిలోనూ శైవ సంప్రదాయం గొప్పది. కాని ప్రస్తుతం యీ సంప్రదాయంలో వున్నవారిలో ఎక్కువమంది దొంగ దైవభక్తులే. వేమన లింగధారులలోగల దురాచారాలను కూడా తీవ్రంగా విమర్శించారు.

261. ఋషికులమున దాము రూఢిగా జన్మించి
కులము గోత్రములను గోప్యపఱుప
బ్రహ్మకులముగాక బ్రాహ్మణులెట్లైరి? ॥వి॥

రూఢిగా= యథార్థంగా; గోప్యము= రహస్యము; గోప్యపఱుచుట=

దాచివుంచుట, తెలియనివ్వకుండా ఉంచుట

ఋషులు అనబడేవారంతా నానా కులాలవారికి పుట్టినవారే. కాని వారి కులగోత్రాలు గోప్యముగా వుంచబడ్డాయి. కానినేడు తమను బ్రాహ్మణులమని చెప్పుకొనేవారంతా నానా కులాలవారికి పుట్టిన ఋషుల సంతతివారే. అయితే ఎవరైతే బ్రహ్మజ్ఞానం గలవారో వారే బ్రాహ్మణులట. బ్రహ్మజ్ఞానం లేకుండానే, నేడు తమను బ్రాహ్మణులమని చెప్పుకొనేవారంతా ఋషికులస్థులేగాని బ్రహ్మజ్ఞానంగల బ్రాహ్మణులు మాత్రం కాజాలరు.

262. బట్టెలట్టులఅవఫల మేమికలదురా?
అందు సార్థకంబు చెందకున్న
విన్నవారు వారి వెఱ్ఱులుగా నెంత్రు ॥వి॥

సార్థకము= ప్రయోజనము, ఉపయోగము; ఎంత్రు= ఎంచెదరు, భావించెదరు.

గేదెలవలెబిగ్గరగా అరచుచూ వేదములు చదివినందువల్ల ఉపయోగమేమున్నదీ? వేదార్థమును తెలిసికొని అందు చెప్పినట్లు నడచుకొన వలయును.లేకున్న యెడల జనులు వారిని వెఱ్ఱివారినిగా ఎంచెదరు.

263. కల్లలాడుటకంటె కష్టంబు మఱిలేదు
కష్టమెపుడొ కీడుకలుగజేయు
ద్విజుడననుట జూడ త్రిమ్మరితనమురా ॥వి॥

కల్ల= అబద్ధము; కీడు= చెడు; ద్విజుడు= బ్రాహ్మణుడు; తిమ్మరితనము= వదరుబోతు తనము; ప్రేలుట= పొగరుబోతు తనము.

అబద్ధము మాదిరిగా కీడును కలిగించేది మరొకటిలేదు. అది ఎప్పటికైననూ కీడును కలిగించి తీరుతుంది. అబద్ధమాడువాడు బ్రాహ్మణుడైనప్పటికీ వాడు చెడ్డవాడుగానే ఎంచబడుతాడు. అబద్ధానికి నిజానికి కులమత లింగభేదాలు లేవు.

264. ఊరినడిమిబావి యుదకంబు గొనితెచ్చి
పాదతీర్థమనుచు భ్రమయ జేయ,
పాదతీర్థమన్న ఫలమేమికద్దురా? ॥వి॥

ఉదకము= నీరు; పాదతీర్థము= దేవుని పాదాలు కడిగిననీరు; భ్రమయజేయుట= భ్రాంతి కలిగించుట, భ్రమ కలిగించుట, గుడ్డినమ్మకం కలిగించుట

పరాన్నభుక్కులైన పూజారులు ఊరి నడుమ బావినీరుతెచ్చి దేవుని పాదాలు కడిగిన తీర్థమని నమ్మించి త్రాగమని ప్రజలకు చేతులలో పోస్తారు. పాద తీర్థమును త్రాగినవారు పూజారికి కానుకలు సమర్పించుకుంటారు. కానుకలు రాబట్టుకోటానికే పూజారి పాదతీర్థంతంతు పన్నుతున్నాడు. కానుకల ద్వారా పూజారి శరీరశ్రమ చేయకుండా జీవితం గడుపుకొంటున్నాడు.

265. తనలో సర్వంబుండగ
తనలోపల వెదుకలేక ధరవెదకెడి యీ
తనువుల మోసెడియెద్దుల
మనముల దెల్పంగవశమె మహిలో వేమా॥

ధర= భూలోకము; తనువు= శరీరము; మహి= భూలోకము; మనము= మనస్సు; సర్వంబు= పరమాత్మ.

తమ శరీరాలలోగల భగవంతుని తెలిసికోలేక ఆయన కొఱకు పలుచోట్ల వెతకువారు పరమ మూర్ఖులు. వారు శరీరబరువును మోసెడి యెద్దులవంటివారు. అంటే అవివేకులు. వారికి పరమాత్మ తత్త్వమును బోధించుట ఎవరితరమూకాదు. ఎద్దుమొద్దు అనే సామెత వుండనేవుందిగదా!

266. గంగస్నానమాడి ఘనమైన వారెల్ల
భంగపడిరి పెక్కు బాధలంది;
గంగనీటికన్న, గయతీర్థములకన్న
నెన్న వేమతీర్థమెచ్చు వేమ

భంగపడుట= మోసపోవుట; పెక్కు= అనేక, ఎక్కువ; తీర్థము= పుణ్యక్షేత్రము, పుణ్యనది; ఎచ్చు= ఎక్కువ; ఘనమైన= గొప్ప; వేము= వేమన్న; వేముతీర్థము= వేమన్న చెప్పిన సూక్తులు, వేమన చెప్పిన నీతులు.

గంగా, యమునా, కృష్ణా, గోదావరి మొదలగు నదులలో స్నానం చేసిన యెడల పుణ్యము కలుగునని పరాన్నభుక్కులైన పండితులు చెప్పుచుందురు. అందువల్ల

చదువులేని చదువుకొన్న యాత్రికులు ఆయా నదులలో స్నానం చేయాలని బయలుదేరి ఎన్నో కష్టాలనుభవిస్తున్నారు. తీర్థములలో పండాలు, పురోహితులు యాత్రికులయందు ఎంత క్రూరంగా ప్రవర్తిస్తారో చెప్పనక్కరలేదు. పండాల పురోహితుల ఏకైక లక్ష్యం కేవలం ధనార్జనగానే కనిపిస్తుంది. వారు యాత్రికులను ఆర్థికంగా ఎన్నో కష్టాలు పెడతారు; వారి దుష్ప్రవర్తన వివేకముగల యాత్రికుల హృదయాలలో పుణ్యభావమునకు బదులు హేయభావమును కలిగిస్తుంది. నేడు పుణ్యక్షేత్రాలనబడేవన్నీ అన్నిరకాల అవినీతిపరులకు కేంద్రాలుగా వున్నాయి. అక్కడ నీతిబోధలు చేసేవారుండరు. అవి అపవిత్ర క్షేత్రాలుగా కన్పిస్తాయి. అటువంటి అపవిత్ర క్షేత్రాలకు వెళ్ళుటకు బదులు మన వేమన్న తీర్థమునకు అంటే వేమన్న బోధలను మననం చేసికొని వాటిని జీవితంలో అమలు పరచుకొంటే మనం పుణ్యాత్ములము కాగలము.

267. గాడ్దె బూడ్దెనుగోరు, గజము మంటిని గోరు
పందిమురుగుడునీళ్ళ బడనుగోరు
కవులు గ్రాసముగోరు గురుపూజగోరునా? ॥వి॥

గజము= ఏనుగు; గ్రాసము= కబళము, ముద్ద, తిండి

వేమనకాలంలో కవులు తిండికై కటకటలాడిపోయి ఒక కబళానికై కవిత్వము వినిపించేవారు.

268. పసరపునంజుడు మొక్కియు
మసలకసుర ద్రాగుమహిమఖవంతులకు
రసికత రంభాభోగము
గుసు మాస్త్రునిబెట్టి చెఱిచెగుంభిని వేమా

వసరము= పశువు; నంజుడు= మాంసము; మెక్కుట= తినుట; మసలక= ఆలస్యముచేయక, వెంటనే; సుర= కల్లు, సోమరసము; మఖవంతులు= యజ్ఞముచేయువారు; రసికత= ప్రియమైన, రసవంతమైన; రంభాభోగము= రంభతో జతకట్టుట, రంభను సంభోగించుట; కుసుమాస్త్రుడు= పువ్వులబాణాలుగలవాడు, మరుడు, మన్మథుడు, కామాన్ని కలిగించే దేవత; కుంభిని= భూమి, నేల

సోమయాజిగారు పశువుని చంపి దాని మాంసంతిని సోమరసం త్రాగి (యజ్ఞంచే) సేదిస్వర్గలోకంలోగల రంభను సంభోగించడానికేనట.

269. గురువులనుకొని దొంగగాడ్దెభడవాలెల్ల
ధనముకై యాసింత్రుధరణియందు;
మనుజులేమారించి మోసపుత్తురుగదా ॥వి॥

ఏమారించుట= ఏమరించుట, మరిపించుట; దరణి=భూమి

కొంతమంది దొంగసన్యాసులు తమను గొప్ప గురువులనుగా చెప్పుకొని డబ్బుకై సామాన్య ప్రజలను మోసగించుచుందురు.

270. జపతపమార్గములన్నియు
నుపవాస క్రియలగూడియుండునుజూడన్
జపలత్వమడపజాలక
యుపమరివై గుణములడచియుండరవేమా

అడచుట= అణచుట; ఉపమరివై= ఉపాయము గలవాడవై

జపము, తపము, ఉపవాసము మొదలగు క్రియలు మానసిక చపలత్వాన్ని పోగొట్టలేవు. కనుక నీవు యీ క్రియలను చేయక సాత్వికరాజస తామసగుణములను జయించుము. అప్పుడు నీకు ముక్తి కలుగును.

271. టెక్కెమెత్తి చెప్పుమొక్కడే దేవుడు
నిక్కముగనులోన నిలిచియుండు;
చక్కజూచునతనిసంతోషమునముంచు ॥వి॥

టెక్కెము= టెక్కియము, జెండా; టెక్కెమెత్తి చెప్పుట= ఎలుగెత్తి చెప్పుము, ఘంటాపథంగా చెప్పుము, గట్టిగా చెప్పుము.

దేవుడు ఒక్కడేననియు, పలువురు లేరనియు ఘంటాపథంగా చెప్పుము. ఆ దేవుడు మనమనస్సులోనే నిరంతరం ఉంటున్నాడు. ఆయనను తెలుసుకొన్నయెడల మనకు పరమానందము కలుగును.

272. తనదునాత్మయందు దైవంబువెలయంగ
తీర్థయాత్రలకిల దిరుగునరుడు;

గంధపు దునుకలగాడ్దెమోసినయట్లు ॥వి॥

తునుక= తునక, ముక్క, చెక్క; వెలయుట= ప్రకాశించుట; ఇల= బూమి.

మానవుడు తనలోనే వున్న భగవంతుని తెలుసుకోలేక మూర్ఖుడై తీర్థయాత్రలకు పోవును. అట్టివాడు గంధపు చెక్కలను మోయు గాడెదతో సమానము.

273. తనువ దెవరిసొమ్ము తనదని పోషింప
ధనమదెవరిసొమ్ము దాచుకొనగ
బ్రాణమెవరిసొమ్ము పాయకుండగనిల్వ ॥వి॥

తనువు= శరీరము; పాయుట= పోవుట.

మనం మన శరీరాన్ని మనదని తలచి దానికి రకరకాల తిండ్లు పెట్టి రకరకాల విలువగల గుడ్డలుకట్టి, రకరకాల విలువగల నగలుపెట్టి దానిని అలంకరిస్తున్నాము. నిత్యమూ దానిని అందంగా వుంచటానికి యత్నిస్తాము. అట్లనే రకరకాల అవినీతి పనులను చేసి అదేపనిగా డబ్బును కూడబెట్టి దానిని నాదని యెంచి దానిని ఏ బ్యాంకులోనో, ఇనుపపెట్టెలోనో దాచివుంచి తృప్తిపడుతున్నాము. అట్లనే మనం ప్రాణాలను కూడ మనవిగానే తలచి జాగ్రత్తగా కాపాడుకొనటానికి యత్నిస్తున్నాము. కాని నిజమాలోచిస్తే మన శరీరంగాని, మన ధనంగాని, మన ప్రాణాలుగాని మనవిగా కన్పించుటలేదు. ఎందుకనగా మనం యీ భూలోకంనుంచి వెళ్ళిపోయే సమయంలో యీ మూడింటిలోనూ ఏదీకూడా మనవెంట రావటంలేదు. కనుక మనదనేదేదో మనకు తెలియటంలేదు. బహుశా మనదనే దేదీ లేదేమో!

274. తనువునడవిజేసి తనలోనెకూర్చుంది
తపముచేయలేని తపసులెల్ల,
నడవియందుజేరి యలజడి వడెదరు ॥వి॥

తనువు= శరీరము; తపసులు= తపముచేయువారు; అలజడిపడుట= కష్టమనుభవించుట, దుఃఖించుట.

275. తల్లి తొలుతలంజె, తనయాలు మాదిగ
తాను బ్రాహ్మణుడనదగునె జగతి?
తపముచేత ద్విజుడు తర్కింపగులమేది? ॥వి॥

వసిష్ఠ మహర్షి జన్మవృత్తాంతము.

276. ఎన్నాళ్ళిల దానుండెడి?
నెన్నాళ్ళిక దాసునేర్చి యన్నిటవెలయుం,
గొన్నాళ్ళకు దాజన్నను
మన్నొగద విద్యలెల్ల మహిలో వేమా॥

చనుట= పోవుట; వెలయుట= ప్రకాశించుట, పేరుకాంచుట; చన్నను= చనిపోవునపుడు, వెళ్ళిపోవునపుడు.

మనం యీ మానవలోకంలో వుండేదే కొద్దికాలం. ఈ కొద్ది కాలంలో మనం ఎన్ని చదువులు చదివి ఎంత గొప్ప పేరును సంపాదించుకొన్నప్పటికీ మనం యిక్కడనుండి సెలవు తీసుకొని వెళ్ళేటప్పుడు మన చదువులన్నీ, మంటిలో కలిసిపోతాయి. సిరిసంపదల వలెనే మన చదువులు కూడ కరిమ్రింగిన వెలగపండు గుజ్జువలె కన్పించకుండా పోయేవే!

277. తన్నుదెలియకున్న దగవేదములవెట్టి
సర్వసంపదల ముసాబువెట్టి,
ఆరుశాస్త్రములునికా పురాణములును
జబ్బులపడు జగతి చాలువేమ॥

వేదములు, ఆరు శాస్త్రములు, పురాణాలు సకల సంపదలు మనకు శాశ్వతమైన ఆత్మజ్ఞానాన్ని కలిగించవు. అవి అశాశ్వితమైనవి. భౌతిక సుఖములను కలిగించి మనలను అజ్ఞానులనుగానే చేస్తాయి. కనుక అవికూడ ఒకరకమైన జబ్బులేనని ప్రపంచానికి వెల్లడి చేయుము.

278. తల్లి వంతలంజె తండ్రికుండుడు గోళు
డాలును సుతులెల్ల నట్టివారె;
చెలగు చుట్టములకు సిగ్గేల లేదొకో? ॥వి॥

కుండుడు= కుండకుడు, పెనిమిటి యుండగా ఱంకుమగనికి పుట్టిన వాడు; గోళుడు= గోళకుడు, విధవకు ఱంకుమగనివల్ల పుట్టినవాడు; ఆలు= పెండ్లాము; సుతులు= కొడుకులు.

ఋషులు, కౌరవ పాండవులు మొదలగువారి పుట్టుపూర్వోత్తరాల వృత్తాంతం లోగడ వచ్చింది.

279. తఱచి చదువ చదువ తర్కవాదమెకాని
దివ్య మైన తెలివి తేటపడదు;
పిసిరికాయ పురుగు పగిదిని చెడిపోవు ॥వి॥

పిసిరికాయ పురుగు= పిసినికాయ పురుగు, పట్టుపురుగు; తేటపడుట= వివరంగా తెలియుట

ఏ విధంగానైతే పట్టుపురుగు పట్టుదారాన్ని తన కడుపులోనుండి లాగుకొని తన శరీరంచుట్టూ చుట్టుకొని తనను ఆ దారంతో బంధించుకొని చివరకు చచ్చిపోవుచున్నదో, అదేవిధంగా కుతర్కవాదియైన పండితుడు చదివి చదివి తర్కవాదములో ఇరుక్కొనిపోయి దివ్యమైన జ్ఞానాన్ని పొందలేక అనేక ఇడుములకు గురైపోతాడు.

280. దొమ్మమాయుకొఱకు నమ్మవారికివేట
లిమ్మటంచ్రిదేమి దొమ్మతెగులొ?
అమ్మవారిపేర నందఱు దినుటకా? ॥వి॥

దొమ్మ= పశువుల రోగము; వేట= జంతుబలి, జంతువులను అమ్మవారి పేర నరకుట, మాయుట= పోగొట్టుట

పూర్వం గ్రామాలలో మనుషులకుగాని, పశువులకుగాని జబ్బులువస్తే ముందుగా మందులను వాడక గంగానమ్మ వగైరా అమ్మవార్లకు ముడుపు కట్టి తరువాత కొలుపులు కొలిచి మేకలు, గొఱ్ఱెలు, దున్నపోతులు, కోళ్ళు వగైరాలను బలియిచ్చి నైవేద్యము చెల్లించేవారు. అమ్మవార్ల పేరుమీద బలియిచ్చిన జంతువులను, పక్షులను, చల్దినైవేద్యాలను ప్రజలే తినేవారు. కొలుపుల వలన జబ్బులు పోతాయని ఆ రోజులలో నమ్మేవారు. ఆనాటి పండితులుకూడా కొలుపులను సమర్థించేవారు.

281. ధనలక్ష్మిని సేవించిన
ధనమార్చింపగ వచ్చు ధర్మముగానే
ధనహీనులకు నొసంగెడు

ధనమే మూలంబు ముక్తి దారికి వేమా ॥వి॥

ధనహీనులు= బీదలు

ధనమును లక్ష్మి, డబ్బు, సంపద, కలిమి, ఆస్తి, దశలనికూడ అంటారు. నిజానికి నేడు డబ్బుమీదనే ప్రపంచ పనులన్నీ ఆధారపడి వుంటున్నాయి. కనుక డబ్బును ప్రతివాడూ తప్పక ఆర్జించవలసిందే. కాని డబ్బును ఎక్కువమంది చెడు మార్గాలగుండా సంపాదిస్తున్నారు. కాని మన పూర్వులు కొందరు ధర్మయుక్త మార్గంద్వారా డబ్బును ఆర్జించి తాము అనుభవిస్తూ యితరులకు తోడ్పడిన యెడల మోక్షము పొందవచ్చునని చెప్పారు. ధర్మముఅనే మాటకు శీలము, స్వాభావిక గుణము, నిత్యనియయము, సదాచారము, కర్తవ్యము, మంచిపని, పుణ్యము, ఎక్కువ మందికి సుఖము కలిగించు పని, ఎవ్వరికీ కీడు కలిగించనిపని అనే అర్థాలు కలవు. కనుక ఎవ్వరికీ ఏ విధమైన కీడు కలగని పద్ధతితో డబ్బును ఆర్జించి తాము అనుభవిస్తూ వీలునుబట్టి బీదప్రజలకు తోడ్పడటమే మోక్షమును సంపాదించుకొనుట అని పండితులంటారు. ఈ పనినే పుణ్యము అని అన్నారు.

282. మాలద్రిప్పుచుండి మంత్రంబు సనుగుచు
మదినికేమొతలప మహిమమున్నె?
బుద్ధినిలుకడున్న బున్నెంబు సేకూరు ॥వి॥

మాల= జపమాల; సనుగుట= గొనుగుట; పున్నెంబు= పుణ్యము; సేకూరుట= లభించుట,దొరకుట; తలప= ఆలోచింప; ఉన్నె?= ఉండునె? నిలుకడ= ఉనికి, స్థైర్యము= స్థిరత్వము

చేతితో జపమాల త్రిప్పుచూ, నోటితో ఏదో మంత్రాన్ని సనుగుతూ చంచలమైన మనస్సుతో ఏదో విషయం ఆలోచించుచూ వున్న మనిషికి మనశ్శాంతి కలుగదు. స్థిరమైన బుద్ధివున్న మనిషే మనశ్శాంతిని పొందగలడు. స్థిరమైన బుద్ధిలేని జపతపాలు, మంత్రతంత్రాలు మొదలగు వాటివల్ల జ్ఞానం కలగదు.

283. మాలవానిజూచి యేల నిందింతురు?
తూలుమాటపలుక దొమ్మయేమొ?
ఆకుజూచిపలుకు వానికులంబేది? ॥వి॥

తూలు= తప్పుడు, తేలిక; దొమ్మ= జబ్బు; ఆకు= బ్రహ్మవ్రాత; ఆకుజూచి పలుకువాడు= బ్రహ్మదేవుడు.

బ్రహ్మదేవుడు అందర్నీ ఒకటిగానే పుట్టించును. ఇక ఎక్కువ తక్కువలెక్కడున్నవి? అయినప్పుడు సవర్ణులు మాల మాదిగలను తూలనాడుట అవివేకము కాదా?

284. యజ్ఞయాగములని యెన్నిచేసినగాని,
ఆత్మయజ్ఞమగునె యంటిచూడ?
క్రతువుచేయువారు కానంగదొంగలు ॥వి॥

ఆత్మయజ్ఞము= పరమాత్మనుగురించి చేసిన యజ్ఞము; క్రతువు= యజ్ఞము.

యజ్ఞములు ఎన్ని చేసిననూ అవి ఆత్మబోధను కలిగించే యజ్ఞమునకు సాటిరావు. యాగములు చేయువారు మోసగాంద్రు.

285. బ్రాహ్మణునకు మ్రొక్క బహుదీవనలొసంగు
నాత్మశుద్ధిగల్గు నాతడైన;
కలుగునన్ని;కామి, కంఠశోషయెసుమీ ॥వి॥

ఆత్మశుద్ధిగల బ్రాహ్మణునకు అంటే మంచి నడతగల బ్రాహ్మణునకు దణ్ణంపెట్టిన యెడల అతడు దీవించినట్టయితే మనకు మేలు కలుగును. లేనివానికి అంటే ఆత్మశుద్ధి లేని బాపనయ్యకు దణ్ణం పెట్టుటవల్ల లాభంలేదు.

286. మనుజులందఱి నిలమంగలిచేగిన్నె
పొత్తుగుడిపి కులము బోడిజేయు;
దలనుజేయిపెట్టి తగనమ్మచెప్పదా? ॥వి॥

ఇల= భూలోకము; పొత్తు= సంబంధము, ఉమ్మడి; స్నేహము= జత; కుడుపుట= అనుభవింపచేయుట, తినిపించుట, త్రాగించుట; బోడిచేయుట= గొరిగివేయుట, నాశనం చేయుట; తలనుచేయి పెట్టి= ప్రమాణపూర్తిగా.

మంగలి అన్ని కులాలవారికి ఒకే గిన్నెలో నీళ్ళుపోసి తలలను తడిపి వెంట్రుకలు గొరుగును. ప్రతి ఒక్కొక్కనికి ఒక్కొక్క గిన్నెను పెట్టడు. నీరు మార్చును. కాని గిన్నె ఒక్కటే. మంగలిగిన్నె అన్ని కులాలె ఒక్కటేనని వెలుగెత్తి చాటుచున్నది.

కాని కుక్షింభరులు కొందరు తమభుక్తికై కులాలని, మతాలని వేరువేరుగా పెట్టుకొని ప్రజలను చీల్చి వారిని మూఢులనుగాచేసి వారిని ఆర్థికంగా దోచివేస్తున్నారు. ఈ కులాలు మతాలు సమాజానికి కీడును కలిగించుటను మనం నిత్యం చూస్తూనే యున్నాము. అయితే మోసగాళ్ళయిన కులమత ప్రచారకుల మోసము మాటలను సామాన్య ప్రజానీకం పాపం గ్రహించలేకపోతున్నది.

287. పితరులన్నమనుచు బ్రీతితోపిలిపించి
కాకులకుబెట్టు కర్మలార!
కాకులందునేమి? ఘనులకుబెట్టుడి ॥వి॥

ఘనులు= మంచినడత గలవాళ్లు; పితరులు= పితృదేవతలు, చచ్చిపోయిన తండ్రి మొదలగువారు.

288. ప్రేత యన్నమనుచు ప్రీతితో పిలిపించి,
కాకులకు బెట్టు కర్మలార!
కాకులు పితరులయి కలిగింత్రె మోక్షంబు? ॥వి॥

ప్రేతము= చనిపోయిన మగమనిషి; ప్రేతనీ= చనిపోయిన ఆడమనిషి; పితరులు= పితృదేవతలు, చనిపోయిన తండ్రి మొదలగువారు.

చనిపోయిన పూర్వీకుణ్ణి పితరుడు, పితృడు, ప్రేతము అని అంటారు. ఈ పితరునకు చేసే కర్మను శ్రాద్ధకర్మ అనిగాని పెద్దకర్మ అనిగాని దినము అనిగాని అంటారు. చనిపోయిన మనిషియొక్క స్థూలశరీరము తుగలబెట్టబడినప్పుడు గాని, పాతిపెట్టబడినపుడుగాని చనిపోయిన మనిషి మరొక శరీరాన్ని ధరిస్తాడట. ఆ శరీరాన్ని లింగశరీరమని గాని భోగ శరీరమనిగాని అంటారట. అది సూక్ష్మరూపంలో ఉంటుందట. చనిపోయిన వ్యక్తి పేర పెట్టబడే పిండాలు, అర్పించే తర్పణాలు వగైరాలను లింగ శరీరధారియైన చనిపోయిన వ్యక్తి అనుభవిస్తాడట. అందుకై పురోహిత బ్రాహ్మణుడు క్రొత్తకుండలో వట్టి అన్నంమాత్రం వండించి కాకులకుపెట్టిస్తాడు. కాకులు సందేహించకుండా అన్నం తింటే చనిపోయిన వ్యక్తి తిన్నట్లే నని పురోహితుడు నచ్చచెపుతాడు. తరువాత పురోహితుడు తన దోపిడీని సాగిస్తాడు.

కర్మచేయువాడు బ్రాహ్మణ పురోహితునికి కొన్ని నెలలకు సరిపడ భోజన సామాగ్రి, కొత్తగుడ్డలు, చెప్పులు, గ్లాసులు, పీటలు, గొడుగులు, డబ్బు మొదలగునవి శ్రద్ధాభక్తులతో సమర్పించి ఆయనను తృప్తిపరచాలి. చనిపోయిన వ్యక్తికి దినము చేయనట్టయితే చనిపోయిన వ్యక్తి లింగ శరీర రూపంలో వుంటూ పెంటను తింటూ, ఉచ్చను త్రాగుతూ ఉచ్చ పెంటలు గల చోట్లల్లో వుంటూ వుంటాడట. అందువల్ల యీ మానవలోకంలో అతని తాలూకూ వారికి అనేక ఆపదలు కలుగగలవని పురోహితుడు ముందుగానే కర్మచేయువారిని భయపెడతాడు. అందుకని చనిపోయిన వ్యక్తి తాలూకూ వార్కి తింటానికి చాలినంత కూడు, కట్టుకోటానికి చాలినన్ని గుడ్డలు, వుంటానికి తగిన ఇల్లు లేని పరిస్థితులలో కూడ వారు తల తాకట్టుపెట్టి డబ్బు తెచ్చుకుని యీ శ్రాద్ధ కర్మను తప్పక చేసి బ్రాహ్మణునికి చెల్లించవలసిన మామూళ్ళను సక్రమంగా చెల్లించ యత్నిస్తారు. శ్రాద్ధకర్మ సందర్భంలో దాన ధర్మాలు పట్టే బ్రాహ్మణులంతా పనిపాటలు చేయని సోమరులే. వారు శ్రాద్ధకర్మ తంతు ద్వారా మంచి ఆదాయాన్ని సంపాదించుకొంటూ సుఖ జీవనం చేస్తూ వుంటారు. కాని ఇటు కర్మచేసే బీదవారు కడుపునిండా కూడు లేక మలమల మాడిపోతూ వుంటారు.

ఉత్తర భారతదేశంలో యీ శ్రాద్ధకర్మ చేయించే పురోహితుణ్ణి "మహా బ్రాహ్మణుడు" అంటారు. అంటే మహా నికృష్ట బ్రాహ్మణుడు అని అర్థము. అక్కడ పురోహిత బ్రాహ్మణుని చాల నీచంగా చూస్తారు. వారు అతనితో సహపంక్తి బోజనాలుగాని పెండ్లిండ్లుగాని చేయనే చేయరు.

289. విశ్వము నడుపంగ విశ్వేశ్వరుండుండ
బ్రాహ్మణులకు నేల పట్టుదలలు?
వనములోని కోతి వసుమతి నడుపునా? ॥వి॥

విశ్వము= ప్రపంచము; విశ్వేశ్వరుడు= భగవంతుడు; వసుమతి= భూలోకము

ప్రపంచమంతటినీ నడుపుటకు భగవంతుడుండగా యీ జగత్తంతా మావల్లనే నడపబడుతున్నదని బ్రాహ్మణులు అహంకారంతో మొండిగా వాదించుట అజ్ఞానమే. అడవిలోని కోతి రాజ్యం చేయగలదా?

290. పాలు,పెరుగు, వెన్న పాయసంబు, నేయి,
జున్ను లెన్నియైన జూడపాలె;
పాలవంటి కులము బ్రహ్మంబు కానరో ॥వి॥

బ్రహ్మంబు= పరమాత్మ; కానుట= కనుట, చూచుట.

ఏవిధంగానైతే పెరుగు, పెరుగుపచ్చడి, మజ్జిగ, మజ్జిగ చారు(మెంతి మజ్జిగ), జున్ను, మీగడ, నేయి, పాయసము మొదలగు వన్నీ పాలయొక్క మాఱురూపాలో, అదేవిధంగా బ్రహ్మమునుండే సకల కులాలు పుట్టాయి. కనుక కులాలన్నీ సమానమే. వాటిలో ఎక్కువ తక్కువలు లేనేలేవు. కాని కొంతమంది జన్మగత బ్రాహ్మలు తాము అన్ని కులాలవారి కంటెనూ గొప్పవారమని విఱ్ఱవీగుతున్నారు. ఇది వారి కుల దురహంకారానికీ, వారి అవివేకానికీ ప్రబల నిదర్శనము.

291. హృదయమందు శివుడు కుదురుగనుండగ
శిలల మ్రొక్కుటేల జీవులార!
జీవులందెగాని శిలలందులేడయా ॥వి॥

కుదురుగ= స్థిరముగా; శిలలు= రాళ్ళు

292. సకలంబు మతికిని సంతోష మతితోష
బ్రహ్మ మెరిగినవాడె బ్రాహ్మణుండు;
బ్రహ్మ నెఱుగకపోతె, బ్రాహ్మణుండేలాగు? ॥వి॥

సంతోషము= సంబరము; మతి= మనస్సు.

ఏ కులానికి చెందినవాడై నప్పటికీ భగవంతుణ్ణి తెలిసికొన్నవాడే బ్రాహ్మణుడు. బ్రాహ్మణుడనని చెప్పుకొనేవాడు భగవంతుని తెలిసికో నట్టయితే వాడు బ్రాహ్మణుడు కాడు.

293. సకల కల్మషములు సమ్మతింతురె చేయ
విప్రులేల నిట్లు వెఱ్ఱు లైరొ?
కాల గతినె, యిట్టి కడగండ్లు పుట్టెరా ॥వి॥

కల్మషము= మురికి,పాపము; సమ్మతించుట= ఒప్పుకొనుట; విప్రుడు= బ్రాహ్మడు, వెఱ్ఱులు= పిచ్చివాళ్ళు, కాలగతి= కాలమహిమ, కాల ప్రభావము;

కడగండ్లు= కష్టాలు; ఇడుములు= ఆపదలు.

బ్రాహ్మణులమని చెప్పుకొనే పెద్దకులాలవారు అనేకమైన చేయరాని, చెప్పరాని ముఱికిపనులు చేసి పిచ్చివాళ్ళయిపోయారు. పాపం ఇది వారి దోషం కాదు. ఇదంతా కాలమహిమ! కాల ప్రభావం!

294. సకల శాస్త్రములను జదివియు వ్రాసియు
తెలియగలరు, చావుతెలియలేరు
చాలు తెలియలేని, చదువులవేలరా? ॥వి॥
సకల= అన్ని ఏలరా? ఎందుకురా?

295. సత్యవంతుల యెడ సరసమాడగరాదు;
పేదవారితోడ బెనగరాదు;
కలిమి గలుగువారి గలియనేరాదురా ॥వి॥

సరసము= ఎగతాళి; పెనగుల= తగవులాడుట, పోట్లాడుట; కలిమిగలవాడు= డబ్బుగలవాడు; కలియుట= స్నేహముచేయుట.

296. పరగ ప్రతిమలకును ప్రాణప్రతిష్ఠలో,
ప్రాణమొసగ, ప్రతిమ పలుగగలదె?
మొదటివాని సృష్టి మూర్తివంతంబైన?

ప్రాణప్రతిష్ఠ= ప్రాణం పోయుట; ప్రతిమ= రాతిబొమ్మ; మూర్తిమంతమగుట= ప్రత్యక్షమగుట; మొదటివాని= భగవంతుని; సృష్టి= ఉత్పత్తి, నిర్మాణము.

కొంతమంది తేరసొమ్ము తినే పనిచేయని పేరయ్యలు శిల్పులు చెక్కిన ప్రాణంలేని రాతి విగ్రహాలలో మంత్రశక్తితో ప్రాణం పోయగలమని బూటకపు మాటలు చెప్పి బూటకపు జీవితాలను గడుపుకొంటున్నారు. చూడండి రాతిబండలను భగవంతుడు ప్రాణంలేని జడపదార్థాలుగా సృష్టించాడు. ఇకవాటిలలో ప్రాణం పోయగలగటం అంటే భగవంతుని సృష్టిని తారుమారు చేయటమేగదా? ఈ పని మానవునికి సాధ్యమైన పనేనా? ఏ వస్తువును భగవంతుడు ప్రాణంగల దానినిగా సృష్టించాడో దానిని ప్రాణంలేని దానినిగా చేయటానికి మానవులలో ఎవ్వరికీ

శక్తిలేనేలేదు. కనుక ప్రాణంలేని రాతి విగ్రహాలలో ప్రాణం పోయగలమని బూటకపు మాటలు చెప్పే పేరయ్యలు పిచ్చివాళ్ళయినా కావాలి లేక గొప్ప మోసగాళ్ళన్నా కావాలి. రాతి విగ్రహాలలో ప్రాణం పోయుబడినట్లయితే, అది మాట్లాడగలగాలిగా?కనీసం పూజారితోగాని భక్తులతోగాని మాట్లాడగలగాలిగా? ఇంతవరకు రాతి విగ్రహం మాట్లాడినట్లు ఎవ్వరూ చెప్పలేదు.

297. పట్టుబట్టకట్టి పట్టెనామము పెట్టి
నట్టి భ్రాంతి జెంది వైష్ణవుడయి
లొట్టి త్రాగి నతడు లోకుల చెఱచురా ॥వి॥

పట్టెనామము= పంగనామాలు; లొట్టి= కల్లుముంత, కల్లు కడవ; లోకులు= జనము; భ్రాంతిజెంది= భ్రమపడి,

డాబుగా పట్టుబట్టలు కట్టుకొని పెద్దపెద్ద పంగనామాలు పెట్టుకొని పెరుమాళ్ళ తీర్థమని చెప్పుకొని కల్లుత్రాగువాడు నిజమైన వైష్ణవుడు కాలేడు. కాని వాడు లోకులను మోసగించేవాడుగా తయారౌతున్నాడు.

298. నీచకులీనుని వ్యాసుని
జూచిరె నారాయణాంశ శోభిల్లె భువి
న్గోచుల కెల్లను మేటిగ
వాచాలతనొందె నౌరవసుధను వేమా॥ ॥వి॥

శోభిల్లుట= ప్రకాశించుట, పేరుగాంచుట; గోదులు= గోచులు ధరించిన సన్యాసులు; నీచ కులీనుడు= నీచజాతి పల్లెపడుచు కొడుకు; భువి= భూలోకము; మేటిగ= అందరికంటే గొప్పవాడు; వాచాలత= వాగ్ధాటి= మాట్లాడే శక్తి

కులముకంటె గుణము గొప్పది. పల్లెపడుచుకు పుట్టిన వ్యాసుడు గొప్ప మహర్షి అయిపోయెను.

299. పండుకొందామన్న పండుకోనియ్యదు,
నిదరబోదామన్న నిదురరాదు
లేచిపోదామన్న లేచిపోనియ్యదు ॥వి॥

ఆశ మానవునికి అనేక కష్టాలు కలిగించును. అది అతనిని ముప్పుతిప్పలు

పెట్టును. అతనికి అది మతి స్థిమితంలేకుండా చేయును.

300. పాషాణములు దిబ్బపర గంగగుడి కట్టి
వేరె శిలనుజెక్కి విగ్రహమని
పూజసేయగానె, పుణ్యంబు గల్గునా? ॥వి॥

పాషాణము= రాతిబండ; శిల= రాయి.

ఱాళ్ళకు మ్రొక్కుట మోక్ష రాజ్యానికి మార్గము కాదు. ఱాళ్ళకు మ్రొక్కి కానుకలను అర్పించుట పూజారుల భుక్తికొరకే.

301. పుట్టు శక్తులైదు పుడమినటింపంగ
విప్రులెల్ల వేదవేత్తలంద్రు
శక్తిపుత్ర కులము జగతిలో నెఱుగరో ॥వి॥

పుట్టు శక్తులు= పంచభూతాలు (గాలి, నీరు, నేల, అగ్గి, ఆకాశము); నటించుట= నర్తించుట, ఉండుట.

అందరూ పంచ భూతాలవల్ల పుట్టినవారే. అందరూ ప్రాకృతికశక్తి పుత్రులే. అందరికీ ఒకే కులము. కాని కొంతమంది జన్మగత బ్రాహ్మలు మేము వేదవేత్తలమని విర్రవీగటం తెలివిమాలిన తనమే.

302. బ్రహ్మయండమెనెడి పట్టణమందున,
బ్రహ్మ మెఱుగలేని బాపడేల?
తన మనంబు దెలియదానెపో బ్రహ్మంబు ॥వి॥

మన శరీరమే బ్రహ్మపురము. దానిలో బ్రహ్మ నివసిస్తున్నాడు. తన శరీరంలోగల బ్రహ్మమును తెలుసుకోలేని బ్రాహ్మణుడు జన్మగత బ్రాహ్మణుడేగాని గుణగత బ్రాహ్మణుడు కాజాలడు. తన శరీరంలోగల బ్రహ్మమును తెలుసుకొన్నవాడే బ్రాహ్మణుడు.

303. ఎన్ని మతములైన నేమాత్రమైనను
సత్య మింతలేక జాడవిడదు;
సత్యము గలదేని జగతిలో ద్విజుడగు ॥వి॥

ఇంత= ఏమాత్రమైనా; జాడ= జ్ఞానము, భగవంతుని జాడ; విడదు=

తెలియదు; ద్విజుడు= బ్రాహ్మడు.

సత్యములేని మతాలకుగాని, మంత్రాలకుగాని ఉనికి లేనేలేదు. ఎందుకన పరబ్రహ్మ సత్యస్వరూపుడు. కనుక బ్రహ్మత్వమును తెలిసికొన్న వాడే బ్రాహ్మణుడు. వాడు సత్యవాది కూడ. అంటే ఎవడైతే సత్యము పలుకునో వాడే బ్రాహ్మడు. సత్యము పలుకనివాడే ఛండాలుడు;నీచుడు.

304. యాగముచేసిన విప్రుడు
భోగించును రంభతోడ బుత్రుడు మరలన్
యాగంబు చేయదల్లిని
భోగించుటగాని యజ్ఞ పుణ్యము వేమా॥

యాగము= యజ్ఞము.

యజ్ఞము చేసిన బ్రాహ్మడు రంభను సంభోగించును. అతని కొడుకు తరువాత యజ్ఞంచేసి తల్లియైన రంభనే భోగించును. యజ్ఞం చేయుటవల్ల కలిగే పుణ్యం యిదేగా.

305. కడు పెద్ద పరాశరుడట
చెడు మాల గణితకడుపున జలగి జనించె
న్వడి పెద్ద వ్యాసుడాచెం
బడి దానికి జాతమయ్యె బాడిగ వేమా

గణిత= ఇల్లాలు, పతివ్రత; పడి= వెంటనే; చెంబడిదానికి= పల్లె పడుచుకు; జాతమయ్యె= పుట్టెను.

పరాశర మహాముని మాలపడుచు ద్వారా శక్తికి కలిగెను. శక్తి వాసిష్ఠునికి అరుంధతికీ పుట్టెను. వ్యాసమహాముని పరాశర మహామునికీ పల్లె పడుచు మత్స్యగంధికీ పుట్టెను.

306. ఆడుదానిజూడ నర్థంబు జూడగ
బ్రహ్మకైనబుట్టు రిమ్మతెగులు;
బ్రహ్మ యాతిత్రాడు బండిరేవున ద్రెంప ॥వి॥

అర్థము= డబ్బు; రిమ్మ=భ్రమ, ఆశ; తెగులు= జబ్బు; ఆలి= పెండ్లాము;

బ్రహ్మ ఆలి= సరస్వతి; త్రాడు= మంగళసూత్రము.

వాని పెండ్లాము త్రాడు బందిరేవులో త్రెంప అనేది ఒక తిట్టు. దాని అర్థము వాడు చచ్చిపోవుగాక.

ఆడుదానిని, ఆస్తిని చూచినపుడు వలపుకలగని మగవాడంటూ యీ లోకంలో లేడు. బ్రహ్మయంతటి గొప్ప దేవుడుకూడ తన సొంత కూతుర్ని చూచినపుడు వలపువలలో చిక్కుకొనిపోయాడు. ఇక సామాన్య మానవుని సంగతి ఏమని చెప్పాలి? ఆడవాళ్ళు తమ సొగసుతోనూ, తమ వయ్యారపు నడకలతోనూ, కైపెక్కించే కండ్ల చూపులతోనూ, ఇంపైన సొంపైన మాటలతోనూ మగవాళ్ళను తమవైపుకు లాక్కోగలుగుతారు. ఇది తప్పనిసరియైన ఒక ప్రకృతి కట్టడిగా కన్పిస్తోంది. ఈ కట్టడికి లోబడని మగవాడు యీ లోకంలో అరుదు.

తన సొంత కూతుర్ని వలచిన ముసలి బ్రహ్మదేవుణ్ణి మన వేమన కాస్త కటువుగా కసురుకొన్నమాట నిజమే.

మన తెనుగునాట పెనిమిటి చనిపోతే వాని ఇల్లాలిని ఏదేని చెరువు రేవు వద్దకో, ఏదేని కాల్వబండి రేవు వద్దకో, ఏ ఏటి ఒడ్డుకో, ఏ బావి వద్దకో తీసికొనిపోయి ఆమె మెడలోని తాలిబొట్టు త్రాడును తెంచివేస్తారు. ఈ ఆచార ప్రకారం వేమన్న బ్రహ్మదేవుని చచ్చిపొమ్మని తిట్టాడు.

307. మర్మమెరుగలేక మతములు కల్పించి
యుర్విజనులు దుఃఖమొందుచుంద్రు;
గాజుటింటి కుక్క కళవళపడురీతి ॥వి॥

మర్మము= ఆత్మ తత్త్వము, ఆత్మ రహస్యము; కల్పించుట= సృష్టించుట; ఉర్వి= భూలోకము; కళవళపడుట= కలతపడుట= కంగారుపడుట.

స్వార్థపరులైన చదువుకొన్న కొంతమంది మేధావులు తమ భుక్తికై వేరు వేరు మతాలను కల్పించి పరతత్త్వాన్ని ఒకమూలకు నెట్టివేశారు. అందువలన వారి అనుయాయులు అద్దపుటింటిలోని కుక్కలవలె తమ నీడలను చూసుకొని కలతజెంది తమకుతామే కీడును కలిగించుకొని పరమార్థానికి దూరమైపోతున్నారు. పరతత్త్వాన్ని తెలుసుకోటానికియీ కల్పిత మతాలు ఎందుకూ పనికిరావు. కనుక

యీ మత పిచ్చిని విడిచినపుడే మానవాళి సుఖంగా మనగలదు.

308. పేదతికమంత దోషం
బేదో యీ జగతిలోన నీశ్వరుడెఱుగున్
పేదను పొడగనువాడది
కాదను శవమనుచు జూచుగదరా వేమా॥

పొడ= జాడ, చూపు, స్నేహము; కనుట= చూచుట; శవము= పీనుగ.

కూడు, గుడ్డ గూడు చాలినంత లేనివానిని పేదవాడంటారు. మానవ జీవితానికి యీ మూడు ముఖ్యమైనవని అందరకూ తెలిసిన సంగతే. ఇవి లేనివాడు మానవుడు పడే బాధలు భగవంతునికే తెలియాలి. ఉన్నవాళ్ళకు అంటే కలిమిగలవారికి పేదవాళ్ళ పొడ అసలే గిట్టదు. వారు బీదలు దగ్గరకు రాగానే శవాలను చూచినట్లుగా భావించి దూరదూరంగా పోతారు. లేక వారిని దూర దూరంగా పారదోలుతారు. కాని ఉన్నవారు లేనివాళ్ళను భగవత్స్వరూపులుగా ఎంచి వారి బాధలను తమ బాధలనుగా ఎంచి వారికి తగిన సహాయం చేయుటే వారి ముఖ్య మానవ కర్తవ్యము. మానవులంతా భగవదాంశాన్ని కలిగినవారేనని ఉపనిషత్తులు గోలపెట్టుకున్నాయి. అందుకే మానవసేవయే మాధవసేవ అన్నారు.

309. తనదు సొమ్ముజూడ దానమీయగవచ్చు
నవని దొడ్డగాద దేనికైన
అదురు బెదురులేక యన్యుల సొమ్ముల
దానమిచ్చువాడు దాత వేమ॥

అవని= భూలోకము; దొడ్డ= గొప్ప; అన్యులు= ఇతరులు.

పేదరికము చాల చెడ్డది. భరింపరాని బాధ. అందువలన దానిని ఏ విధముగానైనా సరే నిర్మూలింపచేయుట ఉచితము. అంటే మోసము, హింస మొదలగు క్రూరమైన పద్ధతులతోనైనా ధనమును సంపాదించి బీదరికాన్ని నిర్మూలింపచేయుట తప్పులేదు. ఎందుకన ధనవంతులు పేదల కష్టాలు చూచికూడా వారిని ఏమాత్రం కరుణించనపుడు గతిలేక తప్పని సరియై హింస, కపటము మొదలగు పద్ధతులద్వారానైనా ధనమును సంపాదించి బీదరికాన్ని నాశనం చేయుట

మానవతావాదుల పరమ కర్తవ్యము.

310. కాంతమీది యాశ, కనకంబుపై నాశ,
లేనివాడు పుడమిలేనివాడె;
కబురులేల జెప్ప, గాన్పింప దెలియరా ॥వి॥

కాంత= ఆడుది; కనకము= బంగారము; పుడమి= భూలోకము

ఆడుదాని మీదను, బంగారం మీదను, కోరికలేని మగవాడంటూ ప్రపంచం మొత్తంలో కన్పించడు. అందులో ఎక్కువమంది మగవాళ్ళు బంగారం కంటె ఆడుదాని వ్యామోహంలో పడిపోతున్నారు. ఎందుకన బంగారము జడపదార్థము. ఆడుది చేతన పదార్థము. అందులో ఆడుదాని కోమల మైన శరీరపాటవము, ఆమె క్రీగంటి చూపులు, వయ్యారపునడతలు, హావభావాలు, నేర్పుగల మాటలు బంగారానికి లేవుగదా! అందువలన బంగారం కంటె ఆడుదే మగవానిని తొందరగా ఆకట్టుకోగలుగుతోంది. కనుక టూకీగా చెప్పాలంటే ఆడుదాని మీద ఆశలేనివాడు మగతనం లేని బృహన్నలు తప్ప మరెవ్వడూ వుండడు. దీనికి తోడు ఆడుదాని ఆకర్షణశక్తి ప్రాకృతిక కట్టుబాటుగా కన్పిస్తోంది. దానిని ఎవ్వడూ తప్పించుకోగల నట్లగపడుతోంది.

311. చెమటకారునట్టు చట్టను శ్రమపెట్టి
గడియించి నన్నంబు కుడవవలెను;
తల్లిదండ్రుల సొమ్ము తినుట కారాదురా ॥వి॥

చట్ట= శరీరము; చెట్ట= చేయి; గడించుట= సంపాదించుట; కుడుచుట= తినుట, త్రాగుట.

ఆర్యులు రాకపూర్వం మన భారతదేశ పరిస్థితులు అంతగా తెలియవు గాని ఆర్యులు ఇచ్చటకు అడుగుపెట్టిన లగాయతు మన దేశంలో శరీర శ్రమ చేయకుండానే ఇతరుల శరీర కష్టార్జితాన్ని భోంచేసి బ్రతికే పేరయ్యలే ఎక్కువగా కన్పిస్తున్నారు. ఒక కులంవారైతే శరీరశ్రమ చేయుట ఆగౌరవమనియు, అవమానమనియు ఎంచి పరాన్నభుక్కులుగా తయారైనారు. వీరికితోడు సన్యాసులు, బైరాగులు, మఠాధిపతులు, పీఠాధిపతులు, పూజారులు, పురోహితులు, బాబాలు

మొదలగువారు శరీరశ్రమ ఏమాత్రం చేయకుండానే దొంగబ్రతుకులు బ్రతుకుతున్నారు. నేడు మన దేశంలో ఎక్కువమంది పిల్లలు తమ తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తిపాస్తులమీద ఆధారపడి బ్రతుకుతున్నారు. కొంతమంది యువకేసరులు తమ ఇల్లాండ్రు తెచ్చిన కట్నాలమీద కాలక్షేపం చేస్తున్నారు. నేటి యువకులకు శరీరశ్రమ చేస్తే దుస్తులు మాసిపోతాయనే జంకు గలదు. కాని నిజానికి శరీరశ్రమ చేయుటవలన మనకు రెండు లాబాలు గలవు. మన ఆరోగ్యం బాగుపడగలదు. మనం ఇతరులను దేవిరించకుండా స్వతంత్రంగానూ, గౌరవంగానూ జీవించగలము. మనమంతా పాటుపడిన యెడల మన దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందగలదు. అప్పుడు మనదేశం ప్రపంచదేశాలలో గౌరవము పొందగలడు. అందుకే మహా మనీషి టాల్‌స్టాయ్‌గారు అన్నారు. "ఏదేశంలోనైతే శరీరశ్రమ చేసేవారు ఎంత ఎక్కువగా వుంటారో, ఆ దేశం అంత ఎక్కువ గౌరవంగానూ ఐశ్వర్యవంతంగానూ ఉండగలరు. నిజానికి శరీరశ్రమతో సమానమైన సంపత్తి మరొకటిలేదు."

312. కరక కాయలుదిని కాశెల బిగగట్టి
కాంచ విడుచుటెల్లకాని గుణము;
వెంపలి తరుగట్టఁవే దండముండునా? ॥వి॥

కరక కాయ= కరక్కాయ; కాశెలు= గోచీలు; కాంత= ఆడుది; కాని గుణము= చెడ్డగుణము; వెంపలి= వెంపలి చెట్టు; తరు= చెట్టు; వేదండము= ఏనుగు.

ఏ విధంగానైతే వెంపలి మొక్కకు ఏనుగును కట్టివేస్తే అది వుండదో, అదే విధంగా కొంతమంది సన్యాసులు పెండ్లాలను విడిచిపెట్టి కామం కలుగకుండా వుండాలని కరక్కాయలుతిని గోచీలను గట్టిగా పెట్టుచుందురు. కాని వారు తమ ఇంద్రియాలను అదుపులో వుంచుకోలేక పోతున్నారు.

313. పరులు చదువజూచి నిరసన బుద్ధితో,
వట్టి మాటలాడు వదరుబోతు
అట్టివాని బ్రతుకు టదియేలమంటికా? ॥వి॥

నిరసించుట= తిరస్కరించుట, అనాదరించుట; వదరుబోతు= పొల్లు

మాటలు మాట్లాడువాడు.

ఇతరులు చదువుకొని విద్వాంసులుకాగా, వారినిచూచి ఓర్వలేనివాడు వ్యర్థుడు. అట్టి వీరుని బ్రతుకు ఎందుకూ పనికిరాదు.

హిందువులలో కులాలు ఏర్పడినప్పటినుండీ చదువులు, జపతపాలు, పూజలు, అర్చకత్వం వగైరాలు పూర్తిగా బ్రాహ్మణులనబడే వారి చేతులలోనే వుండిపోయాయి. తక్కిన కులాల వారిలో శూద్రులనబడేవారిని భగవంతుడు కేవలం బ్రాహ్మణులకు ఊడిగం చేయటానికై పుట్టించాడని బ్రాహ్మణ పండితులు కల్పిత కథలను అల్లి వారిని (శూద్రులను) చదువు సంధ్యలకు చాల దూరంగా వుంచారు. కాని ఇటీవల కాలంలో కొంతమంది శూద్రులు, మాలమాదిగ లనబడేవారుకూడ చదువుకొని సుఖం జీవనంచేయసాగారు. అప్పుడు వారిని చూచి బ్రాహ్మణులు వగైరా అగ్రకులలవారు కొందరు ఓర్వలేక వారిని నిరసించి అతి తేలికగా చూడసాగారు. ఇది వారి (అగ్రకులాలవారి) కుటిల స్వభావానికి ప్రబల నిదర్శనము.

314. పరుల మోసపుచ్చి పరధన మార్జించి
కడుపు నింపుకొనుట కానిపద్దు.
ఋణముసేయు మనుజుడెక్కువ కెక్కునా?

కానిపద్దు= పనికిమాలిన లెక్క, పనికిమాలినపని; ఎక్కువ కెక్కునా? = వృద్ధిచెందునా, బాగుపడునా?

మానవ సమాజంలో ముందుగా సోమరితనము చొచ్చుకొని వచ్చింది. దానినుండి అబద్ధము అవతరించింది.అబద్ధంనుండి మోసం మొలకెత్తింది. ఈ మూడు చెడ్డ అలవాట్లూ మానవ సమాజంనుండి నీతి– నిజాయితీలను తరిమి వేశాయి. అందువల్ల నేడు మానవ సమాజంలో ఎన్నెన్నో తలాతోకాలేని ఆచారాలు, గుడ్డినమ్మకాలు, ఎక్కువ తక్కువ తేడాలు, రకరకాల మోసాలు పుట్టుకొక్కుల్లాగ పుట్టుకొచ్చి మానవ సమాజాన్ని ఛిన్నాభిన్నం చేయసాగాయి.

ఈ చెడ్డఅలవాట్లు ముందుగా చదువుకున్న కులాలవారిలోనే మొదలయ్యాయి. ఎందుకన చదువుకొన్న కులాలవారిలో ఎక్కువమంది ఒళ్లొంచి పనిచేయటానికి బద్ధకించి రాతి దేవుళ్ళకు పూజలు, పెండ్లిండ్లు, గర్భాదానాలు

చచ్చిపోయిన వాళ్ళకు దినాలు, తద్దినాలు, శాంతులు, జ్యోతిష్యము మొదలగు వాటిని ఆధారంగా చేసికొని చదువులేని కష్టించి పనిచేసే అమాయక కష్టజీవుల కష్టార్జితాన్ని మోసపు మాటలనుచెప్పి అపహరించుచూ కొన్ని వందల ఏండ్లనుండి కడుపులోని నీళ్ళు కదలకుండా కాలక్షేపం చేస్తున్నారు.

ఈ అణుయుగంలో కూడా మనదేశంలో కొంతమంది చదువుకొన్న ఎక్కువ కులాలవారు ఎల్లప్పుడూ కష్టించి పనిచేసే కష్టజీవుల బుద్ధులు (తెలివితేటలు) పెరగకుండా వుండేలాగున కుట్రతో వారిని గుడ్డి నమ్మకాలతోనూ, మూఢాచారాలతోనూ, రాతి విగ్రహాల పూజలతోనూ బంధించి వారిని మూర్ఖులుగానే వుంచి వారిని ఆర్థికంగా పట్టపగలే నిలువుదోపిడీ చేయ సాహసిస్తున్నారు. తోటి మానవులను బౌద్ధికంగానూ, ఆర్థికంగానూ దోపిడీచేసే యీ నరమానవ హంతకులు తగినరీతిని దండింపబడే రోజు ఎప్పుడు వచ్చునోగదా?

315. కల్లు కిచ్చినటు చల్లకివ్వగ లేరు?
కొల్ల కిచ్చునట్లు కుడువ లేరు;
బూయికిచ్చునట్లు పుణ్యాని కియ్యరు ॥వి॥

కొల్ల= దోపిడీ; కుడుచుట= తినుట, అనుభవించుట; బూయి= జారిణి, లంజె

316. కల్లుకిచ్చినట్లు చల్లకివ్వగలేరు;
కొల్లకిచ్చినట్లు కుడువలేరు;
పొలుసు కిచ్చినట్లు పుణ్యానికివ్వరు ॥వి॥

పొలుసు= పొలసు, పలము= మాంసము, పలలము.

లోకంలో సహజంగా ఎక్కువమంది తమకు ఇతరులకు మేలు కలిగించే మంచిపనులకంటె సరదాలకని, సరసాలకని, విలాసాలకని తనకు యితరులకు కీడు కలిగించే చెడ్డపనులకు ఎక్కువసొమ్ము వెచ్చిస్తున్నారు. తమ ప్రక్కవానికి కల్లు కొని పోస్తారేకాని, పదిమంది బీదవాళ్ళకు చల్లపోయరు. ఎవరైనా తమ సొమ్మును దోచుకొని పోతూవుంటే కిక్కురుమనకుండా వూరుకుంటారు. కాని అలా దోచుకొని పోయేముందు ఆ సొమ్మును తాము ఖర్చు పెట్టుకుని తినలేరు. కామ సుఖానికి

ఖర్చు పెట్టినట్లు లోకానికి ఖర్చుపెట్టలేరు. ఇది మానవ స్వభావమేమో!

మానవులు నీటిని, నిప్పును, గాలిని, నేలనుండి రకరకాల పంటలను తమ శరీరాల పోషణకై వాడుకోవటం మొదలు పెట్టినప్పటికీ కూడ తమ శరీరాలకు కీడును కలిగించే వస్తువులనుకూడ సర్దాకని, షోకులకని, విలాసాలకని వాడుకోసాగారు. ఆ వస్తువులలో పొగాకు, గంజాయి, నల్లమందు, భంగు, కల్లు, సారాయి మొదలగునవి ముఖ్యమైనవి. పుగాకుతో చుట్టలు, బీడీలు, సిగరెట్లు, సురతీ, హుక్కా, కారపుల్లీ మొదలగునవి తయారు చేయబడుతున్నాయి. వీటిని మగవాళ్ళే కాకుండా యీ రోజులలో ఆడవాళ్ళు కూడ సరదాకై వాడుతున్నారు. కల్లు, సారాయి, నల్లమందు గంజాయి మత్తుకని మగవాళ్ళతోపాటు కొంతమంది ఆడవాళ్ళుకూడా సేవిస్తున్నారు. ఈ చెడ్డ అలవాట్లుగల వారలలో ఎక్కువమందికి అంకుతనము (వ్యభిచారము,చీకటితప్పు) చాల తేలికగా అలవాటైపోతుంది. ఈ చెడ్డ అలవాట్లకై ఏటా కొన్నివేల కోట్ల రూపాయలు బూడెదపాలైపోతున్నాయి. ఇంతేకాదు బంగారంవంటి కోట్లాది కుటుంబాలు ఆర్థికంగానూ, ఆరోగ్యంగానూ దెబ్బతినిపోతున్నాయి. ఈ చెడ్డ అలవాట్లుగలవారు సంఘంలో ఎన్నో అవమానాలకు గురి కావలసి వస్తోంది. ఈ చెడ్డ అలవాట్లకు తొత్తులైన అనేక మంది ఘరానా పెద్దమనుషులుకూడా తమ ఇల్లూ- వల్ల గుల్లచేసుకోవటమే కాకుండా ఎన్నో అవమానాలను అనుభవిస్తున్నారు. ఎన్నో అవినీతి పనులను చేయ సాహసిస్తున్నారు.

ఆట్టే చూడగా మానవ స్వభావం అందులో మగవాని స్వభావం ఎక్కువగా మంచిపనులవైపుకు కంటే చెడ్డపనులవైపుకే మొగ్గు చూపుతున్నట్లు కన్పిస్తుంది. టూకీగా చెప్పాలంటే యీ అణుయుగంలో కల్లుత్రాగుట, పొగపీల్చుట, ముక్కుపొడి పట్టించుట, వ్యభిచరించటం సామాన్య పనులుగా లెక్కించబడుతున్నాయి.ప్రతి మనిషి చెడ్డ పనికి డబ్బును, తన జీవితాన్ని ఆహుతి చేయటానికి యిష్టపడుతాడు గాని పదిమందికి మేలుచేసే మంచిపనికి డబ్బు ఖర్చుచేయటానికిగాని తాను సేవ చేయటానికిగాని యిష్టపడడు. దండగకు ఒప్పుకుంటారేగాని ధర్మానికి ఒప్పుకోరు అనే సామెత నేడు నూటికి నూరుపాళ్ళు నిజంగా కన్పిస్తోంది.

317. బిందు రక్తములను బెరసిన దేహము

చందమెఱుగక ద్విజశబ్ద మిడుక
నడచిన విడుచునా నరకంబు మృత్యువు? ॥వి॥

బిందు= వీర్యము, శుక్రము; బెరయుట= కలుగుట, పుట్టుట; చందము= రీతి, విధము; ద్విజ= బ్రాహ్మణ; ఇడుట= పెట్టుకొనుట.

శరీరము వీర్యము (మగవాని) రక్తము (ఆడుదాని) వలన ఏర్పడుతున్నది. ఈ సంగతి ఎరుగక బ్రాహ్మణులు తామేదో ఆకాశమునుండో బ్రహ్మ ముఖంనుండో పుట్టామన గర్విస్తున్నారు కాని మృత్యువు నరకము వారిని విడిచిపెట్టునా?

318. స్వానుభూతిలేక, శాస్త్రవాసనలచే
సంశయము విడదు సాధకునకు;
చిత్ర దీపమునకు చీకటి పోనట్లు ॥వి॥

స్వానుభూతి= సొంత అనుభవము; శాస్త్రవాసనలు= శాస్త్రముల జ్ఞానము; సంశయము= అనమానము, సందేశము; సాధకుడు= ఆచరణపరుడు; చిత్రము= చిత్రపటము, కాగితంమీద గీసిన బొమ్మ.

శాస్త్రములను బాగుగా చదివినను సొంత అనుభవము లేనియెడల అజ్ఞానం నశించదు. బొమ్మలోని దీపమువలన చీకటి నశించగలదా? శాస్త్రజ్ఞానం అంటే శాస్త్రములలో చెప్పబడిన విషయాలను అర్థం చేసుకోకుండా గ్రుడ్డిగా చదివిన చదువు. ఈ చదువు కాగితంమీద గీసిన కాగడా బొమ్మ వంటిది. ఈ చిత్ర దీపం చీకటిని పోగొట్టలేదు. నిజమైన దీపమే చీకటిని పోగొట్టగలదు. కాని స్వానుభూతి అనే నిజమైన దీపము సందేహం అనే చీకటిని పోగొట్టగలదు. సాధకుడు నిరంతరం పరిశీలనవల్లనే అనుభవాన్ని పొందుతాడు.

319. రాయిరూపుజేసి, రాజుల మ్రొక్కింప,
వన్నెకెక్కునటనె వైభవంబు?
కర్త యెవ్వడనుచు గానరు మూర్ఖులు ॥వి॥

రూపము= విగ్రహము; వన్నె= అందము, గొప్పతనము.

రాతిని విగ్రహంగా చెక్కి రాజులచేతకూడ దానికి మ్రొక్కించినంత మాత్రాన దానికి గొప్పతనం రాదు. కాని మూర్ఖులు జగత్తుకు కర్త ఎవ్వడో తెలిసికోలేక

ప్రాణంలేని రాతి విగ్రహాలను పూజించి యింకా మూర్ఖులై పోతున్నారు.

320. వీరుడైన లేదు, విద్యనేర్పిన లేదు;
సత్కులమున లేదు, నటలలేదు;
జన్మఫలమె కాని, జపియించినను రాదు ॥వి॥

వీరుడు= పరాక్రమవంతుడు; సత్కులము= మంచి కులము; నటలు= జడలు

పరాక్రమవంతుడైనా, విద్యనేర్పినవాడైనా, మంచి కులంలో పుట్టినవాడైనా, పొడుగాటి జడలు ధరించిన సన్యాసియైనా, గొప్ప తపస్సు చేసినవాడైనా, భోగభాగ్యములు పొందలేడు. కేవలం జన్మాంతర ఫలము వల్లనే భోగభాగ్యాలు లభిస్తాయి.

321. జాతిభేదమెంచి జన్మముల్ తెలియక
ముక్తిగానలేరు మూర్ఖజనులు;
జాతినెంచనేల? జన్మము తెలియుము ॥వి॥

జాతి= కులము; జన్మము= పుట్టుక

పుట్టుటలో అందరూ సమానులే. కులగోత్రాలు లేవు. కాని జనులు అవివేకమువల్ల కులభేదాలను పాటిస్తూ మోక్షమునకు దూరమైపోతున్నారు. కుల మత భేదాలు పాటించే మూర్ఖులు పరమాత్మకు దూరమైపోతారు. అందరకూ పరమాత్మ ఒక్కడే. అందరూ పరమాత్ముని బిడ్డలే అయినప్పుడు కులమత వర్ణభేదా లెక్కడివి?

322. ఒక్క ప్రొద్దులున్న యూరపందై పుట్టు;
పృధిని తపము చేయ పేదయగును;
నిగిడిశిలకు మ్రొక్కి నిర్జీవులౌదురు ॥వి॥

ఒక్క ప్రొద్దులుండుట= ఒకపూట ఉపవాసము చేయుట; పృధివి= భూమి; శిలలు= రాళ్ళు; నిర్జీవులు= ప్రాణంలేని వస్తువులు, జడపదార్థాలు.

ఒంటిపూట ఉపవాసమువల్ల పందిగానూ, తపము చేసినందువల్ల దరిద్రులుగానూ, ప్రాణంలేని రాళ్ళకు మ్రొక్కిన జడపదార్థాలుగానూ పుట్టుదురు.

323. యోనిలోనబుట్టి యుత్తమ కులజులై
బ్రహ్మ కులమునందు బ్రతుకువారు
బ్రహ్మ మెఱుగలేక పడిచత్తురిదె వింత ||వి||

యోని= అడగుఱి, పూకు; ఉత్తమ= అన్నిటికంటె గొప్పది; వింత = ఆశ్చర్యము; పడిచత్తురు= విర్రవీగుదురు.

నేడు తమను బ్రాహ్మనులమని చెప్పుకొనే యీజన్మ గత బ్రాహ్మణులు అందరివలెనే తల్లి కడుపునుండియే పుట్టిరి. కాని వారు తమను బ్రహ్మకులం వారమని చెప్పుకొని విర్రవీగుట వింతగానున్నది. ఎందుకువారు బ్రహ్మమును తెలిసికోలేని వారైనప్పటికీ తాము బ్రహ్మ కులస్థులమేనని చెప్పుకొంటున్నారు. బ్రహ్మమెఱుగనిది బ్రాహ్మణత్వము ఎట్లు లభించగలదు?

324. రాయియగు నహల్య రామపాదము సోకి
యాడు దయ్యెననెద రవని జనులు
శిల్పి పదముసోక, శిలలెట్లు దేవతల్? ||వి||

సోకుట= అంటుకొనుట, తాకుట; అవని= భూలోకము; పదము= పాదము, కాలు; శిల్పి= రాతితో బొమ్మలను చెక్కువాడు; శిల= రాయి.

శిల్పి తన పాదాలతో తొక్కిపట్టి చేసిన విగ్రహాలు దేవతలుగా ఎంచబడుతున్నాయి. కాని రాయియగు అహల్య రాముని పాదము సోకగానే ఆడుదయ్యేనని జనులు వింతగా ఎందుకు చెప్తుతున్నారో అర్థంకావటం లేదు. ఎందుకన శిల్పి తన పాదాలతో త్రొక్కిపట్టి నిర్మించిన రాయి శివలింగముగా ఎంచబడుతున్నది. కనుక రామునికంటె శిల్పినే గొప్ప శక్తిగలవాడనాలి. ఎందుకన రాముని పాదము తగలగానే రాయి ఆడది మాత్రమే అయింది. కాని శిల్పి కాలు తగలగానే రాయి దేవుడైపోయింది.

325. కచ్చులు కామలు నాడగ
త్రచ్చంగా జగముబుట్టె తాతలనాడే
యిచ్చట కుంజుల డెవ్వడు?
సచ్చరితలు నందరనుచు చాటర వేమా||

కచ్చలు= మగవాళ్ళు పెట్టుకొనే గోచీలు, మగవాళ్ళ ధోవతుల కుచ్చీళ్ళు; కామలు= కామవాంఛలు; ఆడుట= కదలుట; కులజుండు= ఎక్కువ కులంవాడు; సచ్చరితుడు= మంచి నడతగలవాడు; చాటుట= వెలుగెత్తి చెప్పుట, వెల్లడించుట; త్రచ్చుట= తరచుట, మథించుట

ఆడ మగ శుక్ల శోణితముల (వీర్యము, రక్తము) సంయోగమే (కలయికయే) పిండోత్పత్తికి కారణం అయినప్పుడు ఎక్కువ కులం తక్కువ కులం అనే తేడా ఎక్కడిది? అందరూ సమానులే. అందరూ మంచి నడత గలవారే.

326. మంత్రమును దలతురు మంత్రార్థ మెరుగరు,
అర్థ మెరుగలేక అంధులైరి;
గురుతు తెలియలేక నెరి ద్విజుండెట్లగు? ॥వి॥

తలుచుట= చదువుట, తలచుకొనుట; అంధులు= గ్రుడ్డివారు, అజ్ఞానులు; ద్విజుడు= బ్రాహ్మణుడు.

జన్మగత బ్రాహ్మణులలో చాలామంది వేదమంత్రాలను బట్టీపట్టి అప్పగించగలరు. కాని ఆ మంత్రాలకు అర్థం చెప్పలేరు. అర్థం తెలిసికోలేనివారు అంధులే కదా! అంటే అజ్ఞానులే కదా! అర్థం చెప్పగలవాడే విప్రుడనబడును. అర్థం చెప్పలేనివారు బ్రాహ్మణుడు కాజాలడు. కాని జన్మగత బ్రాహ్మణులు చాలామంది యీ సంగతిని ఒప్పుకోరు. పుట్టుకతోనే తాము గొప్పవారమని వారు వాదిస్తారు.

327. మంత్ర విద్యలెల్ల మాయల కొఱకిల
సృష్టియందు బ్రహ్మ సృష్టి చేసె;
మత్తుడైనవాడు మది నిల్పలేడయా ॥వి॥

ఇల= భూలోకము; మత్తుడైనవాడు= మంత్రాల మత్తులో మత్తుడైన వాడు, ఒళ్ళు తెలియనివాడు; మది= మనస్సు; మాయ= మోసము.

మానవులను మోసగించటానికే బ్రహ్మ మంత్రవిద్యలను సృష్టించాడను కోవలసి వస్తున్నది. ఈ మంత్ర విద్యలు నేర్చినవారు మదోన్మత్తులై మనస్సులను స్థిరముగా నిల్పలేకపోతున్నారు. చపలచిత్తులైపోతున్నారు.

328. మంత్రమొకటి చెప్పి మఱి దేవతార్చన

జేసి కరుణ తమకు జెందినదని
వేదపఠన జేసి వెఱ్ఱులై చెడుదురు ॥వి॥

అర్చన= పూజ; కరుణ= దయ.

మతి నిలకడలేని మనుజులు మంత్రములు చదివి దేవతలను పూజించుచూ తమమీద భగవంతుడికి దయ కలిగినదని విర్రవీగుతూ పిచ్చివాళ్ళయి పోతున్నారు. భగవంతుని దయను పొందిన నిజమైన దయాళులు యీ విధంగా విర్రవీగరు.

329. శూద్రతనము పోయె శూద్రుడగానని,
ద్విజుడనుకొనుటెల్ల తెలివిలేమి;
ఇత్తడిలను పసిడికీడన వచ్చునా? ॥వి॥

ద్విజుడు= బ్రాహ్మడు; తెలివిలేమి= తెలివితక్కువతనము, మూర్ఖత్వము; పసిడి= బంగారము; ఈడు= సమానము,సాటి; ఇల= భూలోకము.

జన్మగత బ్రాహ్మణుడు పిలక, జందెముతాల్చి తనకు శూద్రత్వము పోయి బ్రాహ్మణత్వము వచ్చెననుకొనును. శుద్ధ తెలివితక్కువతనము. ఇత్తడి బంగారముతో సమానము ఎన్నటికీ కాజాలదు. అట్లనే ఎంత తన్నుకుచచ్చినా, ఎన్ని జందాలు, ఎన్ని పిలకలు ధరించినా బ్రహ్మజ్ఞానం లేనిది ఎవ్వడూ బ్రాహ్మడు కాజాలడు.

330. మనసులోన బుట్టు మరి కోర్కెలన్నియు
గోర్కెలందు ముక్తి కుదురుపడదు;
మనసు బ్రహ్మమనుచు మది నెఱుంగగలేరు ॥వి॥

బ్రహ్మము= పరమాత్మ; మది= మనస్సులో.

మనకు మనస్సునుండే కోర్కెలు కలుగుతాయి. ఆ కోర్కెలను నశింపజేసినగాని మనం ముక్తిని పొందలేము. అంటే మనం దుఃఖంనుండి విముక్తులము కాజాలము. కోర్కెలను మనం నశింపచేయగలిగిన యెడల మనం బ్రహ్మమును కనుగొనగలము. కాని యీ పనిసామాన్యులకు సాధ్యమయ్యేది కాదు. మనస్సే బ్రహ్మమని చాలామందికి తెలియదు. అంటే మనస్సు ద్వారానే మనం పరమాత్మని కనుగొనగలము.

331. ఆకలిజంపిన రాదది

యాకుల దిని యడవులందె యలసిననైనన్
జీకటికోసంజిక్కదు
ఏకాకృతి మదిని నిల్పి యెఱుగము వేమా॥ ॥వి॥

కోన= కోనము, కోణము, మూల, అంచు; ఏకాకృతి= తదేక ధ్యానంతో

తిండి తినకుండానూ, ఆకూ అలము తింటూ అడవులలో వుంటూ, శ్రమపడుతున్నా పరమాత్మ ప్రాప్తించదు. ఏకాంత స్థలంలో కూర్చున్నా బ్రహ్మ ప్రాప్తి కలుగదు. కాని పరబ్రహ్మమును నిరంతర ధ్యానంతో పొందవచ్చును. ఉపవాసాలు, వ్రతాలు, జపాలు, రాతి విగ్రహాల పూజలు,సాత్విక ఆహారాలు మొదలగు వాటిద్వారా మనం పరమాత్మను పొందలేము. కాని కేవలం తదేక ధ్యానంతో పరమాత్మను మనం పొందవచ్చును.

332. ఇహము విడిచిఫలము లింపుగగలవని
మహినిబల్కువారి మాటకల్ల;
ఇహనెరము లోపము నెనగుట కానరా ॥వి॥

ఇహము= ఈ లోకము; ఇంపుగ= అందముగా; మహి=భూలోకము; కల్ల= అబద్ధము, మోసము; పరము= పరలోకము, స్వర్గము; ఎనగుట= వ్యాపించుట; కానరా= చూడరా.

కొంతమంది పరాన్నభుక్కులైన మెట్టవేదాంతులు యీ లోక సుఖాలు శాశ్వతంకాదు, వాటికై మనం ప్రయత్నించరాదు. కేవలం పరలోక సుఖానికై ఈ లోకంలో మనం సంపాదించిన యావత్తు ఆస్తిని దానం చేయాలని బూటకపు మాటలు చెబుతారు. వారి మాటలు మనం వినకూడదు. ఎందుకన ఇహము-యీలోకము లేనిది పరము లేదు, పరమాత్మ లేడు. పరమునకు పరమాత్మకు ముఖ్యాధారము యిహలోకమే. ఎట్లనగా యిహలోకంలోని ప్రతి ప్రాణిలోనూ పరమాత్మ వ్యాపించి యున్నాడు. కనుక ఇహలోకాన్ని మనం లేదనజాలము.ఇహము ద్వారానే అంటే ఇహలోక సుఖాలతోపాటు పరలోక సుఖానికై పాటుపడాలిగాని కేవలం పరలోక సుఖానికై యిహలోక సుఖాలను పోగొట్టుకొనగూడదు.

333. వేదాంతులమని కొందఱు

వాదమునకు నడుముగట్టి వత్తురు వారల్
సాధులు కారని చెప్పగ
భేదగుణం బొకటి గుఱుతు పెద్దది వేమా॥

కొందరు పరాన్నభుక్కులైన పండితులు గొప్ప వేదాంతులమని చెప్పుకొనుచూ వితండ వాదములు చేయుచుందురు. వారు సజ్జనులు కారని మనం వేరే చెప్పబనిలేదు. వారి భేదబుద్ధియే అందుకు తార్కాణమగుచున్నది. అంటే వారు సజ్జనులుకారని వారి భేదబుద్ధియే చెప్పుచున్నది.

334. మోక్షమార్గ మెఱుంగక మూర్ఖజనులు
కుక్షినింపెడు వేషముల్ గోరివేసి
నిర్గుణాత్ములమని చెప్ప నీతికాదు;
వారి కిహపరములు సున్నలొర వేమ॥

కుక్షి= కడుపు, పొట్ట; నిర్గుణాత్ములు= సర్వసంగ పరిత్యాగులు, కోరికలు లేనివారు.

కొందరు దొంగసన్యాసులు మూర్ఖులై పొట్టనింపుకోటానికని అనేక వేషాలు వేస్తూ డబ్బు యాచిస్తూ దేశదిమ్మరులుగా తిరుగుతూ తాము నిర్గుణాత్ములమని బూటకపు మాటలుచెప్పి ప్రజలను మోసగించుచున్నారు. ఇటువంటి బూటకపు సన్యాసులు ఇహపరములు రెండూ పోగొట్టుకొంటున్నారు.

335. దాసరనగవచ్చు వేసాలకైనను
జంగమనగవచ్చు లింగమున్న
బాపడనగరాదు పదివేలకైనను

పంగనామాలుపెట్టుకొన్నవానిని దాసరిఅనవచ్చును.మెడలో లింగమును కట్టుకొన్నవారిని జంగము అనవచ్చును. కాని మెడలో జందెము వేసుకొని నెత్తిపైన పిలకను ధరించిన వానిని బ్రాహ్మణుడనరాదు. ఎందుకన బ్రహ్మజ్ఞానం వున్నవానినే బ్రాహ్మణుడు అని అనాలి కాని, బ్రహ్మజ్ఞానం లేనివానిని బ్రాహ్మణుడని చెప్పరాదు. కాని యీనాటి జన్మగత బ్రాహ్మలు దీనిని ఒప్పుకోరు.

336. ఈగ తేనెరుచికి ఇంపుగా చచ్చును

ఓగు కామరుచికి నొదిగివచ్చు;

త్యాగికానివాని ధర్మమడ్గిన చచ్చు ॥వి॥

ఓగ= అవివేకి, చెడ్డవాడు, పనికిరానివాడు; త్యాగి= దానబుద్ధి గలవాడు; ధర్మము= దానము; ఒదుగుట= లీనమగుట, నిమగ్నమగుట; నుడిసిపోవుట= చచ్చిపోవుట; పోనాడుట= పోగొట్టుకొనుట

తేనెను రుచిచూచుటకు వచ్చిన ఈగ తేనెలోపడి చచ్చిపోవును. అవివేకి కామాంధుడై కామంలో నిమగ్నమై చచ్చిపోవును. చాతకాని గొప్ప పిసినిగొట్టును దాన మడిగిన వాని ప్రైప్రాణాలు పైనే పోవును. తేనెవలన యీగ, కామమువలన అవివేకీ, ధర్మమడుగుటవల్ల పిసినిగొట్టు చచ్చిపోతాడు.

337. ఇంద్రు డాయెకామి, హీనుడై పోయెను;

మారు డాయె కామి, మడిసిపోయె;

బ్రహ్మయయ్యె కామి, బయసిపోనాడెను ॥వి॥

కామము= బూతు, మోహము, ఆడ మగ కలిసినపుడు కలిగే సుఖము; బయసి= సిగ్గు, మర్యాద; బయసిపోవుట= సిగ్గుచేత నాశనమగుట; మడసిపోవుట= చచ్చిపోవుట; పోనాడుట= పోగొట్టుకొనుట.

ఈ పద్యములో వేమన్న కామము గొప్ప శక్తిగలదని ఉదాహరణ సహితంగా నిరూపించాడు. ఇంద్రుడు దేవతలకు, గంధర్వులకు అప్సరసలకు దేవత. ఈయన ఆర్యజాతి కులదేవత ఆర్యఋషులు కాకితో కబురంపితే ఆకాశరథంలో రెప్పపాటు కాలంలో వచ్చి వాలేవాడట. ఈయనకు కావలసినంతమంది దేవతావేశ్యలు గలరట.కాని కామదేవుని ప్రేరేపణవల్ల పాపం యీయనకు గౌతమమహర్షిగారి అహల్యమీద మనసు పోయిందట. అప్పుడు మహర్షిగారు యీయన శరీరమంతా ఉపస్థలతో ఎప్పుడూ నిండివుండాలని శపించెనట. ఆ ఉపస్థులు యీయనకు మాత్రం ఉపస్థులుగా కన్పించునట, ఇతరులకు కండ్లుగా కన్పించునట. ఈయనను యీ విధంగా మహర్షిగారు అవమానపరచినారట. మన్మథుడు ఆడ మగకు జతకట్టటానికి ప్రేరేపణ కలిగించే దేవతయట. అతడు ఒకసారి శివుని సమాధిని చెడగొట్టి ఆయనకు కామోద్రేకం కలిగించగా ఆయన యీయనను తన మూడవ నేత్రం తెరచి భస్మంచేసి

వేసినాడట. ఈ రకంగా మన్మథుడు చనిపోయెనట. బ్రహ్మదేవుడు సృష్టికర్త అని అందరకూ తెలిసిన సంగతే. ఈయన మానవులను దేవతలను అందర్నీ సృష్టించే దేవతయట. ఈయన ఒక అమ్మాయిని సృష్టించి ఆమె అందాన్నిచూసి ఆమెను ప్రేమించి ఇల్లాలుగా చేసుకొన్నాడట. అందువల్ల యీయన కూతుర్ని పెండ్లాముగా చేసుకొన్నందులకు యీయన గొప్ప అపకీర్తి అవమానం భరించవలసి వచ్చెనట. ఈ రకంగా కామము యింత శక్తివంతమైనదైనప్పుడు యిటువంటి కామాన్ని జయించాలంటే చదువు సంధ్యలు, సంస్కారాలులేని పామరజనానికి సాధ్యమయ్యే పనేనా?

338. మతములెన్నియైన సతములు కావవి
సతము కర్మమగును జగతియందు
అన్ని మతలములందు నరయ నొక్కటిలేదు ॥వి॥

సతములు= స్థిరమైనవి; సతము= స్థిరమైనది; కర్మ= పని; అరయ= విచారించగా.

ప్రపంచంలో అనేక మతాలు గలవు. అవన్నీ స్థిరమైనవికావు. కర్మయొక్కటే స్థిరమైనది. మతాలలో ఒక కట్టుబాటంటూ ఏమీలేదు. ఎన్నో మతాలు వెలసి కాలగర్భంలో కలిసిపోయాయి. వాటి స్థానములలో క్రొత్త మతాలు పుట్టుకొచ్చాయి. అట్లనే ఎంతోమంది పాతదేవుళ్లు పాతివేయబడ్డారు. వారి స్థానాలలో క్రొత్తదేవుళ్లు వెలశారు. అట్లనే ఎన్నో రాజ్యాలు స్థాపించబడ్డాయి. అవి కాలగర్భంలో కలిసిపోయి వాటి స్థానాలలో ఎన్నో ప్రజారాజ్యాలు నెలకొల్పబడ్డాయి. ఎన్ని మార్పులు వచ్చినా కర్మమాత్రం ఏకతీరున నిలచియున్నది.

339. చదువులెల్ల జదివి సర్వజ్ఞులైయుండి
బ్రహ్మవిద్యలెల్ల బదటగలిపి
పడతి దలచినంత పరమయోగముమాను ॥వి॥

పదడు= బూడిద; పదట గలుపుట= బూడెదలో కలుపుట; పడతి= ఆడది;

ఈ పద్యంలో కూడ వేమన్న కామముయొక్క శక్తినే విశదీకరించాడు. కామము ముందు సామాన్య విద్యలు, చివరకు బ్రహ్మవిద్యకూడ ఎందుకూ పనికిరానివి

గానే కన్పిస్తున్నవి. దీనిని బట్టి ఎన్ని చదువులు చదివి ఎంతజ్ఞానాన్ని సంపాదించినా చివరకు కామముముందు మానవుడు తలొగ్గవలసి వస్తున్నది. ఇది అనివార్యమైన ప్రాకృతిక నియమంగా కన్పిస్తున్నది.

340. పరధనంబునకును బారుగా జేజాచి
సత్యమింతలేక చట్టు ద్విజులు
ద్విజులమంచు నెంత్రు తేజమించుకలేదు ॥వి॥

చేజాచి= యాచించి, అడుక్కొని; తేజము= జ్ఞానము; చట్టు= చెడిపోయిన; ద్విజులు= బ్రాహ్మలు; ఇంచుక= ఏమాత్రము.

ఈ కాలంలో బ్రాహ్మలు ఇతరులను డబ్బు యాచిస్తున్నారు. వారు డబ్బును ప్రాణంకంటే ఎక్కువగా ఎంచుచున్నారు. వారిలో జ్ఞానంలేక పోయినా తామే గొప్ప కులస్థులమని భ్రమపడుతున్నారు. వారు యాచన వృత్తి తమదేనని గర్వముగా చెప్పుకొంటున్నారు. ఇతర కులస్తులు యాచనకు బయలుదేరుట పాపమని జన్మగత బ్రాహ్మణులు అంటారు. బ్రహ్మజ్ఞానం లేకపోయినా తాము బ్రాహ్మణులమేనని గర్వముగా చెప్పుకొంటున్నారు. ఇట్టివారు బ్రాహ్మణులెట్లగుదురు?

341. బాప డెముకకూడు భక్షింపుచుండును
పేరటంబుబోవు పెండ్లిమగువ;
కులము మానమువిడి కోర్కెలు మెండాయె ॥వి॥

బాపడు= బ్రాహ్మడు; ఎముకకూడు= తద్దినము, దినము మొదలగు సందర్భాలలో పెట్టబడే కూడు; పేరంటము= ముత్తయిదువులు వచ్చి చేయు కార్యము; పెండ్లిమగువ= పెండ్లాము; మానము = గౌరవము, మర్యాద; మెండు= ఎక్కువ.

పురోహిత బ్రాహ్మణుడు, ఆయన భార్య ఎక్కువ కోరికలు గలవారగుటవల్ల వారు తమ కులగౌరవాన్ని పోగొట్టుకుంటున్నారు. పురోహిత బ్రాహ్మణుడు తద్దినముల దినముల తిండికై వెళ్ళుచూవుంటే అతని పెండ్లాము ముత్తైదుగా పేరొంటానికి వెళ్ళుచున్నది. అంటే ఇద్దరూ యాచనకై యిల్లిల్లూ తిరుగుతూ వుంటారు.

342. మద్యమాంసరుచిని మాదిగ దైవాల
యెంగిలి తినగానే నింగికలదె?

భక్తివిహరు గొల్చి భవ్యులు కండయా ॥వి॥

మద్యము= కల్లు; నింగి= స్వర్గము, ఆకాశము, ముక్తి; భవ్యులు= పుణ్యాత్ములు, జ్ఞానులు, ధన్యులు.

క్షుద్ర (చిలిపి) దేవతలకు కల్లు, మాంసములు నివేదించి వాటిని తాము తిన్నంత మాత్రాన ఎవ్వరూ స్వర్గమును పొందలేరు. కాని భక్తితో శివుని కొల్చిననేగాని ముక్తి దొరకదు.

343. మునిగి బ్రాహ్మణుండు ముందుగానకపోయె
తిరిగి తిరిగి యతడు దిమ్మరాయె;
కూసి కూసి తుదకు కుక్కయైపోయెరా ॥వి॥

దిమ్మరి= సోమరి, దేశం తిరుగువాడు

బ్రాహ్మడు స్నానాలు చేసిచేసి యింటింటికి తిరిగి బిచ్చము యాచించి కుక్కవలె బిగ్గరగా వేదాలను చదివి చదివి చివరకు వెఱ్ఱివాడై పోయెను.

344. మఱవవలె బాపసంగతి
మఱవంగావలెను దురము మఱి విశ్వములో
మఱవవలె పరుల నేరము
మఱవంగా వలదు మేలు మహిలో వేమా॥

పాప సంగతి= చెడ్డమాట; దురము= యుద్ధము, పోట్లాట; కలహము= జగడము; విశ్వము= ప్రపంచము; నేరమి= నేరము, దోషము, తప్పు.

345. విప్రవరుల మనుచు వేదంబు చదవక
ప్రాకృతులను జూచి పరిహసింత్రు
ధరణి సురులకన్న దాసరిమెత మెచ్చు ॥వి॥

విప్రులు= బ్రాహ్మలు; ప్రాకృతులు= పామరులు, సామాన్యజనులు; పరిహసించుట= ఎగతాళిచేయుట; ధరణిసురులు= బ్రాహ్మలు; దాసరిమతము= సాతాని వైష్ణవమతము; ఎచ్చు= ఎక్కువ.

బ్రాహ్మణుడని పేరు పెట్టుకొన్నవాడు వేదములు తప్పక చదవగలిగి వుండాలి. అట్లుగాక వేదాలను చదవక జన్మగత బ్రాహ్మడు పామర జనాన్ని ఎగతాళి

చేస్తున్నాడు. ఇటువంటి కుటిల స్వభావము గల దుష్ట బ్రాహ్మణుని కంటే సాతానే గొప్పవాడు. అంటే దుష్టబ్రాహ్మణుని కంటే సాతానే సమాజానికి ఎక్కువ మేలు చేయగలుగుతున్నాడు.

346. వేషమొనరగట్టి వెట్టి శూద్రత్వంబు
తనకు లేదనుకొను ధరణిద్విజుడు
అరిది గిట్టువేళ నడగు ద్విజత్వంబు ॥వి॥

ధరణి= భూలోకము; గిట్టువేళ= చచ్చిపోవునపుడు; ద్విజత్వంబు= బ్రాహ్మణత్వము; అరిది= ఆశ్చర్యకరమైన; అడగుట= నశించుట.

వెట్టివాడగు బ్రాహ్మణుడు జందెము ధరించి తనకు శూద్రత్వము పోయి బ్రాహ్మణత్వము సిద్ధించినదని విర్రవీగుతున్నాడు. కాని చచ్చిన తరువాత జందెము వగైరాలు తీసివేయబడినపుడు శూద్రత్వమురాదా? అప్పుడు అతడు బ్రాహ్మణుడెట్లగును?

347. ఇంచుకంత యోనికేగెడు జనములు
కంచముకడ పిల్లిపొంచినట్లు;
పంచబాణునింట బానిసకొడుకులు ॥వి॥

ఇంచుక= మిక్కిలి చిన్న, యోని= ఆడగుఱి, పూకు; ఏగుట= వెళ్ళుట; కంచము= పళ్ళెము; కడ= వద్ద; పొంచియుండుట= కాచుకొనియుండుట; పంచబాణుని= మన్మథునియొక్క, కామదేవునియొక్క; బానిసకొడుకులు= తొత్తుకొడుకులు.

ఏవిధంగానైతే ఆకలిగొన్న పిల్లి కంచంలోని తిండిని తినటానికై పొంచియుండునో అదే విధంగా కామాంధులైన జనం కామ సుఖానికి తొత్తు కొడుకులైపోతున్నారు.

348. మతము దారి మఱచు మధురాధరము జూచి;
మగువ రూపుజూచి మనసు మఱచు;
యోని జూచి సర్వయోగంబు మఱచు ॥వి॥

మధుర= తియ్యని, అధరము= పెదవి, మగువ= ఆడుది; యోని= ఆడ

గుటి, పూకు; సర్వయోగము= యోగము.

ఆడదాని అందమైన పెదవి చూచినపుడు మగవాడు తన మతాన్నే మరచిపోతాడు. ఆడుదాని రూపము చూచినపుడు మగవాడు తన మనస్సునే మరచిపోతాడు. ఆడుదాని పూకును చూచినపుడు మగవాడు తన యోగాన్నే మరచిపోతాడు. అంటే ఆడుదానికి మగవానిని ఆకర్షించే సహజమైన శక్తిని దైవమే ప్రసాదించాడనుకోవలసి వస్తోంది.

349. జ్ఞానులమని యెంచి చపలాత్ములగువారు
తెలివిలేమి తమ్ము తెలియలేక
కష్ట గహనమందు గట్టిగా జిక్కిరి ॥వి॥

చపలాత్ములు= నిలకడలేని బుద్ధులుగలవారు; తెలివిలేమి= తెలివితేటలు లేక; గహనము= అడవి, గుహ, కష్ట= కష్టములు; చిక్కిరి= ఇరుక్కొనిపోయిరి.

తెలివిలేని, చంచల మనస్సుగల పండితులు కొందరు తమను జ్ఞానులమని ఎంచి గర్వముతో విర్రవీగుతున్నారు. అందువల్ల వారు అనేక ఇడుములకు గురి కావలసివస్తోంది.

350. గూబ యెక్కినట్టి గురము పాడుగపెట్టి
వెళ్ళిపోదురెంత వెఱ్ఱివారొ
గూబ గృహములేమి కూర్చునా కర్మంబు ॥వి॥

గూబ= గుడ్లగూబ; గురము= గృహము, ఇల్లు; కూర్చుట= చేకూర్చుట, కలిగించుట.

కొత్తపనులు చేయబోయేటప్పుడు కొన్ని కులాలవారు, కొన్ని పశువులు, కొన్ని పక్షులు, కొన్ని వస్తువులు ఎదురుగా వస్తే, అవి ఆ పనుల యొక్క మంచి చెడ్డ ఫలితాలను తెలుపుతాయని చాల మంది నమ్ముతున్నారు.

ఈ గుడ్డి నమ్మకాలను, మూఢాచారాలను, వర్జ్యం, వారాదులను పనికి దొంగలైన కొంతమంది మేధావులు తమ పొట్టపోషణకై కల్పించి పామర జనాన్ని మరీ బెదరేసి వారిని ఆర్థికంగా దోపిడీ చేస్తున్నారు.

గుడ్లగూబ చెడ్డ శకునాలలో ఒకటిగా ఎంచబడుతోంది. అది దూరిన

కొంపనుగానీ, అది కూర్చున్న కొంపనుగాని వెంటనే ఖాళీచేసి దానిని కొన్ని నెలలపాటు పాడుపెట్టి వుంచి గడువు తీరిన తరువాత బ్రాహ్మణ పురోహితుని చేత దానిని శుద్ధిచేయించుకొని ఆయనకు తగిన దాన ధర్మాలు, స్వయంపాకాలు సమర్పించుకొని ఇంటిలో ప్రవేశించాలని బ్రాహ్మణ పండితులు చెప్పుతారు.

పామర జనమే కాకుండా, కొంతమంది మేధావులు కూడ పండితుల బూటకపు మాటలను నమ్మి ఎన్నో కష్టాలపాలైపోతున్నారు. నిజంగా గుడ్లగూబ కూర్చుంటేనూ, దూరితేనూ ఇంటిలోనివాళ్ళకు కీడు కలుగుట నిజమైతే, గుళ్ల గోపురాలలో గుడ్ల గూబలు గూళ్ళు పెట్టుకొని కాపురాలు చేస్తున్నాయి కదా! ఆ గుళ్లను పాడుపెట్టమని పండితులు ఎందుకని చెప్పరు? గుళ్ళను పాడుపెట్టితే పూజారుల పుట్టి మునుగుతుంది. వారికి కూడు కరువైపోతుంది. నిజానికి మానవుని కర్మల ఫలితాలను మార్చగల శక్తి గుడ్లగూబకుగాని యింటికిగాని లేనేలేదు. పిచ్చి ప్రజలు పరాన్నభుక్కులైన బ్రాహ్మణ సిద్ధాంతుల బూటకపు మాటలను యీ అణుయుగంలో కూడా తెలుసుకోలేక పోతున్నారంటే వివేకముగల వారు నవ్వాలో ఏడ్వాలో అర్థం కావటం లేదు.

–xxx–